సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 199

మంగళవారం 4-4-2023



'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'



చెన్నై చెలరేగగా..
ధోని సేనకు తొలి విజయం..
12 పరుగుల తేడాతో ఓడిన లక్నో -12లో



6న కీలక నిర్ణయాలు!
ఆర్‌బీఐ తొలి ద్వైమాసిక పాలసీ సమీక్ష ప్రారంభం - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఎంతటివారినైనా ఎదుర్కోండి
అవినీతిపరులు ఎంతటి శక్తివంతులైనాసరే ముందడుగు వేసి పోరాడాలని సీబీఐ అధికారులకు ప్రధాని మోదీ సూచించారు.
వివరాలు 6లో ▸



జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్
జార్ఖండ్‌లోని ఛత్రా జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మరణించారని పోలీసులు చెప్పారు.
వివరాలు 6లో ▸

ప్రైమరీలో నెగ్గితేనే పార్టీ అభ్యర్థి
అభ్యర్థులను పార్టీ నేతలు, కార్యకర్తలే ఎంపిక చేయడం ద్వారా కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టింది.
వివరాలు 6లో ▸



నేడు కోర్టుకు ట్రంప్
హష్ మనీ చెల్లింపుల కేసులో అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ మంగళవారం మన్‌హటన్ గ్రాండ్ జ్యూరీ ముందు హాజరు కానున్నారు.
వివరాలు 6లో ▸







గెలుపు 'గ్రాఫ్'!

మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజక వర్గాల ఇన్‌చార్జ్‌లతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

మిమ్మల్ని మళ్లీ గెలిపించాలనే ఈ కార్యక్రమాలన్నీ..

ఏ ఒక్కరినీ పోగొట్టుకోవాలని నేను అనుకోను: సీఎం జగన్

- గడప గడపకూ.. చిత్తశుద్ధితో నిర్వర్తించండి
- సగం సచివాలయాల పరిధిలో పూర్తి.. మిగతా చోట్ల ఆగస్టులోగా
- నెలకు 25 రోజుల చొప్పున సచివాలయాల్లో పర్యటించాలి
- సెప్టెంబరు నుంచి ఇతర కార్యక్రమాలకు శ్రీకారం
- రాష్ట్రంలో సగటున 87 శాతం కుటుంబాలకు మంచి చేయగలిగాం
- 21 స్థానాలకు ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగితే మనం 17 స్థానాల్లో గెలిచాం
- 80 లక్షల మంది ఓటర్లలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల సంఖ్య 2.50 లక్షలే
- అది ఏ రకంగానూ అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం వహించేది కాదు
- మిగతా వారంతా ఏకమైనా టీడీపీ మొదటి ప్రాధాన్యతతో గెలవలేకపోయింది
- వాపును చూసుకుని బలం అన్నట్లుగా చంద్రబాబు ప్రచారం
- దోచుకో.. పంచుకో.. తినుకో కోసమే గజదొంగల ముఠా తాపత్రయం
- దుష్ప్రచారాన్ని గ్రామ గ్రామాన ఎక్కడికక్కడ సమర్థంగా తిప్పికొట్టండి
- సమీక్షలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌లకు సీఎం దిశానిర్దేశం

2లో

రాజకీయాలంటే.. మానవ సంబంధాలు

"నేను నాన్న దగ్గర నుంచి నేర్చుకున్న అంశం ఏమిటంటే.. రాజకీయాలంటే మానవ సంబంధాలు! ఏ ఒక్క ఎమ్మెల్యేనూ పోగొట్టుకోవాలని నేను అనుకోను. ఏ ఒక్క కార్యకర్తనూ పోగొట్టుకోవాలని కూడా అనుకోను. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 మాటలను నమ్మవద్దు. మీతో పని చేయించి.. మిమ్మల్ని మళ్లీ గెలిపించాలనే ఈ కార్యక్రమాలు చేస్తున్నాం. ఈ అడుగులన్నీ అందుకోసమే. మీరంతా మళ్లీ గెలిచి రావాలనే ఇవన్నీ చేస్తున్నాం. మనం సరైన పద్ధతుల్లో పనిచేయకపోతే, ప్రజల్లో మీ గ్రాఫ్ సరిగా లేకపోతే పార్టీకి, కేడర్‌కు నష్టం. మనం అధికారంలో లేకపోతే కోట్ల మంది ప్రజలు నష్టపోతారు. అందుకే మన గ్రాఫ్ పెంచుకోవాలి. గ్రాఫ్ పెరగాలంటే ఎన్నికలు సంవత్సరంలో ఉన్నాయని గుర్తు పెట్టుకోవాలి. అందుకే గడప గడపకూ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకోండి. అది సక్రమంగా నిర్వహిస్తే కచ్చితంగా గ్రాఫ్ పెరుగుతుంది.

- సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

నిజమే.. నిధులు మళ్లించాం!

సీఐడీ విచారణలో రామోజీ పరోక్షంగా అంగీకారం

- సొంత పెట్టుబడులుగా పెట్టాం.. అది మార్గదర్శి ఆర్థిక ప్రణాళికంటూ దబాయింపు
- విచారణ తప్పించుకునేందుకు అనారోగ్యం అంటూ డ్రామా
- రామోజీ ఆరోగ్యం బాగానే ఉందన్న సొంత డాక్టర్
- దీంతో వీడియో రికార్డింగ్ ద్వారా విచారించిన సీఐడీ అధికారులు
- విచారించాల్సింది మార్గదర్శి మేనేజర్లనంటూ రామోజీరావు వితండ వాదన
- ఎట్టకేలకు మంచంపై పడుకునే సమాధానాలు
- 8 గంటల విచారణ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేసిన సీఐడీ
- ఈ నెల 6న శైలజను విచారించనున్న సీఐడీ అధికారులు
- తదుపరి రామోజీ, శైలజను ఏపీలో విచారించేందుకు సీఐడీ సన్నాహాలు



రామోజీరావును విచారించిన అనంతరం బయటకు వస్తున్న అధికారులు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో ఏ–1గా ఉన్న సంస్థ చైర్మన్ చెరుకూరి రామోజీరావు సీఐడీ విచారణను తప్పించుకునేందుకు ఆడిన డ్రామాలు ఫలించలేదు. విచారించాల్సింది తనను కాదని, మార్గదర్శిలో కిందిస్థాయి సిబ్బందినంటూ తప్పించుకునేందుకు ఆయన వేసిన ఎత్తుగడలు పారలేదు. తన ఆరోగ్యం బాగా లేదని రామోజీరావు చెబుతున్నవి సాకులేనని

మిగతా 3వ పేజీలో ▶

ఏది నిజం?

రామోజీ 'రక్త' కన్నీరు!

- కాంగ్రెస్ హయాంలో సంపూర్ణ మద్య నిషేధ ఉద్యమానికి మద్దతు
- చంద్రబాబు అధికారంలోకి రాగానే దానిని అటకెక్కించారు
- ఫిల్మ్‌సిటీ కోసమే ఈ డ్రామా అంతా.. ఇది రక్తమాంసాలతో వ్యాపారం కాదా రామోజీ?
- చంద్రబాబు హయాంలో ఏరులై పారిన మద్యం.. టీడీపీ నేతల గుప్పెట్లోనే మద్యం సిండికేట్
- 43వేల బెల్ట్ దుకాణాలతో దోపిడీ
- పర్మిట్ రూమ్‌లు పెట్టి మరీ తాగించారు కదా రామోజీ
- అప్పుడు రక్తమాంసాలతో వ్యాపారం అనిపించలేదా?
- దశల వారీగా మద్య నియంత్రణను సమర్థంగా అమలుచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- నాటి బెల్ట్ షాపులు, పర్మిట్ రూమ్‌లన్నీ రద్దు.. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలు
- ప్రైవేటు మద్యం సిండికేట్‌కు చెక్
- మద్యం దుకాణాల సంఖ్య 4,380 నుంచి 2,934కు తగ్గింపు
- మద్యం దుకాణాల వేళలు కుదింపు, షాక్ కొట్టేలా మద్యం ధరలు
- మేనిఫెస్టోకు కట్టుబడే ప్రభుత్వ మద్య విధానం.. దాంతో భారీగా తగ్గిన మద్యం అమ్మకాలు
- కళ్లుండి ఇవేవీ చూడలేని కబోదిలా రామోజీ విషపు రాతలు

4లో

మళ్లీ నంబర్‌వన్‌గా జొకోవిచ్

12లో

ఈఏపీ సెట్‌లో 'ఇంటర్'కు వెయిటేజీ

25 శాతం మార్కులను వెయిటేజీగా తీసుకొని ర్యాంకులు

- కరోనాతో గత రెండేళ్లుగా వెయిటేజీ ఎత్తివేత
- ఇప్పుడు పరీక్షలు జరుగుతుండడంతో పాత విధానం పునరుద్ధరణ
- ఈసారి నర్సింగ్ సీట్లూ ఈఏపీసెట్ ర్యాంకుల ఆధారంగానే భర్తీ.. పరీక్షల సిలబస్‌లోనూ కొన్ని మార్పులు
- వచ్చే నెల 15 నుంచి 18 వరకు ఎంపీసీ, 22, 23 తేదీల్లో బైపీసీ విభాగం పరీక్షలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఈఏపీసెట్–2023లో ఇంటర్మీడియెట్ మార్కులకు వెయిటేజీ ఇవ్వనున్నారు. ఇంటర్ మార్కులకు 25 శాతం మేర వెయిటేజీ ఇచ్చి ఈఏపీసెట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థులకు ర్యాంకులను ప్రకటించనున్నారు. కరోనా కారణంగా రెండేళ్లుగా నిలిపివేసిన ఇంటర్ మార్కుల వెయిటేజీ విధానాన్ని పునరుద్ధరిస్తూ ప్రభుత్వం

మిగతా 3వ పేజీలో ▶



ఒంగోలులోని మంగమూరు రోడ్డులో లలితకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ మేఘన

పింఛన్ల పంపిణీ ప్రారంభం

ఉదయానికే సచివాలయాల ఖాతాల్లో పింఛన్ల డబ్బు జమ

మధ్యాహ్నం నుంచి పంపిణీ ప్రారంభించిన వలంటీర్లు

2లో


రాహుల్‌కు బెయిల్



పరువునష్టం వ్యాఖ్యల కేసులో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి సూరత్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రెండేళ్ల జైలు శిక్షను సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన అప్పీల్‌పై ఏప్రిల్ 13న విచారణ చేపట్టనున్నట్టు అదనపు సెషన్స్ జడ్జి ఆర్.పి. మొగేరా తెలిపారు. ఏప్రిల్ 10లోగా ప్రతిస్పందన దాఖలు చేయాలని ఆదేశిస్తూ ప్రతివాది బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీకి నోటీసులు జారీ చేశారు.

- వివరాలు 6లో


ఆంగ్లంతో పాటు తెలుగులోనూ పరీక్షలు



- పోటీ పరీక్షలపై ఏపీపీఎస్సీ కీలక నిర్ణయం
- కొన్ని సాంకేతిక, ప్రత్యేక అర్హతల పోస్టుల భర్తీకి చర్యలు
- అభ్యర్థులందరికీ మేలు జరిగేలా ఏర్పాట్లు.. జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీ పరీక్షలు 2 భాషల్లో నిర్వహణ
- సబ్జెక్టు పేపర్లను ఆంగ్లంలోనే నిర్వహించనున్న కమిషన్

- వివరాలు 3లో

ఇదండీ సంగతి



మరీ అంత తగ్గాల్సిన అవసరం లేదనుకుంటా సార్!!


శ్రీకాకుళం నగరంలోని దమ్మల వీధిలో జీబీషాన్ బాషాకు పింఛను అందజేస్తున్న వలంటీర్ శాంతి


ఏలూరు 20వ డివిజన్‌లో కె.వజ్రమ్మకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వలంటీర్ రామకృష్ణ


అనంతపురంలో దివ్యాంగ చిన్నారి దేశాయి ఉజ్వల్‌కు పింఛను అందజేస్తున్న వార్డు వలంటీర్ అనిత


ఎన్టీఆర్ జిల్లా నున్నలో కాట్ల లింగమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ శుక్రీనాయక్


విశాఖ నగరం సీతంపేటలో గుడ్ల సత్యవతికి వితంతు పింఛను అందజేస్తున్న వలంటీర్ వంగలపూడి తనూజ

పింఛన్ల పంపిణీ ప్రారంభం


తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలో కొచ్చెర్ల రత్నానికి వృద్ధాప్య ఫించను అందజేస్తున్న వలంటీర్ దేవి

- సోమవారం ఉదయానికే సచివాలయాల ఖాతాల్లో పింఛన్ల డబ్బు జమ
- మధ్యాహ్నం నుంచి పంపిణీ ప్రారంభించిన వలంటీర్లు
- రాత్రికి కూడా కొనసాగుతున్న పంపిణీ
- మరో నాలుగు రోజులు పంపిణీ
- ఈ నెల మొత్తం 63.42 లక్షల మందికి పింఛన్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా సోమవారం పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. మార్చి 31వ తేదీతో ఆర్థిక సంవత్సరం ముగింపు, ఆ తర్వాత వరుసగా రెండు రోజులు బ్యాంకులకు సెలవుల కారణంగా ఈ నెలలో పింఛన్ల పంపిణీ మూడో తేదీ నుంచి మొదలు పెట్టనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే ప్రకటించిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 63,42,805 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగ, వివిధ చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం రూ. 1747.88 కోట్లను విడుదల చేసింది. సోమవారం ఉదయం బ్యాంకు తెరిచే సమయానికల్లా ఈ నిధులను ఆయా గ్రామ, వార్డు సచివాలయాల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ఈ డబ్బును గ్రామ సచివాలయాల సిబ్బంది బ్యాంకుల నుంచి డ్రా చేసి, వలంటీర్లకు అందించారు. అనంతరం మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ మొదలైనట్టు అధికారులు వెల్లడించారు. పలు చోట్ల సోమవారం రాత్రి పొద్దుపోయాక కూడా వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ డబ్బులు పంపిణీ చేస్తూనే ఉన్నారని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులు చెప్పారు. మరో నాలుగు రోజులు పింఛన్ల పంపిణీ కొనసాగుతుందని తెలిపారు.


విజయనగరంలోని రాజీవ్‌నగర్ కాలనీలో గంగమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ విజయకుమార్


పల్నాడు జిల్లా పాడపాడులో వృద్ధురాలు పుల్లా శౌరీలుకు పింఛను ఇస్తున్న వలంటీరు చినబాబు


నెల్లూరు నగరం 28వ డివిజన్‌లో దివ్యాంగురాలు వెంకటపద్మజకు పింఛను అందజేస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ మోజెస్

గెలుపు 'గ్రాఫ్'!

గడప గడపకూ.. చిత్తశుద్ధితో నిర్వర్తించండి

సమీక్షలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌లకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం



ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: 'మనం మారీచులతో యుద్ధం చేస్తున్నాం. చంద్రబాబు అనే వ్యక్తి ఒక ముసుగులో గజదొంగల ముఠా ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, పవన్‌కళ్యాణ్ కలసి చేస్తున్న దోచుకో.. పంచుకో.. తినుకో.. కార్యక్రమానికి మనం అధికారంలోకి వచ్చాక తెరపడింది. మళ్లీ చంద్రబాబును అధికార పీఠంపై కూర్చోబెట్టి దోపిడీని కొనసాగించేందుకు ప్రభుత్వంపై ఉన్నది లేనట్లుగా, లేనిది ఉన్నట్లుగా భ్రమ కల్పించేలా గజదొంగల ముఠా దుష్ప్రచారం చేస్తోంది. రానున్న రోజుల్లో ఇది మరింత ఎక్కువ చేస్తారు. దాన్ని ఎక్కడికక్కడ సమర్థంగా తిప్పి కొట్టాలి' అని మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, ప్రాంతీయ సమన్వయకర్తలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంపై సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. గడప గడపకూ కార్యక్రమం సగం సచివాలయాల పరిధిలో ఇప్పటికే పూర్తైందని, మిగతా సగం సచివాలయాల పరిధిలో ఆగస్టులోగా పూర్తి చేయాలని నిర్దేశించారు. నెలకు 25 రోజుల చొప్పున సచివాలయాల్లో పర్యటించాలన్నారు. ఇది పూర్తయితే సెప్టెంబరు నుంచి ఇతర కార్యక్రమాలకు శ్రీకారం చుడదామని తెలిపారు. సంక్షేమ క్యాలెండర్ ప్రకారం వివిధ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో బటన్ నొక్కి డబ్బులు జమ చేసే బాధ్యతను తాను నిర్వర్తిస్తానని, గడప గడపకూ వెళ్లి చేసిన మంచిని వివరిస్తూ ప్రజలతో మమేకమై ఆశీర్వాదాలు పొందే బాధ్యతను నేతలు సక్రమంగా నెరవేర్చాలని సూచించారు. నేను, మీరూ ఏకమై సమన్వయంతో, సమర్థంగా బాధ్యతలు నిర్వర్తిస్తే 175కు 175 శాసనసభ స్థానాల్లోనూ విజయం సాధించడం ఖాయమని నేతల్లో ఉత్సాహాన్ని ఉరకలెత్తించారు. సమీక్షలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే...


సమావేశానికి హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, ప్రాంతీయ సమన్వయకర్తలు

రెట్టించిన వేగంతో గడప గడపకూ..

ఫిబ్రవరి 13న గడప గడపకూ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించాం. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ మార్చి 16 వరకూ కొనసాగింది. ఆ తర్వాత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరిగాయి. ఆసరా కార్యక్రమాలు మొదలయ్యాయి. దీనివల్ల గడప గడపకూ కార్యక్రమానికి కాస్త గ్యాప్ వచ్చింది. మళ్లీ ఆ కార్యక్రమాన్ని ఉధృతంగా చేపట్టాలి. గేర్ మార్చి రెట్టించిన వేగంతో చేయాలి. అందుకే ఇవాళ ఈ సమావేశం ఏర్పాటు చేసుకున్నాం.

నేరుగా రూ.2 లక్షల కోట్లు జమ..

దేవుడి దయ వల్ల రాష్ట్ర చరిత్రే కాదు.. దేశ చరిత్రలో ఎప్పుడూ చూడని విధంగా నాలుగేళ్లు గడవక ముందే రూ.2 లక్షల కోట్లు పైచిలుకు సొమ్మును ఎలాంటి వివక్షకు తావులేకుండా, లంచాలకు అవకాశం లేకుండా అక్కచెల్లెమ్మల కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేశాం. పట్టణ ప్రాంతాల్లో 84 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 92 శాతం కుటుంబాలకు సగటున 87 శాతం కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా మంచి చేయగలిగాం. ఆ ఇళ్లల్లో అక్కచెల్లెమ్మలకు మేలు జరిగింది. ఇలా అండగా నిలబడ్డ పరిస్థితి గతంలో ఎప్పుడూ జరగలేదు. అర్హులను పారదర్శకంగా గుర్తించి ప్రయోజనం చేకూర్చాం. పేదలు మిస్‌కాకుండా వెరిఫికేషన్ చేసి మరీ సంతృప్త స్థాయిలో పథకాలు అందిస్తున్నాం.

పరిమితి పెంపుతో మరింత ప్రయోజనం

మనం అధికారంలోకి రాక ముందు గ్రామీణ ప్రాంతాల్లో రూ.5 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.6 వేలు మాత్రమే నెలకు ఆదాయ పరిమితిగా ఉన్న బీపీఎల్ నిర్వచనాన్ని మారుస్తూ గ్రామీణ ప్రాంతాల్లో పరిమితిని రూ.10 వేలకు, అర్బన్ ప్రాంతాల్లో రూ.12 వేలకు పెంచి పథకాలు అందిస్తున్నాం. తద్వారా 87 శాతం ఇళ్లకు డీబీటీ ద్వారా బటన్ నొక్కి నేరుగా మేలు చేస్తున్నాం.

ఇది ఏ రకంగా రిప్రజెంటేటివ్ శాంపిల్?

ఈమధ్య కాలంలో ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, చంద్రబాబును చూసి కొన్ని మాటలు మాట్లాడుతున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గొప్పగా గెలిచామని మాటలు చెబుతున్నారు. వాస్తవాలు అందరికీ తెలియాలి. 21 స్థానాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగితే 17 స్థానాల్లో మనం గెలిచాం. ఒక ఎమ్మెల్సీ స్థానం అంటే 34 – 39 నియోజకవర్గాల పరిధి ఉంటుంది. ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌లో కనీసం 2.5 లక్షల మంది ఓటర్లు ఉంటారు. అంటే 80 లక్షలకుపైగా ఓట్ల పరిధిలో ఎమ్మెల్సీ స్థానం ఉంటుంది. ఆ పరిధిలో 87 శాతం అక్కచెల్లెమ్మల కుటుంబాలకు నేరుగా బటన్ నొక్కి సంక్షేమ పథకాలతో మంచి చేస్తున్నాం. 80 లక్షల కుటుంబాల్లో కేవలం రెండున్నర లక్షల మంది మాత్రమే ఓటర్లుగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో నమోదు చేసుకున్నారు. మనం మంచి చేసిన 87 శాతం మందిలో ఎమ్మెల్సీ ఓటర్లు చాలా తక్కువ సంఖ్యలో ఉంటారు. దాదాపు రెండున్నర లక్షల మంది ఎమ్మెల్సీ ఓటర్లలో 80 శాతం మంది డీబీటీలో లేనివారే ఉన్నారు. కేవలం 20 శాతం మంది మాత్రమే డీబీటీలో ఉన్నవారు కనిపిస్తున్నారు. మరి అలాంటప్పుడు ఇది ఏ రకంగా రిప్రజెంటేటివ్ శాంపిల్ అవుతుంది?

అంతా ఏకమైనా మొదటి ప్రాధాన్యతతో నెగ్గలేకపోయారు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరొక అంశం.. ఒకటో ప్రాధాన్యం, రెండో ప్రాధాన్యం, మూడో ప్రాధాన్యతలకు సంబంధించినది. మిగిలిన పార్టీలంతా కలిశాయి. మనం ఒంటరిగా పోటీ చేశాం. అయినప్పటికీ కూడా టీడీపీ మొదటి ప్రాధాన్యతతో గెలవలేకపోయింది. రెండో ప్రాధాన్యత ఓటు బదిలీ కావడం, ఇంతమంది ఏకం కావడం వల్ల జరిగిన అంశం ఏ రకంగానూ ప్రభావం చూపలేదు. ఒక వాపును చూపించి.. అది బలం అన్నట్లుగా చంద్రబాబు ప్రాజెక్ట్ చేసుకోవడం, దానికి ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 వంత పాడటాన్ని చూస్తున్నాం.

లిస్టు కూడా తయారు చేస్తున్నారంటూ...

రాబోయే రోజుల్లో ఇంకా రూమర్లు ప్రచారం చేస్తారు. టికెట్లు ఇవ్వని 50 – 60 మంది ఎమ్మెల్యేల లిస్టు కూడా తయారు చేస్తున్నారని చెబుతారు. ఆ జాబితాలో ఇంతమంది వెళ్లిపోతున్నారంటూ ఆంధ్రజ్యోతి, టీవీ 5, ఈనాడు అదే పనిగా ప్రచారం చేస్తున్నారు. ఇంతకంటే దారుణమైన ఎమ్మెల్యే ఉండరని మన పార్టీకి చెందిన ప్రతి ఎమ్మెల్యేపైనా ప్రచారం చేస్తున్నారు. ఒక్కో ఎమ్మెల్యేను టార్గెట్ చేసి మరీ విష ప్రచారం చేస్తున్నారు. వాటిని మనం తిప్పికొట్టే కార్యక్రమం చేయాలి. ప్రతి ఊరులో, ప్రతి నియోజకవర్గంలోనూ దీన్ని గట్టిగా చెప్పాలి.

లబ్ధిదారులే మన ప్రచారకర్తలు..

సంవత్సరంలో ఎన్నికలు జరగనున్నాయి. మన క్యాడర్ అత్యంత క్రియాశీలకంగా ఉండాలి. సోషల్ మీడియాను బాగా వినియోగించుకోవాలి. క్యాంపెయిన్‌ను ఉధృతం చేసుకోవాలి. ప్రతి నియోజకవర్గంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల నియామక వ్యవస్థను పూర్తి చేసుకోవాలి. ప్రతి లబ్ధిదారుడిని మన ప్రచారకర్తగా తయారు చేసుకోవాలి. ప్రతి లబ్ధిదారుడు వారికి జరిగిన మంచిని నలుగురితో పంచుకునేలా ప్రోత్సహించాలి. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులను మమేకం చేయాలి. వారంతా కలసి ప్రతి ఇంటికీ మన ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రతి కుటుంబానికీ తీసుకెళ్లాలి. ఇది మీరు కచ్చితంగా చేయాలి.

నెలకు 25 రోజులు గడప గడపకూ..

దాదాపు 15 వేల సచివాలయాలు ఉండగా సగం సచివాలయాల పరిధిలో గడప గడపకూ కార్యక్రమం పూర్తయింది. మిగిలిన సగం కూడా వచ్చే 5 నెలల్లో అంటే ఆగస్టు నాటికి పూర్తి చేయాలి. నెలకు 9 సచివాలయాలను పూర్తి చేయాలి. నెలకు 25 రోజుల చొప్పున సచివాలయాల్లో తిరగాలి. ఇది పూర్తయితే సెప్టెంబరు నుంచి ఇతర కార్యక్రమాలకు శ్రీకారం చుడదాం.

7న 'జగనన్నే మన భవిష్యత్తు' ప్రారంభం..

'జగనన్నే మన భవిష్యత్తు' కార్యక్రమాన్ని ఏప్రిల్ 7వతేదీన ప్రారంభిస్తున్నాం. ఇది ఏప్రిల్ 20 వరకు జరుగుతుంది. సచివాలయాల కన్వీనర్, గృహ సారథులను ఏకం చేసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలి. గ్రామ స్థాయిలో మన వ్యవస్థను ఏకం చేసి ప్రతి ఇంటికి పంపుతున్నాం. ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లేలా ఇది పక్కాగా జరగాలి.

13న 'జగనన్నకు చెబుదాం'...

వ్యక్తిగత సమస్యలను పరిష్కరించే కార్యక్రమంలో భాగంగా రేషన్ కార్డు స్ప్లిట్ కాకపోవడం లాంటి సమస్యలు గ్రామాల్లో ఒకటి అరా ఉంటే వాటిని కూడా మిస్ కాకూడదని 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. ఈ నెల 13న దీన్ని చేపడుతున్నాం. ఎవరికి సమస్య ఉన్నా నేరుగా నాకే ఫోన్ చేయవచ్చు. వాటిని పరిష్కరిస్తాం.

అంగన్‌వాడీల్లో 243 పోస్టులు

- ఏపీపీఎస్సీ ద్వారా భర్తీకి ప్రభుత్వం ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 243 పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 61 చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సీడీపీవో), అసిస్టెంట్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఏసీడీపీవో), మహిళా–శిశు సంక్షేమ అధికారి, రీజినల్ మేనేజర్ పోస్టులు, 161 గ్రేడ్–1 సూపర్‌వైజర్ పోస్టులు, 21 శిశు సంరక్షణ కేంద్రాల సూపరింటెండెంట్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది.

కార్గో పార్శిళ్లపై నిఘా పెంచండి

- అనుమతి లేని లగేజ్ తీసుకుంటే కఠిన చర్యలు
- ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు



సాక్షి, అమరావతి: ఆర్టీసీ బస్సుల్లో గంజాయి, గుట్కా, లిక్కర్, ఇతర చట్టవిరుద్ధమైన వస్తువుల రవాణాను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని.. కార్గో ద్వారా బుక్ చేసే పార్శిళ్లపై నిఘా పెంచాలని ఎండీ ద్వారకా తిరుమలరావు ఆదేశించారు. సోమవారం ఆయన అన్ని జిల్లాల, జోన్ల ఆర్టీసీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొంతమంది డ్రైవర్లు, కండక్టర్లు అనుమతి లేని లగేజ్ తీసుకుంటున్నారని, దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎవరైనా అవినీతికి పాల్పడినా, ఆర్టీసీ ఆదాయానికి గండికొట్టే చర్యలు చేసినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఆర్టీసీ పరిధిలోని అన్ని కౌంటర్లలో గంజాయి, మత్తు, పేలుడు పదార్థాలు, చట్టబద్ధంగా నిషేధించబడిన అన్నిరకాల వస్తువులను అనుమతించరాదని హెచ్చరికలు జారీ చేశారు. ఇకపై కార్గోలో బుక్ చేసే ప్రతి పార్శిల్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. వినియోగదారుని ఆధార్, అడ్రస్, ఫోన్ నంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలని, ఈ అంశాల పట్ల నిబద్ధతతో ఉండాలని సూచించారు. ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కేఎస్ బ్రహ్మానందరెడ్డి, ఎ.కోటేశ్వరరావు, ఓఎస్డీ రవివర్మ, సీటీఎం చంద్రశేఖర్, నాగేంద్రప్రసాద్, డిప్యూటీ సీటీఎం త్రినాథ్ పాల్గొన్నారు.

మంచిని వివరిస్తూ ఇంటింటికీ

సీఎం సమీక్ష అనంతరం మీడియాతో మంత్రులు

- చంద్రబాబుకు అన్నిచోట్లా పోటీ చేసే దమ్ముందా?
- పులివెందులలో సీఎం జగన్‌తో తలపడే సత్తా ఉందా?

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనం పొందిన లబ్ధిదారులు తమకు జరిగిన మంచిని నలుగురితో పంచుకునేలా కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారని మంత్రులు తెలిపారు. సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గడప గడపకూ మన ప్రభుత్వంపై సీఎం సమీక్ష ముగిసిన అనంతరం మంత్రులు జోగి రమేష్, అంబటి, గుడివాడ అమర్‌నాథ్, తానేటి వనిత మీడియాతో మాట్లాడారు.

మంచిని వివరిస్తూ ఇంటింటికీ



రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వం చేసిన మంచిని వివరించాలని సీఎం వైఎస్ జగన్ సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా నిలిపివేసిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పునఃప్రారంభించాలని ఆదేశించారు. ఏప్రిల్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పార్టీ క్యాడర్‌తో పాటు ఎమ్మెల్యేలు, అసెంబ్లీ కోఆర్డినేటర్లు పూర్తిస్థాయిలో పాల్గొనాలని నిర్దేశించారు. వీటిపై పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో సీఎం జగన్ కూలంకషంగా చర్చించారు. ఎల్లో మీడియా ఊహించుకుని రాసినట్లుగా సమావేశంలో ఏమీ జరగలేదు.

– అంబటి రాంబాబు, జలవనరుల శాఖ మంత్రి

ఐదేళ్లు పూర్తయ్యాకే ఎన్నికలకు



దేశంలో ఏ రాజకీయ పార్టీకీ లేనంత బలమైన క్యాడర్ వైఎస్సార్‌సీపీకి ఉంది. ప్రభుత్వం చేస్తున్న మంచిని రాష్ట్రంలోని 1.60 కోట్ల కుటుంబాలకు వివరిస్తూ ప్రతి తలుపు తట్టాలని సీఎం జగన్ సూచించారు. దాదాపు 87 శాతం కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సహకారం అందించిన విషయాన్ని ప్రజలకు గుర్తు చేయాలని నిర్దేశించారు. ప్రజలిచ్చిన ఐదేళ్ల సమయాన్ని పూర్తి చేసుకున్న తరువాతే ఎన్నికలకు వెళ్తామని చెప్పారు. నెలకు 25 రోజుల పాటు నియోజకవర్గాల్లో పర్యటించాలని ఆదేశించారు.

– గుడివాడ అమర్‌నాథ్, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి

ఉధృతంగా గడప గడప



గడపగడపకూ కార్యక్రమాన్ని మరింత ఉధృతంగా ముందుకు తీసుకెళ్లాలని సీఎం జగన్ ఆదేశించారు. ఎల్లో మీడియా, టీడీపీ సోషల్ మీడియా దుష్ప్రచారాలను ఎక్కడికక్కడ ఎండగడుతూ ప్రతి గ్రామంలో, ప్రతి నియోజకవర్గంలో కార్యక్రమాలు చేపట్టాలని నిర్దేశించారు. ప్రతి నియోజకవర్గంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల వ్యవస్థను ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. ప్రతి లబ్ధిదారు తమకు జరిగిన మంచిని నలుగురితో పంచుకునేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

– తానేటి వనిత, హోంమంత్రి

పులివెందులలో పోటీకి సిద్ధమేనా?



అన్ని చోట్లా వైఎస్సార్‌సీపీని ఓడిస్తామని ప్రగల్భాలు పలుకుతున్న చంద్రబాబుకు 175 స్థానాల్లోనూ సైకిల్ గుర్తుపై అభ్యర్థులను పోటీకి దింపే సత్తా ఉందా? ఆయనకు ధైర్యముంటే అన్ని చోట్లా టీడీపీ అభ్యర్థులు పోటీ చేస్తారని ప్రకటించాలి. 38 నియోజకవర్గాల్లో టీడీపీకి ఇన్‌చార్జీలే లేరని మూడు నెలల క్రితం పార్టీ నేతలతో వాపోయిన దుస్థితి చంద్రబాబుది. ఎంతో మంది ఆత్మత్యాగంతో రెపరెపలాడిన కమ్యూనిస్టు జెండాను నారాయణ, రామకృష్ణ టీడీపీకి తాకట్టు పెట్టడం చూసి నిజమైన కమ్యూనిస్టుల గుండెలు ఆక్రోశిస్తున్నాయి. నారాయణను నమ్మి కమ్యూనిస్టులు పెత్తనం అప్పగిస్తే ఆయన పార్టీని టీడీపీకి అమ్మేశారు. చంద్రబాబును కుప్పంలో, లోకేశ్‌ను మంగళగిరిలో ఓడించి తీరుతాం. పవన్‌కళ్యాణ్ ఎక్కడా గెలవలేరు. సీపీఐ, సీపీఎం, బీజేపీ, జనసేనను పోగేసుకుంటే కానీ సీఎం జగన్‌తో తలపడే ధైర్యం చంద్రబాబుకు లేదు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్.. ఎవరైనా సరే పులివెందులలో పోటీ చేయవచ్చు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లో గెలిచి వాపును చూసి బలుపు అనుకుంటున్నారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వం చేకూర్చిన మంచిని వివరిస్తూ ఎమ్మెల్యేలు గడపగడపనూ సందర్శించాలని సీఎం ఆదేశించారు.

– జోగి రమేష్, గృహ నిర్మాణ శాఖ మంత్రి

అమరావతిలో పేదల ఇళ్లకు సీఆర్‌డీఏ ఆమోదం


సీఆర్‌డీఏ 33వ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- 20 లే అవుట్లలో 48,218 మందికి ఇళ్ల పట్టాలు
- 1,134.58 ఎకరాల భూమి కేటాయింపు
- కనీస మౌలిక సదుపాయాలు కల్పించేలా కార్యాచరణ
- మే మొదటి వారంలో పనులు ప్రారంభించేలా కసరత్తు

సాక్షి, అమరావతి: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం మూడో విడత కింద అమరావతి ప్రాంతంలో 48,218 మంది పేదలకు ఉచితంగా ఇళ్ల పట్టాలు అందించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన కనీస మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని అధికార యంత్రాంగానికి సూచించారు. మే నెల మొదటి వారం నాటికి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. ఇళ్లులేని పేదల చిరకాల వాంఛ నెరవేర్చే ఈ కార్యక్రమాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తూ జీవో జారీ చేసిన నేపథ్యంలో సీఎం జగన్ అధ్యక్షతన సోమవారం క్యాంపు కార్యాలయంలో జరిగిన సీఆర్‌డీఏ 33వ సమావేశంలో ఈమేరకు ఆమోద ముద్ర వేశారు.

20 లేఅవుట్లు..

అమరావతి ప్రాంతంలో మొత్తం 20 లేఅవుట్లలో 1,134.58 ఎకరాల భూమిని పేదల ఇళ్ల కోసం కేటాయించారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన 48,218 మంది పేదలు ఉచితంగా ఇళ్ల పట్టాలు పొందనున్నారు. ఐనవోలు, మందడం, కృష్ణాయపాలెం, నవులూరు, కురగల్లు, నిడమానూరు ప్రాంతాల్లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం చట్టంలో మార్పులు చేసింది. సీఆర్డీఏ చట్టం సెక్షన్ 41(3), (4) ప్రకారం ఆర్–5 జోన్ ఏర్పాటు చేసి భూములను ఆ పరిధిలోకి తెచ్చింది. గత ఏడాది అక్టోబరులో అభ్యంతరాలు, సలహాలను స్వీకరించి సీఆర్‌డీఏ బహిరంగ విచారణ నిర్వహించింది. అనంతరం గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఇళ్ల పట్టాల లబ్దిదారుల జాబితాతో డీపీఆర్‌లు తయారు చేయాలని గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. న్యాయపరమైన చిక్కులను పరిష్కరించి పేదలకు ఇళ్ల పట్టాలు అందించేలా ప్రభుత్వం సన్నద్ధమైంది. సీఎం సమీక్షలో పురపాలక శాఖ మంత్రి సురేష్, సీఎస్ జవహర్‌రెడ్డి, పురపాలక శాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, ఇంధన శాఖ స్పెషల్ సీఎస్ విజయానంద్, ఆర్‌అండ్‌బీ శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, సీఆర్డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన కేంద్రాల్లో సోమవారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	41.2	26.4
అనంతపురం	40.7	22.8
కర్నూలు	40.5	27.0
రాజమహేంద్రవరం	40.0	25.0
నంద్యాల	39.0	25.2
కడప	38.0	26.6
కనిగిరి	38.0	25.0
భీమవరం	37.0	25.0
నెల్లూరు	36.7	27.0
విజయవాడ	36.0	27.0
విశాఖపట్నం	35.6	25.0
కాకినాడ	34.4	25.0
శ్రీకాకుళం	34.0	22.0
అనకాపల్లి	33.4	22.8
మచిలీపట్నం	33.0	28.0
ఏలూరు	33.0	27.0
అమలాపురం	33.0	27.0
తెలంగాణలో..		
ఆదిలాబాద్	38.3	22.5
హైదరాబాద్	36.9	25.3
రామగుండం	37.0	25.0

రాష్ట్రంలో తగ్గుతున్న అధిక వేడి రోజులు




- 2014లో 16 రోజులు అత్యధిక ఉష్ణోగ్రత
- ఆ తరువాత 2019లో 13 రోజులు
- 2020లో 3 రోజులు, 21లో 4 రోజులు, 22లో 5 రోజులే
- 2019లో ఒక రోజే అత్యంత చలి
- 2020లో 6 రోజులు, 21లో 7 రోజులు, 22లో ఒక రోజే అత్యంత చలి
- కేంద్ర పర్యావరణ గణాంకాల నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గడిచిన మూడేళ్లుగా వాతావరణంలో అధిక వేడి ఉండే రోజుల సంఖ్య క్రమేపీ తగ్గుతోంది. అతి ఎక్కువ చలి ఉండే రోజులూ తగ్గుతున్నాయి. రాష్ట్రంలో 2014లో సగటున 16 రోజులు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవగా, ఆ తరువాత 2019లో 13 రోజులు నమోదైనట్లు కేంద్ర పర్యావరణ గణాంకాల నివేదిక-2023 తెలిపింది. 2020లో 3 రోజులు, 21లో 4 రోజులు, 22లో 5 రోజులు మాత్రమే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 2022లో ఒక రోజు మాత్రమే అత్యంత చలి నమోదైనట్లు నివేదిక పేర్కొంది. వివిధ రాష్ట్రాల్లో సంవత్సరాలవారీగా అత్యధిక ఉష్ణోగ్రతలు, చలి నమోదైన రోజుల వివరాలను ఆ శాఖ విశ్లేషించి, నివేదిక రూపొందించింది. ఈ నివేదిక ప్రకారం.. 2014 సంవత్సరంలో రాష్ట్రంలో మూడు రోజులు మాత్రమే అత్యంత చలి నమోదైందని నివేదిక తెలిపింది. 2018లో సగటున 8 రోజులు, 2020లో 6 రోజులు, 2021లో ఏడు రోజులు అత్యంత చలి నమోదవగా, 2022లో కేవలం ఒక రోజు మాత్రమే అత్యంత చలి నమోదైనట్లు నివేదిక పేర్కొంది. 2022 సంవత్సరంలో దేశంలో రాజస్థాన్, పంజాబ్, హరియాణ, జార్ఖండ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో అత్యధిక వేడి రోజులు నమోదైనట్లు నివేదిక పేర్కొంది. 2022లో హరియాణాలో 9 రోజులు అత్యంత చలి నమోదైందని తెలిపింది.

వివిధ రాష్ట్రాల్లో సంవత్సరాల వారీగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన రోజులు

రాష్ట్రం	2014	2015	2016	2017	2018	2019	2020	2021	2022
ఆంధ్రప్రదేశ్	16	7	10	10	8	13	3	4	5
ఒడిశా	17	11	19	9	4	8	2	4	5
రాజస్థాన్	11	9	15	14	17	20	6	4	26
పంజాబ్	12	3	5	12	4	8	1	2	24
హరియాణా	9	4	10	13	9	8	3	2	24
జార్ఖండ్	7	9	16	10	3	10	1	0	18
ఢిల్లీ	7	3	2	9	6	8	4	3	17
ఉత్తరప్రదేశ్	9	8	5	4	6	13	2	1	15
ఉత్తరాఖండ్	3	2	9	4	5	13	0	0	15
మధ్యప్రదేశ్	10	4	10	7	7	13	2	1	13
తెలంగాణ	2	7	14	5	0	10	2	0	2
మహారాష్ట్ర	5	5	8	6	8	15	5	0	4



వరుసగా రెండు రోజులు గరిష్టంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటే హీట్ వేవ్

ఏదైనా ప్రాంతంలో రెండు రోజులు గరిష్టంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటే హీట్ వేవ్ పరిస్థితులుగా పరిగణిస్తారు. రాష్ట్రంలో 2016 మే 2న ప్రకాశం జిల్లా వెలిగండ్లలో అత్యధికంగా 48.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. 2017 మే 17న టంగుటూరులో అత్యధికంగా 47.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. 2018 మే 31న నెల్లూరు జిల్లా మర్రిపాడు, డిచ్చిపల్లిలో 45.6 డిగ్రీలు నమోదైంది. 2019 మే 26న కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలో 47.3 డిగ్రీలు నమోదైంది. 2020 మేలో కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 47.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 2021 మేలో ప్రకాశం, పశ్చిమగోదావరి జిల్లాల్లో అత్యధికంగా 45.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 2022లో తిరుపతిలో అత్యధికంగా 45.9 డిగ్రీలు నమోదైంది.

క్లుప్తంగా...

రాగిజావ ఉ.10.10కే..
ఒంటిపూట బడులతో పంపిణీ సమయాల్లో మార్పు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల స్కూళ్లకు రాష్ట్ర ప్రభుత్వం ఒంటిపూట బడులను ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వ స్కూళ్లలో అందించే రాగిజావ పంపిణీ సమయాల్లో మిడ్ డే మీల్ విభాగం మార్పులు చేసింది. ఈ మేరకు డైరెక్టర్ నిధి మీనా మెమో జారీచేశారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ స్కూళ్లలోని విద్యార్థులకు అందించే రాగిజావను ఉ.10.10 నుంచి 10.25 లోపు అందించాలని సూచించారు. ప్రస్తుతం దీనిని మంగళవారం, గురువారం, శనివారం అందిస్తున్న సంగతి తెలిసిందే. ఉదయం స్కూళ్లు తెరిచిన రెండున్నర గంటల తరువాత ఈ రాగిజావను అందిస్తారు. అనంతరం స్కూళ్లు విడిచిపెట్టే ముందు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తారు. అది పూర్తయ్యాకే పిల్లలను ఇళ్లకు పంపించనున్నారు. ఇక టెన్త్ పరీక్షలు జరుగుతున్న స్కూళ్లలో పరీక్షలు జరిగే రోజుల్లో మినహా మిగిలిన రోజుల్లో రాగిజావను అందించాలని సూచించారు.

ఈకేవైసీకి 10వ తేదీ గడువు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రబీ 2022-23 సీజన్‌లో 48.05లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా, నూరు శాతం ఈ క్రాపింగ్ నమోదు చేశామని వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ చేవూరు హరికిరణ్ తెలిపారు. రైతుల ఈకేవైసీ రికార్డుస్థాయిలో ఇప్పటికే 97 శాతం నమోదైందని పేర్కొన్నారు. ఇంకా మిగిలిన 3 శాతం రైతుల కోసం మరో అవకాశం ఇస్తున్నామని తెలిపారు. ఈ నెల 10వ తేదీలోగా తమ సమీప ఆర్బీకేలకు వెళ్లి వీఏఏలను సంప్రదించి బయోమెట్రిక్ లేదా ఓటీపీ ద్వారా ఈకేవైసీని నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ క్రాపింగ్‌తో పాటు ఈకేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. ప్రతి రైతు రబీలో సాగు చేసిన పంటలకు సంబంధించి ఈకేవైసీ చేయించుకోవాలని సోమవారం ఆయన ఓ ప్రకటనలో కోరారు.

మే 5న ఏపీ ఈసెట్

బాలాజీ చెరువు (కాకినాడ సిటీ): బీటెక్, బీఫార్మసీ, బీఈ కోర్సుల్లో ద్వితీయ సంవత్సర ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఈసెట్ -2023ను మే 5న నిర్వహిస్తున్నట్లు సెట్ చైర్మన్ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు సోమవారం తెలిపారు. ఏప్రిల్ 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే 85004 04562 నంబర్‌కు ఫోన్ చేయొచ్చని చెప్పారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

- తొలిరోజు పరీక్షకు 99.01 శాతం మంది హాజరు
- పకడ్బందీ ఏర్పాట్లతో అవాంఛనీయ ఘటనలకు చెక్
- మాల్‌ప్రాక్టీసు కేసులూ నిల్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా ముగిశాయి. ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవడంతో ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా విద్యార్థులు పరీక్ష రాశారు. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం పరీక్ష రాయవలసిన అభ్యర్థులు 6,17,971 మంది కాగా 6,11,832 మంది (99.01 శాతం) హాజరయ్యారని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి చెప్పారు. ఈసారి 26 జిల్లాలను ప్రాతిపదికగా తీసుకుని ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచే పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో హడావుడి నెలకొంది. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు హాజరయ్యేందుకు వీలుగా ప్రభుత్వం ఆర్టీసీ బస్సులను ఏర్పాటుచేయడం, వాటిలో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించడంతో విద్యార్థుల్లో ఎక్కువ శాతం మంది సకాలంలోనే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఫర్నిచర్‌తోపాటు మంచినీరు అందుబాటులో ఉంచారు. గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో జరిగిన ఘటనలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈసారి అనేక జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కలిగేలా విస్తృతమైన ప్రచారం కల్పించింది. అన్ని పరీక్ష కేంద్రాలను నో ఫోన్ జోన్లుగా ప్రకటించి చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లతో సహా ఎవరి ఫోన్లను అనుమతించలేదు. విద్యార్థులకు కూడా ఫోన్లు, డిజిటల్ వాచీలు, ఇయర్‌ఫోన్లు, బ్లూటూత్ వంటి డిజిటల్ పరికరాలను పూర్తిగా నిషేధించింది. ప్రతి కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక పోలీసు స్క్వాడ్లను కూడా ఏర్పాటు చేసింది. మొబైల్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్ల సంఖ్యను పెంచింది. లీక్‌లు, ఫేక్ ప్రచారాలు చేయకుండా ఈ చర్యలు అడ్డుకట్ట వేశాయి. ఎవరైనా ఎక్కడైనా లీక్ లేదా ఫేక్ ప్రశ్నపత్రాల ప్రచారం చేసినా వెంటనే పసిగట్టేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా సిద్ధం చేసింది. ప్రతి ప్రశ్నపత్రం మీద క్యూఆర్ కోడ్‌తో కూడిన రక్షణ ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మాల్ ప్రాక్టీస్ కేసులు కూడా ఎక్కడా నమోదు కాలేదు.

డిజిటల్‌గా పరీక్ష రాసిన దివ్యాంగ విద్యార్థులు

అనంతపురం జిల్లాలోని రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డీటీ) ఇన్‌క్లూజివ్ హైస్కూల్‌కు చెందిన ఆరుగురు దివ్యాంగ (దృష్టిలోపం ఉన్న) విద్యార్థినులు డిజిటల్‌గా పరీక్ష రాశారు. ఈ పాఠశాలకు చెందిన ఎక్కలూరు దివ్యశ్రీ, పాలిమెర చైత్రిక, ఏకుల సౌమ్య, మేఖ శ్రీధాత్రి, ఉప్పర నాగరత్నమ్మ, చందుగారి పావని రాప్తాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రానికి హాజరయ్యారు. వీరు డిజిటల్ విధానంలో కంప్యూటర్ ద్వారా స్క్రయిబ్ సహాయం లేకుండా పరీక్ష రాశారు.

ఆంగ్లంతో పాటు తెలుగులోనూ పరీక్షలు

పోటీ పరీక్షలపై ఏపీపీఎస్సీ కీలక నిర్ణయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొన్ని ప్రత్యేక విభాగపు పోస్టుల భర్తీకి నిర్వహించే పరీక్షలను ఆంగ్లంతో పాటు తెలుగులోనూ నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్ణయించింది. దీనివల్ల అభ్యర్థులందరికీ మేలు జరుగుతోందని కమిషన్ భావిస్తోంది. ఈ మేరకు ఏపీపీఎస్సీ కార్యదర్శి జె.ప్రదీప్ కుమార్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని సాంకేతిక, ప్రత్యేక అర్హతలతో కూడిన పోస్టుల నియామకాలకు ఏపీపీఎస్సీ ఇప్పటివరకు ఆంగ్లంలోనే పరీక్షలు నిర్వహిస్తూ వస్తోంది. వీటిని తెలుగు మాధ్యమంలో కూడా నిర్వహించాలని గత కొంతకాలంగా గ్రామీణ, తెలుగు మాధ్యమం అభ్యర్థులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఏపీపీఎస్సీ ఈ పరీక్షలకు సంబంధించిన పేపర్-1ను ఆంగ్లం, తెలుగు మాధ్యమాల్లో నిర్వహించాలని నిర్ణయించింది. పేపర్-1లో జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీ ప్రశ్నలుంటాయి. ఆంగ్లం ప్రశ్నలను తెలుగులో అనువదించి ఇస్తారు. అయితే ఈ రెండు మాధ్యమాల్లో ఆంగ్లంలోని ప్రశ్నలను మాత్రమే పరిగణనలోకి తీసుకోనున్నారు. ఇక పేపర్-2లో సబ్జెక్టు పేపర్లను మాత్రం ఆంగ్ల మాధ్యమంలోనే నిర్వహించనున్నారు.

ఆంగ్లంతోపాటు తెలుగులోనూ పరీక్షలు నిర్వహించే పోస్టులివే..

- టెక్నికల్ అసిస్టెంట్ (జియోఫిజిక్స్), గ్రౌండ్‌వాటర్ విభాగం
- అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్, ఏపీ ఫిషరీస్
- టౌన్‌ప్లానింగ్, బిల్డింగ్ ఓవర్సీర్, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్
- ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్, ఇండస్ట్రియల్ సర్వీస్
- ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, ఏపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్, పబ్లిక్ హెల్త్ లేబొరేటరీస్ అండ్ ఫుడ్ అడ్మినిస్ట్రేషన్
- అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్
- ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, ఫారెస్టు సర్వీస్

ఈఏపీసెట్‌లో 'ఇంటర్'కు వెయిటేజీ

▶ మొదటి పేజీ తరువాయి

ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ఇదే విషయాన్ని ఇటీవల విడుదలైన ఈఏపీసెట్ నోటిఫికేషన్‌లో కూడా పొందుపరిచింది. కాగా ఈఏపీసెట్‌కు దరఖాస్తు చేయడానికి ఇంటర్‌లో కనీసం 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత తప్పనిసరి అని స్పష్టం చేసింది. సెట్‌కు ఆన్‌లైన్ దరఖాస్తులను ఎటువంటి ఆలస్య రుసుము లేకుండా ఈ నెల 15 వరకు స్వీకరించనున్నారు. ఆలస్య రుసుములతో మే 14 వరకు స్వీకరిస్తారు. ఇందులో భాగంగా మే 15 నుంచి 18 వరకు ఎంపీసీ విభాగం, మే 22, 23 తేదీల్లో బైపీసీ విభాగం పరీక్షలను కంప్యూటర్ ఆధారితంగా నిర్వహిస్తారు. కాగా ఈఏపీసెట్ దరఖాస్తు, ఇతర అంశాల్లో విద్యార్థులకు సహకారం అందించడానికి రాష్ట్రంలో అన్ని జిల్లాలతోపాటు హైదరాబాద్‌లోనూ రీజినల్ సెంటర్లను ఏర్పాటు చేశారు.

ఉన్నత విద్యా మండలి ప్రతిపాదనల మేరకు..

కరోనాకు ముందు వరకు ఏపీ ఈఏపీసెట్‌లో ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీ అమల్లో ఉండేది. ఇందులో భాగంగా ఈఏపీసెట్‌లో వచ్చిన మార్కులకు 75 శాతం, ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీ ఇచ్చి ర్యాంకులను ప్రకటించేవారు. ఈ ర్యాంకుల ఆధారంగా విద్యార్థులకు సీట్లు కేటాయించేవారు. అయితే కరోనా వల్ల 2020, 2021 విద్యా సంవత్సరాల పరీక్షలు జరగలేదు. దీంతో ఈఏపీసెట్‌లో ఇంటర్ మార్కులకు వెయిటేజీని ప్రభుత్వం ఎత్తేసింది. ఈ రెండు సంవత్సరాల్లోనూ ఈఏపీసెట్‌లోని మార్కులనే పూర్తిగా పరిగణనలోకి తీసుకొని ర్యాంకులను కేటాయించింది. 2022 నుంచి పరిస్థితులు సద్దుమణిగి ఇంటర్ తరగతులు సజావుగా సాగుతుండడంతో ఉన్నత విద్యామండలి ప్రతిపాదనల మేరకు ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీ విధానాన్ని ప్రభుత్వం పునరుద్ధరించింది. ప్రస్తుతం ఇంటర్ సెకండియర్ రాసిన విద్యార్థులు 2022లో ఫస్టియర్ పరీక్షలు రాశారు. ఫస్టియర్, సెకండియర్ పరీక్షలను విద్యార్థులంతా పూర్తిస్థాయిలో రాయడంతో ఇంటర్ మార్కులకు ఈఏపీసెట్-2023లో వెయిటేజీ ఇవ్వాలని ప్రభుత్వానికి ఉన్నత విద్యామండలి నివేదించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో ఈసారి ఈఏపీసెట్‌లో ఇంటర్ మార్కులకు 25 శాతం, ఈఏపీసెట్ మార్కులకు 75 శాతం వెయిటేజీ ఇచ్చి ర్యాంకులను ప్రకటించనున్నారు.



సిలబస్‌పైనా స్పష్టత

కాగా ఈఏపీసెట్-2023 సిలబస్‌పైనా ఉన్నత విద్యామండలి స్పష్టతనిచ్చింది. కరోనా సమయంలో తరగతులు, పరీక్షలు నిర్వహించకపోవడంతో ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులు వెనుకబడ్డారు. దీంతో ఇంటర్ బోర్డు 30 శాతం మేర సిలబస్‌ను కుదించింది. అప్పట్లో నిర్వహించిన పరీక్షలకు కుదించిన సిలబస్‌నే పరిగణనలోకి తీసుకుంది. దీంతో ఈఏపీసెట్ పరీక్షల్లోనూ ఉన్నత విద్యామండలి.. బోర్డు నిర్ణయించిన విధానాన్నే అనుసరించాల్సి వచ్చింది. బోర్డు తీసేసిన అంశాలను సిలబస్ నుంచి మినహాయించి ఈఏపీసెట్‌ను నిర్వహించింది. 2022లో కూడా 30 శాతం సిలబస్ కుదింపు అంశాన్నే కొనసాగించింది. అప్పట్లో ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు రాసిన విద్యార్థులకు ఆ 30 శాతం సిలబస్‌పై బోధన జరగలేదు. ఆ విద్యార్థులు ప్రస్తుతం ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాశారు. ఈసారి కూడా ఈఏపీసెట్ సిలబస్‌లో ఇంటర్ సెకండియర్‌ను పూర్తిగా, ఫస్టియర్‌ను 30 శాతం మేర కుదించి పరీక్ష నిర్వహించనున్నారు.

ఈఏపీసెట్ ర్యాంకుల ఆధారంగానే నర్సింగ్ సీట్లు

ఈసారి కొత్తగా నర్సింగ్ సీట్లనూ ఈఏపీసెట్ ర్యాంకుల ఆధారంగానే భర్తీ చేయనున్నారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి అనుబంధ నోటిఫికేషన్‌ను కూడా జారీ చేసింది. రాష్ట్రంలో 2023-24 విద్యా సంవత్సరంలో బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలు ఏపీ ఈఏపీసెట్-2023 ర్యాంకుల ఆధారంగానే ఉంటాయని తెలిపింది. డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ కౌన్సెలింగ్ నిర్వహిస్తుందని వెల్లడించింది.

డి-పట్టా భూమి ఆక్రమణ

పరిటాల శ్రీరామ్ అనుచరుడి కబ్జాలో రెండెకరాలు



పరిటాల శ్రీరామ్‌తో వెంకటప్ప (ఫైల్)

సాక్షి, పుట్టపర్తి: బతుకుదెరువు కోసం తనకు ప్రభుత్వం అందజేసిన డి-పట్టా భూమిని ఆక్రమించి తనను పొలంలోకి రానివ్వడం లేదని శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం మద్దెలచెరువుకు చెందిన రైతు బంగారు నారాయణ పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఎన్నో ఏళ్లుగా తాను సాగుచేసుకుంటున్న భూమిని టీడీపీ నేత పరిటాల శ్రీరామ్ అనుచరుడు ఎరికల వెంకటప్ప రెండేళ్లుగా ఆక్రమించినట్లు తెలిపారు. సర్వే నంబరు 216-1లో 2.83 ఎకరాలు, సర్వే నంబరు 216-2లో 0.48 ఎకరాలకు తన పేరుతో డి-పట్టా పాసుపుస్తకం కూడా ఉన్నట్లు తెలిపారు. పరిటాల శ్రీరామ్ అండతోనే వెంకటప్ప దౌర్జన్యం చేస్తున్నాడని ఆరోపించారు.

నిజమే.. నిధులు మళ్లించాం!

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన వ్యక్తిగత వైద్యుడే పరోక్షంగా సమ్మతించడంతో విచారణకు అంగీకరించక తప్పలేదు. చిట్‌ఫండ్ చట్టం, రిజర్వ్‌బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డ రామోజీరావును సీఐడీ అధికారులు హైదరాబాద్‌లో సోమవారం దాదాపు 8 గంటలపాటు విచారించారు. విచారణ ప్రక్రియను ఆడియో, వీడియో రికార్డింగ్ చేశారు. కేంద్ర చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధంగా భారీగా నిధుల మళ్లింపు, రిజర్వ్ బ్యాంకు నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమ డిపాజిట్ల సేకరణపై ఆధారాలతో విచారించారు. ఈ కేసులో ఏ-2గా ఉన్న రామోజీరావు కోడలు, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజను ఈ నెల 6న సీఐడీ అధికారులు విచారించనున్నారు. అనంతరం కేసు దర్యాప్తులో పురోగతిని సమీక్షించి రామోజీరావు, శైలజను ఏపీకి పిలిచి మరోసారి విచారించాలని సీఐడీ భావిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

తప్పించుకునేందుకు చివరిదాకా యత్నం..

మార్గదర్శి అక్రమ వ్యవహారాల కేసులో సీఐడీ విచారణను తప్పించుకునేందుకు రామోజీరావు చివరి వరకూ ప్రయత్నించారు. రామోజీరావు, శైలజ హైదరాబాద్‌లోనే వారి నివాసంలోగానీ కార్యాలయంలోగానీ విచారణకు హాజరు కావాలని పేర్కొంటూ సీఐడీ అధికారులు నోటీసులిచ్చారు. నాలుగు తేదీలు సూచించి వారికి అనువైన రోజు విచారణకు హాజరు కావాలని పేర్కొన్నారు. నిబంధనల మేరకు కేసు దర్యాప్తులో భాగంగా విచారిస్తామని స్పష్టం చేశారు. అయితే విచారణను తప్పించుకునేందుకు రామోజీరావు కాలయాపన చేశారు. చివరికి మార్చి 3న రామోజీ ఫిల్మ్‌సిటీలో విచారణకు హాజరవుతానని సీఐడీకి తొలుత సమాచారం ఇచ్చారు. తీరా సోమవారం రోజు ఫిల్మ్‌సిటీలో కాకుండా జూబ్లీహిల్స్‌లోని తన కోడలు శైలజ కిరణ్ నివాసంలో విచారణకు హాజరవుతానని పేర్కొనగా అందుకు సీఐడీ అధికారులు సమ్మతించారు. ఈ మేరకు సీఐడీ ఎస్పీ అమిత్ బర్దార్, విచారణాధికారి రవికుమార్‌తోపాటు అధికారుల బృందం జూబ్లీహిల్స్‌లోని శైలజ నివాసానికి ఉదయం 10.30 గంటలకు చేరుకుంది. సీఐడీ అధికారులు రావడమే ఆలస్యం తన ఆరోగ్యం సరిగా లేనందున విచారణకు సహకరించలేనని రామోజీ పేర్కొన్నారు. అనారోగ్యానికి కారణాలు, నివేదికలు అందచేసి విచారణకు హాజరు కాలేరని ధృవీకరించాలని రామోజీరావు వ్యక్తిగత వైద్యుడిని సీఐడీ అధికారులు కోరారు. దీంతో రామోజీని విచారించవచ్చని, మంచంపై పడుకుని సమాధానాలు ఇస్తారని ఆయన వైద్యుడు చెప్పడంతో అందుకు సీఐడీ సమ్మతించింది. ఇక తప్పదని స్పష్టం కావడంతో సీఐడీ అధికారుల విచారణకు రామోజీ సమ్మతించారు.

ఆడియో...వీడియో రికార్డింగ్

విచారణ సందర్భంగా సీఐడీ అధికారులు నిబంధనలను కచ్చితంగా పాటించారు. ప్రక్రియ మొత్తం రికార్డింగ్ చేశారు. రామోజీ పడుకున్న మంచం సమీపంలోనే వేర్వేరు కోణాల్లో రెండు కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆయనకు కాస్త దూరంగానే సీఐడీ అధికారులు కూర్చున్నారు. విచారణ సందర్భంగా రామోజీరావు చెప్పిన సమాధానాలు, ఆయన హావభావాలు రికార్డ్ అయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నారు.

నిధుల మళ్లింపు, అక్రమ డిపాజిట్లపై..

విచారణలో సీఐడీ అధికారులు కీలక విషయాలను రాబట్టినట్టు సమాచారం. ప్రధానంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధులు అక్రమంగా బదిలీ, రిజర్వ్ బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్ల సేకరణ, రికార్డుల నిర్వహణలో అవకతవకలపై ప్రశ్నించినట్లు సమాచారం. మార్గదర్శి కార్యాలయాల్లో తనిఖీల్లో కనుగొన్న ఆధారాలు, బ్రహ్మయ్య అండ్ కో చార్టెడ్ అకౌంటెంట్ శ్రావణ్ ఇచ్చిన వాంగ్మూలం కాపీలను చూపిస్తూ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు దాటవేసేందుకు రామోజీరావు ప్రయత్నించారు. కీలక పత్రాలు, బ్యాంకు లావాదేవీల కాపీలు, బ్యాలన్స్ షీట్ల కాపీలను చూపిస్తూ అధికారులు ప్రశ్నించడంతో ఇక మాట్లాడలేకపోయారని తెలుస్తోంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయాల్లోని నిధులను ప్రధాన కార్యాలయానికి మళ్లించడం నిజమా.. కాదా? అని సూటిగా ప్రశ్నించడంతో అవునని రామోజీ అంగీకరించాల్సి వచ్చింది. చిట్‌ఫండ్స్ నిధులను నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్, ఇతర షేర్ మార్కెట్లో పెట్టుబడిగా పెట్టిన ఆధారాలను కూడా సీఐడీ అధికారులు చూపించి ప్రశ్నించగా అదంతా మార్గదర్శి ఆర్థిక ప్రణాళికలో భాగమని రామోజీ చెప్పినట్టు సమాచారం. అంటే చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడం వాస్తవమే కదా? అని ప్రశ్నించడంతో ఔనని రామోజీరావు అంగీకరించారని సమాచారం. చిట్టీల చందాదారులు పాడిన మొత్తాన్ని ఇవ్వకుండా రశీదు' మాత్రమే ఇస్తూ 5శాతం వడ్డీ చెల్లిస్తున్న విషయంపై కూడా సీఐడీ అధికారులు సూటిగా ప్రశ్నించారు. తాము అట్టిపెట్టుకున్న మొత్తానికి వడ్డీ చెల్లిస్తున్నాం కదా అందులో అక్రమం ఏముందనీ రామోజీరావు ఎదురు ప్రశ్నించినట్టు తెలుస్తోంది. వడ్డీ చెల్లిస్తామని చెప్పి నగదును అట్టిపెట్టుకోవడం అంటే అది డిపాజిట్ సేకరణే అవుతుంది కదా... చిట్‌ఫండ్ కంపెనీలను డిపాజిట్ల సేకరణకు రిజర్వ్‌బ్యాంకు అనుమతించిందా? అంటే రామోజీరావు స్పందించకుండా మౌనం వహించారని సమాచారం. అంటే మార్గదర్శి కేసులో సీఐడీ అధికారులు నమోదు చేసిన అభియోగాలన్నీ దాదాపు వాస్తవమేనని ఆయన పరోక్షంగా సమ్మతించినట్టు స్పష్టమవుతోంది. ఇప్పటికే మార్గదర్శి బ్రాంచి మేనేజర్లు, ఆడిటింగ్ వ్యవహారాలు చూసిన చార్టెడ్ అకౌంటెంట్ కూడా నిధుల మళ్లింపు, అక్రమ పెట్టుబడులు, అక్రమ డిపాజిట్లకు పాల్పడినట్టు సమ్మతించారు.



ఆరోగ్యం బాగోలేదంటూ మంచంపైన రామోజీరావు.. కానీ, ఆరోగ్యం బాగానే ఉందన్న సొంత డాక్టర్.. ఈ సందర్భంగా వీడియో రికార్డింగ్‌తో విచారిస్తున్న సీఐడీ అధికారులు

స్టేట్‌మెంట్ విశ్లేషించాక తదుపరి చర్యలు: అమిత్ బర్దార్, ఎస్పీ

'మార్గదర్శి అక్రమ వ్యవహారాలకు సంబంధించి 7 కేసులు నమోదయ్యాయి. రామోజీరావును విచారించి ఆయన స్టేట్‌మెంట్ నమోదు చేశాం. అది విశ్లేషించాల్సి ఉంది. శైలజను ఈ నెల 6న విచారిస్తాం. కేసులో కనుగొన్న ఆధారాలు, పురోగతిని బట్టి తదుపరి చర్యలు చేపడతాం'

తదుపరి విచారణ ఏపీలో!

మార్గదర్శి వ్యవహారంలో ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించిన సీఐడీ అధికారులు కేసు దర్యాప్తును మరింత వేగవంతం చేయనున్నారు. అందుకోసం రామోజీరావు, శైలజలను త్వరలో ఏపీలో విచారించాలని భావిస్తున్నారు. నేరం జరిగిన ప్రదేశం(సీన్ ఆఫ్ అఫెన్స్) ఏపీ కాగా మన రాష్ట్రంలోని చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా హైదరాబాద్ తరలించారు. కేసు దర్యాప్తు తీరును సమీక్షించిన అనంతరం తదుపరి విచారణ కోసం రామోజీరావు, శైలజలను రాష్ట్రానికి రప్పించాలని సీఐడీ భావిస్తోంది. విజయవాడ, గుంటూరు, విశాఖపట్నంలో ఎంపిక చేసుకున్న చోట విచారించేందుకు సమాయత్తమవుతున్నారు. మార్గదర్శి అక్రమాలపై ఆ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఇతర రాష్ట్రాలకు సీఐడీ సమాచారం ఇచ్చారు.

సహకరించని రామోజీ

సీఐడీ విచారణ మొదలు పెట్టిన తరువాత రామోజీరావు సమాధానాలు చెప్పేందుకు చాలాసేపు ససేమిరా అన్నారు. సీఐడీ పరిధినే ప్రశ్నిస్తూ తనను అసలు విచారించడానికే వీల్లేదన్నట్టుగా వ్యవహరించడం గమనార్హం. తాను విచారణ సంస్థలకు అతీతమన్నట్టు మొండిగా వ్యవహరించారు. దీంతో చట్ట నిబంధనలను తెలియచేస్తూ సీఐడీ అధికారులు విచారణ కొనసాగించారు. చిట్‌ఫండ్స్‌లో అక్రమ వ్యవహారాలన్నింటికీ తమ బ్రాంచి మేనేజర్లు(ఫోర్‌మెన్), అకౌంటెంట్లదే బాధ్యతని, తనకు సంబంధం లేదని తప్పించుకునేందుకు రామోజీరావు ప్రయత్నించారు. బ్రాంచి కార్యాలయాల్లోనే అన్ని వ్యవహారాలు సాగినందున వారినే ప్రశ్నించాలని మొండికేసినట్లు తెలుస్తోంది. బ్రాంచి మేనేజర్లకు రూ.500కు మించి చెక్‌పవర్ లేనప్పుడు భారీగా నిధుల బదిలీపై వారిని మాత్రమే ఎలా బాధ్యులను చేస్తామని సీఐడీ అధికారులు ఎదురు ప్రశ్నించడంతో రామోజీరావు మౌనం వహించారు. బ్రాంచిల నుంచి నిధులన్నీ హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయానికి తరలింపుపై కూడా తనకు సంబంధం లేదని రామోజీ వాదించారు. మరి చెక్ పవర్ మార్గదర్శి ఎండీ శైలజ, ప్రధాన కార్యాలయంలోని మరో 10 మంది వద్ద ఎందుకు ఉందని విచారణ అధికారులు ప్రశ్నించడంతో రామోజీ సమాధానం చెప్పలేకపోయారు. చందాదారుల సొమ్మును మ్యూచువల్ ఫండ్స్, షేర్‌మార్కెట్లో పెట్టుబడుల ద్వారా ఆర్జించిన ఆదాయం అంతా చైర్మన్, ఎండీలుగా వారే ప్రయోజనం పొందుతున్నప్పుడు జీతాలకు పనిచేసే మేనేజర్లు ఎలా బాధ్యులవుతారని సీఐడీ అధికారులు ప్రశ్నించారు.



ఒక దేశ గొప్పతనం అక్కడి జంతువులను ఎలా చూసుకుంటున్నారు అనేదాన్ని బట్టి అర్థమవుతుంది.
– మహాత్మా గాంధీ

సాక్షి
మంగళవారం, ఏప్రిల్, 4

హడావిడిగా ఆరోగ్య చట్టం!

అత్యవసర సమయాల్లో రోగులు ముందుగా డబ్బు చెల్లించకపోయినా కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రులలో తక్షణ వైద్య సేవలు అందేలా రాజస్థాన్ ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఆరోగ్య హక్కు చట్టంపై (రైట్ టు హెల్త్) అక్కడి వైద్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది! ఈ చట్టాన్ని నిరసిస్తూ లక్ష మందికి పైగా ప్రైవేటు డాక్టర్లు నిరవధికంగా సమ్మెను కొనసాగిస్తున్నారు. దాదాపు మూడు వేల ప్రైవేటు ఆసుపత్రులు వైద్య సేవల్ని నిలిపివేశాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐ.ఎం.ఎ.) కూడా వైద్యుల నిరసనకు మద్దతు తెలపడంతో రాజస్థాన్‌లో గత రెండు వారాలుగా ప్రజారోగ్య వ్యవస్థ దాదాపుగా స్తంభించిపోయింది. అత్యవసర చికిత్స కోసం రోగులు పొరుగు రాష్ట్రాలకు వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడింది. ఆందోళన విరమించేది లేదని వైద్యులు, చట్టాన్ని వెనక్కు తీసుకునే ప్రసక్తి లేదని ప్రభుత్వం పట్టుపట్టి మెట్టు దిగడం లేదు.



2018 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకే ఆరోగ్య హక్కు చట్టాన్ని తెచ్చామని రాజస్థాన్ ముఖ్య మంత్రి అశోక్ గెహ్లోత్ చెబుతున్నారు. ఎప్పుడో ఇచ్చిన హామీని మళ్లీ ఎన్నికలు వస్తున్న తరుణంలో నెరవేర్చడం వెనుక రాజకీయ ప్రయోజనాలు మాత్రమే కాక, రాష్ట్రంలో ప్రైవేటు ఆసుపత్రులన్నవే లేకుండా చేయాలన్న తలంపు కూడా ప్రభుత్వానికి ఉండివుండొచ్చని వైద్యులు ఆరోపిస్తున్నారు. మార్చి 21న రాజస్థాన్ అసెంబ్లీలో ఆరోగ్య హక్కు బిల్లు ఆమోదం పొందింది. వెనువెంటనే వైద్యుల నిరసనలు మొదలయ్యాయి. మార్చి 28న వైద్యులకు మద్దతుగా ఐ.ఎం.ఎ. రంగంలోకి దిగింది.

రాజస్థాన్ తెచ్చిన ఈ కొత్త ఆరోగ్య బిల్లు ప్రకారం, ఒక వ్యక్తి అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవల కోసం వచ్చినప్పుడు ప్రైవేటు వైద్యులు వైద్య సేవల్ని నిరాకరించకూడదు. డబ్బు చెల్లించలేక పోయినా తక్షణం చికిత్సను అందించి తీరాలి. చికిత్సానంతరం ఆ బిల్లుల్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. అత్యవసర వైద్యం నిరాకరించిన ఆసుపత్రి లేదా వైద్యుడు తొలిసారి 10 వేలు, మళ్లీ అదే తప్పు చేస్తే 25 వేలు జరిమానా చెల్లించాలి. తప్పు మీద తప్పుకు ఆ మొత్తం అలా పెరిగిపోతూ ఉంటుంది.

అయితే రోగులకు ప్రభుత్వం కల్పించిన ఈ ఆరోగ్య హక్కు... వైద్యుల జీవించే హక్కును కాలరాసేలా ఉందని, రోగుల అత్యవసర పరిస్థితి ఎలాంటిదైనా కూడా తప్పనిసరిగా చికిత్సను అందించాలన్న చట్ట నిబంధన కారణంగా తమకిక కనీస విశ్రాంతి కూడా దొరకదన్నది వైద్యుల ఆందోళన. వైద్యాన్ని నిరాకరించిన డాక్టరుపై న్యాయపరమైన చర్యలకు దిగేందుకు సైతం అనుమతిస్తున్న తాజా బిల్లు కారణంగా వైద్యులకు వేధింపులు తప్పవనీ, తమపై తప్పుడు కేసులు కూడా నమోదయ్యే ప్రమాదం ఉందనీ ప్రైవేటు వైద్యులు కలవరపడుతున్నారు. అదే సమయంలో చట్టంలోని అంశాల విషయమై ప్రభుత్వం నుంచి మరింత స్పష్టతను డిమాండ్ చేస్తున్నారు.

ఒక్కోసారి మామూలు తలనొప్పిగా అనిపించినది కూడా అత్యవసర స్థితిగా మారి మెదడులో రక్తస్రావానికి దారి తీస్తే అప్పుడేమిటి? అప్పుడు ఎంత బిల్లయినా ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుందా? మరి వైద్య పరీక్షలకు అయ్యే ఖర్చుల మాటేమిటి? తలనొప్పి, కడుపునొప్పితో వచ్చినవారికి పరీక్షలన్నీ చేశాక అది ఎమర్జెన్సీ కేసు కాదని తేలితే ఆ వైద్య పరీక్షల ఖర్చును ప్రభుత్వం భరిస్తుందా? బిల్లును పంపిన ఎన్నాళ్లకు ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుంది? ఇవీ... సమ్మె బాట పట్టిన వైద్యుల ప్రాథమిక సందేహాలు. ప్రభుత్వం ఈ సందేహాలన్నిటినీ నివృత్తి చేయవలసిన అవసరం ఉంది. చట్టం ఉద్దేశం మంచిదే కావచ్చు. చట్టంలో అస్పష్టత లేనప్పుడే అది ఆమోద యోగ్యం అవుతుంది.

దేశంలోనే తొలిసారి రాజస్థాన్ ఇలాంటి చట్టం తెచ్చిందని ఆరోగ్యశాఖ మంత్రి ప్రసాద్ లాల్ మీనా గొప్పగా చెబుతున్నారు! అయితే ఇదేమీ పూర్తిగా కొత్తది కాదు. 2021లోనే తమిళనాడు ప్రభుత్వం... అన్ని ఆసుపత్రులూ బాధితులకు విధిగా అత్యవసర వైద్య సేవలను అందించేలా ఒక పథకం ప్రవేశపెట్టింది. ఆ పథకం కింద... బిల్లు చెల్లించలేని రోగుల తరఫున ప్రభుత్వమే ఆసుపత్రులకు రీయింబర్స్ చేస్తుంది. అయితే వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించిన ఆరోగ్యశ్రీ పథకంతో పోల్చడానికి ఈ రీయింబర్స్‌మెంట్ సరిపోదు. ఆరోగ్యశ్రీ పథకం వీటితో పోల్చితే అత్యంత ప్రభావవంతమైనది, విజయవంతమైనది. దీన్ని ఇప్పుడు వైఎస్ జగన్ ప్రభుత్వం మరింత మెరుగుపర్చడంతో పాటు ప్రభుత్వ వైద్యరంగాన్ని కూడా బలోపేతం చేయడంతో అది అన్ని రాష్ట్రాలకూ మోడల్‌గా ఆవిర్భవించింది.

రాజస్థాన్ విషయానికి వస్తే ఆరోగ్య హక్కు చట్టాన్ని అక్కడి ప్రభుత్వం హడావిడిగా తెచ్చినట్లు స్పష్టం అవుతోంది. అటు ప్రభుత్వ వైద్యరంగాన్ని పటిష్టం చేయడానికి ఏ ప్రయత్నం చేయకుండా, ఇటు ఆరోగ్యశ్రీ వంటి ఒక బృహత్తర పథకాన్ని ఆలోచించకుండా, ఆ రంగానికి సంబంధించిన ప్రముఖులతో చర్చించకుండా, వైద్యుల భయాలను సంపూర్ణంగా నివృత్తి చేయకుండా, రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బిల్లును ఆమోదించినట్లు కనిపిస్తోంది. ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు. బిల్లు అమలులోకి రావాలంటే గవర్నర్ ఆమోదం పొందాలి. ఆరోగ్య హక్కు చట్టం పరిధిలోకి వచ్చే ఆసుపత్రులేవో ప్రభుత్వం నిర్ణయించాలి. అప్పుడే రీయింబర్స్‌మెంట్ ప్రక్రియ గురించి స్పష్టత వస్తుంది. ఈ అన్ని దశలలోనూ వైద్యులతో ప్రభుత్వం తప్పక చర్చించాలి. చర్చలకు హామీ ఇస్తూ, సమ్మె విరమించి వెంటనే విధులకు హాజరవాలని వైద్యులను కోరవలసిందీ, ఇందుకు తగిన చొరవ తీసుకోవలసిందీ ప్రభుత్వమే.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.త్రయోదశి ఉ.7.44 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** పుబ్బ ఉ.9.24 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** సా.5.12 నుండి 6.55 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.24 నుండి 9.11 వరకు తదుపరి రా.10.53 నుండి 11.38 వరకు, **అమృతఘడియలు:** రా.3.30 నుండి 5.12 వరకు.

సూర్యోదయం : 5.57
సూర్యాస్తమయం: 6.09
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

రాజ లాంఛనం

జ్యోతిర్మయం

రాచరికాలు రాజ్యం చేసే రోజుల్లో, రాజులనూ, వాళ్ళ వంశాన్నీ, వాళ్ళ గుణగణాలనూ, ఘన కార్యాలనూ అదేపనిగా పొగ డుతూ ఉండేందుకు వందిమాగధుల సిబ్బంది ఉంటూ ఉండేది. ఈ పొగడ్తలు, కార్యార్థులై వచ్చే 'కాకా'సురులు చేసే ముఖస్తుతులకు అదనం. ఈ 'రాజ లాంఛనం' ప్రపంచంలో అన్ని ప్రాంతాలలోనూ, అన్ని కాలాలలోనూ ఏదో ఒక రూపంలో ఉంటూ వచ్చిందే.

ఈ 'లాంఛనం' వెనక ఉద్దేశ్యం రాజుగారి అహంకారానికి మర్దన చేసి ఆయనకు సుఖం కలిగించటం మాత్రమే కాదు. ఇలాంటి నిత్య ప్రశంసల వల్ల ప్రజలకు కూడా తమ రాజు మీద గౌరవాదరాలు పెరిగి, ఆయన నాయకత్వంలో అందరూ ఒక తాటిమీద ఉంటారనీ, రాజభక్తీ, దేశ భక్తీ వృద్ధి అవుతాయనీ ఒక ఆశయం. రాజు కూడా మానవ మాత్రుడే. అయినా ఈ స్తోత్రపాఠాల వల్ల, ఆయన ఇతరులందరికంటే ఘనుడని ఒక ఛవి దేశమంతా ఏర్పడితే, ఆయన ఆదేశాలకూ, నిర్ణయాలకూ విలువ పెరుగుతుందని కూడా రాజనీతివేత్తల నమ్మకం. రాజు ఘనుడైనా కాకపోయినా, ఆయన సమర్థుడన్న విశ్వాసం దేశవ్యాప్తంగా ప్రజలలో ఉంటే అది దేశానికి బలమే. అలాగే రాజు ఎంత ఘనుడైనా, ఆయన అసమర్థుడు అన్న అభిప్రాయమే ప్రజలలో ప్రబలంగా ఉంటే అది దేశానికి బలహీనతే.

ఈ స్తుతుల వెనక మరొక కొంటె కోణం కూడా ఉండేదేమో! 'మారాజు ధర్మాత్ముడూ, దయామయుడూ' అని ప్రతిరోజూ ఎత్తేయ టంలో ఒక అర్థం, 'రాజా, ఈ సుగుణాలన్నీ ఇప్పుడు నీకు లేవన్న విషయం నీకూ తెలుసు, మాకూ తెలుసు. కానీ ఇవన్నీ మంచి పాల కుడి లక్షణాలు. ఇప్పుడైనా ఈ లక్షణాలు అలవరచుకొనేందుకు ప్రయత్నించండి. అప్పటిదాకా ఈ లక్షణాలన్నీ మీకు నిజంగా ఉన్నట్టే అందరమూ నటిస్తూ ఉందాం' అని లౌక్యంగా సూచించే వాళ్ళేమో! 'నువ్వు దాన కర్ణుడి వహో' అని చుట్టూ చేరిన జనం రోజూ ఊదర గొడుతుంటే, ఎంత పిసినారి వాడయినా మొహమాటం కోసమైనా కొంత ఉదార స్వభావం చూపక తప్పదు కదా!

– ఎం. మారుతి శాస్త్రి

టీడీపీ ప్రభుత్వంలో మద్యం విక్రయాల పెరుగుదల ఇలా.. (కేసుల్లో)

ఏడాది	ఐఎంఎల్ (మద్యం) విక్రయాలు	బీరు విక్రయాలు
2017-18	3.60 కోట్లు	2.27 కోట్లు
2018-19	3.84 కోట్లు	2.77 కోట్లు

వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం విక్రయాల తగ్గుదల ఇలా.. (కేసుల్లో)

ఏడాది	ఐఎంఎల్ (మద్యం) విక్రయాలు	2018-19తో పోలిస్తే తగ్గిన విక్రయాలు	బీరు విక్రయాలు	2018-19తో పోలిస్తే.. తగ్గిన విక్రయాలు
2019-20	3.08 కోట్లు	20 శాతం	2.12 కోట్లు	23 శాతం
2020-21	1.94 కోట్లు	50 శాతం	57 లక్షలు	79 శాతం
2021-22	2.78 కోట్లు	28 శాతం	82 లక్షల కేసులు	70 శాతం

రామోజీ 'రక్త' కన్నీరు!

- మేనిఫెస్టోకు కట్టుబడే ప్రభుత్వ మద్య విధానం
- దాంతో భారీగా తగ్గిన మద్యం అమ్మకాలు
- అక్రమ మద్యం, నాటుసారాపై ఎస్‌ఈబీ ఉక్కుపాదం
- నాటుసారా తయారీ కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధితో నవోదయం
- కళ్లుండి ఇవేవీ చూడలేని కబోదిలా రామోజీ విషపు రాతలు

రాష్ట్రంలో ప్రభుత్వం ఏం చేయాలో రామోజీ కంటిచూపుతో డిసైడ్ చేస్తాడు..
కాంట్రాక్టులు ఎవరికి కట్టబెట్టాలో ఆయనే శాసిస్తాడు..
విధానపరమైన నిర్ణయాలనూ రామోజీరావే నిర్దేశిస్తాడు..
ఇదంతా 2019 చంద్రబాబు హయాం వరకు ఉన్న పరిస్థితి. అప్పటి వరకు ఆయన ఆడింది ఆట.. పాడింది పాటగా సాగింది.. చెల్లింది కూడా.
ఆ తర్వాత సీన్ మారింది..
ఇప్పుడు నాలుగేళ్లుగా రాష్ట్రంలో రామోజీ ఆటలు సాగడంలేదు..
తన సమీప బంధువు నుంచి పోలవరం కాంట్రాక్టు మొదలుకుని నిన్నమొన్నటి మార్గదర్శి చిట్‌ఫండ్స్ వరకూ ఆయనకు తరచూ నోట్లో పచ్చివెలక్కాయలు పడుతున్నాయి. గొంతులో ఊపిరాడకుండా చేస్తున్నాయి.
ఎందుకంటే ఇప్పుడున్నది జీ హుజూరంటూ తలూపే చంద్రబాబు సర్కారు కాదు కదా.. పుష్కలంగా ప్రజామద్దతు ఉన్న వైఎస్ జగన్ సర్కార్ ఇది.
పైగా తన జేబులో మనిషి.. 40 ఇయర్స్ ఇండస్ట్రీ చంద్రబాబు వైభవం మరోవైపు మిణుకుమిణుకుమంటోంది.
దీంతో రామోజీకి దిక్కుతోచడంలేదు.. సరికదా పిచ్చెక్కినట్లు ఉంటోంది.
అంతే.. ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లు వైఎస్ జగన్ సర్కారుపై అడ్డగోలుగా.. తన పాఠకులు విసుగెత్తిపోయారనే కనీస స్పృహ కూడా లేకుండా నిత్యం కలంకూట విషం చిమ్ముతున్నాడు. అందులో భాగంగా తాజాగా రాష్ట్ర ప్రభుత్వ మద్య విధానంపై వాస్తవాలను వక్రీకరిస్తూ 'రక్త మాంసాలతో వ్యాపారం' అంటూ ఎప్పటిలాగే మరోసారి విషం కక్కాడు. ఈ విషబీజాలు మీకు కిక్కు ఇస్తాయేమోకానీ మీరనుకున్న లక్ష్యం నెరవేరదు రామోజీ..!
నిత్యం అబద్ధాలు అల్లుతూ రాసే విషపు రాతలోని పచ్చినిజం 'ఏది నిజం'.. ఇదిగో...

సాక్షి, అమరావతి

రాష్ట్ర ప్రభుత్వ మద్య విధానంపై వాస్తవాలను వక్రీకరిస్తూ 'రక్త మాంసాలతో వ్యాపారం' అంటూ ఈనాడు మరోసారి విషం చిమ్మింది. చంద్రబాబు అధికారంలో లేడన్న బాధ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా విజయవంతంగా కొనసాగుతున్నారన్న అక్కసు అంతా కలగలిపి మరీ అక్షరాల్లో కూర్చి తన కరపత్రికలో కడుపుమంట తీర్చుకున్నాడు రామోజీ. కానీ, వాస్తవం ఏమిటంటే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థంగా అమలుచేస్తున్న మద్యం విధానం అందిస్తున్న ఫలాలు ఏమిటో ప్రజలకు తెలుసు.. బెల్ట్ దుకాణాల్లేని పల్లెలకు తెలుసు.. పర్మిట్‌రూమ్‌లు లేని ఊర్లకు తెలుసు.. మద్యం రేట్లు అమాంతంగా పెరగడంతో ఆ వ్యసనానికి తమ భర్తలు, పిల్లలు క్రమంగా దూరమవుతుండటంతో ఊరట చెందుతున్న అక్కాచెల్లెమ్మలకు తెలుసు.. దశాబ్దాలుగా నాటుసారా తయారీ తప్ప మరో దిక్కులేని అగత్యం నుంచి బయటపడి, ప్రస్తుతం దర్జాగా ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలతో సామాజిక గౌరవం పొందుతున్న కుటుంబాలకు తెలుసు.. సంక్షేమ పథకాలతో ఆర్థిక వృద్ధి, మెరుగైన జీవన ప్రమాణాలు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద కుటుంబాలకూ తెలుసు. ప్రజలు అందరికీ వాస్తవాలు తెలుసు అన్నదే ఈనాడు రామోజీరావు దుగ్ధ. ప్రజలు చంద్రబాబును ఏమాత్రం నమ్మడం లేదనే ఆయన ఆక్రోశం. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపట్ల జనాదరణ రోజురోజుకు మరింతగా పెరుగుతుండడమే ఆయన ఆందోళన. అందుకే తనకు అలవాటైన రీతిలో విష ప్రచారంతో ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. రామోజీ, చంద్రబాబు ద్వయానికి కష్టంగా ఉన్నా సరే వారు ఇప్పటికైనా గుర్తించాల్సిన వాస్తవం ఏమిటంటే.. మీ టైమ్ అయిపోతోంది.. మీ కట్టుకథలకు కాలం చెల్లింది. తెలుస్తోందా రామోజీ..



మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న అధికారులు (ఫైల్)

ఏది నిజం?

అప్పట్లో మూడు పర్మిట్ రూమ్‌లు.. ఆరు బెల్ట్ దుకాణాలు..

మద్యం విక్రయాలను దశల వారీగా నియంత్రిస్తామన్న మేనిఫెస్టోలోని హామీని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలుచేస్తోంది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలోటీడీపీ నేతల మద్యం సిండికేట్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో మూడు పర్మిట్ రూమ్‌లు.. ఆరు బెల్ట్ దుకాణాలుగా మద్యం ఏరులై పారిందన్న నిజం పాపం రామోజీరావుకు గుర్తుండి ఉండదు. అప్పట్లో మద్యం మాఫియా యథేచ్ఛగా ప్రజలను దోపిడీ చేసింది. మద్యం దుకాణాలన్నీ టీడీపీ నేతల గుప్పెట్లోనే ఉండేవి. వేళాపాళా లేకుండా 24గంటలూ మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగేవి. ఎమ్మార్పీ ధరల కంటే 25శాతం వరకు అధిక ధరలకు అమ్ముతున్నా సరే నాడు ఎక్సైజ్ శాఖ చోద్యం చూస్తూ ఉండాల్సి వచ్చేది.

సీఎంగా జగన్ వచ్చాక..

కానీ, ఈ మద్యం మాఫియా అరాచకాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క విధాన నిర్ణయంతో తుడిచిపెట్టేశారు. రాష్ట్రంలో ప్రైవేటు మద్యం దుకాణాల విధానాన్ని ఆయన రద్దుచేశారు. 2019, అక్టోబరు 1 నుంచి మద్యం దుకాణాలన్నీ ప్రభుత్వపరం చేసేశారు. దాంతో రాష్ట్రంలో మద్యం మాఫియాను తుదముట్టించారు. అందుకోసం..

మద్యం దుకాణాల వేళలు కుదింపు

ప్రైవేటు వ్యక్తులు అయితే ఎంతగా మద్యం విక్రయాలు పెంచితే తమకు అంతటి లాభం వస్తుందని అనుకుంటారు. ప్రస్తుతం మద్యం దుకాణాలు ప్రభుత్వానివే కాబట్టి మద్యం అమ్మకాలను ప్రోత్సహించాల్సిన అవసరమేలేదు. ఇక మద్యం విక్రయాల సమయాలను బాగా కుదించారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రైవేటు మద్యం దుకాణాలు ఉ. 10గంటల నుంచి రాత్రి 11గంటల వరకు అధికారంగా విక్రయాలు సాగించేవి. అనధికారికంగా 24గంటలూ విక్రయిస్తూ ఉండేవి. కానీ, ప్రస్తుతం ప్రభుత్వం మద్యం దుకాణాల సమయాన్ని కుదించి కచ్చితంగా అమలుచేస్తున్నారు. ఉ.10గంటల నుంచి రాత్రి 9గంటల వరకే విక్రయాలను అనుమతించారు.

బెల్ట్ షాపులు, పర్మిట్ రూమ్‌ల రద్దు

అంతేకాదు.. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ప్రైవేటు మద్యం దుకాణాలకు అనుబంధంగా రాష్ట్రంలో 43వేల బెల్ట్ దుకాణాలు ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బెల్ట్ దుకాణాలను పూర్తిగా తొలగించింది. టీడీపీ ప్రభుత్వంలో మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లకు అనుమతించారు. అంటే మద్యం దుకాణాలే అనధికారికంగా బార్లుగా కూడా చలామణి అయ్యేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే ఇవీ రద్దయ్యాయి.

మద్యం దుకాణాలు క్రమంగా తగ్గింపు

చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్రంలో 4,380 మద్యం దుకాణాలు ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రైవేటు మద్యం దుకాణాలను పూర్తిగా తొలగించి ప్రభుత్వ పరం చేసింది. అంతేకాదు.. మద్యం దుకాణాలను క్రమంగా తగ్గిస్తూ వస్తోంది. 2019లో రాష్ట్రంలో 4,380 ప్రైవేటు మద్యం దుకాణాలు ఉండగా ప్రస్తుతం 2,934 ప్రభుత్వ మద్యం దుకాణాలే ఉన్నాయి. ఈ సంఖ్యను ఇంకా తగ్గించే ఉద్దేశంలో ప్రభుత్వం ఉంది. ఇవన్నీ కాదనగలరా రామోజీరావుగారూ..

బార్ల సంఖ్య పెంచలేదు

టీడీపీ ప్రభుత్వం ఏటా బార్ల సంఖ్యను పెంచేది. కానీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బార్ల సంఖ్యను పెంచలేదు. 2019లో ఖరారుచేసిన 840 బార్లే ఉన్నాయి. కొత్త బార్లకు లైసెన్సులు ఇవ్వలేదు.

భారీగా తగ్గిన మద్యం అమ్మకాలు

ఇక దశలవారీగా మద్య నియంత్రణ విధానం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలిస్తున్నాయి. రాష్ట్రంలో మద్యం విక్రయాలు గణనీయంగా తగ్గాయి. టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే రాష్ట్రంలో ప్రస్తుతం మద్యం విక్రయాలను సగానికి పడిపోయాయి. అందుకు ఈ గణాంకాలే తార్కాణం..

మేనిఫెస్టోలో హామీ మేరకే షాక్ కొట్టేలా మద్యం ధరలు..

మద్యం విక్రయాలను నిరుత్సాహపర్చడమే తమ పార్టీ విధానమని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభల్లోనూ మేనిఫెస్టోలోనూ స్పష్టంగా చెప్పారు. తద్వారా పేదలను మద్యం వ్యసనానికి దూరం చేయాలన్నది తమ విధానమన్నారు. అంతేగానీ, మద్యం విక్రయాలను ప్రోత్సహించి సొమ్ము చేసుకోవడం ప్రభుత్వ లక్ష్యం కాదని ఆయన స్పష్టం చేశారు. అదేమాటకు కట్టుబడుతూ అధికారంలోకి వచ్చాక మద్యం ధరలను షాక్ కొట్టేలా పెంచారు. అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (ఏఆర్‌ఈటీ) పన్నునూ విధించారు. దాంతో మద్యం ధరలు పెరిగాయి. ప్రభుత్వం అమలుచేస్తున్న దశలవారీ మద్య నియంత్రణతో మద్యం విక్రయాలు గణనీయంగా తగ్గాయి. మరోవైపు.. మద్యం వ్యసనాన్ని నిరుత్సాహ పరిచేందుకు విధించిన ఏఆర్‌ఈటీ పన్నుతో మద్యం రాబడి పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఈ వాస్తవాన్ని రామోజీ వక్రీకరిస్తూ రాష్ట్రంలో మద్యం విక్రయాలు పెరిగాయని ప్రజలను తప్పుదారి పట్టించేందుకు కిందామీదా పడుతున్నారు. వాస్తవానికి రాష్ట్రంలో మద్యం విక్రయాలు గణనీయంగా తగ్గాయి. పేదలు మద్యం వ్యసనానికి క్రమంగా దూరమవుతున్నారు. పేదలు మద్యానికి దూరమవుతుండటం కూడా రామోజీరావుకు ఆవేదన కలిగిస్తుందంటే నిజంగా ఆయనకు మామూలు చికిత్స కాదు మానసిక చికిత్స అవసరమనిపిస్తోంది.

డిస్టిలరీలన్నీ బాబు హయాంలోనివే..

ఇక రాష్ట్రంలో ఉన్న మద్యం డిస్టిలరీలన్నీ చంద్రబాబు హయాంలో అనుమతులు ఇచ్చినవే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ఒక్క కొత్త డిస్టిలరీకీ అనుమతివ్వలేదు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాసనసభలో స్లైడ్లు ప్రదర్శించి మరీ వివరించారు. అయినా సరే.. కళ్లున్న కబోదిగా వ్యవహరిస్తున్న రామోజీని ఏమనాలి.. ఏం చేయాలి?

సంక్షేమ పథకాలకు నిధుల సమీకరణ తప్పా రామోజీ..

రాష్ట్ర బేవరేజ్ కార్పొరేషన్ ద్వారా ఎన్‌సీడీలు జారీచేసి ప్రభుత్వం నిధులు సమీకరించింది. వీటిని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, అగ్రవర్ణ పేదల సంక్షేమం కోసం వెచ్చిస్తున్నామని కూడా స్పష్టంచేసింది. పేదల సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం తగినన్ని నిధులు సమీకరించడం కూడా రామోజీరావుకు కంటగింపుగా మారుతోంది. తాను, తన చంద్రబాబు తప్ప పేదలు బాగుపడకూడదని ఆయన భావన కావచ్చు. ఆ రోజులకు కాలం చెల్లింది. మీకు అర్థమవుతోందా రామోజీ..

అక్రమ మద్యంపై ఎస్‌ఈబీ ఉక్కుపాదం

అలాగే, వైఎస్సార్సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అక్రమ మద్యం, నాటుసారాపై ఉక్కుపాదం మోపుతోంది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా సాగిన అక్రమ మద్యం, నాటుసారా దందాను సమర్థంగా కట్టడి చేస్తోంది. అందుకోసం ప్రత్యేకంగా 'స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో' (ఎస్‌ఈబీ)ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటుచేయడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనం. ఎస్‌ఈబీ మూడు విధాలుగా అక్రమ మద్యం, నాటుసారాను అరికడుతోంది. ఎలాగంటే..

- అక్రమ మద్యం, నాటుసారా తయారీ దశాబ్దాలుగా సాగుతున్న 147 గ్రామాలను గుర్తించి దాడులు నిర్వహిస్తోంది.
- గ్రామ వలంటీర్లు, వార్డు వలంటీర్లు, గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా కచ్చితమైన సమాచారాన్ని తెప్పించుకుని అక్రమ మద్యం దందాను అడ్డుకుంటోంది.
- ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం స్మగ్లింగ్‌ను అడ్డుకునేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది. అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశాలు నిర్వహిస్తూ.. పొరుగు రాష్ట్రాలతో కలిసి దాడులు నిర్వహిస్తోంది.

సారా సిండికేట్‌కు గుండెల్లో రైళ్లు

2019 నుంచి 2023 మార్చి వరకు పోలీసు, ఎస్‌ఈబీ విభాగాలు నాటు సారా తయారీదారులపై 1,44,254 కేసులు నమోదు చేశాయి. మొత్తం 1,12,604 మందిని అరెస్టుచేశారు. 18.41లక్షల లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకోవడంతోపాటు 5.34కోట్ల లీటర్ల సారా ఊటలను ధ్వంసం చేయడం ప్రభుత్వం చేపడుతున్న కఠిన చర్యలకు నిదర్శనం. మొత్తం 14,556 వాహనాలను జప్తుచేశారు.

చంద్రబాబు హయాంలో 2014 నుంచి 2018 వరకు అక్రమ మద్యం కేసులు..

కేసులు	నిందితులు	స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం	స్వాధీనం చేసుకున్న అక్రమ బీరు	జప్తు చేసిన వాహనాలు
6,812	5,560	8.35 లక్షల లీటర్లు	4,074 లీటర్లు	881

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2019 నుంచి 2023 మార్చి వరకు..

కేసులు	నిందితులు	స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం	స్వాధీనం చేసుకున్న అక్రమ బీరు	జప్తు చేసిన వాహనాలు
56,310	76,900	10.33 లక్షలు	34,768 లీటర్లు	24,881

బైండోవర్ కేసులు, పీడీ యాక్ట్‌లు..

రాష్ట్రంలో నాటుసారా, అక్రమ మద్యం, అక్రమంగా నల్లబెల్లం తయారీదారులపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోంది. వారిపై బైండోవర్ కేసులు నమోదుచేస్తోంది. 2020 జూన్ నుంచి 2023 మార్చి 14 వరకు మొత్తం 74,674 బైండోవర్ కేసులు నమోదు చేసింది. అలాగే, రాష్ట్రంలో అక్రమ మద్యం, నాటుసారా దందాకు అలవాటుగా మారిన నేరస్తులను గుర్తించి పీడీ యాక్ట్‌లను ప్రయోగిస్తున్నారు. 2020, మే 16 నుంచి 2023, మార్చి 16 వరకు రాష్ట్రంలో ఏకంగా 206 మందిపై పీడీ యాక్ట్ ప్రయోగించడం ప్రభుత్వం చేపడుతున్న కఠిన చర్యలకు నిదర్శనం.

జిల్లాల వారీగా పీడీ యాక్ట్ కేసులు..

జిల్లా	కేసులు
శ్రీకాకుళం	3
విజయనగరం	1
అల్లూరి సీతారామరాజు	5
పార్వతీపురం మన్యం	4
అనకాపల్లి	2
కాకినాడ	12
అంబేడ్కర్ కోనసీమ	6
తూర్పు గోదావరి	36
పశ్చిమ గోదావరి	8
ఏలూరు	12
కృష్ణా	6
ఎన్టీఆర్	8
బాపట్ల	14
పల్నాడు	15
ప్రకాశం	7
ఎస్పీఎస్ఆర్ నెల్లూరు	3
చిత్తూరు	22
తిరుపతి	1
వైఎస్సార్	5
కర్నూలు	6
నంద్యాల	19
అనంతపురం	6
శ్రీసత్యసాయి	4
అన్నమయ్య	1
మొత్తం	206

అక్రమ మద్యం దందాకు చెక్

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అక్రమ మద్యం దందా యథేచ్ఛగా సాగింది. టీడీపీ నేతలు ఇతర రాష్ట్రాల నుంచి పన్ను చెల్లించని మద్యాన్ని అక్రమంగా స్మగ్లింగ్ చేసి భారీగా దోపిడీకి పాల్పడ్డారు. ఆనాటి ప్రభుత్వం కూడా ఆ దందాపై ఉదాసీనంగా ఉండేది. రామోజీ కూడా ఏనాడు పెన్నెత్తి మాట్లాడలేదు. కానీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అక్రమ మద్యం దందాకు సమర్థంగా చెక్‌పెట్టింది. ఎస్‌ఈబీ విస్తృతంగా దాడులు నిర్వహిస్తూ మద్యం స్మగ్లింగ్‌ను కట్టడి చేస్తోంది. దీనిని కాదనగలరా రామోజీ..

ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలతో 'నవోదయం'

దశాబ్దాలుగా నాటుసారా తయారీయే జీవనోపాధిగా చేసుకున్న కుటుంబాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్త వెలుగులు తెచ్చింది. నవోదయం పేరుతో వినూత్న సంస్కరణలను తీసుకొచ్చింది. ఆ కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించి వారికి ఆర్థికంగా దన్నును అందించడంతోపాటు సామాజికంగా గౌరవాన్ని పెంచింది. అందుకోసం ఎస్‌ఈబీ ప్రత్యేకంగా సర్వే నిర్వహించి అటువంటి గ్రామాలను గుర్తించి ఆయా జిల్లాల యంత్రాంగాల సహకారంతో పటిష్ట కార్యాచరణ చేపట్టింది. ఆ కుటుంబాలకు ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా ప్రత్యామ్నాయ ఉపాధి అందిస్తోంది. 2022 ఏప్రిల్ నాటికి రాష్ట్రంలో 1,891 గ్రామాలను గుర్తించారు. ఆ గ్రామాల్లో ఇప్పటికే 1,552 కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వం రూ.11.46 కోట్ల మేర సహాయం చేసింది. మిగిలిన కుటుంబాలకు కూడా కల్పించే ప్రక్రియ కొనసాగుతోంది రామోజీ..

చంద్రబాబు, రామోజీ మధ్య ఉన్నది మద్యం బంధమే

రక్తమాంసాలతో వ్యాపారం వారిద్దరిదే



వ్యాపార ప్రయోజనాల కోసం ఎంతటి కుత్రపూరిత రాజకీయాలు చేయాలో.. ప్రభుత్వ పాలనా వ్యవస్థను ఎంతగా దుర్వినియోగం చేయాలో ఈ ప్రపంచంలో చంద్రబాబు, రామోజీరావులకు తెలిసినంతగా మరెవరికీ తెలీదు. ఆ విషయంలో పేటెంట్ వారిద్దరిదే. 1989–94లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపడం.. అప్పట్లో తమ పోటీ పత్రిక 'ఉదయం' ఆర్థిక మూలాలను దెబ్బతీసేందుకు రామోజీరావు సంపూర్ణ మద్య నిషేధం ఉద్యమాన్ని ప్రోత్సహించారు. ఎన్టీరామారావు అధికారంలోకి రాగానే సంపూర్ణ మద్య నిషేధాన్ని విధించారు. ఆ తర్వాత ఎన్టీరామారావుకు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు సీఎం అయ్యారు. వెంటనే రామోజీరావు ఏమాత్రం సిగ్గూఎగ్గూ లేకుండా ప్లేటు ఫిరాయించి సంపూర్ణ మద్య నిషేధం విధానానికి టాటా చెప్పారు. అంతే.. నిషేధాన్ని చంద్రబాబు ఎత్తేశారు. ఎందుకంటే అప్పుడే రామోజీ ఫిల్మ్‌సిటీ నిర్మాణం చేపట్టారు. అందులోని స్టార్‌హోటళ్లలో మద్యం విక్రయాల కోసం రామోజీరావు నిజంగా ప్రజల రక్తమాంసాలతో వ్యాపారం చేశారు. ఇప్పుడు ఈయన శ్రీరంగ నీతులు చెబుతున్నాడు.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు!

హనుమంత వాహనంపై భక్తవత్సలుడు



ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట శ్రీకోదండ రామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నాలుగో రోజు సోమవారం నవనీతకృష్ణాలంకారంలో కోదండ రాముడు భక్తులకు దర్శనమిచ్చారు. కేరళ వాయిద్యాలు, కోలాటాల నడుమ నవనీతకృష్ణుడు గ్రామంలో ఊరేగాడు. రాత్రి 8 నుంచి 9.30 గంటల వరకు హనుమంత వాహనంపై భక్తవత్సలుడు భారీగా తరలివచ్చిన భక్తులకు అభయం ఇచ్చారు. టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్ బాబు ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. కాగా కోదండ రామాలయంలో మంగళవారం ఉదయం 8 నుంచి 10 వరకు మోహినీ అలంకారంలో స్వామి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. రాత్రికి గరుడ వాహనంపై కోదండ రాముడు ఒంటిమిట్ట వీధుల్లో ఊరేగనున్నారు.

హనుమంత వాహనంపై ఊరేగుతున్న శ్రీరామచంద్రుడు

శ్రీవారి వసంతోత్సవాలు ప్రారంభం

తిరుమల: తిరుమలలోని వసంతోత్సవ మండపంలో సోమవారం శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు శోభాయమానంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవంలో భాగంగా శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామి వారు నాలుగు మాడవీధుల్లో ఊరేగింపుగా వసంత మండపానికి వేంచేపు చేశారు. ఉదయం ఆస్థానం చేపట్టారు. మధ్యాహ్నం శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామివారికి స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఈ వేడుకలో ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమ జాతి పుష్పమాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు అక్కడినుంచి బయల్దేరి ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ కుమార్ పాల్గొన్నారు. వసంతోత్సవాల్లో రెండవ రోజైన మంగళవారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు స్వర్ణరథంపై తిరుమాడ వీధుల్లో ఊరేగనున్నారు. కాగా, తిరుమలలో ఆదివారం అర్ధరాత్రి వరకు 82,398 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.4.40 కోట్లు సమర్పించారు. టికెట్లు లేని వారికి దర్శనానికి 24 గంటల సమయం పడుతోంది. శ్రీవారిని సోమవారం సినీనటి జాహ్నవి కపూర్ దర్శించుకున్నారు.



స్నాపన తిరుమంజనంలో సేద తీరుతున్న శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి

స్వయం సహాయక సంఘాల దాతృత్వం

సైనిక సంక్షేమ నిధికి రూ.7.62 లక్షల విరాళం

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలోని 25,097 స్వయం సహాయక సంఘాల సభ్యులు సోమవారం సైనిక సంక్షేమ నిధికి రూ.7.62 లక్షలు విరాళమిచ్చారు. ఈ చెక్కును విజయవాడలో కలెక్టర్ ఢిల్లీ రావు చేతుల మీదుగా సైనిక సంక్షేమ అధికారి డాక్టర్ కళ్యాణ వీణకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన సైనికుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు స్వయం సహాయక సంఘాల సభ్యులు విరాళం అందించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకుంటూ సంపాదించిన దానిలో కొంత మొత్తాన్ని సైనిక సంక్షేమ నిధికి విరాళంగా అందించడం గొప్ప విషయమన్నారు. ప్రజలు కూడా ఇదే విధంగా స్పందించి విరాళాలు అందజేయాలని కోరారు. ఆసక్తి ఉన్నవారు జిల్లా సైనిక సంక్షేమ అధికారికి ఎస్బీఐ ఖాతా 62067742138, ఐఎఫ్ఎస్సీ కోడ్ ఎస్బీఐఎన్ 0020899 ద్వారా నేరుగా తమ విరాళాలు అందించవచ్చని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు శ్రీవాస్, కె.మోహన్‌కుమార్, కె.శ్రీనివాస్, ఎం.సునీత లక్ష్మి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కె.సీత, కార్యదర్శి కె.రాణి, కోశాధికారి లియోనా తదితరులు పాల్గొన్నారు.



సైనిక సంక్షేమ నిధికి విరాళం చెక్కును అందజేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, జిల్లా సమాఖ్య సభ్యులు

● తెలంగాణ

చెత్త వేసొస్తానని పారిపోయి.. చెట్లపొదల్లో నిద్రపోయి..

- మున్సిపల్ ట్రాక్టర్‌లో చెత్తవేసి జంప్ అయిన ఖైదీ
- గాలించిన పోలీసులు, పరకాల జైలు అధికారులు
- పొదల్లో సేదదీరుతూ దొరికిపోయిన వైనం

పరకాల: చుట్టూ పచ్చనిపొలాలు.. పంటకాల్వల్లో ఉరకలేస్తున్న జలాలు.. ఆ పక్కనే చీమ చిటుక్కున్నా వినిపించేంత నిశ్శబ్దం అలుముకున్న చెట్లపొదలు. ఆ పొదల్లో ఓ వ్యక్తి ఆదమరిచి నిద్రపోతున్నాడు. ఏదో అలికిడికి ఉలిక్కిపడి లేచి చూసేసరికి చుట్టూ సాయుధులైన పోలీసులు. తప్పించుకోబోయి చివరికి పోలీసులకు చిక్కాడు. జైలు సిబ్బందిని నమ్మించి పారారైన రిమాండ్ ఖైదీ చివరికి అతడి భార్య ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులకు పట్టుబడ్డాడు. 2019లో మహదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ బాలికపై అత్యాచారం కేసులో ములుగు జిల్లా ఏటూరునాగారం గ్రామానికి చెందిన సైకిల్ మెకానిక్ షేక్ గౌస్ పాషా అలియాస్ చోటు(22) కరీంనగర్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. బెయిల్‌పై బయటకు వచ్చి తిరిగి కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతుండటంతో ఈ ఏడాది మార్చి 18న పోలీసులు అతడిని అరెస్టు చేసి పరకాల సబ్‌జైలుకు తరలించారు. అప్పటి నుంచి జైలు సిబ్బందితో సన్నిహితంగా ఉంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో మున్సిపల్ వాహనంలో చెత్తవేయడానికని తాజాగా సోమవారం తెల్లవారుజామున 6.20 గంటలకు జైలు గేటు దాటి వచ్చి పరారయ్యాడు.

భార్య నిజాయితీతో దొరికిన ఖైదీ

పరారైన తరువాత భార్యకు నిందితుడు ఫోన్ చేసి ఉంటాడని జైలు అధికారులు పసిగట్టి పరారీ విషయాన్ని ఆమెకు ఫోన్‌ద్వారా తెలియజేశారు. అతడు తిరిగి జైలుకు వస్తే శిక్ష తక్కువగా ఉంటుందని, లేకపోతే మరింత ఎక్కువ కాలం శిక్ష అనుభవించాల్సి వస్తుందని చెప్పారు. కొద్దిసేపటి తరువాత అనుకున్నట్టే గౌస్ పాషా ఇతరుల సెల్‌ఫోన్‌తో భార్యకు ఫోన్ చేశాడు. ఆమె ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఆ నంబర్ లొకేషన్ గుర్తించి అయ్యప్ప గుడి వద్దకు చేరుకున్నారు. అతడు అదే ప్రాంతంలో ఉంటాడని భావించిన పోలీసులు ఆ చుట్టుపక్కల పంటపొలాలు, కాల్వలు, చెట్లపొదలలో గాలించారు. చివరకు ఓ పంటకాల్వ సమీపంలోని చెట్లపొదల్లో నిద్రపోతూ పోలీసులకు చిక్కాడు.

లక్ష మంది భద్రాచల ముత్యాల తలంబ్రాల బుకింగ్

- ఈనెల 10 వరకు బుకింగ్ గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాలను ఆర్టీసీ లాజిస్టిక్ ద్వారా లక్ష మంది భక్తులు బుక్ చేసుకున్నారు. మరికొంతమంది ముందుకొస్తుండటంతో ఈనెల 10 వరకు బుకింగ్స్‌ను తెరిచే ఉంచనున్నట్లు ఆర్టీసీ ప్రకటించింది. మొదట బుక్ చేసుకున్న 50 వేల మంది భక్తులకు ఆదివారం నుంచి ఆ తలంబ్రాల ప్రసాదాన్ని ఇళ్లకు తెచ్చి అందిస్తున్నారు. మిగతా వారికి కూడా రెండుమూడ్రోజుల్లో డోర్ డెలివరీ ప్రారంభించనున్నట్లు తెలిపింది. కొత్తగా బుక్ చేసుకునేవారికి బుక్ చేసుకున్న మూడు రోజుల్లోనే అందివ్వనున్నట్లు పేర్కొంది. గతేడాది 88 వేల మంది ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా బుక్ చేసుకుని తలంబ్రాలు పొందితే, ఈ సంవత్సరం ఇప్పటికే లక్ష మంది బుక్ చేసుకున్నారని, గడువు తేదీ వరకు మరికొంతమంది బుక్ చేసుకుంటారని వెల్లడించింది. తొలి బుకింగ్ నమోదు చేసుకున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు బస్‌భవన్‌లో ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం బిజినెస్ హెడ్ సంతోష్‌కుమార్ ఈడీలు మునిశేఖర్, వినోద్, సీటీఎం జీవన్‌ప్రసాద్‌తో కలిసి తలంబ్రాలను అందించారు. ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్ దంపతులకు వారి నివాసంలో ఆర్టీసీ చీఫ్ పర్సనల్ మేనేజర్ కృష్ణకాంత్ తలంబ్రాలను అందించారు. కాగా, భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి కల్యాణం నేపథ్యంలో 18,256 మంది భక్తులు ముత్యాల తలంబ్రాలను పోస్టాఫీసుల ద్వారా బుక్ చేసుకున్నారు. మరో 1,119 మంది భక్తులు పోస్టాఫీసుల ద్వారా భద్రాచల స్వామివారి అంతరాలయ అర్చన సేవలో పేర్లు నమోదు చేసుకుని పరోక్షంగా ఆ సేవలో పాల్గొన్నారు.

సింగరేణి టర్నోవర్ రూ.32,830 కోట్లు

సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థ 2022–23లో 23 శాతం వృద్ధితో రూ.32,830 కోట్ల టర్నోవర్ సాధించి రికార్డు సృష్టించింది. 2021–22లో సంస్థ రూ.26,619 కోట్ల టర్నోవర్ సాధించింది. తెలంగాణ ఏర్పాటుకు ముందు 2013–14లో సాధించిన రూ.12 వేల కోట్ల టర్నోవర్‌తో పోల్చితే 2022–23లో 173 శాతం వృద్ధిని నమోదు చేసినట్టు సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన సింగరేణి ఉద్యోగులు, అధికారులు, కార్మికులు, సంఘాలకు అభినందనలు తెలిపారు. 10 కొత్త గనులను ప్రారంభించడంతోపాటు బొగ్గు అమ్మకాలను 8 రాష్ట్రాలకు విస్తరించడం, సింగరేణి సంస్థ థర్మల్, సోలార్ విద్యుత్ రంగాల్లో కూడా ప్రవేశించడంతో టర్నోవర్ గణనీయంగా పెరిగిందన్నారు. 2022–23లో బొగ్గు అమ్మకాల్లో 25 శాతం వృద్ధి రేటుతో రూ. 28,459 కోట్లను, థర్మల్ విద్యుత్ విక్రయాల్లో 13 శాతం వృద్ధితో రూ.4,371 కోట్లను సాధించింది. 2021–22లో బొగ్గు అమ్మకాలతో రూ. 22,740 కోట్లను, థర్మల్ విద్యుత్ విక్రయాలతో రూ. 3,879 కోట్లను ఆర్జించింది. 2023–24లో 75 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, ఆ తర్వాతి రెండు సంవత్సరాల్లో 80 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని సింగరేణి చేరుకుంటుందని శ్రీధర్ పేర్కొన్నారు. మరో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణం పూర్తయితే 2026–27 నాటికి సంస్థ రూ.50 వేల కోట్ల టర్నోవర్ మైలురాయిని చేరుకుంటుందని తెలిపారు.

4 గనులను తిరిగి కేటాయించే అవకాశం: కేంద్ర ప్రభుత్వం వేలంలో పెట్టిన నాలుగు సింగరేణి గనులను తిరిగి సంస్థకి కేటాయించే విషయంలో సానుకూలత కనిపిస్తోందని శ్రీధర్ వెల్లడించారు. ఐదేళ్లలో ప్రైవేటు బొగ్గు కంపెనీలతో ప్రభుత్వ బొగ్గు సంస్థలకు గట్టి పోటీ తప్పదని, దీనిని తట్టుకోవాలంటే ఉత్పత్తి వ్యయం భారీగా తగ్గించుకోవాలని, ఉత్పాదకత పెంచుకోవాలన్నారు. భూగర్భ గనుల్లో టన్ను ఉత్పత్తి వ్యయం రూ.8 వేలకు చేరిందని, దీనిని సాధ్యమైనంత తగ్గించుకోవాలన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సమీక్ష నిర్వహించారు. 2023–24లో ఒడిశాలోని నైనీ, కొత్తగూడెంలోని వీకే, ఇల్లందులోని జేకే ఓసీ విస్తరణ, గోలేటి ఓపెన్‌కాస్ట్ గనుల నుంచి 104 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు.

గవర్నర్‌తో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా భేటీ



సాక్షి, అమరావతి: ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా సోమవారం గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా గవర్నర్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

అదుపుతప్పి తాటిచెట్టును ఢీకొట్టిన కారు

ముగ్గురు మృతి ● ప్రకాశం జిల్లాలో ఘటన



తాటి చెట్టును ఢీకొని ధ్వంసమైన కారు



శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, యూసఫ్ మృతదేహాలు

కొనకనమిట్ల: వేగంగా వస్తూ కారు అదుపుతప్పి తాటిచెట్టును బలంగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా ఒంగోలు–గిద్దలూరు రహదారి కొనకనమిట్ల మండలం గొట్లగట్టు సమీపంలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. వివరాలు.. ఒంగోలుకు చెందిన ముగ్గురు స్నేహితులైన తక్కెళ్లపాటి శ్రీనివాస్ (50), బెజవాడ వెంకటేశ్వర్లు (53), ఎస్‌కె.యూసఫ్ (38) మెడికల్ కంపెనీలో పనిచేస్తున్నారు. శ్రీనివాస్ కాస్మోస్ కంపెనీ మేనేజర్‌గా పని చేస్తుండగా వెంకటేశ్వర్లు, యూసఫ్ ఆర్గానిక్స్ కంపెనీలో రిప్రజెంటేటివ్స్‌గా పని చేస్తున్నారు. ఈ క్రమంలో ముగ్గురు సోమవారం ఉదయం కంపెనీ పనిమీద కారులో ఒంగోలు నుంచి గిద్దలూరు వెళ్లారు. అక్కడ పని పూర్తిచేసుకుని తిరుగు ప్రయాణంలో ఒంగోలు వస్తున్నారు. కారు కొనకనమిట్ల మండలం గొట్లగట్టు దాటి కొంత దూరం వచ్చాక అదుపుతప్పిన కారు రహదారి పక్కనే ఉన్న తాటిచెట్టును బలంగా ఢీకొట్టింది. దీంతో తాటిచెట్టు కారు ముందు భాగంలోకి చొచ్చుకుపోవడంతో కారు డ్రైవింగ్ చేస్తున్న శ్రీనివాస్, పక్కసీట్లో ఉన్న వెంకటేశ్వర్లు, వెనుక సీట్లో కూర్చున్న యూసఫ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ దీపిక అన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ చర్యలు అభినందనీయం

ఎన్‌సీపీసీఆర్ సభ్యుడు ఆర్‌జీ ఆనంద్



సాక్షి, విశాఖపట్నం : జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు తీసుకున్న చర్యలు అభినందనీయమని, నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సీపీసీఆర్) సభ్యుడు డాక్టర్ ఆర్జీ ఆనంద్ అన్నారు. విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల్లో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునతో కలిసి పర్యటించిన ఆయన.. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడారు. బాల్య వివాహాల నిర్మూలనపై దృష్టి సారించామని.. దీనిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. బాలికా విద్యకు ప్రాధాన్యమిస్తూ.. బాలురతో సమానంగా డిగ్రీ లేదా ఇతర ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌సీపీసీఆర్ చైర్‌పర్సన్ ప్రియాంక్ కనూంగో ఆదేశాల మేరకు తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఏపీలో పథకాల అమలు తీరు ప్రశంసనీయంగా ఉందని తెలిపారు. డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, మాతా శిశు సంక్షేమ శాఖ పీడీ వెంకటేశ్వరి, ఐసీడీఎస్ సిబ్బంది, పాల్గొన్నారు.

తెలుగు యువత నేత ఇంట్లో తెలంగాణ మద్యం



మద్యం బాటిళ్లతో ఎస్ఈబీ అధికారులు పట్టుకున్న తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు ఎం.అవినాష్

పాలకొల్లు సెంట్రల్: పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో తెలుగు యువత పట్టణ అధ్యక్షుడి ఇంట్లో 20 తెలంగాణ మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం పట్టణ ఎస్ఈబీ సీఐ ఎల్.చిరంజీవి మాట్లాడుతూ స్థానిక దేశాలమ్మ ఆలయం వెనుక ఉన్న ఓ భవనంలో పట్టణ పోలీసులు తనిఖీ చేశారని తెలిపారు. 20 ఫుల్ బాటిళ్లు ఉన్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని తమకు అప్పగించారన్నారు. అవన్నీ తెలంగాణకు చెందిన మద్యం బాటిళ్లని తెలిపారు. ఆ ఇల్లు తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు ఎం.అవినాష్‌దని తెలిసిందన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. తమ ఇంట్లో ఓ వేడుక నిమిత్తం తెలంగాణ నుంచి మద్యం బాటిళ్లు తెచ్చుకున్నట్లు నిందితుడు తెలిపాడని వివరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నిరంతర విద్యుత్‌కు కంటైనర్ సబ్ స్టేషన్లు దోహదం

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- గొల్లపూడిలో రూ.7.64 కోట్లతో నిర్మించిన కంటైనర్ సబ్ స్టేషన్ ప్రారంభం



కంటైనర్ సబ్ స్టేషన్ ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, చిత్రంలో వసంత, తలశిల రఘురాం

భవానీపురం(విజయవాడ పశ్చిమ): నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కంటైనర్ విద్యుత్ సబ్ స్టేషన్లు దోహదం చేస్తాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో రూ.7.64 కోట్ల అంచనా వ్యయంతో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ నూతనంగా నిర్మించిన కంటైనర్ సబ్ స్టేషన్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో మొదటి కంటైనర్ సబ్ స్టేషన్‌ను ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించటం మనకు గర్వకారణం అన్నారు. రానున్న రోజుల్లో ఎక్కడైనా స్థలాభావం ఉన్న చోట ఇటువంటి కంటైనర్ సబ్ స్టేషన్ నిర్మించటం మంచిదని తెలిపారు. విద్యుత్ చార్జీలు పెంచారని కమ్యూనిస్టులు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, శాసన మండలి సభ్యులు తలశిల రఘురామ్, మైలవరం శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్, ఏఎంసీ చైర్మన్ కారంపూడి సురేష్, ఏపీసీపీడీసీఎల్ చైర్మన్ జె.పద్మజనార్దనరెడ్డి, డైరెక్టర్స్ జయభారత్‌రావు, జె.రమాదేవి పాల్గొన్నారు.

డిస్కంలకు కాస్త ఊరట

- బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ అమ్మకం ధరలు తగ్గింపు
- ప్రకటించిన కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి
- ఫిబ్రవరిలో 'హైప్రైస్ డే ఎహెడ్' యూనిట్ ధరను రూ.12 నుంచి ఏకంగా రూ.50కి పెంచిన సీఈఆర్‌సీ
- ఇప్పుడు బహిరంగ మార్కెట్‌లో రూ.20కి అమ్ముకునేలా మార్పులు



సాక్షి, అమరావతి: విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కం)కు కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి(సీఈఆర్‌సీ) కాస్త ఊరట కలిగించింది. బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ అమ్మకం ధరల సీలింగ్‌ను మారుస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సవరించింది. వేసవిలో విద్యుత్ డిమాండ్, కొరతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఈఆర్‌సీ వెల్లడించింది. తాజా నిర్ణయంతో బహిరంగ మార్కెట్‌లో హై ప్రైస్ డే ఎహెడ్ మార్కెట్ ధరలు యూనిట్‌కు రూ.50 నుంచి రూ.30కు తగ్గాయి. సాధారణ సమయాలకు సంబంధించి యూనిట్ ధర రూ.12 నుంచి రూ.10కు తగ్గింది.

అప్పట్లో అంతా వాళ్లిష్టమే..

దేశంలోని అన్ని రాష్ట్రాలూ తమ రోజువారీ అవసరాలకు సరిపడా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోలేవు. కొన్ని రాష్ట్రాలు తమ ఉత్పత్తి సామర్థ్యానికి అనుగుణంగా అవసరం మేరకు ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేస్తుంటాయి. అయితే అది దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాల ప్రకారం జరుగుతుంది. కానీ ఇతర సమయాల్లోనూ ఫిక్స్‌డ్ చార్జీలు చెల్లించాల్సి రావడంతో డిస్కంలు ఆర్థికంగా బాగా నష్టపోతుండేవి. ఈ నేపథ్యంలో లాంగ్ టర్మ్ పీపీఏలకు బదులు షార్ట్ టర్మ్ పీపీఏలు చేసుకోవడం మొదలుపెట్టాయి. కానీ ఆ ఒప్పందాల వల్ల కూడా కొన్ని రాష్ట్రాల్లో విద్యుత్ అవసరాలు తీరడం లేదు. ఈ నేపథ్యంలో బహిరంగ మార్కెట్ నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నాయి. 2021 వరకు బహిరంగ మార్కెట్‌లో ని ధరలు విద్యుత్ ఉత్పత్తిదారుల ఇష్టానుసారం ఉండేవి. అదే ఏడాది అక్టోబర్‌లో బొగ్గు సంక్షోభం ఏర్పడటంతో థర్మల్ విద్యుత్ కేంద్రాలు మూతపడటం.. ఉత్పత్తిని తగ్గించడంతో విద్యుత్ కొరత ఏర్పడింది. ఆ సమయంలో మార్కెట్‌లో విద్యుత్‌కు డిమాండ్ పెరిగింది. ఇదే అదనుగా ఉత్పత్తి సంస్థలు భారీ ధరలు వసూలు చేశాయి. ఈ నేపథ్యంలో సీఈఆర్‌సీ గతేడాది మార్చి 5న సీలింగ్ విధానాన్ని తీసుకువచ్చింది.

ఇవీ కొత్త ధరలు

సీఈఆర్‌సీ గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరించి యూనిట్ ధరను రూ.50 నుంచి రూ.20కు తగ్గించింది. అలాగే ఏడాదిగా అమలులో ఉన్న సాధారణ సమయాల్లో సీలింగ్ ధరను రూ.12 నుంచి రూ.10కు మార్చింది. పవర్ మార్కెట్ రెగ్యులేషన్స్–2021 ప్రకారం రిజిస్టర్ అయిన అన్ని పవర్ ఎక్స్ఛేంజీలలో ఏప్రిల్ 4 నుంచి ఈ సవరించిన ధరలతోనే విద్యుత్ ట్రేడింగ్ జరగాలని ఆదేశించింది. దిగుమతి చేసుకున్న గ్యాస్, బొగ్గు అధిక ధరను పరిగణనలోకి తీసుకుని గతంలో సీలింగ్ పెంచామని.. ఇప్పుడు వాటి ధరలు తగ్గడంతో సీలింగ్ కూడా తగ్గించామని కమిషన్ తెలిపింది.

ఇప్పుడు కొనేవాళ్లు కరువై..

సీఈఆర్‌సీ సీలింగ్ ప్రకారం యూనిట్ విద్యుత్‌ను రూ.12కు మించి అమ్మడానికి అవకాశం ఉండేది కాదు. అంటే ఆ రేటుకు, లేదా అంతకంటే తక్కువకే డిస్కంలకు విద్యుత్ లభించేది. ఈ విధానం బాగున్నప్పటికీ కొందరు ప్రైవేటు జెన్‌కోల నిర్వాహకులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చారు. అంతర్జాతీయ మార్కెట్‌లో గ్యాస్, బొగ్గు ధరలు విపరీతంగా పెరిగినందున విద్యుత్ అమ్మకం ధర సీలింగ్ పెంచాలని కోరారు. వారి విజ్ఞప్తి మేరకు ఈ ఏడాది ఫిబ్రవరిలో యూనిట్ ధరను రూ.50గా సీఈఆర్‌సీ సీలింగ్ ప్రకటించింది. దీనిపై డిస్కంలు తీవ్ర ఆందోళనను వ్యక్తం చేశాయి. వేసవిలో అత్యధిక విద్యుత్ అవసరం అవుతున్నందున అంత ఎక్కువ రేటుకు కొనడం ఆర్థికంగా ఇబ్బంది అని కేంద్రానికి మొరపెట్టుకున్నాయి. మరోవైపు ధరలు పెంచినప్పటి నుంచి బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోళ్లు దారుణంగా పడిపోయాయి. దీంతో సీఈఆర్‌సీ ధరలను భారీగా తగ్గించింది.

వికేంద్రీకరణతోనే సమగ్రాభివృద్ధి

918వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే నిరాహార దీక్షలో నినాదాలు చేస్తున్న బహుజన నాయకులు

తాడికొండ: పాలనా వికేంద్రీకరణ కారణంగానే సమగ్రాభివృద్ధి సాధ్యమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 918వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పలువురు మాట్లాడారు. మూడు రాజధానుల అజెండాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు వెళ్లేందుకు నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని, అన్ని ప్రాంతాల సమానాభివృద్ధితోనే అంబేడ్కర్ కలలుగన్న సామాజిక న్యాయం, బహుజన రాజ్యాధికారం ప్రతి ఒక్కరికీ చేరువ కానుందని హర్షం వ్యక్తం చేశారు. రాజధానిలో 54 వేల ఇళ్ల పట్టాల ఏర్పాటు దిశగా ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తుందని, ఈ మేరకు అమరావతి పరిసర ప్రాంతాల్లో ఉన్న నిరుపేదలకు స్థలాలు కేటాయించే ప్రక్రియ త్వరలో జరుగనుండడం బహుజనుల విజయానికి నిదర్శనమన్నారు. మార్గదర్శి చిట్స్ వ్యవహారంలో శైలజా కిరణ్‌ను సీఐడీ విచారణ చేస్తుండడం హర్షణీయమని, చంద్రబాబుపై ఉన్న అభియోగాలపై కూడా పూర్తిస్థాయి విచారణ చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇకనైనా కుల రాజకీయాలకు స్వస్తి పలికి బాబు తన తప్పును ఒప్పుకోపోతే 2024 ఎన్నికల్లోనూ డిపాజిట్లు లేకుండా గల్లంతు చేస్తామని హెచ్చరించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

పూతరేకులకు త్వరలో భౌగోళిక గుర్తింపు

సాక్షి అమలాపురం: ఆత్రేయపురం పూతరేకులకు భౌగోళిక గుర్తింపు త్వరలో రానున్నదని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం హిమాన్షు శుక్లాను దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి చెందిన మేథో సంపత్తి హక్కుల సభ్యులు మాకిరెడ్డి మనోజ్, గాదిరాజు ప్రసాద రాజు కలిశారు. పూతరేకులకు భౌగోళిక గుర్తింపు (జీ.ఐ) జర్నల్‌ను కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుచిలో అద్భుతం, మైమరిపించే మాధుర్యం ఆత్రేయపురం పూతరేకులు సొంతమన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రఖ్యాతి చెందిన ఆత్రేయపురం పూత రేకులకు వాణిజ్య పరిశ్రమల శాఖ వారు జారీ చేసే భౌగోళిక గుర్తింపు (జీ.ఐ) కోసం జరుగుతున్న ప్రయత్నాలు ఒక కొలిక్కి వచ్చాయని, మరో నాలుగు మాసాలలో గెజిట్ నోటిఫికేషన్ వస్తుందన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురానికి చెందిన సర్ ఆర్థర్ కాటన్ పూతరేకుల సహకార సంఘం వారు విశాఖపట్నం దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం సహకారంతో (జీ.ఐ) భౌగోళిక గుర్తింపు కోసం చేసుకున్న దరఖాస్తుకు సంబంధించి పలు పరిశీలనలు పూర్తయ్యాయన్నారు. వాణిజ్య పరిశ్రమల శాఖ ఫిబ్రవరి 13న విడుదల చేసిన భౌగోళిక గుర్తింపు జర్నల్‌లో ఆత్రేయపురం పూతరేకుల గుర్తింపుపై ప్రకటన ఇచ్చారని వివరించారు.

ప్రేమికుడు రాలేదని ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

తిరుపతి రూరల్: ప్రేమికుడు తనను కలిసేందుకు రాలేదని ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తిరుపతిలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తిరుపతి నగరం పరిధిలోని సరస్వతి నగర్‌లో నివాసం ఉంటున్న టి.అనూష(22) శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. గత కొన్నాళ్లుగా ఓ వ్యక్తిని ఆమె ఇష్టపడుతోంది. ఇద్దరూ ప్రేమించుకుంటున్నారు. ఆదివారం ఇద్దరూ తిరుపతిలో కలవాలని నిర్ణయించుకున్నారు. అయితే ప్రేమికుడు ఎంతకూ రాకపోయేసరికి ఆమె మనస్తాపం చెంది ఆదివారం అర్ధరాత్రి ఇంట్లోనే ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది. సోమవారం ఉదయం గమనించిన ఆమె తల్లిదండ్రులు ఎంఆర్‌పల్లి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల మార్చురీకి తరలించారు. ఎంఆర్‌పల్లి ఎస్ఐ ఎస్‌కె మూర్తి కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

శ్రీశైలంలో వీఐపీ బ్రేక్, ఉచిత స్పర్శ దర్శనం నిలుపుదల

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహిస్తున్న వీఐపీ బ్రేక్, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు కల్పిస్తున్న ఉచిత స్పర్శదర్శనం తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు శలేశ్వరం జాతర సందర్భంగా శ్రీశైలక్షేత్రానికి భక్తు లు అధిక సంఖ్యలో తరలివచ్చే అ వకాశం ఉన్న నేపథ్యంలో ఈ మేర కు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. శ్రీశైల మల్లన్న దర్శనార్థం వచ్చే భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

క్లుప్తంగా...

సిసోడియా జ్యుడీషియల్ కస్టడీ...
17 దాకా పొడిగింపు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో నూతన మద్యం విధానం రూపకల్పనలో అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలపై అరెస్టయిన ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని ఏప్రిల్ 17వ తేదీ దాకా పొడిగిస్తూ సీబీఐ కోర్టు సోమవారం ఉత్తర్వులిచ్చింది. సోమవారం సిసోడియాను ఢిల్లీలోని జడ్జి ఎంకే నాగ్‌పాల్ ముందు సీబీఐ అధికారులు హాజరుపరిచారు. కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్నందున ఆయనకు బెయిల్ ఇవ్వొద్దని, మరో 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీ పొడిగించాలని దర్యాప్తు అధికారులు విజ్ఞప్తిచేయగా అందుకు సమ్మతి తెలుపుతూ సీబీఐ జడ్జి ఉత్తర్వులిచ్చారు. ఇదే కేసులో అరెస్టయిన హైదరాబాద్‌కు చెందిన అరుణ్ పిళ్లైకు సైతం జ్యుడీషియల్ కస్టడీని ఈనెల 17వ తేదీదాకా పొడిగిస్తున్నట్లు న్యాయమూర్తి ఆదేశించారు.

జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్
ఐదుగురు మావోయిస్టులు మృతి

ఛత్రా(జార్ఖండ్): జార్ఖండ్‌లోని ఛత్రా జిల్లా మావోయిస్టులు, భద్రతా బలగాల కాల్పులతో దద్దరిల్లింది. భద్రతా బలగాలు పైచేయి సాధించిన ఈ ఎదురుకాల్పుల ఘటనలో ఐదుగురు మావోయిస్టులు మరణించారని పోలీసులు సోమవారం చెప్పారు. లవలాంగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఛత్రా–పలామూ సరిహద్దులో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఐదుగురు మరణించగా కొందరికి బుల్లెట్ గాయాలయ్యాయని, ఐదుగురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని ఛత్రా ఎస్పీ రాకేశ్ రంజన్ చెప్పారు. 'ఉదయం 8.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఘటనాస్థలిలో రెండు ఏకే47 రైఫిళ్లు, రెండు దేశవాళీ రైఫిళ్లు, భారీ మొత్తంలో మందుగుండు లభించాయి. గాలింపు కొనసాగుతోంది' అని ఎస్‌డీపీఓ అశోక్ ప్రియదర్శి చెప్పారు. మరణించిన వారిలో మావోయిస్ట్ స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు గౌతమ్ పాశ్వాన్ ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆయన తలపై రూ.25 లక్షల నజరానా ఉంది.

సిరియా విమానం కూల్చివేత

జెరూసలేం: సిరియా, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు మళ్లీ పెరుగుతున్నాయి. తమ గగనతలంపై తిరుగుతున్న సిరియా విమానాన్ని కూల్చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. నిజానికి ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య శత్రుత్వం కొనసాగుతోంది. తమ దేశానికి వ్యతిరేకంగా సిరియా గడ్డపైనుంచి ఇరాన్ కార్యకలాపాలు సాగిస్తోందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. సిరియా మెడలు వంచడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం వరుసగా దాడులు కొనసాగిస్తోంది. గత నెలలో ఆరుసార్లు దాడులు చేసింది. సిరియాలోని వైమానిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటోంది.

కర్ణాటక శాసనసభ ఎన్నికలకు తెరలేచింది. మే 10న ఒకే విడతలో ఎన్నికలు జరుగనున్నాయి. 13న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. పార్టీలు వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగిపోయాయి. ప్రధానంగా అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్, జేడీ(ఎస్) ముందంజలో ఉన్నాయి. కాంగ్రెస్, జేడీ(ఎస్) ఎన్నికల షెడ్యూల్‌కు ముందే అభ్యర్థుల తొలి జాబితా ప్రకటించాయి. ప్రచారంలో దూసుకు పోతున్నాయి. బీజేపీ మాత్రం అభ్యర్థులపై ఇంకా ప్రకటన చేయలేదు. పైగా ఈ ఎన్నికల్లో కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టడం ఆసక్తి కలిగిస్తోంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పార్టీలు అమలు చేసే 'ప్రైమరీ'లను బీజేపీ అందిపుచ్చుకుంది. ఒకరకంగా ఇవి అంతర్గత ఎన్నికలని చెప్పుకోవచ్చు. బీజేపీ టికెట్లపై ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను పార్టీ నేతలు, కార్యకర్తలే ఎంపిక చేస్తున్నారు. కర్ణాటకలో బీజేపీ ఇలాంటి విధానాన్ని అమలు చేయడం ఇదే మొదటిసారి.

- సాక్షి, నేషనల్ డెస్క్



ప్రైమరీ...
అభ్యర్థుల ఎంపికలో అమెరికన్ స్టైల్

- అంతర్గత ఎన్నికల ద్వారా బీజేపీ అభ్యర్థుల ఎంపిక
- కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో అమెరికా తరహా ప్రయోగం
- అభ్యర్థులపై ఏకాభిప్రాయం సాధించడానికే..
- పార్టీలో అసమ్మతికి చెక్ పెట్టే ఎత్తుగడ

సగటున 150 మంది ఓటర్లు

➤ కర్ణాటకలో మొత్తం 224 అసెంబ్లీ స్థానాలున్నాయి. బీజేపీ నాయకత్వం శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాల స్థాయిలో ప్రైమరీలు నిర్వహించింది. ఈ ఎన్నికల ద్వారా ఒక్కో నియోజకవర్గంలో ముగ్గురు మెరుగైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ప్రతి అసెంబ్లీ స్థానంలో సగటున 150 మంది ఓటు వేశారు. నియోజకవర్గ స్థాయిలో బీజేపీ ఆఫీసు–బేరర్లు, మండల కమిటీల అధ్యక్షులు, సభ్యులు, పార్టీ అనుబంధ విభాగాలైన మహిళా మోర్చా, ఎస్సీ మోర్చా, ఎస్టీ మోర్చా, ఓబీసీ మోర్చా, యూత్ మోర్చా, రైతు మోర్చా, మైనార్టీ మోర్చా సభ్యులు ఓటర్లుగా నమోదయ్యారు. ప్రతి నియోజకవర్గంలో అంతర్గత ఎన్నికల ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించడానికి ఇద్దరు బీజేపీ సీనియర్ నాయకులను అధిష్టానం నియమించింది. రాష్ట్రమంతటా ప్రైమరీలు సజావుగా ముగిశాయి. అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించాల్సి ఉంది.



పార్టీ ఆశిస్తున్నదేమిటి?

ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక కత్తిమీద సామే. గ్రూప్‌లు, అంతర్గత కుమ్ములాటల నడుమ అందరినీ సంతృప్తిపరుస్తూ సమర్థున్ని ఎంపిక చేయాలి. రకరకాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవాలి. అంతర్గత ఎన్నికల ద్వారా పార్టీ నేతలు, కార్యకర్తల అభిప్రాయానికి పెద్దపీట వేసినట్లు అవుతుందని, ఎక్కువ మందికి నచ్చిన అభ్యర్థే ఎన్నికల్లో పోటీకి దిగుతాడని, దాంతో విజయావకాశాలు రెట్టింపవుతాయని కర్ణాటక బీజేపీ ఉపాధ్యక్షుడు నిర్మల్‌కుమార్ సురానా చెప్పారు. అసమ్మతిని చల్లార్చడానికి, అభ్యర్థిపై ఏకాభిప్రాయానికి రావడానికి ప్రైమరీలు దోహదపడతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులను ఎంపిక చేసే బాధ్యతను కార్యకర్తల చేతుల్లోనే పెట్టామని అన్నారు.

ప్రజాస్వామిక విధానం..

2014లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రైమరీల లాంటి ప్రయోగమే చేసింది. దీనికి 'ఎంచుకో, ఎన్నుకో' అని పేరు పెట్టింది. ఇప్పుడు జరుగుతున్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక కోసం ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తు రుసుము కింద ఆశావహులు రూ.2 లక్షల చొప్పున పార్టీకి చెల్లించారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను కాంగ్రెస్ నాయకత్వం వసూళ్ల ప్రక్రియగా మార్చేసిందని బీజేపీ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు చలవాది నారాయణస్వామి విమర్శించారు. తాము డబ్బుతో సంబంధం లేకుండా కార్యకర్తలను భాగస్వాములను చేస్తూ పూర్తి ప్రజాస్వామిక విధానంలో అభ్యర్థులను ఎంపిక చేస్తున్నామని వివరించారు.

10న తుది జాబితా ప్రకటన..

➤ బీజేపీ 'ప్రైమరీ'కసరత్తు బాగానే ఉన్నప్పటికీ ఆ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో మాత్రం గుబులు మొదలైంది. ఈసారి తమ టికెట్ గల్లంతు అవుతుందని, తమ స్థానాల్లోకి కొత్త అభ్యర్థులు వస్తారని బెంబేలెత్తిపోతున్నారు. అయితే, గెలిచే సామర్థ్యం ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిర్మల్‌కుమార్ సురానా చెప్పారు. అంతర్గత ఎన్నికల ఫలితాలతోపాటు గెలిచే సత్తా, సామాజిక న్యాయం తదితర సమీకరణాల ఆధారంగా అభ్యర్థులపై పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని వివరించారు. ప్రతి నియోజకవర్గంలో ప్రైమరీల్లో మూడు పేర్లను ఎంపిక చేశారు. జిల్లా కోర్ కమిటీలు ఆయా పేర్లను క్షుణ్నంగా పరిశీలించాయి. సదరు ఔత్సాహిక నేతలతో స్వయంగా మాట్లాడాయి. జిల్లా కోర్ కమిటీల సూక్ష్మ పరిశీలన దాదాపు పూర్తయ్యింది. ఇందులో వెల్లడైన ఫలితాల ఆధారంగా అభ్యర్థులను రాష్ట్ర కోర్ కమిటీ ఖరారు చేయనుంది. తుది జాబితాను బీజేపీ కేంద్ర పార్లమెంటరీ బోర్డుకు పంపిస్తారు. ఈ జాబితాలోని పేర్లను ఈ నెల 10వ తేదీన కేంద్ర పార్లమెంటరీ బోర్డు అధికారికంగా ప్రకటించనుంది. అంటే ఎన్నికలకు సరిగ్గా ఒక నెల ముందు బీజేపీ అభ్యర్థుల ఎంపిక పూర్తవుతుంది.

ప్రైమరీ ఎన్నికలు అంటే?

➤ అమెరికాలో పార్టీల తరఫున అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడే అభ్యర్థులను ప్రజలు, పార్టీల్లో రిజిస్టర్ అయిన కార్యకర్తలు ఎంపిక చేస్తారు. ఈ ఎన్నికలనే ప్రైమరీ ఎన్నికలు అంటారు.

➤ అధ్యక్షుడిని ప్రజలు నేరుగా ఎన్నుకోరు. ఏ పార్టీ తరఫున ఎవరు బరిలో ఉండాలన్నది మాత్రమే నిర్ణయిస్తారు.

➤ సాధారణ ప్రజలు ఓటు వేసే ఎన్నికను ఓపెన్ ప్రైమరీ, పార్టీ కార్యకర్తలు ఓటు వేసే ఎన్నికను క్లోజ్డ్ ప్రైమరీగా వ్యవహరిస్తారు.

➤ అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి దిగే పార్టీ అభ్యర్థుల ఎంపిక బాధ్యతను బడా నేతలు, ప్రముఖులకు కాకుండా ప్రజలకు, పార్టీల కార్యకర్తలకు అప్పగించాలన్నదే ఈ ప్రైమరీల ఉద్దేశం.

➤ అధ్యక్ష ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేయాలనుకునేవారు ప్రైమరీలతో పనిలేకుండా నేరుగా నామినేషన్ దాఖలు చేయొచ్చు.

ఎంతటివారినైనా ఎదుర్కోండి

- అవినీతిపరులు ఎంతటి శక్తివంతులైనా విధి నిర్వహణలో పోరాడండి
- న్యాయానికి తిరుగులేని బ్రాండ్ అంబాసిడర్ సీబీఐ
- సీబీఐ వజ్రోత్సవ వేడుకల్లో ప్రధాని మోదీ ఉద్బోధ



వజ్రోత్సవ వేడుకలో మెడల్స్ గ్రహీతలు, అధికారులతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: అవినీతిపరులు ఎంతటి శక్తివంతులైనాసరే కర్తవ్య దీక్షలో ముందడుగువేసి పోరాడాలని కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) అధికారులకు ప్రధాని నరేంద్ర మోదీ కర్తవ్యబోధ చేశారు. సోమవారం ఢిల్లీలో ఏర్పాటుచేసిన సీబీఐ వజ్రోత్సవాల్లో పాల్గొన్న సందర్భంగా ప్రధాని ప్రసంగించారు. ' కేంద్రప్రభుత్వ స్థాయిలో అవినీతిని ఎదుర్కొనేందుకు రాజకీయ సంకల్పానికి కొదువే లేదు. ప్రభుత్వం నుంచి పూర్తి సహాయసహకారాలు అందుతాయి. మీరు చేయాల్సిందల్లా ఒక్కటే. అవినీతిపై పోరాడండి. అవినీతిపరులు ఎంతటి శక్తివంతులైనాసరే తగ్గేదేలేదు' అంటూ సీబీఐ అధికారులను ఆదేశించారు. ' ప్రజాస్వామ్యం, న్యాయాలకు అవినీతే అతిపెద్ద అవరోధం. అవినీతి నుంచి దేశాన్ని విముక్తి చేయాల్సిన బాధ్యత సీబీఐ పైనే ఉంది. అవినీతిపరులను వదలొద్దని ప్రజలు కోరుకుంటున్నారు. దశాబ్దాలుగా అవినీతితో లబ్ధిపొందిన నేతలు నేడు ఏకంగా సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలపైనే విమర్శలు చేసే పరిస్థితులు సృష్టించారు. పక్కదోవ పట్టించే వీళ్లను పట్టించుకోకుండా విధి నిర్వహణపై దృష్టిపెట్టండి. మన ప్రయత్నంలో అలసత్వం, నిర్లక్ష్యం వద్దు. ఇదే దేశం, దేశ ప్రజలు కోరుకునేది. దేశం, చట్టం, రాజ్యాంగం మీ వెన్నంటే ఉన్నాయి' అని అధికారులకు భరోసా ఇచ్చారు.

ఫోన్‌కాల్‌తో వేలకోట్ల రుణాలు ఇప్పించుకున్నారు

'స్వాతంత్య్రం వచ్చేనాటికే దేశంలో అవినీతి తిష్టవేసి ఉంది. దీన్ని తొలగించాల్సిన ఆనాటి నేతలు కొందరు దీనిని మరింత పెంచడం దారుణం. ఎవరెంతగా అవినీతి చేయగలరనే పోటీ నడుస్తోందిప్పుడు. దీంతో దేశంలో పలు వ్యవస్థలు ధ్వంసమై ప్రభుత్వ విధానాలు నిర్వీర్యమై అభివృద్ధి ఆగిపోతోంది. దేశ ఐక్యత, స్నేహభావం, ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీసే అవినీతిని పెకిలించాలి. ఇప్పుడు ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ వంటి పారదర్శకమైన విధానాలొచ్చాయిగానీ గతంలో కొందరు 'శక్తివంతమైన' నేతలు కేవలం ఫోన్‌కాల్ ద్వారా తమ వారికి వేలకోట్ల రుణాలు దక్కేలా చేశారు. అలా ఆయాచిత లబ్ధిపొందాక దేశం వదిలి పారిపోయారు. పారిపోయిన ఆర్థిక నేరగాళ్ల చట్టం ద్వారా మేం రూ.20,000 కోట్ల ఆస్తులను జప్తుచేశాం. ఇలాంటి అవినీతిపరులు మరింత తెగించి ప్రభుత్వం ద్వారా నిజమైన లబ్ధిదారులకు దక్కాల్సిన రేషన్, ఇళ్లు, స్కాలర్‌షిప్, పెన్షన్లనూ లూటీ చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చే ప్రతి రూపాయిలో కేవలం 15 పైసలే వాస్తవ లబ్ధిదారునికి చేరుతోందని స్వయంగా గత ప్రధానమంత్రే సెలవిచ్చారు' అని మోదీ గుర్తుచేశారు.

అందరి నోటా సీబీఐ

''ఏదైనా కేసు సంక్లిష్టంగా, సమస్యాత్మకంగా ఉందంటే పరిష్కారం కోసం ప్రజల నోట వినిపించే ఒకే ఒక పేరు సీబీఐ. 60 ఏళ్లుగా న్యాయం, సత్యానికి బ్రాండ్ అంబాసిడర్‌గా సీబీఐ నిలుస్తోంది. పంచాయతీ స్థాయిలో జరుగుతున్న ముఖ్య నేరాలనూ సీబీఐకి అప్పజెప్పాలని ప్రజలు కోరుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో అవినీతి చిన్నదిగా కనిపించొచ్చు. కానీ అది పేదల హక్కులను లాగేసుకుంటుంది. కొత్తగా ఎన్నో నేరాలకు అంటుకడుతుంది' అని అన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా సీబీఐ అధికారులకు రాష్ట్రపతి పోలీస్ మెడల్స్‌ను, చక్కని దర్యాప్తు చేసిన సీబీఐ అధికారులకు బంగారు పతకాలను ప్రధాని ప్రదానం చేశారు. స్మారక తపాలా బిళ్ల, నాణేలను ఆవిష్కరించారు.

ఉమ్మడి గళం వినిపిద్దాం

- విడివిడిగా ఎలాంటి లాభం ఉండదు: డీఎంకే చీఫ్ స్టాలిన్
- 'సామాజిక న్యాయ' తొలి సదస్సులో పాల్గొన్న విపక్ష నేతలు

చెన్నై/న్యూఢిల్లీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని గద్దె దించేందుకు ఉమ్మడిగా పోరాడాల్సిందేనని డీఎంకే చీఫ్, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ కుండబద్దలు కొట్టారు. విపక్ష పార్టీలు కూటమి కట్టకుండా విడిగా పోటీ చేస్తే ఎలాంటి లాభం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలో మళ్లీ సామాజిక న్యాయం, సమైక్యత, సోదరభావం, సమానత్వం సాధించాలంటే విపక్ష పార్టీలన్నీ ఉమ్మడిగా పోరాడాలని పిలుపునిచ్చారు. డీఎంకే ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేదికగా హైబ్రిడ్‌మోడ్‌లో సోమవారం తొలి 'సామాజిక న్యాయ సదస్సు' జరిగింది. రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, బిహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, తృణమూల్ కాంగ్రెస్ నేత డెరెక్ ఒబ్రియన్, ఆమ్ ఆద్మీ పార్టీ నేత సంజయ్ సింగ్, ఎన్సీపీ, ఐయూఎంఎల్, బీఆర్ఎస్, ఎండీఎంకే, ఆర్ఎస్పీ, ఎల్ఎస్పీ, వీసీకే తదితర పార్టీల నేతలు పాల్గొని ప్రసంగించారు. అన్ని పార్టీలను ఏకతాటి మీదకు తేవడం అత్యంత ప్రధానమైన విషయమని స్టాలిన్ అన్నారు. ''ఇది కొన్ని రాష్ట్రాలకే పరిమితం కాకూడదు. దేశవ్యాప్తంగా సాకారం కావాలి. అందరం కలసి పోరాడదాం'' అని పిలుపునిచ్చారు. ''కేంద్రం ఏ హేతుబద్ధ ప్రమాణాల ఆధారంగా 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటా అమలుచేస్తోంది? ఇది సామాజిక న్యాయం అనిపించుకోదు'' అన్నారు.

దేశవ్యాప్త కులగణన: తేజస్వి

వెనకబడిన కులాలకు రిజర్వేషన్ ఫలాలు దక్కాలంటే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాల్సిందేనని తేజస్వీ యాదవ్ స్పష్టం చేశారు. ''బిహార్‌లో మహాఘట్‌బంధన్ సర్కార్ ఈ దిశగా ఇప్పటికే అడుగేసింది. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ ప్రభుత్వాలు తమ రాష్ట్రాల్లో ఓబీసీలకు అదనపు రిజర్వేషన్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. కానీ గవర్నర్లు మోకాలడ్డుతున్నారు' అని ఆరోపించారు. సామాజిక న్యాయ రాజకీయాలతో బీజేపీని ఉమ్మడిగా ఎదుర్కొందామని అన్నారు. దేశవ్యాప్త కులగణన డిమాండ్‌కు విపక్ష నేతలంతా మద్దతు పలికారు.

రాహుల్‌కు బెయిల్

- జైలుశిక్ష సస్పెన్షన్‌పై 13న విచారణ
- బీజేపీ ఎమ్మెల్యేకు కోర్టు నోటీసులు
- బీజేపీ, కాంగ్రెస్ తీవ్ర వాగ్యుద్ధం

సూరత్: పరువునష్టం వ్యాఖ్యల కేసులో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి సూరత్ సెషన్స్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రెండేళ్ల జైలు శిక్షను సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన అప్పీల్‌పై ఏప్రిల్ 13న విచారణ చేపట్టనున్నట్టు అదనపు సెషన్స్ జడ్జి ఆర్.పి.మొగేరా పేర్కొన్నారు. ఏప్రిల్ 10వ తేదీలోగా ప్రతిస్పందన దాఖలు చేయాల్సిందిగా ఆదేశిస్తూ ప్రతివాది బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీకి నోటీసులు జారీ చేశారు. దొంగలందరి ఇంటిపేరు మోదీయే ఎందుకుంటుందో అంటూ 2019లో గత లోక్‌సభ ఎన్నికల సమయంలో కర్ణాటకలోని కోలార్‌లో ఎన్నికల సభలో చేసిన వ్యాఖ్యలపై రాహుల్‌కు సూరత్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించడం తెలిసిందే. ఈ శిక్షను సస్పెండ్ చేయడంతో పాటు రాహుల్‌కు బెయిల్ మంజూరు చేయాలంటూ ఆయన తరఫు న్యాయవాదులు సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో జడ్జి విచారణ జరిపారు. ఈ సందర్భంగా రాహుల్ తన సోదరి ప్రియాంకాగాంధీ వాద్రా, రాజస్తాన్ సీఎం అశోక్ గహ్లోత్ తదితర కాంగ్రెస్ అగ్రనేతలతో కలిసి ప్రత్యేక బస్సులో కోర్టు సముదాయానికి వచ్చారు. విచారణ సందర్భంగా వారంతా రాహుల్‌తో కలిసి కోర్టు గదిలోనే ఉన్నారు. తదుపరి విచారణకు రాహుల్ వ్యక్తిగత హాజరు నుంచి జడ్జి మినహాయింపు ఇచ్చినట్టు ఆయన న్యాయవాదులు తెలిపారు. కోర్టు బయట రాహుల్‌కు మద్దతుగా పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో గుమిగూడారు.జైలు శిక్ష నేపథ్యంలో ఆయన లోక్‌సభ సభ్యత్వం రద్దవడం తెలిసిందే.

సత్యమే నా ఆయుధం: రాహుల్

ప్రజాస్వామ్య పరిరక్షణ 'మిత్రకాల్'పై చేస్తున్న పోరాటంలో సత్యమే తన ఆయుధమని రాహుల్ అన్నారు. సూరత్ కోర్టులో విచారణకు హాజరైన అనంతరం ఆయన ఈ మేరకు ట్వీట్ చేశారు. ''దేశ స్వేచ్ఛా గళం కోసం పోరాడుతున్నా. అందుకు ఎంతటి మూల్యమైనా చెల్లించేందుకు సిద్ధం'' అని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం అస్మదీయ ఆశ్రిత పెట్టుబడిదారులకు అక్రమ మార్గాల్లో భారీగా లబ్ధి చేకూరుస్తోందని రాహుల్ ఆరోపిస్తుండటం, దీన్ని 'మిత్రకాల్'గా అభివర్ణిస్తుండటం తెలిసిందే.



సూరత్ కోర్టుకు వచ్చి వెళ్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక, ఇతర కాంగ్రెస్ నేతలు

న్యాయవ్యవస్థపై ఒత్తిడి యత్నం: రిజిజు

కోర్టు విచారణకు రాహుల్ భారీగా పార్టీ నేతలు, కార్యకర్తలను వెంటదీసుకుని వెళ్లడాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. ''ఇది కచ్చితంగా కోర్టును ఘెరావ్ చేయడమే. న్యాయవ్యవస్థపై అవాంఛిత ఒత్తిడి పెంచే బల ప్రదర్శనే. ఇలాంటిది గతంలో ఎప్పుడైనా చూశామా?'' అంటూ కేంద్ర న్యాయ మంత్రి కిరణ్ రిజిజు దుయ్యబట్టారు. ''గతంలో సొంత పార్టీ నేత మాజీ ప్రధాని పీవీ నరసింహారావును ఓ కేసులో కోర్టు దోషిగా నిర్ధారించినా దానిపై కాంగ్రెస్ మౌనంగానే ఉంది. పి.చిదంబరం వంటివారికి కూడా ఇలా మద్దతు తెలపలేదు. ఇప్పుడు కేవలం రాహుల్ కోసమే ఇలా డ్రామా చేస్తోంది'' అంటూ ఎద్దేవా చేశారు. రిజిజు ఆరోపణలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొట్టిపారేశారు. సంఘీభావం తెలిపేందుకు మాత్రమే నేతలంతా రాహుల్ వెంట వెళ్లారన్నారు. నిత్యం న్యాయవ్యవస్థను, న్యాయమూర్తులను బెదిరించే వ్యక్తి నుంచి ఇలాంటి మాటలు రావడం విడ్డూరమని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ అన్నారు. మోదీకాల్‌లో ఆత్మవంచనకు హద్దుల్లేకుండా పోతున్నాయని ఎద్దేవా చేశారు.

అమెరికాలో ఎయిర్‌పోర్ట్ ప్రమాదంలో
తెలుగు వ్యక్తి దుర్మరణం



న్యూయార్క్: స్నేహితుడికి స్వాగతం పలికేందుకు విమానాశ్రయానికి వచ్చిన భారతీయ అమెరికన్, తెలుగు వ్యక్తి విశ్వచంద్ కోళ్ల (47) అనుకోని ఎయిర్‌పోర్ట్ బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. మార్చి 28న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భారత్ నుంచి వస్తున్న విశ్వచంద్ స్నేహితుడైన ఒక సంగీత కళాకారుడు మసాచుసెట్స్ రాష్ట్ర రాజధాని బోస్టన్ సిటీలోని లోగన్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌లో దిగనున్నారు. ఆయన కోసం విశ్వచంద్ లోగన్ ఎయిర్‌పోర్ట్‌కు మార్చి 28 సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో ఎస్‌యూవీ వాహనంలో చేరుకుని టర్మినల్–బి వద్ద వేచిచూస్తున్నారు. విమాన ప్రయాణికులు, లగేజీతో అదే సమయంలో అటుగా వచ్చిన డార్ట్‌మౌత్ ట్రాన్స్‌పోర్టేషన్ బస్సు విశ్వచంద్‌ను పక్క నుంచి గుద్దుకుంటూ వెళ్లింది. దీంతో రెండు వాహనాల మధ్య ఇరుక్కుని నలిగిపోయి అక్కడే పడిపోయారు. ప్రథమ చికిత్స చేసే ప్రయత్నం చేసినా అప్పటికే ప్రాణాలు కోల్పోయారు. విశ్వచంద్‌ది ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా రేపల్లె అని సమాచారం. అమెరికాలో తకేడా ఫార్మాస్యూటికల్స్ కంపెనీలోని గ్లోబల్ అంకాలజీ విభాగంలో డాటా అనలిస్ట్‌గా పని చేస్తున్నారు. ఆయనకు భార్య సౌజన్య, కుమారులు ధృవ, మాధవ్ ఉన్నారు. విశ్వచంద్ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు బంధువులు గోఫండ్‌మీ ద్వారా ఇప్పటికే 4,06,151 డాలర్లు (దాదాపు రూ.3.3 కోట్లు) విరాళంగా సేకరించారు.

పార్లమెంటులో అవే నిరసనలు
ఉభయసభలూ రేపటికి వాయిదా

న్యూఢిల్లీ: పార్లమెంటులో సోమవారమూ అవే దృశ్యాలు. అధికార, విపక్ష సభ్యుల డిమాండ్లు, నిరసనలు, గందరగోళం. దాంతో కార్యకలాపాలేవీ చేపట్టకుండానే ఉభయసభలూ బుధవారానికి వాయిదా పడ్డాయి. లోక్‌సభ ఉదయం సమావేశం కాగానే అదానీ ఉదంతంపై విపక్ష సభ్యులంతా మూకుమ్మడిగా నిరసనకు దిగారు. దాంతో ఇటీవల మరణించిన పుణే బీజేపీ ఎంపీ గిరీశ్ బాపట్, కేరళకు చెందిన మాజీ ఎంపీ ఇన్నోసెంట్‌లకు నివాళులు అర్పించిన అనంతరం సభ మధ్యాహ్నం రెండింటి దాకా వాయిదా పడింది. తిరిగి సమావేశమయ్యాక కూడా విపక్షాల నిరసనలు, నినాదాలు, అదానీపై విచారణకు జేపీసీ ఏర్పాటుకు డిమాండ్లు కొనసాగడంతో సభ బుధవారానికి వాయిదా పడింది. రాజ్యసభ కూడా నిరసనలతో మధ్యాహ్నం వాయిదా పడింది. తిరిగి సమావేశమయ్యాక ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కాంపిటీషన్ (సవరణ) బిల్లు–2023ను ప్రవేశపెట్టారు. విపక్షాల నిరసనలు నెమ్మదించకపోవడంతో చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం పొందినట్టు చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ ప్రకటించారు.


యూకేలో పాస్‌పోర్ట్ సిబ్బంది సమ్మె

లండన్: దేశంలో ద్రవ్యోల్బణం రెండంకెలకు ఎగబాకిందని, ధరలు పెరిగిపోతున్నాయని, తమ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)లో పాస్‌పోర్ట్ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది సోమవారం సమ్మె ప్రారంభించారు. ఐదు రోజులపాటు ఈ సమ్మె కొనసాగనుంది. దీంతో విదేశాలకు వెళ్లాల్సినవారు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పాస్‌పోర్ట్‌లు సకాలంలో అందకపోతే ప్రయాణాలు మానుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు. యూకేలో ద్రవ్యోల్బణం 10.4 శాతానికి చేరుకుంది. ఆహారం, ఇంధనం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. జీవన వ్యయం భారీగా పెరిగిపోయింది. తక్షణమే వేతనాలు పెంచాలన్న డిమాండ్‌తో వైద్యులు, ఉపాధ్యాయులు, రైళ్లు, బస్సుల డ్రైవర్లు, ఎయిర్‌పోర్టుల్లో పనిచేసే సిబ్బంది, పోస్టల్ సిబ్బంది ఇదివరకే సమ్మెకు దిగారు.

మళ్లీ టీచర్ల సమ్మెబాట

యూకే ప్రభుత్వం ఆఫర్ చేసిన వేతన 4.5 శాతం పెంపు, 1,000 పౌండ్ల వన్ టైమ్ చెల్లింపును టీచర్లు తిరస్కరించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 27, మే 2న సమ్మె చేపట్టాలని నిర్ణయించినట్లు నేషనల్ ఎడ్యుకేషన్ యూనియన్ ప్రకటించింది.

బేబీ ఈఫిల్ టవర్



పారిస్‌లో ప్రఖ్యాత ఈఫిల్ టవర్‌కు దీటుగా ఏర్పాటుచేసిన ఈ బుల్లి టవర్ పేరు ఈఫిలా. ఈఫిల్ పరిమాణంలో పదోవంతు ఉంటుంది. దీన్ని ఏడాది పాటు కష్టపడి తయారు చేసినట్టు శిల్పి ఫిలిప్ మెయిన్ డ్రోన్ చెప్పారు. ఏప్రిల్ ఒకటిన దీన్ని ప్రతిష్ఠించారు.

ఐదేళ్లలో 374 మందిని అరెస్టు చేసిన ఈడీ
రూ. 33,862.20 కోట్ల ఆస్తులు అటాచ్

న్యూఢిల్లీ: దేశంలో అక్రమ నగదు లావాదేవీలు, మనీ లాండరింగ్ ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గత ఐదేళ్లలో 374 మందిని అరెస్టు చేసింది. వీరిలో పలు కార్పొరేట్ సంస్థల డైరెక్టర్లున్నారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభకు ఈ మేరకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. ''కార్పొరేట్ మోసాలకు సంబంధించి స్టెర్లింగ్ బయోటెక్ గ్రూప్, విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ తదితరులపై ఈడీ కేసులు పెట్టింది. రూ.33,862.20 కోట్ల ఆస్తులను అటాచ్ చేసింది. వీటిలో రూ.15,113 కోట్ల ఆస్తులను ప్రభుత్వ బ్యాంకులు అధీనంలోకి తీసుకున్నాయి. ఈడీ అప్పగించిన ఆస్తులను ఎస్బీఐ నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియం విక్రయించి రూ.7,975.27 కోట్లు ఆర్జించింది'' అని మంత్రి వివరించారు.

నేడు కోర్టుకు ట్రంప్
జడ్జిపై తీవ్ర ఆరోపణలు



వాషింగ్టన్: హష్ మనీ చెల్లింపుల కేసులో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (76) మంగళవారం మన్‌హటన్ గ్రాండ్ జ్యూరీ ముందు హాజరు కానున్నారు. పోర్న్ చిత్రాల నటి స్టార్మీ డేనియల్స్‌తో తన అఫైర్‌ను కప్పిపుచ్చేందుకు చేసిన చెల్లింపుల కేసులో ట్రంప్‌పై నేరాభియోగాలు మోపుతూ జ్యూరీ గత గురువారం సంచలన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దాంతో ఒక క్రిమినల్ కేసులో విచారణ ఎదుర్కొంటున్న తొలి అమెరికా మాజీ అధ్యక్షునిగా ట్రంప్ నిలిచారు. మంగళవారం విచారణ తంతు 10 నుంచి 15 నిమిషాల్లో ముగుస్తుందని చెబుతున్నారు. ట్రంప్‌పై ఏయే అభియోగాలు మోపిందీ ఆయనకు చదివి వినిపిస్తారు. అనంతరం ట్రంప్ ఫ్లోరిడా వెళ్లి మంగళవారం రాత్రి మద్దతుదారులను ఉద్దేశించి ప్రసంగిస్తారని ఆయన కార్యాలయం ఇప్పటికే ప్రకటించింది. ఈ కేసును విచారిస్తున్న ప్రాసిక్యూటర్‌తో పాటు జడ్జిపైనా ట్రంప్ ఆరోపణలతో విరుచుకుపడ్డారు! ''ఈ కేసు కేవలం నాపై కక్షపూరిత చర్యే. దీన్ని విచారిస్తున్న జడ్జికి నేనంటే అమిత ద్వేషం. కేసును దర్యాప్తు చేస్తున్న జిల్లా అటార్నీ ప్రత్యర్థి డెమొక్రటిక్ పార్టీకి చెందినవాడు. ఏరికోరి నన్ను ద్వేషించే జడ్జినే విచారణకు ఎంచుకున్నారు'' అంటూ ఆరోపణలు గుప్పించారు. క్రిమినల్ విచారణకు దారితీయగల పలు ఇతర అభియోగాలను కూడా ట్రంప్ ఇప్పటికే ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం : 4 : ఏప్రిల్ : 2023

విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

దొడ్డబళ్లాపురం: టేకాఫ్ తీసుకున్న అంతర్జాతీయ సర్వీసు విమానం సాంకేతిక సమస్య వల్ల కొంతసేపటికి తిరిగి వచ్చిన సంఘటన బెంగళూరు కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో ఆదివారం రాత్రి జరిగింది. రాత్రి 9:07 గంటలకు ఎతిహాద్ ఎయిర్‌లైన్స్ విమానం బెంగళూరు నుంచి దుబాయ్ కి టేకాఫ్ అయ్యింది. కొన్ని నిమిషాల్లోనే విమానంలో లోపల గాలి ఒత్తిడి తగ్గినట్లు పైలట్లు గుర్తించారు. దీంతో విమానాశ్రయ సిబ్బందిని సంప్రదించి అత్యవసర ల్యాండింగ్‌కు అనుమతి కోరారు. కొన్ని నిమిషాల్లో తిరిగి ల్యాండయ్యారు. విమానంలో 200 మంది ప్రయాణికులు, 10 మంది సిబ్బంది ఉన్నారు. ఇంజనీర్లు సమస్యను సరిచేశాక 4 గంటలు ఆలస్యంగా విమానం బయల్దేరింది.

న్యూస్‌రీల్

వరుసగా కార్లు ఢీ



కృష్ణరాజపురం: నగరంలోని మహాదేవపుర నియోజకవర్గం వైట్‌ఫీల్డ్ పరిధిలో వర్తూరు వద్ద బళగెరె రోడ్డులో మూడు కార్లు ఢీకొన్నాయి. ఒక కారు డ్రైవర్‌కు కళ్లు తిరగడంతో సడన్ బ్రేక్ వేశాడు, దీంతో వెనుక వస్తున్న రెండు కార్లు వచ్చి ఢీకొన్నాయి. మూడుకార్లూ పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదం వల్ల కొంతసేపు ట్రాఫిక్‌కు అవాంతరం ఏర్పడింది. వైట్‌ఫీల్డ్ పోలీసులు వచ్చి కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యేపై లోకాయుక్తలో ఫిర్యాదు



తుమకూరు: ఓ ప్రైవేట్ చానల్ నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్‌లో డబ్బులు తీసుకుంటూ దొరికిపోయిన మధుగిరి ఎమ్మెల్యే ఎం.వి.వీరభద్రయ్యపై లోకాయుక్త కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మధుగిరికి చెందిన వీరణ్ణ, సిద్దాపుర ఆధ్వర్యంలో స్థానికులు పెద్ద ఎత్తున నగరంలోని లోకాయుక్త కార్యాలయం చేరుకుని అక్కడ ఫిర్యాదు చేశారు. రెడ్‌హ్యాండ్‌గా కాంట్రాక్టర్ వద్ద లక్షల కమీషన్ తీసుకుంటున్న ఎమ్మెల్యేపై వెంటనే కేసు నమోదు చేయాలని కోరారు.

బీజేపీ ఎమ్మెల్సీ ఆయనూరు రాజీనామా

శివమొగ్గ: బీజేపీ ఎమ్మెల్సీ ఆయనూరు మంజునాథ్ పదవికి రాజీనామా చేశారు. శివమొగ్గ నగర ఎమ్మెల్యే టికెట్ కోసం ఆయన ఆరాటంతో ఉన్నారు. టికెట్ రాదని గ్రహించి రాజీనామా చేశారు, కాంగ్రెస్‌లో చేరి ఎమ్మెల్యే పదవికి పోటీ చేస్తారని సమాచారం. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ పార్టీకి కూడా రాజీనామా చేస్తానని, బీజేపీ అభ్యర్థిపై పోటీ చేస్తానని ప్రకటించారు. గత 32 సంవత్సరాల నుంచి శివమొగ్గ నగర ఎమ్మెల్యేగా ఉన్న కె.ఎస్. ఈశ్వరప్ప చేసిన అభివృద్ధి ఏమీ లేదని ఆరోపించారు. ఈసారి తనకు అవకాశం కల్పించాలని కోరినా బీజేపీ నేతలు పట్టించుకోలేదని, అందుకే ఈ నిర్ణయానికి వచ్చానన్నారు. ఒకవేళ కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోతే జేడీఎస్ నుంచి పోటీ చేస్తా, లేనిపక్షంలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధిస్తానని అన్నారు.

బస్సులో బంగారం దొరికితే..



మహిళకు చైన్ అందజేస్తున్న డ్రైవర్, కండక్టర్

మైసూరు: బస్సులో దొరికిన మాంగళ్యం చైన్‌ను బస్సు డ్రైవర్, కండక్టర్ సొంతదారుకు అందజేసి నిజాయితీని చాటుకున్నారు. మైసూరు జిల్లా హుణసూరు– కోయంబత్తూరు బస్సులో నంజనగూడుకు చెందిన సుమ అనే మహిళ చామరాజనగరకు ప్రయాణించింది. ఊరు రాగానే ఆమె దిగిపోయింది. అయితే మాంగళ్యం చైన్ తెగి సీటు కింద పడిపోగా, ఆమె చూసుకోలేదు. కొంతసేపటికి బస్ డ్రైవర్ తాండవమూర్తి, కండక్టర్ ఆర్.పి.శివకుమార్ చైన్‌ను చూసి డిపో మేనేజర్‌కు అందజేశారు. మహిళ కూడా చైన్ పోయిందని బస్టాండుకు తిరిగివచ్చి తన టికెట్, ఇతర ఆధారాలను చూపింది. డ్రైవర్, కండక్టర్‌ల చేతుల మీదుగా సుమకు చైన్ అందజేయడంతో ఆమె ఆనందానికి అవధులు లేవు.

హాసన్ విషయంలో నా వైఖరి మారదు

- మాజీ సీఎం కుమారస్వామి

దొడ్డబళ్లాపురం: హాసన్ విషయంలో తన నిర్ణయం మార్చుకునేది లేదని మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి స్పష్టం చేశారు. సోమవారం రామనగరలో మీడియాతో హాసన్ టికెట్ కేటాయింపుపై మాట్లాడారు. దేవేగౌడ ఇప్పటికే హాసన్ ప్రజలు, పార్టీ కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకున్నారన్నారు. హాసన్ టికెట్‌పై చాలా చర్చ జరుగుతోందని, త్వరలో ఈ సమస్య పరిష్కారమవుతుందన్నారు. ప్రస్తుతం దేవేగౌడ ఢిల్లీ వెళ్లారని, రాగానే టికెట్లపై ఒక నిర్ణయం తీసుకుంటారన్నారు. టికెట్ లభించకపోతే భవాని రేవణ్ణ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసే విషయం తనకు తెలీదన్నారు. ఈ విషయం ఆమెనే అడగాలన్నారు. త్వరలో రెండవ, నాలుగైదు రోజుల్లో మూడవ లిస్టు విడుదల చేస్తామన్నారు.

ఐటీ సిటీ.. ఆస్తిపన్నులో మేటి

- ఏడాదిలో రూ.3,332 కోట్ల వసూలు
- ఇప్పటివరకు ఇదే అత్యధికం





బనశంకరి: ఆస్తిపన్ను వసూలులో సిలికాన్ సిటీ దూసుకుపోయింది. నగరపౌరుల ముక్కు పిండి అణాపైసలతో సహా వసూలు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ఆస్తిపన్ను రూ.3,332 కోట్లు వసూలైంది. గత ఏడాదితో పోలిస్తే రూ.250 కోట్లు ఎక్కువ. బకాయిదారుల జాబితా రూపొందించి వసూలు చేయడం, అధికారులకు టార్గెట్ విధించడం, మారుమూల ప్రాంతాల్లో ఉన్న వేలాది కట్టడాలు, అనేక భవనాల వాస్తవ పరిమాణం తదితరాలపై బెస్కాంతో పాటు వివిధ శాఖలు ఇచ్చిన సమాచారం వల్ల తీసుకున్న చర్యలతో ఆస్తిపన్ను వసూలు పెరిగింది.

ఒకే సంస్థ.. రూ.92 కోట్ల చెల్లింపు

అంతేగాక ఆన్‌లైన్ ద్వారా ఆస్తిపన్ను చెల్లింపులు కూడా కలిసి వచ్చాయని పాలికె అధికారులు తెలిపారు. 2022–23లో రూ.4,189 కోట్లు లక్ష్యమైతే రూ.3,332 కోట్లు వసూలు సాధ్యమైంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ హెచ్‌ఏఎల్ 14 ఏళ్ల నుంచి పాలికెకి ఆస్తిపన్ను చెల్లించలేదు. ఒకేసారి ఆస్తి పన్ను చెల్లిస్తే వడ్డీ తగ్గిస్తామనడంతో రూ.92 కోట్లు చెల్లించింది. బీబీఎంపీ చరిత్రలోనే ఇది అతిపెద్ద ఆస్తిపన్నుగా రికార్డు అయ్యింది.

మొదటి నెలలో 5 శాతం రాయితీ

ఆర్థిక సంవత్సరం మొదటి నెల అంటే ఏప్రిల్ 1 నుంచి 30వ తేదీ మధ్య ఆస్తిపన్ను చెల్లింపుదారులకు 5 శాతం రాయితీ ఇస్తారు. ఆస్తుల యజమానులు ఈ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని బీబీఎంపీ రెవెన్యూ విభాగం ప్రత్యేక కమిషనర్ ఆర్‌ఎల్ దీపక్ తెలిపారు.

బీబీఎంపీ వలయాలవారీగా వసూలైన ఆస్తి పన్ను వివరాలు

బొమ్మనహళ్లి	రూ.352.57 కోట్లు
దాసరహళ్లి	రూ.95.46 కోట్లు
తూర్పు వలయం	రూ.588.05 కోట్లు
మహదేవపుర	రూ.952.73 కోట్లు
ఆర్‌ఆర్.నగర	రూ.220.16 కోట్లు
దక్షిణవలయ	రూ.481.19 కోట్లు
పశ్చిమ వలయ	రూ. 356.50 కోట్లు
యలహంక	రూ.286.06 కోట్లు
మొత్తం	రూ.3,332.72 కోట్లు

గత ఐదేళ్లలో ఆస్తిపన్ను వసూలు వివరాలు

సంవత్సరం	టార్గెట్	సేకరణ (రూ.కోట్లలో)
2018-19	3,100	2,529
2019-20	3,500	2,659
2020-21	3,500	2,860
2021-22	4,000	3,089
2022-23	4,189	3,332

బీజేపీపై విశ్వనాథ్ ఆగ్రహం

- మైసూరులో ప్రాయశ్చిత్త సత్యాగ్రహం



మైసూరు: బీజేపీ ఎమ్మెల్సీ హెచ్. విశ్వనాథ్ సోమవారం మైసూరు కోర్టు ముందున్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ప్రాయశ్చిత్త సత్యాగ్రహం నిర్వహించారు. మీడియాతో మాట్లాడుతూ ఇతర రాజకీయ నాయకుల మాటలను విని ముఖ్యమంత్రిగా ఉన్న హెచ్‌డి.కుమారస్వామి ప్రభుత్వాన్ని కూలిపోవడానికి తాను కూడా కారణం అయ్యాయని అన్నారు. అందుకే ప్రాయశ్చిత్తం కోసం ఇక్కడ ధర్నా చేసినట్లు చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రంలో కూడా గద్దెనెక్కితే ఎంతో అభివృద్ధి చెందుతుందని భావించి కొందరు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి బీజేపీలోకి చేరామన్నారు. కానీ ఇక్కడ బీజేపీ చేసింది ఏమీ లేదని ఆరోపించారు. ఇప్పటివరకు ముఖ్యమంత్రిగా కుమారస్వామి కొనసాగి ఉంటే రాష్ట్రంతో పాటు రైతులు కూడా బాగుపడేవారన్నారు. ఇప్పటికి తప్పు తెలుసుకొని పశ్చాత్తాపంతో సత్యాగ్రహం చేసినట్లు చెప్పారు. ఆయనతో పాటు పెద్ద సంఖ్యలో మద్దతుదారులు ధర్నాలో కూర్చున్నారు. విశ్వనాథ్ బీజేపీలో ఉంటూ సొంతపార్టీకి వ్యతిరేకంగా ఆందోళన చేయడం విశేషం. ఆయన ఈసారి కాంగ్రెస్, లేదా జేడీఎస్ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయవచ్చని సమాచారం.

బియ్యం మూటలు స్వాధీనం



దొడ్డబళ్లాపురం: ఎన్నికల వేళ క్యాంటర్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రూ.8 లక్షల విలువైన 700 బియ్యం బస్తాలను నెలమంగల తాలూకా హాళెనిజగల్ గ్రామం సమీపంలో 48వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి తుమకూరు నుంచి బెంగళూరు వెళ్తున్న క్యాంటర్ వాహనాన్ని చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేశారు. బియ్యం మూటలను వాహనంతో పాటు సీజ్ చేసి, క్యాంటర్ డ్రైవర్ నాగేశ్‌ను అరెస్టు చేసారు.

జాతరలో కుప్పకూలి పూజారి మృతి



పూజారి నాగరాజు

దొడ్డబళ్లాపురం: కనకపుర తాలూకా మావత్తూరు గ్రామంలో వేడుకలో విషాదం చోటుచేసుకుంది. అగ్నిగుండం ప్రవేశానికి కొన్ని క్షణాల ముందు పూజారి కుప్పకూలి మృతిచెందాడు. మావత్తూరమ్మ దేవికి అగ్నిగుండం ఉత్సవాలు జరుగుతుండగా ఈ సమయంలో ఒక మహిళ విచిత్రంగా ప్రవర్తించింది. దీంతో పూజారి నాగరాజు ఆమెను బెత్తంతో కొట్టాడు. బెదిరిన ఆమె ఆయన కాళ్లమీద పడింది. వెంటనే పూజారి నాగరాజు (55) ఉన్నచోటే పడిపోయాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతిచెందాడు. కనకపుర రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనతో ఉత్సవం నిలిచిపోయింది

కాంగ్రెస్ ఆఫీసు ముందు హంగామా

శివాజీనగర: విధానసభ ఎన్నికల్లో టికెట్ కావాలని ఆశావహులు కాంగ్రెస్ ఆఫీసు ముందు గందరగోళం సృష్టించారు. తరీకెరె నియోజకవర్గంలో కాంగ్రెస్ టికెట్ కోసం గోపికృష్ణ మద్దతుదారులు సోమవారం బెంగళూరులో కేపీసీసీ కార్యాలయం ముందు ధర్నా చేశారు. తరీకెరె నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ ఈసారి టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయనకు సీఎల్పీ నాయకుడు సిద్దరామయ్య, ఎమ్మెల్యే బైరతి సురేశ్ మద్దతు ఉన్నట్లు తెలిసింది. గోపికృష్ణ ఇంతకు ముందు కూడా రెండు ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి అతి తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయారు. తరీకెరెలో గతంలో టికెట్ కేటాయింపుపై ఇదే మాదిరి గొడవ జరిగింది. ఈసారి గోపికృష్ణ, శ్రీనివాస మధ్య రగడ ఆరంభమైంది. గోపికృష్ణ మద్దతుదారులు కేపీసీసీ కార్యాధ్యక్షుడు సలీం అహమ్మద్‌తో వాగ్వివాదానికి దిగారు. ఆఫీసులో ఉన్న సిద్దరామయ్య, డీ.కే.శివకుమార్‌లను ఘెరావ్ చేసేందుకు యత్నించారు.

కృష్ణయ్యశెట్టిపై కేసు నమోదు

యశవంతపుర: మాజీ మంత్రి కృష్ణయ్యశెట్టిపై మల్లేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. గాంధీనగర నియోజకవర్గం పేరు, కృష్ణయ్యశెట్టి పేరుతో కిట్లను తయారు చేశారు. సమాచారం అందుకున్న ఎన్నికల అధికారులు, పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. బియ్యం, బెల్లం, కందిపప్పు, వంటనూనెను స్వాధీనం చేసుకున్నారు. రూ. 8 లక్షలకు పైగా విలువగల వస్తువులను స్వాధీనం చేసుకొని కృష్ణయ్యశెట్టిపై కేసు నమోదు చేశారు. కృష్ణయ్యశెట్టి గాంధీనగర నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించారు.

కాషాయంలో ఎడతెగని టికెట్ రేసు

- ఒక్కో సీటుకు నలుగురు చొప్పున పోటీ
- హైకమాండ్‌పై తీవ్ర ఒత్తిడి





దబుల్ ఇంజన్ ఉత్సాహం మీదున్న బీజేపీకి టికెట్ల పంపిణీలో సవాళ్లు

శివాజీనగర: ప్రధాన ప్రతిపక్షాలు కాంగ్రెస్, జేడీఎస్‌లు అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించి రెండో జాబితా కోసం కసరత్తులో మునిగాయి. కానీ ఈ ప్రతిష్టాత్మక విధానసభ ఎన్నికల్లో సొంతబలంతో అధికారంలోకి రావాలని సంకల్పించిన అధికార బీజేపీకి అభ్యర్థులను ఎంపిక చేయడం పెద్ద సవాల్‌గా మారింది. ఒకరికి టికెట్ ఇస్తే, రానివారు తిరుగుబాటు చేయవచ్చనే ఆందోళన పార్టీలో నెలకొంది. ఇది చాలా సున్నితంగా మారడంతో జాబితా తయారీ బీజేపీకి కత్తిమీద సాముగా తయారైంది. రాజధాని బెంగళూరు మినహాయిస్తే అత్యధిక నియోజకవర్గాలను కలిగి ఉన్న బెళగావి, కల్బుర్గి, మైసూరు తదితర చోట్ల ఆకాంక్షుల జాబితా హనుమంతుని తోకలా పెరుగుతోంది. దీనివల్ల హైమాండ్‌పై చాలా ఒత్తిడి ఏర్పడింది.

బెంగళూరులో నువ్వా నేనా

ఉద్యాననగరిలో జయనగరలో సీ.కే.రామమూర్తి, ఎస్.ఆర్.రమేశ్, వివేకరెడ్డి, ఎస్.కే.నటరాజ్ బలమైన ఆకాంక్షులుగా ఉన్నారు. చిక్కపేటలో ప్రస్తుత ఎమ్మెల్యే ఉదయ గరుడాచార్, మాజీ ఎమ్మెల్యే హేమచంద్ర సాగర్, సినీ నిర్మాత జాక్ మంజునాథ్ పోటీలో నిలిచారు. ఇవే కాదు, దాదాపు అన్ని నియోజకవర్గాల్లో నువ్వా నేనా అన్నట్లు టికెట్ల కోసం రేసులో ఉన్నారు. బెళగావిలో మాజీ మంత్రి రమేశ్ జార్కిహొళి తనకు, కొందరు మద్దతుదారులకు టికెట్ ఇవ్వాలని పట్టుబట్టారు. అథణిలో మహేశ్ కుమటిహళ్ళికి, కాగవాడలో శ్రీమంత పాటిల్‌కు ఇవ్వాలని కోరారు. అయితే అథణిలో సీనియర్ నేత లక్ష్మణ సవదిని పోటీ చేయించాలని బీజేపీ యోచిస్తోంది.

బెళగావిలో ముఖ్య భేటీ

సోమవారం బెళగావిలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అధ్యక్షతనలో అభ్యర్థుల ఎంపిక గురించి ముఖ్యమైన సమావేశం జరిగింది. ఎమ్మెల్యేలు బాలచంద్ర జార్కిహొళి, మహదేవప్ప యడవాడ, అనిల్ గనికె, రాజ్యసభ సభ్యుడు ఈరణ్ణ కడాడి, మాజీ సభ్యుడు ప్రభాకర్ కోరె తదితరులు పాల్గొన్నారు. అందరి అభిప్రాయాలను సేకరించారు.

ఖైదీ పెళ్లికి పెరోల్ మంజూరు చేయండి

- హైకోర్టు ఆదేశం



బనశంకరి: హత్యకేసులో పదేళ్ల జైలుశిక్షకు గురైన ఖైదీ పెళ్లి చేసుకోవడానికి 15 రోజుల విరామం (పెరోల్) పై విడుదల చేయాలని హైకోర్టు పరప్పన సెంట్రల్ జైలు అధికారులను ఆదేశించింది. వివరాలు.. 2015 ఆగస్టు 16న కోలారు జిల్లా మాస్తి హోబళి నాగదేవనహళ్లిలో ఒక హత్య జరిగింది. ఇందులో ఆనంద (29) అనే నిందితున్ని పోలీసులు అరెస్టు చేయగా కేసు నడిచింది. నేరం రుజువు కావడంతో సెషన్స్‌కోర్టు 2019లో యావజ్జీవిత శిక్ష విధించింది. దీనిని అతడు హైకోర్టులో అప్పీల్ చేయగా, శిక్షను 10 ఏళ్లకు తగ్గించింది.
మరోవైపు ఊర్లోనే ఇతడు ఒక యువతిని ప్రేమిస్తున్నాడు. పెళ్లి చేసుకోవడానికి అతన్ని తాత్కాలికంగా విడుదల చేయాలని అతని తల్లి, ప్రియురాలు హైకోర్టులో వేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి ఎం.నాగప్రసన్న తో కూడిన బెంచ్ సోమవారం విచారించింది. ఇరువర్గాల వాదనలు ఆలకించిన తరువాత, అతనికి కట్టుదిట్టమైన షరతులతో ఏప్రిల్ 5 మధ్యాహ్నం లోగా 15 రోజులు పెరోల్ ఇవ్వాలని ఆదేశించారు. అతని పెళ్లికి అడ్డంకి తొలగింది.



ర్యాలీ నిర్వహిస్తున్న దివ్యాంగులు

ఓటు జాగృతికి మేము సైతం

తుమకూరు: అంధులు, అవిటివారు ఎన్నో రకాల వైకల్యాలతో బాధపడుతున్నవారు ఓటు జాగృతి ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి ఒక్క ఓటరూ రాబోయే ఎన్నికల్లో ఓటు వేయాలని కలెక్టర్ వై.ఎస్. పాటిల్ అన్నారు. సోమవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఓటు హక్కు జాగృతి ర్యాలీని ఆయన ప్రారంభించారు. జిల్లాలో సుమారు 29,700 మంది దివ్యాంగులు ఉన్నారని, వారందరూ ఓటు హక్కును వినియోగించుకుని జిల్లాలో వంద శాతం పోలింగ్ జరిగేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులు స్కూటర్లతో ర్యాలీ నిర్వహించారు.

8 తరువాత బీజేపీ జాబితా: సీఎం

శివాజీనగర: ఈ నెల 8న పార్టీ పార్లమెంటరీ బోర్డు సమావేశం జరుగుతుందని, ఆ తరువాతనే అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల జాబితా విడుదలవుతుందని సీఎం బొమ్మై తెలిపారు. ఆయన సోమవారం బెంగళూరు ఆర్.టీ.నగరలో నివాసంలో విలేకరులతో మాట్లాడారు. 224 విధానసభ నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపికపై చర్చ జరుగుతోందని తెలిపారు. కొన్ని నియోజకవర్గాల్లో ఆకాంక్షులు అధికమయ్యారు, దీనిని విభేదాలని చెప్పడం సరికాదన్నారు. పలు నియోజకవర్గాల్లో పది మందికి పైగా ఆకాంక్షులు ఉన్నారు, ఇది తమ పార్టీ గెలుపును చూపిస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నూతన రిజర్వేషన్ పద్ధతిని రద్దు చేసే శక్తి కాంగ్రెస్‌కు లేదని సీఎం అన్నారు. నూతన రిజర్వేషన్‌ను రద్దు చేస్తామన్న కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలను ఖండిస్తానన్నారు. కొత్త రిజర్వేషన్లను ఉపసంహరించుకునేది లేదని చెప్పారు. జనసంఖ్యకు అనుగుణంగా రిజర్వేషన్ కల్పించామన్నారు.

యడ్డి నాయకత్వంలో ఎన్నికలకు: సీఎం

శివాజీనగర: ఈ విధానసభా ఎన్నికల్లో హావేరి జిల్లా శిగ్గావి నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని, నియోజకవర్గం మారుతాననడం అవాస్తవమని ముఖ్యమంత్రి బొమ్మై చెప్పారు. సోమవారం బెంగళూరులో బీజేపీ మీడియా కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అభివృద్ధిని చూపి ఓటు కోరుతోంది. మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని అన్నారు. యడియూరప్ప, అనంత్‌కుమార్ తదితరులు పార్టీ కోసం శ్రమించారన్నారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా యడియూరప్ప నాయకత్వంలోనే ఎన్నికలు ఎదుర్కొంటామని తెలిపారు. కాంగ్రెస్‌వారి దుష్టపాలన గురించి ప్రజలకు చెబుతామన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు మత ఘర్షణలతో శాంతిభద్రతలు అస్తవ్యస్తంగా ఉండేవని బొమ్మై ఆరోపించారు. 40 శాతం కమీషన్ పై ఆధారాలు ఇస్తే తనిఖీ చేయిస్తామన్నారు.



బెంగళూరు శేషాద్రి రోడ్డులో సుందర దృశ్యం. రహదారికి ఇరువైపులా పూల చెట్లు వికసించాయి. చూపరులకు ఆహ్లాదం ఉచితం

ఎన్నికల అక్రమాలా.. 1950కి కాల్ చేయండి

యశవంతపుర: ఎన్నికల ఉల్లంఘనలను అరికట్టడానికి పౌరులు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చునని బెంగళూరు పాలికె తెలిపింది. బెంగళూరు నగర, కేంద్ర, ఉత్తర, దక్షిణ ఎన్నికల జిల్లాలకు సంబంధించి ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని పాలికె ప్రత్యేక కమిషనర్ రవీంద్ర తెలిపారు. ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 1950కు ఫోన్ చేసి సమాచారం చెప్పవచ్చు. లేదా ఎన్‌జీఆర్‌ఎస్ లేదా సివిజిల్ యాప్ ద్వారా కూడా అక్రమాలపై, సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఎన్నికల అక్రమాల ఫోటోలు, వీడియోలు, ఆడియోలను కూడా యాప్ ద్వారా పంపవచ్చు.

అధికారం మాదే: డీకేశి

- కాంగ్రెస్ గూటికి ఎస్‌వై గోపాలకృష్ణ

శివాజీనగర: ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన ఎస్.వై.గోపాలకృష్ణ సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎల్పీ నేత సిద్దరామయ్య, కేపీసీసీ అధ్యక్షుడు డీ.కే.శివకుమార్ సమక్షంలో కేపీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ సభ్యత్వాన్ని పొందారు. ఈ సందర్భంగా మాట్లాడిన డీ.కే.శివకుమార్ రాష్ట్రంలో ప్రజాధ్వని కాంగ్రెస్ వైపునకు ఉందనేది స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ విజయం తథ్యమని తెలిసి ఇతర పార్టీలకు చెందిన నేతలు తమ పార్టీలో చేరుతున్నారన్నారు. బీజేపీ నేత ఎస్.వై.గోపాలకృష్ణ పార్టీలో చేరగా జేడీఎస్ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన అరసీకెరె ఎమ్మెల్యే కే.ఎం.శివలింగేగౌడ ఈనెల 9న కాంగ్రెస్‌లో పార్టీలో చేరుతారని చెప్పారు. అవినీతి, ధరల పెరుగుదల కారణంగా బీజేపీపై తీవ్ర వ్యతిరేకత వస్తోందని, మూడు నాలుగుసార్లు ఎమ్మెల్యే అయినవారు బీజేపీని వీడుతున్నారని అన్నారు. మరికొంత మంది ఎమ్మెల్యేలు పార్టీలోకి రావడానికి సముఖత చూపుతున్నారని, అన్నింటినీ గమనించి పార్టీలో చేర్చుకున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఎయిమ్స్ మంజూరుపై చర్చిస్తా



సంతోష్‌తో మాట్లాడుతున్న స్వామీజీలు

రాయచూరు రూరల్: నగరానికి ఎయిమ్స్ మంజూరుపై సీఎంతో చర్చిస్తానని బీజేపీ జాతీయ సమన్వయ కార్యదర్శి సంతోష్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం గంగావతిలోని ఓ హోటల్‌లో ఎయిమ్స్ పోరాట సమితి నేతలు, కార్యకర్తలు తనను కలిసి విన్నవించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పోరాట సమితి నేతలు బసవరాజ్, అశోక్ కుమార్ జైన్, యద్దలదొడ్డి మహాలింగ స్వామి, సిరుగుప్ప బసవ భూషణ స్వామి, సిద్దబసవ స్వామి, అడవేశ్వర స్వామి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాపై సవతి ప్రేమను చూపుతున్నాయన్నారు. ప్రభుత్వం తరపున సీఎం బసవరాజ్ బొమ్మై కేంద్రానికి ప్రతిపాదనలు పంపి ఎయిమ్స్‌ను కేటాయించేలా చూస్తామని హామీనిచ్చారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

రాయచూరు రూరల్: అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలోని మాన్వి తాలూకా జీనూరులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సిద్దరామేష్ (30) అనే రైతు తండ్రి ద్యావప్ప ఎనిమిది ఎకరాల పొలానికి మాన్వి ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో తీసుకున్న రుణాలకు వడ్డీలు తోడై రూ.25 లక్షలు కావడంతో వాటిని చెల్లించలేక పోయాడు. తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం బెంగళూరులో పనులకు వెళ్లారు. సిద్దరామేష్‌కు బ్యాంక్ నుంచి నోటీసులు రావడంతో మనస్తాపానికి గురై ఇంటిలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు మాన్వి సీఐ హిరేమఠ తెలిపారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తులో ఉంది.

పత్తి కుప్పకు దుండగుల నిప్పు



కాలిపోయిన పత్తి కుప్ప

రాయచూరు రూరల్: దేవదుర్గ తాలూకా హిరేరాయకుంపిలో దుండగులు పత్తి కుప్పకు నిప్పంటించారు. వివరాలు..రైతు నీలకంఠకు చెందిన 400 క్వింటాళ్ల పత్తిని మార్కెట్‌లో ధర బాగా వచ్చిన సమయంలో విక్రయించుకోవాలని పొలంలో కుప్పగా నిల్వ చేసి ఉంచారు. అయితే ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పత్తి కుప్పకు నిప్పంటించడంతో 20 క్వింటాళ్లకు పైగా కాలిపోయిందని గబ్బూరు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తులో ఉంది.

ఎక్స్‌ప్రెస్ వేపై టోల్ తొలగింపు?

దొడ్డబళ్లాపురం: బెంగళూరు–మైసూరు ఎక్స్‌ప్రెస్‌వే పై టోల్‌గేట్ల తొలగించే యోచనలో నేషనల్ హైవే అథారిటీ ఉన్నట్లు తెలుస్తోంది. అధిక టోల్ ఫీజులు వసూలు చేస్తున్నట్లు ప్రయాణికుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రత్యామ్నాయ వ్యవస్థను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎక్స్‌ప్రెస్ వే రహదారికి ఇరువైపులా రెండు లేన్ల సర్వీస్ రోడ్డు ఉందని, వాహనదారులు ఈ రోడ్లపై ఉచితంగా సంచరించవచ్చని హైవే అథారిటీ అధికారులు తెలిపారు.

తప్పుడు ప్రచారం నమ్మొద్దు

- బీజేపీ అభ్యర్థిగానే పోటీ చేస్తా
- ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి

బళ్లారి అర్బన్: తన వ్యతిరేకులు తనపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని, తాను పార్టీని వీడే ప్రసక్తే లేదని, బీజేపీ నుంచే నగర అభ్యర్థిగా పోటీ చేస్తానని ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన సోమవారం 22, 23, 24వ వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించి మాట్లాడారు. తాను కేఆర్‌పీపీలోకి వెళతానని, తాను అసలే ఎన్నికల్లో పోటీ చేయనని లాంటి అసత్య ప్రచారంతో తన అభిమానులను, ఓటర్లను తప్పుదారి పట్టించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా, మేయర్, కేఎంఎఫ్ అధ్యక్షులుగా బీజేపీ అధికారం ఇచ్చిందని, నగర ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ బీజేపీ నుంచే పోటీ చేస్తానన్నారు. కార్పొరేటర్ మోత్కర్ శ్రీనివాస్, పార్టీ ప్రముఖులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారంలో పాల్గొన్నారు.

15 వరకు ఎల్‌ఎల్‌సీకి నీరివ్వండి

కంప్లి: తాలూకాలోని ఎల్‌ఎల్‌సీ రైతాంగానికి సాగునీటి చింత ఎదురైంది. నీటిపారుదల సలహా సమితి గతంలో ఎల్‌ఎల్‌సీకి ఏప్రిల్ 5వరకు నీటి విడుదలకు తీర్మానించగా తాజాగా కనీసం ఏప్రిల్ 15 వరకు సాగునీరు అవసరం అని రైతులు ఒత్తిడి చేస్తున్నారు. రైతు కేంద్రం పరిధిలోని 6600 హెక్టార్లలో ఆర్‌ఎస్‌ఆర్ గంగా కావేరి, సోనా బీపీటీ సోనా, కావేరి సోనా రకాలను వేశారు. నది తీర ప్రాంత వాసులకు, ఇతర ప్రాంతాలకు 25 రోజుల తేడా ఉంది. ఏప్రిల్ నెలాఖరులోగా వరి కోతకు వస్తుంది. ఏప్రిల్ 15 లోగా నీటి సరఫరాను నిలిపివేస్తే కోతకు వచ్చిన పంట చేతికి అందదు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని నీటిపారుదల శాఖ తమను ఆదుకోవాలని రైతాంగం కోరుతోంది.

ఇంకా కొలిక్కి రాని అభ్యర్థుల ఎంపిక

- ఇప్పటికే ఆరుగురు కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారు
- కోర్‌కమిటీలో బీజేపీ అభ్యర్థుల ఎంపికపై చర్చ

సాక్షి,బళ్లారి: వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి బళ్లారి జిల్లాలో ప్రధాన పార్టీల తరుపున పోటీ చేసే అభ్యర్థుల పేర్లు ఇంకా ఖరారు కాకపోవడంతో ఎవరెవరికి టికెట్ దక్కుతుందా అన్న విషయంపై ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ తరపున బళ్లారి, విజయనగర జిల్లాల్లో ఆరు నియోజకవర్గాలకు అభ్యర్థుల పేర్లు ఖరారు చేసినా బీజేపీ తరపున ఇంకా ఒకరి పేరు కూడా ఫైనల్ కాలేదు. ఉమ్మడి బళ్లారి జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ తరపున ఇప్పటికే బళ్లారి గ్రామీణ నుంచి నాగేంద్ర, కంప్లి నుంచి గణేష్, సండూరు నుంచి తుకారాం, హగరిబొమ్మనహళ్లి నుంచి భీమానాయక్, హడగలి నుంచి పరమేశ్వర నాయక్, విజయనగర నుంచి హెచ్‌ఆర్ గవియప్పల పేర్లు ఖరారు చేసిన సంగతి తెలిసిందే. బళ్లారి, సిరుగుప్పల నుంచి తీవ్ర పోటీ నెలకొనడంతో కాంగ్రెస్ నేతలు ఈ రెండు నియోజకవర్గాలకు అభ్యర్థుల పేర్లను పెండింగ్‌లో ఉంచారు. బళ్లారి నుంచి మాజీ జెడ్పీ మెంబర్ నారా భరత్‌రెడ్డి పేరు దాదాపుగా ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.



కాంగ్రెస్‌లో బళ్లారి టికెట్‌పై ఉత్కంఠ

నారా భరత్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే అనిల్ లాడ్, మాజీ జెడ్పీ మెంబర్ అల్లం ప్రశాంత్‌ల పేర్లను పరిశీలించినా చివరికి భరత్‌రెడ్డి పేరును ఫైనల్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సిరుగుప్ప నుంచి కాంగ్రెస్ తరుపున మురళీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే బీఎం నాగరాజు పేర్లలో ఒకరిని ఫైనల్ చేసే అవకాశం ఉంది. ఇక బీజేపీ తరపున మొదటి జాబితా కూడా ఇంకా ఖరారు కాకపోవడంతో శనివారం బెంగళూరులో కోర్‌కమిటీలో ఉమ్మడి బళ్లారి జిల్లా అభ్యర్థుల ఎంపికపై చర్చ జరిపి ఒక కొలిక్కి తెచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇందులో బళ్లారి నగర నియోజకవర్గం నుంచి గాలి సోమశేఖరరెడ్డి, బళ్లారి గ్రామీణ నియోజకవర్గం నుంచి మంత్రి శ్రీరాములు, సిరుగుప్ప నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే సోమలింగప్ప, కంప్లి నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే టీ.హెచ్ సురేష్‌బాబు, సండూరు నుంచి కే.ఎస్.దివాకర్‌తో పాటు మరొకరి పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. విజయనగర జిల్లాలో బీజేపీ తరపున విజయనగర(హొసపేటె) నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి ఆనంద్‌సింగ్‌తో పాటు ఆయన తనయుడు సిద్దార్థ సింగ్, బీజేపీ నాయకురాలు రాణి సంయుక్త పేర్లను పరిశీలిస్తున్నారు. ఆనంద్‌సింగ్ కూడా తన కుమారుడికి ఈసారి టికెట్ ఇవ్వాలని కోరినట్లు తెలిసింది.

హొసపేటెలో తండ్రీతనయుల పేర్ల పరిశీలన

నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఈ నియోజకవర్గం నుంచి గెలుపొందడంతో పాటు విజయనగర జిల్లా ఏర్పాటుకు ప్రధాన భూమిక పోషించిన ఆనంద్‌సింగ్ తన కుమారుడిని రాజకీయాల్లోకి దింపాలని యోచించి ఈసారి టికెట్ కూడా తన కుమారుడికి ఇప్పిస్తారా లేక తానే పోటీ చేస్తారా? అన్న సందిగ్ధత నెలకొంది. హరపనహళ్లి నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే గాలి కరుణాకరరెడ్డితో పాటు నంజనగౌడ, చంద్రశేఖర్ ఆచార్ కూడా టికెట్ ఆశిస్తుండటంతో ఎంపికపై మల్లగుల్లాలు పడుతున్నారు. కూడ్లిగి నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ఎన్‌వై గోపాలకృష్ణ బీజేపీకి గుడ్‌బై చెప్పడంతో ఇక్కడ నుంచి పార్టీ ఎవరిని ఎంపిక చేస్తుందోనన్న గందరగోళం నెలకొంది. హడగలి, హగరిబొమ్మనహళ్లి నియోజకవర్గాల్లో తాజా మాజీలైన వారు టికెట్ ఆశిస్తున్నారు. బళ్లారి జిల్లా నుంచి ఐదు నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థుల ఎంపికపై కోర్‌కమిటీలో దాదాపు ఖరారు కాగా విజయనగర జిల్లాలో చిక్కుముడి వీడలేదని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇక కేఆర్‌పీపీ తరపున బళ్లారి సిటీ నుంచి గాలి జనార్దనరెడ్డి సతీమణి గాలి లక్ష్మీ అరుణ, సిరుగుప్ప నియోజకవర్గం నుంచి దరప్ప నాయక్ పేర్లు ఖరారు చేశారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆన్‌లైన్ సేవలు షురూ

బళ్లారిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం కావేరి–2 పథకం కింద సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆన్‌లైన్ సేవలను సోమవారం కలబుర్గి విభాగాధికారి, జిల్లా నోడల్ ఆఫీసర్ మహమ్మద్ అబ్దుల్ హసీబ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కావేరి–1 పథకం కింద ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి ఎదురు చూస్తూ ఇబ్బందులను ఎదుర్కొనేవారమన్నారు. కావేరి–2 పథకం కింద ఇప్పటికే రాష్ట్రంలో ఇటీవల బెళగావి, మండ్య, దొడ్డబళ్లాపుర జిల్లాల్లో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించడంతో బళ్లారిలో కూడా ఏప్రిల్ 1 నుంచి సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ పత్రాలను సోమవారం ఆన్‌లైన్ ద్వారా అందించామన్నారు. రిజిస్టర్ మ్యారేజ్ కోసం గతంలో మాదిరిగానే ఆఫ్‌లైన్ సేవలు కొనసాగాల్సిందేనన్నారు. భూములు, ప్లాట్లు, ఇళ్లు తదితరాల రిజిస్ట్రేషన్ కోసం



ఆన్‌లైన్‌లో రిజిస్టర్ పత్రాలను అందిస్తున్న అధికారులు

https://ifr.karnataka.gov.in or https://.kaveri. karnataka.gov.in వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు 080–68265316 నెంబరును సంప్రదించాలని తెలిపారు. ఆన్‌లైన్ సేవలు విజయవంతం కావడంతో స్వీట్లను పంచిపెట్టి అధికారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ మెహబున్నీసా బేగం, సబ్‌రిజిస్ట్రార్ ఆనంద్‌రాము బదనికాయి, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

13 చోట్ల బరిలో ఎస్‌యూసీఐ అభ్యర్థులు

బళ్లారిఅర్బన్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, కార్పొరేట్ యజమానులు చేస్తున్న ప్రజా వ్యతిరేక పనులను నిరసిస్తూ నిరంతర పోరాటం చేస్తున్న ఎస్‌యూసీఐ తరపున వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులు పోటీ చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కే.సోమశేఖర్ పేర్కొన్నారు. సోమవారం పత్రికర్తర ఒక్కూట భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు కనీస సౌకర్యాల కోసం నిరంతరం పోరాడుతున్న తమ పార్టీ అభ్యర్థులను ప్రజలు గుర్తించి ఓటు వేసి గెలిపించాలన్నారు. బళ్లారి సిటీ అభ్యర్థిగా ఆర్.సోమశేఖర్‌గౌడ, కంప్లి నుంచి దేవదాస్



మాట్లాడుతున్న ఎస్‌యూసీఐ నాయకులు

పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ ఉపాధ్యాయ, జిల్లా సమితి సభ్యులు మంజుల, నాగలక్ష్మి, డాక్టర్ ప్రమోద్, శాంత, గోవింద తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ గుర్తుకు ఓటు..నగర అభివృద్ధికి చోటు

సాక్షి,బళ్లారి: ఈనెల 10న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో నగర నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే నగరాన్ని సర్వతోముఖాభివృద్ధి చేస్తామని కేఆర్‌పీపీ నగర అభ్యర్థి గాలి లక్ష్మీఅరుణా పేర్కొన్నారు. ఆమె సోమవారం నగరంలోని 35వ వార్డు కురిహట్టి తదితర ప్రాంతాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫుట్‌బాల్‌ను చేతపట్టుకొని తన గుర్తు ఫుట్‌బాల్ అని, ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫుట్‌బాల్ గుర్తుపై ఓటు వేయాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేస్తూ అభివృద్ధి పనుల గురించి వివరిస్తూ ప్రచారం చేశారు.



ప్రచారంలో పాల్గొన్న గాలి లక్ష్మీఅరుణా, కార్యకర్తలు

ఈసందర్భంగా పార్టీ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

బాలునికి వైద్యసాయానికి హామీ



బాలునికి వైద్యం చేస్తున్న అభ్యర్థి డాక్టర్ చారుల్

గంగావతి రూరల్: కనకగిరి అసెంబ్లీ నుంచి కేఆర్‌పీపీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థి డాక్టర్ దాసరి చారుల్ రమణ ప్రచారంలో భాగంగా సోమవారం కనకగిరి సమీపంలోని సోమసాగర గ్రామంలో ప్రచారం చేస్తుండగా కడుపుబ్బరంతో బాధపడుతున్న ఓ బాలునికి మానవతతో చికిత్స నిర్వహించారు. అనంతరం బెంగళూరు ఆస్పత్రిలో ఆ బాలునికి తన సొంత ఖర్చుతో చికిత్స చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బాలుడిని బెంగళూరు తరలింపునకు అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం మాట్లాడుతూ క్షేత్రంలోని సమస్యలపై అసెంబ్లీలో లేవనెత్తి క్షేత్రానికి రావలసిన నిధులు, అభివృద్ధి పనులు, నవలి జలాశయం పనుల గురించి గళమెత్తుతానన్నారు. విద్యావంతులు, యువత, మహిళలు, రైతులు, క్షేత్ర ప్రజలు తమ ఓటుతో తనను ఈసారి ఆశీర్వదించాలని మనవి చేశారు.

బసవణ్ణకు పూజతో ప్రచారానికి శ్రీకారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధడేసూగూరు బసవరాజ్, చిత్రంలో పార్టీ కార్యకర్తలు

గంగావతి రూరల్: కనకగిరి అసెంబ్లీ స్థానానికి మే 10న జరిగే ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ధడేసూగూరు బసవరాజ్ సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి బసవణ్ణ క్యాంపులోని బసవణ్ణ దేవస్థానంలో పూజలు చేసిన అనంతరం ప్రచారాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2018 ఎన్నికల్లో కూడా ఈ దేవస్థానంలో పూజలు చేసిన అనంతరం ప్రచారం ప్రారంభించానన్నారు. అదే సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ ఈసారి కూడా ఈ దేవస్థానం నుంచే ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు బిలగార్ నాగరాజ్, గద్ది తిమ్మనగౌడ, శరణప్ప, కాశీ విశ్వనాథ, జడ్పీ మాజీ సభ్యులు వీరేశ్ సాలోణి, సురేశ్ ధడేసూగూరులతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, క్యాంపు ప్రజలు పాల్గొన్నారు.

సోమలింగప్పకు టికెట్ ఇవ్వొద్దు



మాట్లాడుతున్న పార్టీ అసంతృప్త కార్యకర్తలు

సిరుగుప్ప: వచ్చే ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే ఎం.ఎస్.సోమలింగప్పకు టికెట్ ఇవ్వరాదని జిల్లా ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షులు కొడ్లె మల్లికార్జున, ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమితి మాజీ సభ్యులు జి.సిద్దప్ప పేర్కొన్నారు. వారు సోమవారం నగరంలోని మహావీర్ లేఔట్‌లో విలేకరులతో మాట్లాడారు. కుటుంబ రాజకీయాలకు అవకాశం ఇవ్వకుండా వేరొకరికి టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ కౌన్సిలర్ విరుపాక్షి, వాల్మీకి మహాసభ జిల్లా అధ్యక్షులు యర్రెప్ప, టీపీ మాజీ అధ్యక్షులు ముద్దువీరప్ప, ఉపాధ్యక్షులు శాంతనగౌడ, టీపీ మాజీ సభ్యులు దేవేంద్ర, శానవాసపుర జీపీ అధ్యక్షులు పంపాపతి పాల్గొన్నారు.

అందరి పార్టీ కాంగ్రెస్

- కనకగిరి అభ్యర్థి శివరాజ్ తంగడిగి



మాట్లాడుతున్న శివరాజ్ తంగడిగి

గంగావతి రూరల్: దేశంలో అందరినీ కలుపుకెళ్లే సామర్థ్యం ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అని కనకగిరి క్షేత్రం అభ్యర్థి, మాజీ మంత్రి శివరాజ్ ఎస్.తంగడిగి అన్నారు. ఆయన సోమవారం కనకగిరి క్షేత్రంలోని వివిధ గ్రామాల్లో ప్రచారాన్ని ప్రారంభించి మాట్లాడారు. గతంలో తాను చేసిన అభివృద్ధి పనులను చూసి ప్రజలు ఆశీర్వదించాలని మనవి చేశారు. కనకగిరి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గంగాధరస్వామి, ప్రచార సమితి అధ్యక్షులు రమేశ్ నాయక, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్, జిల్లా జెడ్పీ సభ్యులు అమరేశ్ గోనాళ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు వచన పోటీలు



కంప్లి: వచన మహత్యాన్ని ప్రోత్సహించడానికి పిల్లలకు వచన పోటీలు ఏర్పాటు చేశామని అక్క మహాదేవి మహిళా మండలి అధ్యక్షురాలు శివగంగమ్మ తెలిపారు. అక్క మహాదేవి జయంతి సందర్భంగా సంగత్రాయ సంస్కృత పాఠశాలలో పిల్లలకు ఏర్పాటు చేసిన వచన పోటీలను ప్రారంభించి మాట్లాడారు. బాల్యం నుంచే పిల్లలకు వచనాలు చెప్పడం నేర్పించాలన్నారు. పోటీల్లో 40 మంది పిల్లలు పాల్గొనగా ప్రథమ బహుమతి అనుష్క జాబి, ద్వితీయ బహుమతి పూజ అందుకునారు. ప్రిన్సిపాల్ ఘనమఠదయ్య హిరేమఠ, ఉపాధ్యక్షురాలు భత్తద సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లను బూత్‌లకు రప్పించండి



మాట్లాడుతున్న అధికారి సిద్దరామేశ్వర

హొసపేటె: ఓటర్లు పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేసేలా అధికారులు ప్రోత్సహించాలని విజయనగర అసెంబ్లీ నియోజక వర్గ ఎన్నికల అధికారి సిద్దరామేశ్వర తెలిపారు. సోమవారం ఇండోర్ స్టేడియంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను ఉద్దేశించి మాట్లాడారు. అనివార్య కారణాల వల్ల పోలింగ్ బూత్‌లకు రాలేని వారు మాత్రమే పోస్టల్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు విశ్వజిత్ మెహ్తా, మనోహర్, నాగేష్, వెంకటేష్, సెక్టార్ అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

ఇరు వర్గాల మధ్య ఘర్షణ

- పలువురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

శ్రీనివాసపురం: రెండు గుంపుల మధ్య చిన్న విషయానికి ఘర్షణ జరిగి పరస్పర దాడిలో పలువురు గాయపడిన ఘటన ఆదివారం రాత్రి తాలూకాలోని గౌడన తాతనగడ్డ గ్రామంలో చోటు చేసుకుంది. రాష్ట్రంలోనే అత్యంత సున్నిత నియోజకవర్గంగా పేరొందిన శ్రీనివాసపురంలో ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే వర్గాల మధ్య ఘర్షణలు ప్రారంభమయ్యాయి. మురుగు నీటి విషయానికి ప్రారంభమైన గొడవ పరస్పరం దాడులకు దారి తీసింది. గ్రామంలోని టీపీ మాజీ ఉపాధ్యక్షురాలు బాలావతి కుటుంబీకులు తమ ఇంటి ముందుకు మురుగు నీటిని వదలొద్దని లక్ష్మీపుర జీపీ అధ్యక్షురాలు మంగమ్మ కుటుంబం వారిని హెచ్చరించడంతో మంగమ్మ కుటుంబీకులు, కాంగ్రెస్ కార్యకర్తలు మునియప్ప, నడుపణ్ణలతో కలిసి దుడ్డుకర్రలతో దాడి చేశారని జేడీఎస్ కార్యకర్తలు బాలావతి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘర్షణలో గాయపడిన రెడ్డెప్ప, మునీంద్ర, హరిబాబు, రమణమ్మ, బాలావతిలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.ఈ ఘటనపై రాయల్పాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

ప్రధాని మోదీవి తప్పుడు హామీలు

శ్రీనివాసపురం: ప్రధాని నరేంద్ర మోదీ తప్పుడు హామీలతో దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఎమ్మెల్యే కె ఆర్ రమేష్‌కుమార్ ఆరోపించారు. సోమవారం పట్టణంలోని మిలన్ స్టార్ మ్యాంగో మండీలో మైనారిటీ సముదాయ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీ నాలుగేళ్ల క్రితం పార్టీ ఎన్నికల ప్రచారంలో లలిత్ మోదీ, నీరవ్ మోదీ, విజయమల్య వంటివారు బ్యాంకులను లూటీ చేసి దేశం విడిచి పారిపోయి దేశంలో ఆర్థిక మాంద్యం పెరగడానికి కారణమవుతున్నారని ఆరోపిస్తే దీనిపై కోర్టులో కేసు వేసి రాహుల్‌గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష పడేలా చేసి ఎంపీ స్థానం నుంచి అనర్హుడిగా ప్రకటించారన్నారు. ఎమ్మెల్సీ నజీర్ అహ్మద్, డీసీసీ బ్యాంకు డైరెక్టర్ వెంకటరెడ్డి, పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు దింబాల అశోక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి కార్యకర్తల చేరిక



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన కార్యకర్తలు

కేజీఎఫ్: తాలూకాలోని కంగాండ్లహళ్లి జీపీ అధ్యక్షురాలు మంజుల సోమనాథ్, తొంగలకుప్ప సభ్యురాలు యశోదమ్మ, తుళసమ్మ తదితర బీజేపీ కార్యకర్తలు ఎమ్మెల్యే రూపా శశిధర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీ సభ్యుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా చండికా యాగం



చండికా యాగం నిర్వహిస్తున్న దృశ్యం

కేజీఎఫ్: నగరంలోని ఉరిగంపేట ప్రసన్న బాల సోమేశ్వరస్వామి ఆలయంలో లోకకల్యాణం కోసం మహా చండికా హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం 7 గంటల నుంచి పూజలు జరిగాయి. వేద మంత్ర పారాయణం, ఆవాహిత దేవతా పూజ, మహా చండీ పారాయణం, కుమారి పూజ, సుమంగళి పూజ, దంపతి పూజ, మహా పూర్ణాహుతి, మహా మంగళారతి తదితర పూజలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మరథోత్సవం



మాలూరు: చిక్కతిరుపతి ప్రసన్న వేంకటరమణ స్వామి బ్రహ్మరథోత్సవాన్ని సోమవారం అపార భక్తజనసందోహం మధ్య వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు రథాన్ని లాగారు. ఆలయ ప్రధాన అర్చకులు రవి ఎస్.శ్రీధర్, గోపాలకృష్ణ భరద్వాజ్ నేతృత్వంలో తెల్లవారు జామున 4 గంటలకు మూల విరాట్‌కు విశేష పూల అలంకరణతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని 102 అడుగుల బృహత్ రథంలో ప్రతిష్టించి గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. భక్తులు రథానికి అరటి పండ్లు, దవనం విసిరి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు పానకం, పెసరపప్పును పంచి అన్నసంతర్పణ చేశారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్వామీజీ

రాయచూరు రూరల్: నగరంలోని బైరూన్‌కిల్లాలో కేసరి గజానన మిత్ర మండలి, సాయి శివసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని శాంతమల్ల శివాచార్య స్వామీజీ ప్రారంభించారు. వేసవిలో రెండు నెలల పాటు ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే ప్రజలకు తాగునీటిని అందించేందుకు సంస్థలు చేస్తున్న సేవను ప్రశంసించారు. నగరసభ సభ్యుడు ధరూర్ బసవరాజ్, కేసరి గజానన మిత్ర మండలి సభ్యులు రవి, నాగరాజ్, సంతోష్, నరేష్, సాయి శివసేవా ట్రస్ట్ సంచాలకులు శివకాశి భీమన్నలున్నారు.

పార్టీ గెలవాలని తిరుమలకు పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న యువకుల దండు

రాయచూరు రూరల్: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామీణ నియోజకవర్గంలో పార్టీ గెలుపొందాలని రాష్ట్ర బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు తిప్పరాజ్ హవల్దార్ అభిమానులు తిరుపతి తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. సోమవారం జిల్లాలోని మాన్వి తాలూకా కుర్డి నుంచి తిప్పరాజ్ గ్రామీణలో, ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై శిగ్గాంవిలో ఎమ్మెల్యేలుగా ఎన్నిక కావాలంటూ అభిమానులు గోర్కల్ మహంతేష్, బసవరాజ్, వెంకటేష్, మౌనేష్‌లు పాదయాత్ర ద్వారా నడుచుకుంటూ తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు.

బీజేపీలోకి భారీగా చేరికలు



గజమాలతో సురేష్‌బాబును ఆహ్వానిస్తున్న దృశ్యం

కంప్లి: ఎమ్మిగనూరులో చాలా ఏళ్లుగా కాంగ్రెస్‌లో కొనసాగుతున్న జీపీ సభ్యులు డాక్టర్ వీరేంద్రరెడ్డి, దేవప్పనవర శేఖరప్ప, బసవనపేట ఎస్సీ కాలనీతో పాటు గ్రామంలోని 500కు పైగా కాంగ్రెస్ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు సమక్షంలో బీజేపీలో చేరారు. ఎమ్మిగనూరుకు ప్రచారానికి విచ్చేసిన సందర్భంగా ప్రముఖ మార్గాల్లో పూలవర్షంతో సురేష్‌బాబును ఆహ్వానించి ఊరేగించారు. ఈసందర్భంగా ప్రముఖులు బిర్గి మహేష్ గౌడ, ఎల్లార్తి రాఘవేంద్రరెడ్డి, గుడిసలు కాశీంసాబ్, ఎస్.శరణ బసవనగౌడ, లక్ష్మీకాంత్, నాగేష్, రేణుక, బళ్లారి యమునప్పతో పాటు వందలాది కార్యకర్తలు పాల్గొన్నారు.

వేడుకగా గజేంద్ర మోక్షం



మండ్య: మండ్య జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మేలుకోటెలో శ్రీ చెలువనారాయణ స్వామి వైరముడి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం సాయంత్రం గజేంద్ర మోక్ష ఉత్సవం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని తరించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు స్వామివారి సన్నిధిలో మహా రథోత్సవం జరుగుతుంది.

కార్యకర్తలపై పార్టీ అభ్యర్థి నిర్లక్ష్యం

- తాలూకా అధ్యక్షురాలు రాజేశ్వరి ఆరోపణ

కోలారు: కోలారు నుంచి పోటీ చేస్తున్న పార్టీ అభ్యర్థి సీఎంఆర్ శ్రీనాథ్ పార్టీ కార్యకర్తలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని తాలూకా జేడీఎస్ అధ్యక్షురాలు కుర్కి రాజేశ్వరి ఆరోపించారు. సోమవారం తాలూకాలోని వేమగల్‌లో కార్యకర్తలు, అభిమానుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అభ్యర్థి శ్రీనాథ్ మూల నిష్టావంత కార్యకర్తలను విశ్వాసంలోకి తీసుకోవడం లేదన్నారు. తన స్వగ్రామం కుర్కిలో జరిగిన పార్టీ కార్యక్రమానికి కూడా తనను ఆహ్వానించలేదన్నారు. మైనారిటీ సమావేశంలో దేవెగౌడ, కుమారస్వామి ఉన్న బ్యానర్లను తొలగించే ప్రయత్నం చేశారన్నారు. కార్యకర్తల అభిప్రాయాలకు ఏ మాత్రం విలువ ఇవ్వడం లేదన్నారు. సమావేశంలో ఆమె అభిమానులు విజయగౌడ, వీరాపుర వీరేగౌడ, మల్లికార్జున, సూళూరు నంజుండి పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణకు రూ.1.5 లక్షల విరాళం

కోలారు: శ్రీ క్షేత్ర ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ తాలూకాలోని మట్నహళ్లిలోని చౌడేశ్వరి ఆలయ జీర్ణోద్ధరణకు రూ.1.5 లక్షలను విరాళంగా అందించారు. సంస్థ జిల్లా డైరెక్టర్ మురళీధర్ శెట్టి మాట్లాడుతూ ధర్మస్థల గ్రామీణాభివృద్ధి పథకం కింద జిల్లాలోని ఆలయాల అభివృద్ధికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. మన సంస్కృతి, పరంపరను కాపాడే ప్రయత్నాన్ని, జిల్లాలో సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను సంస్థ చేస్తోందన్నారు. మహిళా స్వసహాయ సంఘాల ద్వారా కోట్ల రూపాయల రుణాలను అందిస్తోందన్నారు. సంస్థ వేమగల్ యోజనాధికారి అనిల్, ఆలయ కోశాధికారి నారాయణస్వామి, గ్రామప్రముఖుడు మురళి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆకతాయిలపై కేసు



శివమొగ్గ: శివమొగ్గ నగరం తుంగానగర పరిధిలో మద్యం మత్తులో అసభ్యంగా ప్రవరిస్తున్న 18 మంది యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. తుంగా సీఐ రఘువీర్ ఆధ్వర్యంలో గస్తీ తిరుగుతుండగా మద్యం మత్తులో ఆకతాయి పనులు చేస్తున్న యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు.

అవార్డులకు ఎంపిక

మైసూరు: స్పందన సాంస్కృతిక పరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి నాల్వడి కృష్ణరాజ ఒడెయార్ సమాజ సేవా అవార్డుకు ఆరుగురిని ఎంపిక చేసినట్లు పరిషత్ అధ్యక్షుడు టి.సతీష్ జవరెగౌడ తెలిపారు. వివిధ రంగాల్లో సేవలందించిన మండ్యకు చెందిన సీనియర్ రచయిత్రి ఎస్.గుణసాగరి నాగరాజు, బెంగళూరు సమ్మేళన సాంస్కృత వేదిక అధ్యక్షుడు కువర యల్లప్ప, తుమకూరు అక్షయ ఉపాధ్యాయుల మహా విద్యాలయం ప్రాధ్యాపకుడు బీఆర్ రామచంద్రయ్య, బెంగళూరు అహల్యా బాయి హోళ్కర్, మహిళ పత్తి సహకార సంఘం మేనేజర్ కేఆర్ ప్రభావతి, విస్మత విజేత పోటీ మాస పత్రిక ప్రధాన సంపాదకులు హసన్ ఎస్.కె. శివకుమార్ కృష్ణరాజ ఒడెయార్ అవార్డుకు ఎంపిక చేశారు. ఈనెల 7న జరిగే కార్యక్రమంలో విజయనగరంలో ఉన్న జిల్లా సాహిత్య భవనంలో అవార్డుల ప్రదాన కార్యక్రమం ఉంటుంది.

ఓటుహక్కుపై అవగాహన



మైసూరు: టీమ్ మైసూరు బృందం ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఉదయం ఈ బృందం సభ్యులు నగరంలోని కళా మందిరం కుడివైపు నుంచి రైల్వే గేట్ వరకు మొక్కలకు నీటిని పోసి ఓటుహక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు వినియోగం ఆవశ్యత గురించి, ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన అవసరం గురించి వివరించారు.

ఈతకు వెళ్లి రెవెన్యూ ఉద్యోగి మృతి

మైసూరు: నదిలో ఈతకు వెళ్లిన రెవెన్యూ ఉద్యోగి మృతి చెందిన ఘటన కొళ్ళేగాల తాలూకాలోని తలకాడు గ్రామంలో చోటు చేసుకుంది. కొళ్లేగాల తాలూకా తేరంబళ్లి గ్రామానికి చెందిన రెవెన్యూ శాఖ గ్రామ సహాయకుడు మంటెలింగ (35) నీటిలో మునిగి మృతి చెందాడు. ఇతను స్నేహితులతో కలిసి తలకాడుకు వెళ్లి ఆక్కడ కావేరి నదిలో ఈతకు వెళ్లి నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నైజీరియన్ అరెస్ట్



కృష్ణరాజపురం: బెంగళూరు నగరంలో డ్రగ్స్ విక్రయిస్తున్న విదేశీ వ్యక్తిని నగరంలోని కొణనకుంటె పోలీసులు అరెస్ట్ చేశారు. డ్రగ్స్ విక్రయిస్తున్న నైజీరియాకు చెందిన చిక్ బెర్నాడ్ ఒకెగ్వువాను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 100 గ్రాముల నిషేధిత ఎండీఎంఎ క్రిస్టల్ వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీసా ముగిసినా బెంగళూరులోనే ఉంటూ డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు కొణణకుంటె పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- తండ్రి, కుమార్తె దుర్మరణం

దొడ్డబళ్లాపురం: బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో తండ్రి, కుమార్తె మృతి చెందిన సంఘటన మాగడి తాలూకా సాబరపాళ్యలో చోటుచేసుకుంది. యోగేశ్ (47), హర్షిత (14) మృతి చెందిన తండ్రి, కుమార్తె. మృతులు కల్యా గ్రామ నివాసులు. యోగేశ్ కుమార్తెను పాఠశాలకు వదలడానికి బైక్‌పై తీసికెళ్తుండగా మార్గం మధ్యలో సాబరపాళ్య వద్ద కారు ఢీకొంది. మాగడి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

తోరణాల తొలగింపు

యశవంతపుర: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి బీజేపీ మీడియా కేంద్రం వద్ద కట్టిన కేసరి తోరణాలను ఎన్నికల సిబ్బంది తొలగించారు. సోమవారం మల్లేశ్వరంలోని బీజేపీ ఆఫీసు వద్ద ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై బీజేపీ మీడియా కేంద్రాన్ని ప్రారంభించారు. సీఎం వచ్చి వెళ్లిన తక్షణం ఎన్నికల అధికారులు పరిశీలించి తోరణాలను తొలగించారు. మీడియా కేంద్రం వద్ద తోరణాలను తొలగించటం పార్టీ నాయకులకు షాక్‌కు గురి చేసింది.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

మండ్య: స్కూటర్‌ను కారు ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందిన ఘటన మండ్య తాలూకా తూబీనకెరె వద్ద చోటు చేసుకుంది. మృతుడిని తాలూకాలోని నోదెకొప్పలు గ్రామానికి చెందిన చిక్కరెగౌడ (65)గా గుర్తించారు. చిక్కరెగౌడ నోదేకొప్పలు గ్రామం నుంచి స్కూటర్‌లో తూబీనకెరె గ్రామానికి వస్తుండగా కారు ఢీకొంది. దీంతో అతను అక్కడిక్కడే మృతి చెందాడు.

టైర్ పేలి స్కూటర్ పల్టీ

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళా టెక్కీ మృతి
- కెంగేరి నైస్ రోడ్డులో దుర్ఘటన



టెక్కీ సులోచన (ఫైల్)



బనశంకరి: స్కూటర్ టైర్ పేలిపోయి డివైడరును ఢీకొట్టిన ప్రమాదంలో మహిళా టెక్కీ మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కెంగేరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం జరిగింది. డీసీపీ సుమన్ పన్నేకర్ తెలిపిన ప్రకారం వివరాలు... మండ్యకు చెందిన సులోచన (24) పద్మనాభనగర ఇట్టిమడులో నివాసం ఉంటూ కోరమంగలలో ఒక ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఆమె స్నేహితుడు అనంద్‌కుమార్ కూడా ఇదే కంపెనీలో పనిచేస్తుంటాడు. సాయంత్రం 5.30 సమయంలో కోరమంగల నుంచి హోసకెరెహళ్లికి స్కూటర్‌లో సులోచన, అనంద్‌కుమార్ బయలుదేరారు. ఆనంద్‌కుమార్ ఫుల్ హెల్మెట్ ధరించగా, సులోచనా హాఫ్ హెల్మెట్ పెట్టుకుంది. నైస్ రోడ్డులో వెళుతుండగా స్కూటర్ టైర్ పేలిపోవడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఇనుప రైలింగ్‌ను ఢీకొన్నారు.

హాఫ్ హెల్మెట్ వల్ల అధిక గాయాలు

ఈ ప్రమాదంలో ఇద్దరికి తల, శరీర భాగాలకు తీవ్ర గాయాలు తగిలాయి. తీవ్ర రక్తస్రావమై స్పృహ కోల్పోయి పడి ఉండగా ఇతర వాహనదారులు అంబులెన్స్‌ను పిలిపించి ఆసుపత్రికి పంపించారు. సులోచనా తల, మెదడు భాగాల్లో రక్తం గడ్డ కట్టినట్లు వైద్యులు తెలిపారు. చికిత్స పొందుతూ ఆమె సోమవారం ఉదయం కన్నుమూసింది. హాఫ్ హెల్మెట్ వల్ల ఆమె తలకు ఎక్కువ గాయాలు తగిలి మరణానికి దారితీసింది. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. మరో బాధితుడు ఆనంద్ కుమార్ స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సులోచనా మరణవార్త తెలియగానే కుటుంబసభ్యులు రోదనలు మిన్నంటాయి. కెంగేరి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

హాసన్ టికెట్‌పై దేవెగౌడ నిర్ణయమే ఫైనల్

శివాజీనగర: హాసన విధానసభ నియోజకవర్గ జేడీఎస్ అభ్యర్థి ఎంపిక సమస్య ప్రస్తుతానికి పరిష్కరించటానికి సాధ్యపడదు. ఈ నియోజకవర్గంలో అభ్యర్థి ఎంపిక విషయంలో మాజీ ప్రధాని హెచ్.డీ. దేవెగౌడ తీసుకునే తీర్మానమే ఫైనల్ కానుంది. ఆదివారం రాత్రి దేవెగౌడ సమక్షంలో జరిగిన సమావేశంలో కూడా అభ్యర్థి ఎంపిక గురించి ఏకాభిప్రాయ తీర్మానం సాధ్యపడలేదు. మాజీ ముఖ్యమంత్రి హెచ్.డీ.కుమారస్వామి, మాజీ మంత్రి హెచ్.డీ.రేవణ్ణ, భవాని రేవణ్ణతో పాటుగా కుటుంబ సభ్యులు పాల్గొన్న సమావేశంలో హాసన నియోజకవర్గ అభ్యర్థి ఎంపికపై సమాలోచన జరిపారు. అభ్యర్థి ఎంపిక గురించి సభలో ఉన్న అందరూ తమ తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే హెచ్.ఎస్.ప్రకాశ్ కుమారుడు హెచ్.పీ.స్వరూప్‌ను అభ్యర్థిగా ప్రకటిస్తే పార్టీకి జరిగే సాధక, బాధక పరిణామాలపై చర్చించారు. టికెట్ ఆశిస్తున్న భవాని రేవణ్ణకు టికెట్ ఇస్తే విధానసభ ఎన్నికల్లో ఎలాంటి పరిణామాలు జరుగుతాయి, వాటిని ఏ విధంగా ఎదుర్కొవాలి, మూడో అభ్యర్థి పోటీ చేయిస్తే ఎలాగుంటుంది? అనే విషయాలపై కూడా సమాలోచనలు జరిపినట్లు జేడీఎస్ వర్గాలు తెలిపాయి.

నేల, నీరు కోసం పోరాడాలి

బొమ్మనహళ్లి: నగరంలోని హెచ్ఎస్ఆర్ లేఔట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన యువ కర్ణాటక వేదిక సంస్థ ఆఫీసును ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి ప్రారంభించారు. కన్నడ కోసం పోరాటం చేయడంలో సంస్థ సభ్యులు ముందుండాలని సూచించారు. కన్నడకు ఎక్కడ అన్యాయం జరిగినా స్పందించాలని సభ్యులకు తెలిపారు. హెచ్.శ్రీనివాస్ రెడ్డి, రూపేష్ రాజన, మంజు పాల్గొన్నారు.

ఇంటిలో చోరీ

యశవంతపుర: ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగి ఇంటిలో రూ.25 లక్షల విలువైన బంగారు అభరణాలు చోరీకి గురైన ఘటన బెంగళూరు మహాలక్ష్మీ లేఔట్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. యశవంతపుర ఇండస్ట్రియల్ సబర్బన్ వైభవ్ అపార్ట్‌మెంట్‌లో హర్ష వాసుదేవ్ అనే వ్యక్తికి ఒక ఫ్లాట్ ఉంది. అతని తల్లి కళాశాల లెక్చరర్‌గా చేస్తున్నారు. హర్ష కుటుంబ సభ్యులు తిరుపతికి వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా బీరువాలో బంగారు నగలు కనిపించలేదు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సౌండ్ తగ్గించమన్నందుకు దాడి

బనశంకరి: ఇంట్లో పెద్ద శబ్దంతో డీజే మ్యూజిక్ పెట్టుకోవడాన్ని ఆక్షేపించిన వారిపై టెక్కీలు దాడి చేసిన ఘటన హెచ్ఏఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. విజ్ఞాననగరలో ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఆదివారం వేకువజామున పెద్ద సౌండ్‌తో మ్యూజిక్ పెట్టారు. పక్కన ఉంటున్న వారికి ఇబ్బందిగా మారింది. పక్క నివాసంలో ఉంటున్న లాయ్డ్ నహెమియా సౌండ్ తగ్గించాలని విజ్ఞప్తి చేశాడు. పలు మార్లు కోరినా వారు పట్టించుకోలేదు. ఈ క్రమంలో వారి మధ్య గొడవ జరిగింది. టెక్కీలు ఆక్షేపించిన వారిపై దాడికి పాల్పడ్డారు. బాధితులు టెక్కీలపై హెచ్ఏఎల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అద్దె ఇల్లు దొరికిందోచ్ !

బనశంకరి: ఉద్యాననగరిగా, సిలికాన్‌సిటీగా ఖ్యాతి ఘడించిన బెంగళూరులో అద్దె ఇళ్లకు భారీ డిమాండ్ ఉందనేది మరోసారి రుజువైంది. అవును బెంగళూరులాంటి హైటెక్ సిటీలో బడ్జెట్‌కు అనుగుణంగా ఇళ్లు దొరకడం కష్టతరం. దీంతో ఓ వ్యక్తి వెల్ ఫర్నిష్డ్ ఇల్లు దొరికిందనే సంతోషంతో ట్విట్టర్‌లో పెట్టడమే ఆలస్యం అనేక మంది నెటిజన్లు అతడి అదృష్టమంటూ పోస్టు పెట్టారు. పలువురు ఈ విషయానికి సంబంధించి బెంగళూరులో అద్దె ఇళ్లు లభించడం అంత సులభం కాదని అందులోను బ్యాచులర్స్‌కు ఇళ్లు దొరకడం చాలా కష్టమని, జీవితంపై విరక్తి కలుగుతుందని, చివరకు ఫర్నిష్డ్ ఇల్లు లభించడం సంతోషమని మందన్‌గుప్తా అనే వ్యక్తి ట్విట్టర్‌లో పోస్ట్‌పెట్టారు.

మూడు రోజుల వర్ష సూచన

బనశంకరి: రాష్ట్రంలో మరో మూడురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. దక్షిణ ఒళనాడులోని బెంగళూరు గ్రామాంతర, బెంగళూరునగర, చామరాజనగర, కోలారు, రామనగరలో ఉరుములు పిడుగులతో కూడిన వర్షం కురుస్తుందని బెంగళూరులో మబ్బులతో కూడుకున్న వాతావరణం కలిగి సాయంత్రం లేదా రాత్రి సమయంలో వర్షం కురిసే అవకాశం ఉంది. సోమవార నుంచి బుధవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

కలెక్టర్‌కు ఫిర్యాదుల వెల్లువ

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో వివిధ సమస్యలపై 347 ఫిర్యాదులను కలెక్టర్ దీపక్‌జేకబ్ స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో రాజేశ్వరి, వేడియప్పన్ పాల్గొన్నారు.

నేడు మద్యం షాపులు బంద్

మహావీర జయంతి సందర్భంగా నేడు మంగళవారం క్రిష్ణగిరి జిల్లా అంతటా మద్యం అమ్మకాలు బంద్ అని కలెక్టర తెలిపారు. మద్యం విక్రయించేవారిపై కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

బెంగళూరు దక్షిణలో బీసీలకు అవకాశం ఇవ్వండి

బనశంకరి: శాసనసభ ఎన్నికల్లో బెంగళూరు దక్షిణ జిల్లా పరిధిలో 10 నియోజకవర్గాల్లో రెండింటితో వెనుకబడిన 2ఏ వర్గానికి కేటాయించాలని కర్ణాటక రాష్ట్ర వెనుకబడిన వర్గాల ఒక్కూట అధ్యక్షుడు గణేశ్‌సింగ్ బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు నళీన్‌కుమార్‌కటీల్‌కు రాసిన లేఖలో డిమాండ్ చేశారు. రాష్ట్రం మొత్తం జనాబాలో 31.17 శాతం మంది వెనుకబడిన వర్గాలకు చెందినవారు ఉన్నారని తెలిపారు. గత ఏడాది నవంబరులో దావణగెరెలో నిర్వహించిన బీజేపీ వెనుకబడినవర్గాల సమావేశంలో రాష్ట్ర వెనుకబడిన వర్గాల ప్రముఖ నాయకుల్లో ఒకరైన కేఎస్.ఈశ్వరప్ప నేతృత్వంలో ప్రతి లోకసభ నియోజకవర్గంలో కనీసం ఒకరికి వెనుకబడిన వర్గాలకు చెందిన అభ్యర్థిని బీజేపీ నుంచి బరిలోకి దింపాలని అందరి ఆమోదంతో తీసుకున్న నిర్ణయమని గుర్తు చేశారు. చిక్కపేటే, జయనగర, విజయనగర నియోజకవర్గాలకు అభ్యర్థులకు ఎంపిక చేసే సమయంలో ఈ మూడు నియోజకవర్గాల్లో వెనుకబడిన వర్గాలకు చెందిన నేతలకు ప్రాధాన్యత ఇవ్వాలని లేఖలో కోరారు.

మౌలిక వసతులు కల్పించండి



మూకయ్యనకొటాయ్ గ్రామం



గ్రామానికెళ్లే మట్టిరోడ్డు

కెలమంగలం: డెంకణీకోట తాలూకా బెట్టముగిళాలం సమీపంలోని మూకయ్యనకొటాయ్ గ్రామానికి మౌలిక వసతులు కల్పించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న ఈ గ్రామంలో 60కి పైగా కుటుంబాలున్నాయి. సరైన రోడ్డు వసతులు లేకపోవడంతో అత్యవసర సమయాల్లో వెళ్లలేకపోతున్నామని, గ్రామంలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో బయటవెళ్లేందుకు భయంగా ఉందని అన్నారు. గ్రామానికి వసతులు కల్పించాలని పలు సంవత్సరాలుగా ప్రజా ప్రతినిధులను, ప్రభుత్వ అధికారులకు విన్నవిస్తూ వస్తున్నామని, ఇప్పటికైనా స్పందించి గ్రామానికి మౌలిక వసతులు కల్పించాలని మూకయ్యనకొటాయ్ గ్రామస్థులు కోరుతున్నారు.

యువకుడి హత్య

యశవంతపుర: యువకుడిని హత్య చేసి మృతదేహాన్ని రైల్వే పట్టాలపై పడేసిన ఘటన బెంగళూరు కేజీ హళ్లి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. కేజీహళ్లి సమీపంలో గుర్తు తెలియని యువకుడిని హత్య చేసి దుండగులు రైల్వే పట్టాలపై పడేశారు. సోమవారం ఉదయం రోడ్డుపై వెళ్లేవారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

చెక్‌పోస్ట్‌ను ఢీకొన్న కారు

మండ్య: కారు అదుపుతప్పి చెక్‌పోస్టును ఢీకొనడంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడిన ఘటన మండ్య జిల్లా మద్దూరు తాలూకా సరిహద్దు ప్రాంతంలో ఉన్న నిడఘట్ట చెక్‌పోస్ట్ వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగింది. తెల్లవారుజామున సీడీపీఓ ప్రదీప్, మరో అధికారి చేతన్, సహాయకుడు సంతోశ్, ఓ కానిస్టేబుల్ విధుల్లో ఉండగా బెంగళూరు నుంచి వచ్చిన ఓ కారు అదుపుతప్పి చెక్‌పోస్టులో దూరింది. అదృష్టవశాత్తు సిబ్బంది ప్రాణాలతో బయటపడ్డారు.

అంబేడ్కర్ జయంతికి తరలిరండి



బొమ్మనహళ్లి: ఈనెల 14న డాక్టర్. బాబా సాహెబ్ అంబేడ్కర్ 132వ జయంతిని నగరంలోని బొమ్మనహళ్లి విజయా బ్యాంక్ లేఔట్‌లో ఉన్న క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు బొమ్మనహళ్లి ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని హోంగసంద్రలో బొమ్మనహళ్లి ఎస్సీ, ఎస్టీ మోర్చ బీజేపీ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ...సమ సమాజ స్థాపనకు కృషి చేసిన అంబేడ్కర్ అంటే ప్రతి ఒక్కరికి దైవంతో సమానమని అన్నారు. సమావేశంలో ఎస్సీ మోర్చ అధ్యక్షుడు వెంకటా చలపతి, బీజేపీ రాష్ట్ర మాజీ ఎస్సీ మోర్చ కార్యదర్శి బీఎం రమేశ్, తళిత నాయకుడు సునందప్ప, అరికెరెవార్డు బీజేపీ అధ్యక్షుడు మంజునాథ్, బొమ్మనహళ్లి నగర సభ మాజీ ఉపాధ్యక్షుడు మునిరాజు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



బొమ్మనహళ్లి: ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ ఎన్నికల్లో బీటీఎం లేఔట్‌తో పాటు జయనగరను కూడా కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని బీటీఎం లేఔట్ సీనియర్ కాంగ్రెస్‌నాయకుడు బీ.మోహన్ అన్నారు. ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కోరమంగళలో ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ...సీఎల్‌పీ నేత సిద్దరామయ్య, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, త్వరలో డబల్ ఇంజిన్ ప్రభుత్వం పడిపోతుందని అన్నారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, మూడుసార్లు మంత్రిగా చేసిన రామలింగారెడ్డి, జయనగరలో సౌమ్యారెడ్డి కూడా విజయం సాధిస్తారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆడుగోడి కార్పొరేటర్ మంజుల సంపత్, మునిరాజు, మంజునాథ్, సంపత్‌కుమార్, కన్నడ నటి రత్నమాల, కవితా, మదికుమార్ సింగ్, జీ.మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ ప్రలోభాలకు కళ్లెం



మాట్లాడుతున్న నగర జిల్లా ఎన్నికల అధికారి, బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్

బనశంకరి: డిజిటల్ ప్రలోభాలకు గురిచేసే వారిపై నిఘా పెడతామని నగర జిల్లా ఎన్నికల అధికారి, బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ తెలిపారు. సోమవారం ఆయన నగరంలో విలేకరులతో మాట్లాడుతూ.. రోడ్డు మార్గంలో నగదు తరలించడం పాత పద్ధతి కావడంతో రాజకీయ నేతలు కూడా ప్రస్తుతం కొత్తదారులు వెతుకుతున్నారని గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం, ఆర్‌టీజీఎస్, ఐఎంపీఎస్‌తో పాటు అనేక డిజిటల్ విధానాల్లో నగదు పంపించడం ప్రారంభించారని, దీనిపై కూడా ఎన్నికల కమిషన్ నిఘా పెట్టిందన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తుషార్ హెచ్చరించారు. బీబీఎంపీ కమిషనర్, పోలీస్ కమిషనర్, రెవెన్యూ, ఐటీ, జీఎస్‌టీ, ఆర్‌బీఐ, ఎక్సైజ్ అధికారులతో కూడిన టీమ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆన్‌లైన్ లావాదేవీలపై నిఘా పెట్టడానికి అవసరమైన ఏర్పాట్లు చేశామని అంతేగాక ఈ బృందాలు ఐటీ సభ్యులు ఇప్పటికే అనుమానాస్పద హవాలా వ్యక్తులపై నిఘా పెట్టారని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగానే నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల్లో భారీగా నగదు పట్టుబడుతోందన్నారు. కానీ ఎవరి కంటికి కనబడకుండా ఆన్‌లైన్‌లో నగదు తరలించడానికి చిన్నపాటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని వీటిని కూడా అధిగమించడానికి రాజకీయనేతలు విజయవంతమయ్యారని, దీనిపై ప్రత్యేక బృందం నిఘా పెడుతుందని తుషార్ తెలిపారు.

హోసూరు వార్తలు..

ప్రజా సమస్యలపై ఆందోళన



హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని 45 వార్డుల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సోమవారం ఉదయం విడుదల చిరుతపార్టీ కార్యకర్తలు సిటీ కార్పొరేషన్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. పట్టణ కార్యదర్శి మునిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణంలోని హోసూరు- క్రిష్ణగిరి జాతీయ రహదారి బండాంజనేయస్వామి ఆలయం వద్ద వర్షపునీరు, మురుగునీరు నిలిచి ఉందని, ఈ నీరు బయటకు పంపే ఏర్పాట్లు చేయాలని, కార్పొరేషన్ పరిధిలో పోరంబోకు స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసముంటున్న పేదలకు పట్టాలందజేయాలని కోరారు. అనాథలకు, భర్త వదలిన మహిళలకు, భర్తను కోల్పోయిన మహిళలకు పెన్షన్ అందజేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో సంబంధిత శాఖాధికార్లకు వినతి పత్రం అందజేశారు.

ఉరి వేసుకొని బాలిక ఆత్మహత్య

క్రిష్ణగిరి: కడుపునొప్పి తాళలేక ఉరి వేసుకొని బాలిక ఆత్మహత్య చేసుకొన్న ఘటన నాగరసంబట్టి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... క్రిష్ణగిరి జిల్లా నాగరసంబట్టి ప్రాంతానికి చెందిన మురుగేషన్ కూతురు హిందూప్రియ (14) కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంది. ఫలితం కనిపించకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన బాలిక ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. నాగరసంబట్టి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని స్వాధీనం చేసుకుని క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

దాడి కేసులో యువతి అరెస్ట్

కెలమంగలం: ఆస్తి తగాదాల్లో మహిళపై దాడి చేసిన యువతిని డెంకణీకోట పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... డెంకణీకోట తాలూకా శాలివారం సమీపంలోని ఒమ్మండపల్లి గ్రామానికి చెందిన నాగరాజ్ భార్య క్రిష్ణమ్మ, అదే ప్రాంతానికి చెందిన కావేరి మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఆదివారం సాయంత్రం వారి మధ్య గొడవ జరిగింది. ఆగ్రహంతో కావేరి క్రిష్ణమ్మపై కత్తితో దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన క్రిష్ణమ్మను డెంకణీకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

దక్షిణపెన్నాలో శవం లభ్యం

క్రిష్ణగిరి: దక్షిణపెన్నానదిలో గుర్తు తెలియని వ్యక్తి శవాన్ని ఊత్తంగేరి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు... క్రిష్ణగిరి జిల్లా ఊత్తంగేరి సమీపంలోని హనుమాన్‌తీర్థం వద్ద దక్షిణ పెన్నానది వంతెన అడుగుభాగంలో ఓ వ్యక్తి శవం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం రావడంతో ఊత్తంగేరి పోలీసులు అగ్నిమాపక సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని నదిలో కొట్టుకెళ్తున్న శవాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా బ్రహ్మారథోత్సవం





విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి మూలవిరాట్, రథాన్ని లాగుతున్న భక్తులు

క్రిష్ణగిరి: సూళగిరి తాలూకా కామనదొడ్డి సమీపంలో దక్షిణ తిరుపతిగా పేరుగాంచిన గోపసంద్రం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ రథోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. రథోత్సవ సందర్భంగా రెండు రోజులుగా ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సోమవారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటరమణ స్వామి మూల విరాట్‌ను అభిషేకించి విశేషంగా అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తిని అలంకరించి రథంపై ఉంచి ఊరేగించారు. రథోత్సవ కార్యక్రమంలో సూళగిరి, హోసూరు, బాగలూరు, బేరికె, క్రిష్ణగిరి, రాయకోట, కెలమంగలం, ఉద్దనపల్లి తదితర ప్రాంతీయులే కాక కర్ణాటక, ఆంధ్ర తదితర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొని రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వివిధ స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమాధిపతులు భక్తులకు అన్నదానం, చల్లటి పానీయాలను అందజేశారు. మంగళవారం పల్లకీ ఉత్సవాలు జరుగుతాయి.

పంచాయతీలకు ట్రాక్టర్ల పంపిణీ



ట్రాక్టర్‌లను అందజేస్తున్న దృశ్యం

క్రిష్ణగిరి: సూళగిరి యూనియన్‌లో పారిశుధ్య పనుల వినియోగం కోసం మూడు ట్రాక్టర్‌లను యూనియన్ చైర్‌పర్సన్ లావణ్యమధు సోమవారం అందజేశారు. సూళగిరి సమితిలోని పేరండపల్లి, సూళగిరి, బేరికె ప్రాంతాల్లో చెత్తను తొలగించేందుకు ట్రాక్టర్‌ల అవసరం ఉందని స్థానిక ప్రజలు కోరారు. ప్రభుత్వం ద్వారా సూళగిరి బీడీవో కార్యాలయానికి చేరిన ట్రాక్టర్‌లను గ్రామపంచాయతీలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీడీవోలు గోపాలక్రిష్ణన్, విమల్‌రవికుమార్, నాగేష్, భాగ్యరాజ్, రాజారాం, మంజుల, కలైసెల్వి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఒక్కటైన ప్రేమజంట



పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

హోసూరు: తల్లిదండ్రులు, బంధువుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ఓ ప్రేమ జంట మత్తిగిరి పోలీసులను ఆశ్రయించింది. వివరాల మేరకు డెంకణీకోట తాలూకా కొరటగిరి గ్రామానికి చెందిన మంజునాథ్ (23), హోసూరువాసి వెన్నరసి (22) ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ ప్రేమించుకొన్నారు. తమ ప్రేమను వెన్నరసి తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో సోమవారం మత్తిగిరి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు వెన్నరసి తల్లిదండ్రులతో చర్చించి వారి పెళ్లికి అభ్యంతరం లేదని తీర్మానించారు. దీంతో ప్రేమజంట కొరటగిరి సమీపంలోని శ్రీ మదనగిరి మునేశ్వరస్వామి ఆలయంలో పెళ్లి చేసుకొన్నారు.

డీఎంకే పార్టీ సభ్యత్వ నమోదు



కెలమంగలం: డీఎంకే పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాలను సోమవారం డెంకణీకోట తళిలో నిర్వహించారు. డీఎంకే పార్టీ తళి యూనియన్ కార్యదర్శి, తళి యూనియన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్ ముఖ్య అతిథులుగా పాల్గొని సభ్యత్వ నమోదు పత్రాలను అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, పార్టీ బలోపేతానికి ఎక్కువ మంది సభ్యులను చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంకే నాయకులు దివాకర్, రాజన్న, శ్రీధర్, ఎల్లోరా మణి, చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

25 శాతం కోటా సీట్ల ఫీజులపై తీర్పు వాయిదా

సాక్షి, అమరావతి: విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం కోటా కింద ఉచిత సీట్లు పొందే పిల్లల తల్లిదండ్రులు అమ్మ ఒడి పథకం చెల్లించే మొత్తం నుంచే ఫీజులు చెల్లించుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో 24ను సవాల్ చేస్తూ ఇండిపెండెంట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఐఎస్ఎంఏ) అధ్యక్షుడు కోగంటి శ్రీకాంత్, యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ ఫెడరేషన్ (యుపీఈఐఎఫ్) చైర్మన్ గొల్లపూడి మోహనరావు తదితరులు దాఖలు చేసిన వ్యాజ్యాలపై సోమవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. దీనిపై తీర్పును వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ ప్రకటించారు. అంతకుముందు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు బి.ఆదినారాయణరావు, వేదుల వెంకటరమణ వాదనలు వినిపిస్తూ.. 25 శాతం కోటా కింద భర్తీ చేసే సీట్ల ఫీజులను తల్లుల ఖాతాల్లో కాకుండా నేరుగా పాఠశాలలకు చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. 25 శాతం కోటా సీట్ల ఫీజులను ప్రభుత్వం సరైన రీతిలో నిర్ణయించలేదన్నారు. చట్ట ప్రకారం విద్యాశాఖ అధికారులు, ఎన్‌జీవోలు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల ప్రతినిధులు కలిసి ఫీజులు నిర్ణయించాల్సి ఉందన్నారు. అయితే, అందుకు విరుద్ధంగా ప్రభుత్వమే ఏకపక్షంగా ఫీజులు ఖరారు చేసిందని వివరించారు.

చట్ట ప్రకారమే చేశాం

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. 25 శాతం సీట్ల భర్తీకి సంబంధించిన ఉత్తర్వులు విద్యాహక్కు చట్ట నిబంధనలను అనుసరించే ఇచ్చామన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రభుత్వం సగటున రూ.7 వేలు ఖర్చు చేస్తోందన్నారు. ప్రభుత్వం అన్నీ అంశాలను పరిగణనలోకి తీసుకున్న తరువాతే ఫీజులను ఖరారు చేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో భర్తీ అయిన తరువాతే ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను భర్తీ చేయాలన్న ప్రైవేట్ యాజమాన్యాల వాదన ఎంతమాత్రం సరికాదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

ఎయిమ్స్ వైద్యులకు కేంద్ర మంత్రి అభినందనలు

సాక్షి, అమరావతి: మంగళగిరి ఎయిమ్స్‌లో అవుట్ పేషెంట్(ఓపీ) సేవలు 10 లక్షలు దాటిన సందర్భంగా వైద్యులు, సిబ్బందికి కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ మన్సుక్ మాండవీయా సోమవారం ట్విట్టర్ వేదికగా అభినందనలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో వైద్యులు, సిబ్బంది సమాజానికి, దేశానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. 2019 మార్చిలో ఎయిమ్స్‌లో వైద్య సేవలు ప్రారంభించారు. ఓపీ సేవలు సోమవారం 10 లక్షల మైలురాయిని దాటాయి. ఈ అంశంపై ఎయిమ్స్ మంగళగిరి తన ట్విట్టర్ ఖాతాలో ట్వీట్ చేసింది. ఆ ట్వీట్‌ను ట్యాగ్ చేస్తూ కేంద్ర మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.

పెట్టుబడుల ప్రోత్సాహక విధానం బాగుంది

జపాన్ పారిశ్రామికవేత్తల బృందం ప్రశంస



సచివాలయంలో పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కలిసిన జపాన్‌కాన్సుల్ జనరల్ తగ మసయుకి నేతృత్వంలోని జపాన్ ప్రతినిధుల బృందం

సాక్షి, అమరావతి: ఏపీలోని పెట్టుబడుల ప్రోత్సాహక విధానం బాగుందని జపాన్ పారిశ్రామికవేత్తల బృందం కొనియాడింది. జపాన్ కాన్సుల్ జనరల్(చెన్నై) తగ మసయుకి నేతృత్వంలోని ఆ దేశ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ప్రతినిధుల బృందం సోమవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను, ఏపీఐఐసీ ఉన్నతాధికారి సృజనను కలిసింది. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రోత్సాహకానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విధానాలను వివరించారు. జపాన్‌కు చెందిన పలు దిగ్గజ కంపెనీలు ఇప్పటికే ఏపీలో భారీగా పెట్టుబడులు పెట్టాయని వివరించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని మంత్రి కోరారు. సమావేశంలో జపాన్‌కు చెందిన ఇసుజు, యూనిచార్మ్, కొబెల్కో, వన్‌స్టీల్ ప్లేట్, పియోలాక్స్, మియామా ఎలక్ట్రిక్, ఎంయూఎఫ్‌జీ బ్యాంక్ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎస్‌తోనూ భేటీ..

జపాన్ కాన్సుల్ జనరల్(చెన్నై) తగ మసయుకి సోమవారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరూ ఏపీకి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో జపాన్ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

24 గంటల్లో ఆరోపణలు నిరూపించండి

ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా

- నిరూపించలేకపోతే రాజకీయాల నుంచి తప్పుకోండి
- చంద్రబాబు, లోకేశ్‌లకు ఎమ్మెల్యే కేతిరెడ్డి కౌంటర్
- రైతుల నుంచి కొన్న భూమిలోనే ఇల్లు కట్టుకొన్నానని వెల్లడి
- తనది బాబు నివాసంలా అక్రమ కట్టడం కాదని స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: తనపై చేసిన ఆరోపణలు 24 గంటల్లో నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, నిరూపించకపోతే చంద్రబాబు, లోకేశ్ రాజకీయాల నుంచి తప్పుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఛాలెంజ్ చేశారు. ధర్మవరంలో పాదయాత్రలో భాగంగా లోకేశ్ డ్రోన్ కెమెరా ద్వారా వీడియో తీసి, 902, 904 సర్వే నంబర్లలో చెరువు వెనక భాగంలో భూమిని ఎమ్మెల్యే కేతిరెడ్డి కబ్జా చేసి అక్రమంగా ఫామ్ హౌస్ కట్టారని ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే కేతిరెడ్డి సోమవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు కరకట్ట నివాసమే అక్రమ కట్టడమని, తనది కాదని చెప్పారు. కరకట్టపై అక్రమంగా చంద్రబాబు నివాసం ఉంటున్న ఇంటి వద్దకు వెళ్లి అక్కడి నుంచే చంద్రబాబు, లోకేశ్‌లను సవాల్ చేస్తూ ఒక వీడియో కూడా విడుదల చేశారు. తాను రైతుల వద్ద భూమి కొనుక్కుని ఇల్లు నిర్మించుకున్నానని స్పష్టం చేశారు. చంద్రబాబులా రైతులను బెదిరించి భూములు లాక్కోలేదని, అక్రమ నిర్మాణంలో నివసించట్లేదని కౌంటర్ ఇచ్చారు. '902 సర్వే నంబర్‌తో నాకు సంబంధం లేదు. అది ఎక్కడ ఉందో తెలియదు. 904, 5, 8, 9 సర్వే నంబర్లలోని భూమిని రైతుల వద్ద కొన్నాం. వారు వీడియో తీసేంత వరకు ఆ ప్రాంతం ఇంత అందంగా ఉందని నాకు తెలియదు. ప్రతి నియోజకవర్గంలో గొడవలు సృష్టించేలా లోకేశ్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. లారీలన్నీ బెంగళూరు వెళ్తున్నాయని, పునరావాసంలో డబ్బులు తీసుకున్నానని ఆరోపించారు. నిరూపిస్తాం రాజీనామా చేస్తావా అని ఆయన సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. దాన్ని స్వీకరిస్తున్నా. అందుకే నేను కరకట్ట వద్దకు వెళ్లాను. నేను కూడా సెల్ఫీ ఛాలెంజ్ చేస్తున్నా. కృష్ణా నది లోపల బాబు నివాసం కట్టుకున్నారు. కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. ఆధారాలు చూపిస్తాను. ధర్మవరంలో మా ఫామ్‌హౌస్‌కి పేపర్లు ఉన్నాయి. చంద్రబాబు నివాసానికి హక్కు పత్రాలు చూపాలి. చట్టంలోని లొసుగుల వల్ల చంద్రబాబు నెగ్గుకొస్తున్నారు. 12 కేసులు ఉంటేనే రండని లోకేశ్ కార్యకర్తలకు చెబుతున్నారు. యువతని బాగా చదవాలని, ఉద్యోగం ఇస్తామని చెప్పాలి కానీ.., కొట్టుకొని, చంపుకుని కేసులు పెట్టుకుని రావాలని యువతను రెచ్చగొట్టడం ఇదేమి సంస్కృతి? వైఎస్సార్‌సీపీ నేతలు తిరిగి తిడితే చంద్రబాబు, లోకేశ్ బాత్ రూమ్‌లో కూర్చొని ఏడుస్తారు' అని అన్నారు.

మద్య నిషేధంపై మాట్లాడే అర్హత రామోజీకి, బాబుకు లేదు

- డిప్యూటీ సీఎం నారాయణ స్వామి

సాక్షి, అమరావతి: మద్య నిషేధం గురించి మాట్లాడే అర్హత ఈనాడు రామోజీరావుకి, చంద్రబాబుకు లేదని డిప్యూటీ సీఎం, ఎక్సైజ్ శాఖ మంత్రి నారాయణ స్వామి ధ్వజమెత్తారు. మనషుల రక్త మాంసాలతో వ్యాపారం చేసే అలవాటు రామోజీరావు ఆయన కుటుంబీకులదేనని మండిపడ్డారు. సోమవారం ఆయన సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. అధికారం అండతో పేదలు నివాసం ఉండే ప్రాంతాలను సొంతం చేసుకొని ఫిల్మ్ సిటీ నిర్మించిన దుర్మార్గుడు రామోజీ అని దుయ్యబట్టారు. పచ్చళ్లు అమ్ముకొనే రామోజీరావు ఈనాడు, ఈటీవీ పెట్టి కోటాను కోట్ల డబ్బు ఎలా సంపాదించిందీ అందరికీ తెలుసన్నారు. మద్య నిషేధం ప్రకటించాలని వార్తలు రాసింది, మళ్లీ నిషేధం ఎత్తేయాలని వార్తలు రాసిందీ రామోజీ రావేనని, ఆయన నైజం ఎవరికి తెలియదని అన్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్‌లోని అక్రమాలు వెలికితీస్తుంటే తట్టుకోలేక ప్రభుత్వంపై రోజుకో కథనం వండి వార్చుతున్నారని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మార్చి, బెల్టు షాపులు తెరిచి ప్రజల రక్త మాంసాలతో వ్యాపారం చేసినప్పుడు రామోజీరావు ఏమయ్యారని ప్రశ్నించారు. సీఎం జగన్‌ను దించి వెంటనే చంద్రబాబును సీఎం పీఠంపైకి తేవాలన్నదే రామోజీ ఆలోచన అని అన్నారు. చంద్రబాబు, రామోజీ, రాధాకృష్ణ ఏనాడైనా పేదల కోసం ఆలోచించారా అని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు దొరికినా ఈనాడులో ఏనాడైనా రాశాడా అని నిలదీశారు. సీఎం వైఎస్ జగన్ పార్టీ రహితంగా అందరికీ ఇంటింటికీ పథకాలు అందిస్తున్నారని, వాటి గురించి ఏనాడూ రాయరని నారాయణస్వామి అన్నారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

- గోదావరి జలాలు కాలుష్యరహితం
- రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయి రెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: గోదావరి నదీజలాల్లో కాలుష్యం లేదని కేంద్ర జలశక్తిశాఖ సహాయమంత్రి బిశ్వేశ్వర్ తుడు చెప్పారు. దేశంలోని కలుషిత నదీ భాగాలను గుర్తిస్తూ 2018 సెప్టెంబర్‌లో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) విడుదల చేసిన నివేదిక ప్రకారం రాయనపేట నుంచి రాజమహేంద్రవరం వరకు గోదావరి నదీ జలాలు కలుషితం అయినట్లు గుర్తించినప్పటికీ నవంబర్ 2022 నివేదికలో ఆ జాబితా నుంచి గోదావరిని తొలగించినట్లు తెలిపారు. రాజ్యసభలో సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. రాజమహేంద్రవరం వద్ద గోదావరి జలాల్లో కాలుష్య నిర్మూలన, నదీజలాల సంరక్షణ కోసం నేషనల్ రివర్ కన్జర్వేషన్ ప్లాన్ (ఎన్ఆర్‌సీపీ) కింద రూ.110.22 కోట్లు మంజూరు చేశామన్నారు. గోదావరి జలాల్లో కాలుష్య నిర్మూలన కోసం రాజమహేంద్రవరం సమీపంలోని హుకుంపేట వద్ద రోజుకు 30 మిలియన్ లీటర్లు శుద్ధిచేసే సామర్థ్యంతో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణంతోపాటు ఇతర చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 2022 మార్చిలో గోదావరి నదీజలాల సంరక్షణ, కాలుష్య నిర్మూలన కోసం ఎన్ఆర్‌సీపీ కింద హుకుంపేట వద్ద అదనంగా రోజుకు 50 మిలియన్ లీటర్ల సామర్థ్యంగల మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణానికి రూ.88.43 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. 2025 మార్చి నాటికి దీని నిర్మాణం పూర్తికావాల్సి ఉందన్నారు. నమామి గంగే మాదిరిగా నమామి గోదావరి ప్రాజెక్టు ప్రారంభించే యోచన లేదని మంత్రి స్పష్టం చేశారు.

ఏపీలో వరద నివారణకు చర్యలు

రాష్ట్రంలో వరద నివారణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కేంద్ర జలశక్తిశాఖ సహాయమంత్రి బిశ్వేశ్వర్ తుడు తెలిపారు. వరద ఉధృతికి అనుగుణంగా ఆకస్మిక ప్రణాళికలతో ఉపశమన చర్యలు చేపడుతోందని వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు ప్రశ్నకు జవాబిచ్చారు. నదుల ఒడ్డును వరద ప్రమాణాలకు అనుగుణంగా పెంచుతోందన్నారు. కృష్ణానది ఎడమవైపు వరద రక్షణ గోడ నిర్మాణం చేపడుతోందని, కొండవీటి వాగు నుంచి ఐదువేల క్యూసెక్కుల వరద నీటిని ప్రకాశం బ్యారేజీ ఎగువ కృష్ణానదికి ఎత్తిపోయడానికి రూ.260.48 కోట్లతో నీటి పంపింగ్ పథకం ప్రారంభించిందని వివరించారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని వరద పీడిత ప్రాంతాలను రక్షించడానికి పెన్నానదికి ఎడమ వైపు రక్షణ గోడ నిర్మాణ కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. ఆనకట్టలు, బ్యారేజీలు, కాలువలు, డీసిల్టింగ్ బేసిన్లు తదితరాలపై వార్షిక నిర్వహణ చేపడుతోందని చెప్పారు. వరదల సమాచారం నిమిత్తం రాష్ట్రంలో 10 లెవెల్ ఫోర్‌కాస్ట్, 10 ఇన్‌ఫ్లో ఫోర్‌కాస్ట్ కేంద్రాలున్నాయని తెలిపారు.

లోక్‌సభ

చింతకుంట రాక్ పెయింటింగ్స్ గుర్తించాం

వైఎస్సార్ జిల్లాలోని చింతకుంటలో రాక్ పెయింటింగ్స్‌తో కూడిన రాక్ షెల్టర్లను జాతీయ ప్రాముఖ్యత కలిగిన స్మారకచిహ్నంగా ప్రకటించడానికి గుర్తించినట్లు కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. లోక్‌సభలో సోమవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ బాలశౌరి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. మధ్య శిలాయుగం నుంచి చారిత్రక కాలం వరకు సమాచారంతో ఉన్న రాక్ పెయింటింగ్స్‌తో విస్తరించిన రాక్ షెల్టర్లను రక్షణ నిమిత్తం గుర్తించినట్లు వివరించారు. సంబంధిత ప్రక్రియను అనుసరించి స్మారక చిహ్నంగా ప్రకటిస్తామన్నారు.

ట్రైఫెడ్‌లో 93 మంది ఉత్పత్తిదారులు

ట్రైబల్ కో–ఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ట్రైఫెడ్)లో ఏపీకి చెందిన 93 మంది ఉత్పత్తిదారులు ఎంప్యానెల్ అయినట్లు కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ సహాయమంత్రి రేణుకసింగ్ సరూతా తెలిపారు. ఏపీలో రెండు ఔట్‌లెట్లు కూడా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ ఎంపీలు గోరంట్ల మాధవ్, సంజీవ్‌కుమార్ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

వాల్మీకిబోయలను ఎస్టీల్లో చేర్చాలని ఏపీ ప్రతిపాదించింది

వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ప్రతిపాదన వచ్చిందని కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ సహాయమంత్రి బిశ్వేశ్వర్ తుడు తెలిపారు. ఈ ప్రతిపాదన పరిశీలనలో ఉందని, కురుబలను ఎస్టీల్లో చేర్చాలని ఏ రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతం నుంచి ప్రతిపాదన రాలేదని వైఎస్సార్‌సీపీ ఎంపీ గొడ్డేటి మాధవి ప్రశ్నకు జవాబిచ్చారు.

ఏపీలో 2,254 ప్రైవేటు కళాశాలలు

ఆంధ్రప్రదేశ్‌లో 2,254 ప్రైవేటు (ఎయిడెడ్, అన్ఎయిడెడ్) కళాశాలలున్నాయని కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి సుభాష్ సర్కార్.. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఈ వేసవి మరింత చల్లగా..

- విశాఖ జూలో ప్రత్యేక ఏర్పాట్లు
- చల్లదనంతోపాటు ఆహార నియమాలు
- కంటికి రెప్పలా వన్యప్రాణుల సంరక్షణ

ఆరిలోవ (విశాఖ తూర్పు): ఎండలు తీవ్ర రూపం దాల్చాయి. జూ పార్కులో వన్యప్రాణులు విలవిల్లాడుతున్నాయి. వన్యప్రాణులతో పాటు సందర్శకులకు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేలా జూ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత నుంచి మూగ జీవాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నీడ, చల్లదనం కల్పిస్తున్నారు. వాటికి తాగడానికి నీటిని అందిస్తున్నారు. ఆహారం విషయంలో మార్పులు చేస్తున్నారు. ఆరోగ్యంలో మరింత జాగ్రతలు తీసుకొంటున్నారు. జూలో జింకలు, కనుజులు, కోతులు, పులులు, ఎలుగుబంట్లు, సింహాలు, చింపాంజీలు ఎన్‌క్లోజర్లలో తాటాకులు వేస్తున్నారు. ఇప్పటికే వీటి ఎన్‌క్లోజర్లలో స్ప్రింకర్లు అమర్చారు. ఏనుగుల ఎన్‌క్లోజర్‌లో గతంలో వేసిన ఎత్తయిన తాటాకుల పందిరికి మరమ్మతులు చేపట్టి కొత్తగా అవసరమైన చోట్ల కొమ్మలు అమర్చారు. అన్ని వన్యప్రాణుల ఎన్‌క్లోజర్లలో ఉండే నైట్‌క్రాల్స్‌పై చల్లదనం కోసం వైట్ వాష్ వేస్తున్నారు. వాటికి కావాల్సినంత నీటిని అందుబాటులో ఉంచారు. ప్రతి ఎన్‌క్లోజర్‌లోకి పైపుల ద్వారా బోరు, కుళాయి ద్వారా నీటిని అందిస్తున్నారు. వన్యప్రాణులు నీరసించిపోకుండా ఉండడానికి పాలిబియాన్, గ్లూకోజ్ పౌడర్‌ను నీటిలో కలిపి అందిస్తున్నారు. చింపాంజీలకు కొబ్బరి బొండాల నీరు తాగిస్తున్నారు. పక్షుల ఎన్‌క్లోజర్లలో వట్టివేళ్ల చాపలు వేశారు. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం పక్షులను నీటితో తడుపుతున్నారు.

ఏనుగులు, చింపాంజీలకు ప్రత్యేక చర్యలు

ఏనుగులు, చింపాంజీలకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఏనుగులకు అధికంగా నీరు అవసరం. వాటికి రోజూ స్నానం కోసం, తాగడానికి ఎక్కువ నీరు అవసరమవుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని నాలుగేళ్ల క్రితమే ఏనుగుల మోటలో నీటి తొట్టె నిర్మించారు. ఆ తొట్టెలో అవి స్నానం చేయడానికి వీలుగా ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా 10వేల లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి ట్యాంకు ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఇక్కడ ఉన్న రెండు చింపాంజీలకు వాటి నైట్‌క్రాల్స్‌లో చల్లదనం కోసం కూలర్లు ఏర్పాటు చేశారు. వాటికి ప్రత్యేకంగా కొబ్బరి బొండాల నీరు, పాలిబియాన్, గ్లూకోజ్ నీరు వేర్వేరు సమయాలలో అందిస్తున్నారు.



పక్షుల జోన్‌లో గూళ్లపై వేసిన కస్‌కస్ చాపలు

సందర్శకులకు కోసం

జూకు వచ్చే సందర్శకుల కోసం ఇక్కడ ఆరు చోట్ల ఆర్వో ప్లాంట్లు అందుబాటులో ఉన్నాయి. ముఖం, చేతులు శుభ్రం చేసుకోవడానికి పలుచోట్ల నీటి ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. ఎక్కువచోట్ల సందర్శకులు విశ్రాంతి కోసం ఏనుగులు, పులులు, ఎలుగుబంట్లు, జింకలు, కణుజులు, జిరాఫీలు ఎన్‌క్లోజర్ల వద్ద, పక్షులు, పాములు, కోతులు జోన్ల వద్ద షెడ్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిని శుభ్రం చేయించారు. మూడు రోజుల క్రితం ఇక్కడ సందర్శకులు కోసం డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ విశాఖ అధికారులు స్వచ్ఛతా హై సేవా కార్యక్రమంలో భాగంగా జూలో కణుజుల ఎన్‌క్లోజర్ ఎదురుగా ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు.

అన్ని ఎన్‌క్లోజర్లలోనూ సౌకర్యాలు

జూలో అన్ని ఎన్‌క్లోజర్లలోనూ సౌకర్యాలు కల్పించాం. ఇక్కడ 90 రకాల జాతులకు వన్యప్రాణులున్నాయి. అవి ఉండే ఎన్‌క్లోజర్లలో వేసవి చర్యలు చేపడుతున్నాం. వన్యప్రాణులకు రోజూ ఇచ్చే ఆహారంలో మార్పులు చేస్తున్నాం. నీరు అధికంగా సరఫరా చేయడం, తాగు నీటిలో శక్తి కోసం గ్లూకోజ్, ఎలక్ట్రోలైట్స్, పాలిబియాన్ పౌడర్ కలిపి ఇస్తున్నాం. రోజు మాదిరిగా ఇచ్చినదానికంటే నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయాలు ఎక్కువగా అందిస్తున్నాం. జూకు వచ్చే సందర్శకుల కోసం ఇక్కడ ఆరు చోట్ల ఆర్వో ప్లాంట్లు, పలుచోట్ల నీటి ట్యాప్‌లు, విశ్రాంతి కోసం శుభ్రం చేయించిన షెడ్‌లు అందుబాటులో ఉంచాం.

–అనంత్ శంకర్, ఇన్‌చార్జి క్యూరేటర్, జూ పార్కు



కట్టుంగలో.. భూముల కనికట్టు

- ఆంజనేయ స్వామి సాక్షిగా అక్రమార్కుల భూమాయ
- టీడీపీ హయంలో రైతులకు ధారాదత్తం
- మళ్లీ అవే భూములకు వేలం
- దీనిపై వివాదం
- రీసర్వే చేయాలని ఈఓ దరఖాస్తు



కట్టుంగ ఆంజనేయస్వామి ఆలయం

ఆత్రేయపురం: అలనాడు లంకలో రావణాసురుడి చెరలో ఉన్న సీతమ్మ జాడ కనిపెట్టిన ఆంజనేయ స్వామి.. తన భూములను కాపాడుకోవడానికి ఆపసోపాలు పడుతున్నాడు. కోరిన కోర్కెలు తీర్చే కొండంత దేవుడు కట్టుంగ ఆంజనేయ స్వామి ఆలయ భూములు అక్రమార్కుల చెరలో చిక్కుకున్నాయి. ప్రస్తుతం ఈ భూములు కోర్టు వివాదంలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం భూముల రీసర్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఈ నేపథ్యంలో కట్టుంగ ఆంజనేయ స్వామి ఆలయ భూములపై పక్కాగా రీసర్వే చేసి తమకు టైటిల్ ఇవ్వాల్సిందిగా ప్రస్తుత కార్యనిర్వహణాధికారి (ఈఓ) బి.కృష్ణచైతన్య రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేశారు. ఈ నేపథ్యంలో ఈ భూముల కబ్జా పర్వం మరోసారి చర్చనీయాంశమైంది.

వేలంలో దక్కినా.. దక్కని భూములు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కట్టుంగ గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామి వారికి వివిధ ప్రాంతాల్లో భూములున్నాయి. వీటికి దశాబ్దాల కాలంగా కౌలు వేలం నిర్వహించలేదు. నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది రైతులకు వీటిని అప్పగించారు. దీనిపై గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో 2015లో నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 26.46 ఎకరాల భూములకు అప్పటి దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.భ్రమరాంబ ఆధ్వర్యాన నాటి అధికారులు ఆలయ ప్రాంగణంలో మూడేళ్ల కాలానికి బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయ భూములు కావడంతో అధిక సంఖ్యలో పాటదారులు వేలంలో పాల్గొన్నారు. లొల్ల గ్రామంలో సర్వే నంబర్ 32/1లో 2.76 ఎకరాలు, 86/2లో 0.32 ఎకరాలు, 86/3లో 0.30 ఎకరాలు, 164/9లో 0.33 ఎకరాలు, 164/10బిలో 4.06 ఎకరాలు, 18/4లో 2.03 ఎకరాలు; కట్టుంగ గ్రామం 177/1 సర్వే నంబర్‌లో 3.59 ఎకరాలు, 170/9లో 0.24 ఎకరాలు; వసంతవాడలో 71/4లో 2.13 ఎకరాలు, 131/3లో 2.29 ఎకరాల భూములను పలువురు రైతులు వేలంలో దక్కించుకున్నారు. ఈ గ్రామాల్లోని మొత్తం 18.05 ఎకరాల భూములను అప్పట్లో రికార్డు స్థాయిలో ఏడాదికి రూ.6.91 లక్షల చొప్పున కౌలు వేలం పాడుకున్నారు. రికార్డు స్థాయిలో ఆదాయం రావడంతో ఆంజనేయ స్వామి వారి ధూపదీప నైవేద్యాలకు ఎటువంటి లోటూ ఉండదని భక్తులు భావించారు. కౌలుకు చేసుకునేందుకు 2018 వరకూ హక్కు పొందినప్పటికీ వారికి ఆ భూములు మాత్రం నేటికీ దక్కలేదు. వేలం ద్వారా వచ్చిన నిధులు ఏమయ్యాయో కూడా తెలియని పరిస్థితి.

నాటి టీడీపీ పెద్దల ఒత్తిళ్లతో..

నాడు దేవదాయ శాఖలో పని చేసిన ఓ అధికారి అప్పటి టీడీపీ పాలకుల అండదండలతో ఆలయ భూములను అన్యాక్రాంతం చేశారనే ఆరోపణలున్నాయి. వేలం నిర్వహించిన భూములను అంతకు ముందే కొందరు రైతులకు లీజు పేరుతో అమ్ముకున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. వేలం పూర్తయిన తరువాత ఆ భూములు తమవేనంటూ ఆ రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో 2015లో వేలం పాడుకున్న వారికి భూములు దక్కలేదు. ఇటు చెల్లించిన సొమ్మూ దక్కలేదు. మరోపక్క ఈ భూముల్లో ఉన్న రైతులు 15 ఏళ్లుగా ఎటువంటి శిస్తులూ చెల్లించకుండా అప్పనంగా అనుభవిస్తూండటంతో దేవదాయ శాఖ ఆదాయానికి రూ.కోటి వరకూ గండి పడింది. దేవదాయ శాఖలోని కొందరు అధికారుల అండదండలతోనే కబ్జాదారులు కోర్టులను ఆశ్రయించి, ఆదాయం ఆలయానికి చెందకుండా అడ్డదారులు తొక్కుతున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కొందరు అక్రమార్కులు ఆక్రమించుకున్న భూములను రిజిస్ట్రేషన్ శాఖలోని కొందరు అవినీతిపరుల అండతో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నట్టు చెబుతున్నారు. వేలం జరగక ముందే కొంతమంది రైతులకు ఆలయ భూములను ధారాదత్తం చేసిన విషయం నాటి అధికారికి తెలుసని, అయినప్పటికీ అప్పటి టీడీపీ పెద్దలు, ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు వేలం నిర్వహించారని అంటున్నారు. పాడుకున్న భూములను తమకు అప్పగించాలని వేలంలో భూములు దక్కించుకున్న కౌలుదారులు డిమాండ్ చేస్తున్నారు. భూముల రీసర్వే జరిగితే కోర్టులో రైతులు దాఖలు చేసిన కేసు కూడా ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఆలయ భూములు ఏ మేరకు అన్యాక్రాంతమయ్యాయో తెలిసే అవకాశం ఉంటుంది. కట్టుంగ ఆంజనేయ స్వామి వారికి పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో 1.20 ఎకరాలు, చిలకపాడులో 3.70 ఎకరాలు, ముమ్మిడివరంలో 2 ఎకరాలు, పసలపూడిలో 1.50 ఎకరాల భూములున్నాయని, వాటిని కూడా అధికారులు స్వాధీనం చేసుకుని కౌలు వేలం నిర్వహించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రస్తుత ఈవో ఏమన్నారంటే..



కట్టుంగ ఆంజనేయస్వామి వారి భూముల రీసర్వేకు తహసీల్దార్‌కు, గ్రామ సచివాలయంలోను దరఖాస్తు చేశాం. ఆ భూములు ఎక్కడికీ పోవు. స్వామి వారి ఆలయ భూముల్లో వేలం నిర్వహించిన 18.06 ఎకరాలకు రికార్డు పక్కాగా ఉంది. కోర్టు కేసు తేలిన తరువాత అప్పటి నుంచి వరుసగా మూడేళ్ల కాలానికి 2015లో వేలం పాడుకున్న వారికి ఆ భూములను అప్పగిస్తాం. అప్పట్లో వేలం ద్వారా సమకూరిన ఆదాయం వివరాలు సేకరిస్తున్నాం.

– బి.కృష్ణచైతన్య, ఈఓ

ఆంధ్ర విశ్వవిద్యాలయ శ్రీమంతుడు

- హాస్టల్ నిర్మాణానికి రూ.50 లక్షల విరాళం
- రూ.10 లక్షలతో సమావేశ మందిరం ఆధునికీకరణ

ఏయూ క్యాంపస్: అమ్మ నుంచి ఆశయాన్ని... నాన్న నుంచి అక్షరాన్ని ఆస్తిగా పొందిన శ్రీమంతుడు. అక్షర జ్ఞానాన్ని భిక్షగా పెట్టిన చదువులమ్మ రుణం తీర్చుకుంటున్న పూర్వ విద్యార్థి. రెండు దశాబ్దాలుగా అమెరికాలో స్థిరపడినా తన ప్రగతికి కారణమైన మూలాలను మరువని మనసున్న మనిషి దేవ పురాణం. తిరిగి ఇవ్వకపోతే లావైపోతాము అన్న మహేష్‌బాబు సినిమాలోని డైలాగ్‌ని నిజం చేసి చూపుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధికి సుమారు రూ.60 లక్షలకు పైగా నిధులు వెచ్చించారు.


సాధారణ మధ్య తరగతి కుటుంబం నుంచి...

అమలాపురంలో సాధారణ మధ్య తరగతి కుటుంబంలో రెండో సంతానంగా జన్మించిన పురాణం దేవ హరిహరనాథ్ ప్రాథమిక విద్యని సిద్ధాంతం, అత్తిలిలో పూర్తిచేశారు. పాలకొల్లులో ఇంటర్, డిగ్రీ పూర్తిచేసి 1992లో ఏయూలో అడుగుపెట్టారు. ఏయూలో ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫుడ్ డ్రగ్స్ విభాగంలో విద్యార్థిగా పీజీ పూర్తి చేసిన కాలం అతని జీవితాన్ని మలుపుతిప్పింది. ఆచార్య వై.ఎల్.ఎన్ మూర్తి దిశానిర్దేశం, ఆచార్య సి.శాంతమ్మ మార్గదర్శకంలో చేసిన ప్రాజెక్ట్ వర్క్ భవిష్యత్‌కి అవసరమైన అనుభవాన్ని, నైపుణ్యాన్ని అందించాయి. తర్వాతి కాలంలో హైదరాబాద్‌లో, చెన్నై తదితర ప్రాంతాల్లో పని చేశారు. అనంతరం యూకే, అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ప్రస్తుతం వయార్టిస్ సంస్థకు గ్లోబల్ క్వాలిటీ ఇన్వెస్టిగేషన్స్, సర్వేలెన్స్, రెగ్యులేటరీ కమ్యూనికేషన్స్ అధిపతిగా సేవలు అందిస్తున్నారు.

అమ్మ చెప్పిందని...

అమ్మ లలితా దేవి ఆలోచనలు, ప్రభావం దేవ పురాణం మనసులో బలంగా నాటుకున్నాయి. ఆడపిల్లలంటే లలితా దేవికి అమితమైన ఇష్టం. స్త్రీ ప్రగతిని బలంగా కాంక్షించే వారు ఆమె. అమ్మ ఆశించిన విధంగా స్త్రీ విద్యకు ఉపయుక్తంగా నిలిచే ఫార్మసీ విద్యార్థినుల హాస్టల్ నిర్మాణానికి తన సొంత నిధుల నుంచి రూ.50 లక్షలు విరాళంగా అందించారు. అక్షర జ్ఞానాన్ని అందించిన విశ్వవిద్యాలయంపై తనకున్న ప్రేమ అంతటితో ఆగలేదు. తాను చదువుకున్న కెమిస్ట్రీ విభాగంలో ఒక సమావేశ మందిరాన్ని రూ.10 లక్షలతో పూర్తి స్థాయిలో ఆధునికీకరించారు. ఫార్మసీ హాస్టల్ భవనానికి దేవ పురాణం కోరిన విధంగా వారి తల్లిదండ్రుల పేరును ఏయూ పెట్టింది. ప్రతిష్టాత్మకంగా భావించే అమెరికాకు చెందిన ఎఫ్‌డీఏతో ఏయూను అనుసంధానం చేయడంలో దేవ పురాణం కీలకపాత్ర పోషించారు.

వర్సిటీ నాకిచ్చిన అవకాశంగా భావిస్తా...



నా ప్రగతికి, అభివృద్ధికి కారణమైన ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సేవచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తాను. నాన్న సాధారణ టీచర్‌గా పనిచేశారు. చిన్నతనం నుంచి ఉన్నతంగా ఎదగాలని మమ్మల్ని ప్రోత్సహించారు. ఏయూలో చదువుకోవాలని, పీహెచ్‌డీ చేయాలనేది ఆయన ఆకాంక్ష. నేను అమెరికాలో స్థిరపడినా ఏయూ నుంచి నాన్న కోరుకున్న విధంగా పీహెచ్‌డీ కూడా పూర్తి చేస్తున్నాను. భవిష్యత్‌లో ఏయూకు మరింత సహకారం అందిస్తూ, వర్సిటీ అభివద్ధిలో భాగమవుతాను.

– దేవ పురాణం



● ప్రదర్శనకు వచ్చిన వారితో 'ఎడిస్టీస్' టీమ్

బంగారంలాంటి ఆలోచన

బంగారు ఆభరణాలు తయారుచేసే స్వర్ణకారుల జీవితాలు బంగారమయంగా ఉన్నాయా.. ఈ విషయాన్ని నేరుగా తెలుసుకోవడమే కాదు వారికి సాయం చేయాలనే ఆలోచనతో పాతికేళ్ల లోపు యంగ్‌స్టర్స్ స్వచ్ఛందంగా వారిని కలిసి, ఆభరణాలను తయారుచేయించి హైదరాబాద్ తెల్లాపూర్‌లో ప్రదర్శనను ఏర్పాటుచేశారు.

గ్లోబలైజేషన్‌లో భాగంగా పెద్ద పెద్ద జ్యూవెలరీ షాపులు, కంప్యూటర్ డిజైన్స్ వచ్చాక స్వర్ణకారుల ప్రాభవం మసకబారిపోతోందని, వారి కళను బతికించడం కోసం చేస్తున్న ప్రయత్నమిదని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. వీరిలో శ్రీహర్షిత, ప్రద్యుమ్న, రిత్విక్, ప్రకృతి, సంస్కృతి, సర్వనా, సాత్విక్, భరణ్య, అజయ్, భగీరథ్ లు ఉన్నారు. ఈ కార్యక్రమం గురించి వీరితో మాట్లాడినప్పుడు స్వర్ణకారుల కళ, వారి శ్రమకు తగిన ఫలం రాబోయే రోజుల్లో మరింతగా పెరగాలని కోరుకున్నారు.



● స్వర్ణకారుల్తు తయారు చేసిన ఆభరణాల ప్రదర్శన

స్వర్ణకారులు తయారుచేసిన ఆభరణాల ప్రదర్శనకు ముందుండి నడిచిన చాడా శ్రీహర్షిత లా పూర్తి చేసి, తెలంగాణలోని 'బచ్‌పన్ బచావో ఆందోళన్'కి లీగల్ కన్సల్టెంట్‌గా వర్క్ చేస్తోంది. భరణ్య లా చదువుతోంది. రుత్విక్ డాక్టర్ కాగా స్వాతిక్ లా చేస్తున్నాడు. ప్రకృతి పన్నెండవ తరగతి పూర్తిచేసి సైకాలజీ పట్టా పొందడానికి కృషి చేస్తోంది. ప్రద్యుమ్న, భగీరథ్‌లు బీటెక్ చేస్తున్నారు. ఇక సర్వనా, సంస్కృతి లు స్కూల్ ఏజ్‌లోనే ఉన్నారు.

నేరుగా కలిసి..

తాము చేస్తున్న కార్యక్రమాల గురించి శ్రీహర్షిత మాట్లాడుతూ 'ఎడిస్టీస్ ఎన్జీవోని కిందటేడాది ప్రారంభించాం. దీని ద్వారా ప్రభుత్వ స్కూల్ పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చి, వారిలో మంచి మార్పులు తీసుకురావాలనే ఆలోచనతో కార్యక్రమాలు చేస్తుంటాం. ఇందుకు కర్నూలు వాసి అయిన నర్మదా టీచర్ ప్రెసిడెంట్‌గా ఉండి సరైన సూచనలు ఇస్తుంటారు. స్కూల్ కార్యక్రమాల తర్వాత హస్తకళలకు సాయం చేయాలనే ఆలోచన చేసినప్పుడు స్వర్ణకారుల జీవితాలను చూశాం. మూడు నెలల క్రితం అనుకున్న ఈ కార్యక్రమాన్ని వెంటనే మొదలుపెట్టాం' అని వివరిస్తే.. 'దాదాపు పాతికమంది స్వర్ణకారుల కుటుంబాలను నేరుగా కలిసి, వాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకొని, ఒక డాక్యుమెంటరీ రూపొందించాం. ఆ తర్వాత కొంతమంది ప్రముఖులను కలిసి, స్వర్ణకారుల జీవితాల గురించి తెలియజేశాం. మేం ఏ కార్యక్రమం చేసినా, అందులో ప్రతీసారి కొత్తవారు సభ్యులు అవుతూ ఉంటారు. దీంతో మరికొందరికి సాయం చేయాలన్న ఆలోచన కూడా పెరుగుతోంది' అని వివరించింది భరణ్య.

కళను గుర్తించండి...



ఐదేళ్లుగా చాలా సమస్యలను ఎదుర్కొంటున్నాం. ఎంత కష్టపడినా ఒక్కోరోజు నాలుగైదు వందలు కూడా రావు. బంగారాన్ని కాల్చి, తీగ తీసి, అత్యంత శ్రద్ధతో ఒక ఆభరణాన్ని తయారు చేయాలంటే ఎంతో టైమ్ పడుతుంది. ఇప్పుడంతా పెద్ద పెద్ద జ్యూవెలరీ షాపులకే వెళుతున్నారు. మా దగ్గర ఆభరణాలు చేయించుకునేవారు బాగా తగ్గిపోయారు. ప్రస్తుతం మేం ఆర్థికంగానే కాదు ఆరోగ్య సమస్యలు కూడా ఎదుర్కొంటున్నాం. రాబోయే తరాలకు ఈ పని అందించే ధైర్యం చేయలేకపోతున్నాం. మా పిల్లలను వేరే పనులు చూసుకోమని చెబుతున్నాం. ఇలాంటి ప్రదర్శనల ద్వారా ప్రముఖులు మా పనిని గుర్తిస్తే ఈ కళ బతుకుతుంది.

- గోవింద్, స్వర్ణకారుడు

శ్రమ ఎక్కువ.. ఆదాయం తక్కువ

'హైదరాబాద్‌లోని కళాకారులనే కలుసుకున్నాం. వీరిలో స్థానిక కళాకారులే కాదు కలకత్తా, గుజరాత్.. వంటి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ సెటిల్ అయిన వారున్నారు. స్వర్ణకారుల షాప్‌లో ఒకరు మాస్టర్‌గా ఉంటారు. వారికి తప్ప మిగతా అందరికీ చాలా తక్కువ ఆదాయం ఉంటుంది. దీంతో కుటుంబాలు పోషించుకోలేని స్థితిలో ఉన్నవారిని చూశాం. జ్యూవెలరీ అంటే లగ్జరీ గూడ్ అని మనకు తెలుసు. వీటిని తయారుచేసేవారి దగ్గర కూడా బాగా డబ్బు ఉంటుంది అనుకుంటాం. కానీ, వాళ్ల దగ్గర ఏమీ ఉండటం లేదు. ఈ కారణంగా వారి పిల్లలు కనీస చదువులు కూడా కొనసాగించలేకపోతున్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో 25 మంది కళాకారులు పాల్గొన్నారు. సందర్శకులు వారి ఆభరణాలు కొనుగోలు చేసి, స్వర్ణకారులకు సపోర్ట్‌గా నిలిచారు. ఈ కుటుంబాలకు మేం ఇలా సాయంగా ఉండటం మాకు చాలా ఆనందంగా ఉంది' అని వివరించారు ఈ యంగ్ స్టర్స్.

మన హస్తకళలన్నీ ముందు తరాలలోనూ సుసంపన్నంగా వెలగాలి. ఇలాంటి ప్రదర్శనలు మరిన్ని జనంలోకి వెళుతూ ఉంటే స్వర్ణకళాకారుల భవిత కూడా బంగారమే అవుతుంది.

– నిర్మలారెడ్డి

ప్రత్యేకమైనది

ఏ పని అయినా ఒకసారి చేసి వదిలేయడం వల్ల సరైన ఫలితాలు రావు. ఈ విషయం స్వర్ణకారులను కలిసినప్పుడు మరింతగా అర్థమైంది. నిరంతరం సమస్యలు ఎదుర్కొంటున్నవారికి ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో ఎంచుకున్న కార్యక్రమం ఇది. దీనికి చాలా మంది ప్రముఖుల నుంచి మద్దతు లభించింది. ఈ ఆలోచన ప్రత్యేకంగా ఉందని అభినందించారు.

– శ్రీహర్షిత

సాయపడదాం

జ్యూవెలరీ షాపులు వచ్చాక స్వర్ణకారుల కళా నైపుణ్యం ప్రశ్నార్థకంగానే మారింది. కోవిడ్ తర్వాత వీరి ఇబ్బందులు మరీ పెరిగాయి. కంటిచూపు, గంటలు గంటలు కూర్చొని పని చేయడం వల్ల బ్యాక్‌పెయిన్‌తో సఫర్ అవుతున్నారు. ఈ విధంగా వారికి సాయం పడటం సంతోషాన్నిచ్చింది.

– ప్రకృతి

మేనత్త పోచవ్వ..!

ఇప్పటి సంగతి ఏమోగాని ఒకప్పుడు ప్రతి ఇంట్లో మేనత్తల అజమాయిషీ ఉండేది. శుభాల్లో, అశుభాల్లో మేనత్త వచ్చి దగ్గర ఉండి మంచీ చెడ్డకు నిలిచేది. అనుబంధాల ఆనవాలు చెప్పేది. 'బలగం' సినిమా చూసి అందులో మేనత్త పోచవ్వగా నటించిన నటి విజయలక్ష్మిలో అందరూ తమ మేనత్తలను పోల్చుకుంటున్నారు. సురభి ఆర్టిస్టయిన 65 ఏళ్ల విజయలక్ష్మికి ఇదే తొలి సినిమా. ఇంతకాలం గ్రాంథిక సంభాషణలు మాత్రమే పలికిన ఆమె పోచవ్వగా తెలంగాణ నుడికారాన్ని మెరిపించారు. ఆమె గొప్ప హరికథా కళాకారిణి కూడా. విజయలక్ష్మి పరిచయం.



● విజయలక్ష్మి

'తల వెంట్రుకంత అదృష్టమైనా తల చూపాలి కదా' అన్నారు సురభి విజయలక్ష్మి.

65 ఏళ్లకు ఆమెకు అదృష్టం తల చూపిందనే అనుకోవాలి. సురభి ఆర్టిస్టుగా స్టేజ్ మీద ఎంత పేరున్నా, భాగవత కళాకారిణిగా ఎంత గుర్తింపున్నా ఇప్పుడు 'బలగం' సినిమాలో పోచవ్వగా చేసిన పాత్రే ఆమెకు ఎక్కువ పేరు, గుర్తింపు, ఉనికి ఇచ్చింది. పల్లెటూరి పెద్ద వయసు స్త్రీల విసురు, కసురు, మాట విరుపు, ఆర్ద్రత, అన్నింటినీ పోచవ్వ పాత్రలో రక్తి కట్టించడమే కారణం. ఆమె ఉద్వేగాలు ప్రేక్షకులను కట్టిపడేశాయి.

'మా సురభి పరివారమంతా చాలా సంతోషంగా ఉన్నారు. సినిమా రంగం నుంచి ఫోన్లు వస్తున్నాయి. ఇదంతా చాలా కొత్తగా ఉంది' అన్నారామె.

హైదరాబాద్ చందా నగర్‌లోని సురభి కాలనీలో నివాసం ఉంటున్న విజయలక్ష్మి ఒక రకం గా రంగస్థలంపైనే పుట్టారు. ఆమె తల్లి ప్రఖ్యాత నటి కమలాదేవి. తండ్రి నాగభూషణం. అయితే ఆరుగురు అక్కచెల్లెళ్లలో విజయలక్ష్మి మాత్రమే నటిగా స్టేజ్ మీద కొనసాగారు. 'మూడేళ్ల వయసు నుంచే నాటకాల్లో పాత్రలు చేశాను. కృష్ణుడు, లోహితాస్యుడు... వయసు వచ్చాక దేవకి, సావిత్రి, అనసూయ, కాంతామతి... ఈ పాత్రలన్నీ పోషించేదాన్ని. సురభిలో ఏ పాత్రైనా ఎవరైనా చేయాలని రూలు. అందువల్ల మగవేషాలు కూడా వేశాను. కృష్ణుడిగా, బాలనాగమ్మలో మాయల పకీరుగా నటించాను' అన్నారు విజయలక్ష్మి.

కరీంనగర్ కోడలు

యుక్త వయసు రాగానే కరీంనగర్‌కు చెందిన బంధువుల కుర్రాడు కేశవరావుతో వివాహం జరిగింది. అతను కూడా నటుడు. భార్యాభర్తలిద్దరూ కలిసి నాటక సమాజం నడిపారు. అయితే పిల్లల చదువుల కోసం సురభీ నటీనటులు వేరే చోట్లకు వెళ్లిపోతుండటంతో అందరూ కలిసి సంచారం చేసే పరిస్థితి పోయింది. 'నేను చిన్నప్పటి నుంచి బాగా పాడేదాన్ని. హరికథలంటే ఆసక్తి ఉండేది. హరికథ నేర్చుకుంటే నేనొక్కదాన్నే ప్రదర్శన ఇవ్వొచ్చు. అలా హరికథా కళాకారిణిగా మారాను. నిజామాబాద్, కరీంనగర్, మెదక్, నల్గొండ... ఈ నాలుగు జిల్లాల్లో నేను తిరగని పల్లెటూరు లేదు. మహాభారతాన్ని 18 రోజులు ఒకే ఊరిలో ఉండి చెప్పేదాన్ని. నవరాత్రులొస్తే రాత్రి 8 నుంచి ఒంటి గంట వరకూ నా హరికథ ఉండేది.' అంటారామె.

తెలంగాణ పలుకుబడి

'బలగం సినిమాలో పోచవ్వ పాత్ర కోసం ఆర్టిస్టులను వెతుక్కుంటూ దర్శకుడు వేణు సురభి కాలనీకి వచ్చారు. అందరూ ఆడిషన్స్ ఇస్తుంటే నేనూ ఇచ్చాను. ఆశ్చర్యంగా నన్నే సెలెక్ట్ చేశారు. ఇంతకుముందు ఒకటి రెండు సినిమాలలో నటించినా నాకంటూ అసలు డైలాగు లేదు. ఇదే తగిన నిడివి ఉన్న మొదటి సినిమా. కాని తెలంగాణ మాండలికం. నేనేమో జీవితమంతా రంగస్థలం మీద, హరికథల్లోనూ గ్రాంథికం మాట్లాడతాను. రోజువారి జీవితంలో కూడా నా భాష గ్రాంథికంలా ఉంటుంది. కాని హరికథలు చెప్పడానికి తెలంగాణ పల్లెలకు వెళ్లినప్పుడు అక్కడి స్త్రీలను గమనించిన అనుభవం నాకు ఉపయోగపడింది. డైలాగులను ఆ స్త్రీలు చెప్పినట్టుగా చెప్పాను. నేను నిజంగా అక్కడి ప్రాంత స్త్రీ అని, ఊరిలోని స్త్రీ చేత ఆ పాత్ర చేయించారని అనుకుంటున్నవాళ్లు చాలామంది ఉన్నారు' అని నవ్వారామె.

సినిమాలో మేనత్తగా ఆమె ముఖ్యపాత్రల మధ్య వైషమ్యాలు తొలిగేలా చేయడంలో కీలక పాత్ర పోషిస్తారు. అందువల్ల చాలామంది విజయలక్ష్మిలో తమ మేనత్తను వెతుక్కున్నారు. 'మన సమాజంలో మేనత్తకు ఎప్పటికీ ఇంటి ఆడబిడ్డ స్థానం ఉంటుంది. సోదరులు ఆమెను గౌరవించాల్సిందే. వదిన అయినా, మరదలు అయినా ఇంటి ఆడపడుచుకు తల వొంచాల్సిందే. ఆ అధికారం నా పాత్రలో చూపించాను' అన్నారు విజయలక్ష్మి.

సినిమా నటీమణుల్లో శాంతకుమారిని ఇష్టపడే విజయలక్ష్మి ఒక రకంగా కొత్త ప్రయాణం మొదలెట్టారు. ఆమె ఇద్దరు కొడుకులు, కూతురు జీవితాల్లో స్థిరపడ్డారు కనుక నటనకు ఎక్కువ సమయం ఇవ్వాలనుకుంటున్నారామె. పోచవ్వకు ఆల్ ది బెస్ట్.

బ్యూటిప్



చర్మ సంరక్షణే సరిపోదు..

వేసవిలో చర్మ సంరక్షణ మాత్రమే సరిపోదు దుస్తులు కూడా సరైనవి ధరించాలి. హానికరమైన అల్ట్రా వయొలెట్ కిరణాల నుండి రక్షణ కోసం చర్మానికి చికాకు కలిగించని దుస్తులు వేసుకోవాలి. ఎండ నుంచి రక్షణ కలిగించడంలో దుస్తులు కీలక పాత్ర పోషిస్తాయి. వదులుగా ఉండే దుస్తులు, లేత రంగు దుస్తులు వేసుకోవడం మంచిది. కాటన్ వస్త్రాలు స్కిన్ ఫ్రెండ్లీగా ఉంటాయి. చెమట వల్ల వచ్చే చికాకుని తగ్గిస్తాయి. ముఖాన్ని కప్పుకోవడం కోసం టోపీలు, గొడుగు ధరించడం ముఖ్యం. కళ్లకు హాని కలగకుండా సన్ గ్లాసెస్ ధరించాలి.

సాగుబడి

రేవతి కార్తె: ఏప్రిల్ 13 వరకు

పొలం దగ్గరే ధాన్యం ఆరుదల!

● పొలం దగ్గరే ధాన్యం తేమను తగ్గించే మొబైల్ యంత్రం సిద్ధం ● 2.5 టన్నుల సామర్థ్యం గల మొబైల్ ప్యాడీ డ్రయ్యర్ ధర రూ. 15 లక్షలు ● రోజుకు 4 ఎకరాల్లో పండే ధాన్యాన్ని నాణ్యంగా ఆరుదల చేయొచ్చు



● డ్రయ్యర్ వెనుక వైపు



● మొబైల్ పాడీ డ్రయ్యర్

రైతులు రోడ్లపై ధాన్యాన్ని ఆరబెడుతూ ప్రజలకు అసౌకర్యం కలిగించటం తగదని సుప్రీంకోర్టు ఇటీవల వ్యాఖ్యానించిన నేపథ్యంలో.. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కూడా ధాన్యాన్ని కొద్ది గంటల్లోనే నాణ్యత కోల్పోకుండా ఆరబెట్టుకోవడానికి ట్రాక్టర్‌తో నడిచే పాడీ డ్రయ్యర్లు వీలు కల్పిస్తున్నాయి. 50 డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రతతో ధాన్యాన్ని నాణ్యత చెడకుండా, మొలక శాతం తగ్గకుండా ఆరబెట్టే ఆధునిక సాంకేతికతతో కూడిన పాడీ డ్రయర్లు బాపట్లలోని కోత అనంతర పరిజ్ఞాన పరిశోధన కేంద్రం ద్వారా రైతులకు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి.

ధాన్యాన్ని నూర్చిన తర్వాత తేమ తగ్గేవరకూ సరిగ్గా ఆరబెట్టకపోవటం వల్ల సుమారు 10 శాతం మేరకు నష్టం కలుగుతోందని అంచనా. అధిక తేమ ఉన్న ధాన్యాన్ని బస్తాల్లో నిల్వ చేస్తే ధాన్యం వేడెక్కి రంగు మారుతుంది. అటువంటి అనుకూల వాతావరణంలో ముక్క పురుగులు, శిలీంధ్రాలు ఆశిస్తాయి. బూజు పడుతుంది. ధాన్యం చెడిపోయి వాసన వస్తుంది. వరి ధాన్యాన్ని (కంబైన్ హార్వెస్టర్) యంత్రాల ద్వారా కోసిన తర్వాత సక్రమంగా ఆరబెట్టకపోతే నాణ్యత దెబ్బతింటుంది.

12% కన్నా తక్కువ తేమ శ్రేయస్కరం

సాధారణంగా కంబైన్ హార్వెస్టర్‌తో గింజరాలు నష్టాన్ని తగ్గించడానికి వరి ధాన్యంలో తేమ శాతం 22–24% ఉన్నప్పుడు వరి కోతలు చేస్తుంటారు. నాణ్యత కోల్పోకుండా ఉండాలంటే ధాన్యం నూర్చిన 24 గంటల్లోగా తేమ శాతాన్ని 17–18కి తగ్గేలా ఆరుదల చేయాల్సి ఉంటుంది. వరి ధాన్యాన్ని నాణ్యత కోల్పోకుండా ఆరు నెలల వరకు నిల్వ ఉంచాలంటే తేమను 12–13 శాతానికి తగ్గించాల్సి ఉంటుంది. ఏడాది కంటే ఎక్కువ కాలం నిల్వ ఉంచాలంటే 12 కన్నా తక్కువ శాతానికి తేమను తగ్గించాల్సి ఉంటుంది. ఏకకాలంలో రైతులందరూ పంట నూర్పిళ్లు చేయటం వల్ల పాత పద్ధతుల్లో నేలపైన నచ్చు/ పరదాలపై లేదా రోడ్లపైన ధాన్యాన్ని ఆరబెట్టడం సాధ్యం కావటం లేదు. ఒక్కోసారి అకాల వర్షాల వల్ల ఆరబెట్టిన ధాన్యం తడిచి నాణ్యత మరింత కోల్పోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ పరిస్థితుల్లో ట్రాక్టర్ ద్వారా నడిచే మొబైల్ ప్యాడీ డ్రయ్యర్లు రైతులకు ఉపయోగకరంగా ఉన్నాయి.

గ్రీన్‌సిగ్నల్

పరిశోధనా సంస్థలు, కంపెనీలు రూపొందించే వ్యవసాయ యంత్రాలు, పరకరాలను అధికారికంగా క్షేత్రస్థాయిలో సబ్సిడీపై అందుబాటులోకి తేవాలంటే వాటి పనితీరును పరిశీలించి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖలోని యంత్రీకరణ- సాంకేతిక విభాగం ఆమోద ముద్ర వేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది జనవరి 23న యంత్రీకరణ- సాంకేతిక విభాగం డిప్యూటీ కమిషనర్ ఎ.ఎన్. మెష్రం 32 యంత్రాలు, పరికరాలకు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. చెన్నైలోని కర్ది డ్రయ్యర్స్ సంస్థ రూపొందించిన ప్యాడీ మొబైల్ డ్రయ్యర్ కూడా ఒకటి. సబ్-మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్ (ఎస్.ఎం.ఎ.ఎం.) పథకం ద్వారా కస్టమ్ హైరింగ్ సెంటర్స్ / హైటెక్ హబ్స్, గ్రామస్థాయి ఫామ్ మెషినరీ బ్యాంక్స్‌కు మాదిరిగానే స్వీయ సహాయక బృందాల (ఎస్.హెచ్.జి.ల)కు కూడా ఈ డ్రయ్యర్‌ను సబ్సిడీపై అందించవచ్చని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీలు, చిన్న, సన్నకారు రైతులు, మహిళలకు 60%, ఇతరులకు 50% సబ్సిడీపై ఈ మొబైల్ పాడీ డ్రయ్యర్‌ను అందించవచ్చని ఆ ఉత్తర్వు పేర్కొంది.

బ్యాచ్‌కు 2-12 టన్నులు

కోయంబత్తూరులోని ఐసీఏఆర్ అనుబంధ సంస్థ అయిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లోని ప్రాంతీయ విభాగంతో పాటు, బాపట్లలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధ కోత అనంతర పరిజ్ఞాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు తమ 2.5 టన్నుల మొబైల్ పాడీ డ్రయ్యర్ పనితీరును పరీక్షించి, సంతృప్తిని వ్యక్తం చేశాయని కర్ది డ్రయ్యర్స్ సంస్థ తెలిపింది. ధాన్యాన్ని ఎత్తిపోయటం ద్వారా ఆరుదల చేసే అనేక స్టాటిక్(స్థిర), మొబైల్(చర) డ్రయ్యర్లను ఈ సంస్థ రూపొందిస్తూ దేశ విదేశాల్లో విక్రయిస్తోంది. స్థిరంగా ఒకచోట నెలకొల్పి విద్యుత్/ డీజిల్ జనరేటర్ ద్వారా ధాన్యాన్ని ఆరుదల చేసే 12 టన్నుల సామర్థ్యం గల డ్రయ్యర్లను సైతం ఈ సంస్థ రూపొందించింది. అదేవిధంగా, పొలం దగ్గరకే తీసుకువెళ్లి ధాన్యాన్ని నూర్చిన వెంటనే అక్కడికక్కడే ఆరబెట్టుకునేందుకు ఉపయోగపడే మొబైల్ పాడీ డ్రయ్యర్లలో బ్యాచ్‌కు 2 టన్నుల నుంచి 70 టన్నుల సామర్థ్యం కలిగిన డ్రయ్యర్లు అందుబాటులోకి వచ్చాయి. ట్రాక్టర్‌తో పొలం దగ్గరకే లాక్కెళ్లి రీసర్క్యులేటరీ వ్యవస్థ ద్వారా ధాన్యాన్ని ఆరుదల చేయడానికి ఉపకరించే 2 టన్నుల సామర్థ్యంగల మొబైల్ డ్రయ్యర్ ధర రూ. 15 లక్షలు. 50-60% సబ్సిడీపై అందించడానికి తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదిస్తున్నామని కర్ది డ్రయ్యర్స్ సంస్థ జనరల్ మేనేజర్ దిలీపన్(90940 13375) తెలిపారు.

మొబైల్ డ్రయ్యర్ పనితీరు బాగుంది

వచ్చి వరి ధాన్యాన్ని (బక్కెట్ ఎలివేటర్‌తో తిరిగి ఎత్తిపోస్తూ) ఆరుదల చేసే ఈ 2.5 టన్నుల మొబైల్ డ్రయ్యర్‌ను బాపట్లలోని మా పరిశోధనా కేంద్రంలో పరీక్షించాం. తేమ శాతం 22% నుంచి 13.5%కి తగ్గింది. చాలా బాగా పనిచేస్తోంది. బ్యాచ్‌కు ముప్పావు ఎకరంలో వరి ధాన్యం (35 బస్తాలు) ఆరుదల చేయొచ్చు. రోజుకు 5 బ్యాచ్‌లు చేయొచ్చు. డ్రయ్యింగ్ రెండు దశల్లో చేయాలి. 17–18% వరకు మొదటి దశ, 13% వరకు రెండో దశలో తగ్గించాలి. ఈ ధాన్యాన్ని విత్తనంగా కూడా వాడుకోవచ్చు. మొలక శాతంలో ఎటువంటి తేడా ఉండదు. నూక శాతం తగ్గుతున్నట్లు కూడా నిర్ధరణైంది. ప్రభుత్వానికి నివేదిక పంపాం.



- డా. బి.వి.ఎస్. ప్రసాద్ (80083 73741), ప్రధాన శాస్త్రవేత్త (వ్యవసాయ ఇంజనీరింగ్), అధిపతి, కోత అనంతర పరిజ్ఞాన పరిశోధన కేంద్రం, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాపట్ల

వరితోపాటు మొక్కజొన్న

బ్యాచ్‌కు 1 టన్ను నుంచి 5 టన్నుల సామర్థ్యం గల మొబైల్ పాడీ డ్రయ్యర్ల ద్వారా వరి ధాన్యంతో పాటు మొక్కజొన్నలు, తీపి మొక్కజొన్నలు, బార్లీ, గోధుమలను కూడా ఆరుదల చేయవచ్చని దిలీపన్ వివరించారు. 35–65 హెచ్‌పి ట్రాక్టర్ పిటిఓ ద్వారా ఇవి పనిచేస్తాయి. అతి తక్కువ ఖర్చుతో ధాన్యాలను ఆరబెట్టడంతో పాటు ఫంగల్ ఇన్ఫెక్షన్లను నివారించుకోవచ్చు. ఎండలో ఆరుబయట ఆరబెట్టే సమయంలో 20% సమయంలోనే (2-2.5 గంటలు) ఈ డ్రయ్యర్‌తో కోత కోసిన రోజే, తక్కువ శ్రమతో ఆరుదల చేసి, వెంటనే బస్తాల్లోకి నింపుకోవచ్చు. ఎక్కువ తక్కువ లేకుండా ధాన్యం అంతా సమంగా, సక్రమంగా ఆరుదల జరుగుతుంది కాబట్టి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. వెంటనే అమ్మేసుకోవాల్సిన అవసరం ఉండదు. నిశ్చింతగా నిల్వ ఉంచుకొని మంచి ధరకు అమ్ముకోవచ్చు.

నిర్వహణ: **పంతంగి రాంబాబు,** సాగుబడి డెస్క్

కొమ్మెండు తెగులుకు దివ్యౌషధం పేడ ద్రావణం



● పేడ+పల్లి చెక్క+బెల్లం ద్రావణం

ఉద్యాన తోటల్లో ముఖ్యంగా వేప, నిమ్మ జాతి తోటలు, మామిడి తదితర తోటల్లో కొమ్మెండు (డైబ్యాక్) తెగులు ఇటీవల కాలంలో విస్తరిస్తోంది. కొమ్మలు పై నుంచి కింది వరకు క్రమంగా ఎండిపోయి చివరకు చెట్టు క్షీణించిపోయే పరిస్థితి నెలకొంటున్నది. దీని నివారణకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో రైతులు పేడ ద్రావణం ద్వారా పరిరక్షించుకుంటున్నారు. ఈ ద్రావణం కొమ్మెండు తెగులు సోకి ఆశ వదిలేసుకున్న చెట్లు సైతం 15 రోజుల్లోనే తిరిగి కొత్త చిగుళ్లు తొడుగుతూ పచ్చబడుతున్నాయని భువనగిరి వద్ద రామకృష్ణాపురంలోని అమేయ కృషి వికాస కేంద్రం రైతు శాస్త్రవేత్త జిట్టా బాల్‌రెడ్డి తెలిపారు.

ప్రభావశీలంగా పనిచేస్తున్న ఈ పేడ ద్రావణం రైతు తయారు చేసుకొని వాడుకోవడానికి అనుకూలమైనది. చాలా సులభమైనది. సుమారు 10 కేజీల పశువుల పచ్చి పేడను తొట్టి లేదా డ్రమ్ములో వేసి నీటిలో కలిపి ఊరవేయాలి. 72 గంటల తర్వాత అందులో 5 కేజీల వేరుశనగ (పల్లి) చెక్కను కలపాలి. 2 లేదా 3 రోజుల తర్వాత ట్రైకోడెర్మా విరిడి, సూడోమోనాస్, పిఎస్బీ వంటి జీవన ఎరువులను.. 2 కిలోల బెల్లాన్ని కలిపి 2లేదా3 రోజులు ఊరేయాలి. ఇలా తయారు చేసిన పేడ ద్రావణానికి ఒకటికి 3 రెట్లు నీటిని కలిపి కొమ్మెండు తెగులు ఉన్న చెట్లకు చెట్టు వయసును బట్టి 3 నుంచి 5 లీటర్ల వరకు పోసుకుంటే అద్భుతమైన ఫలితాలు వస్తున్నాయని బాల్‌రెడ్డి వివరించారు.



● జిట్టా బాల్‌రెడ్డి

చనిపోయే స్థితిలో ఉన్న మొక్కలను కూడా రక్షించుకోవటం ఈ పేడ ద్రావణం ద్వారా సాధ్యమేనన్నారు. జీవామృతం కన్నా ఈ పేడ ద్రావణం బాగా పనిచేస్తోంది. ఆవు పేడ లేదా గేదె పేడ అయినా వాడొచ్చు. పూర్తి వివరాలకు.. అమేయ కృషి వికాస కేంద్రం యూట్యూబ్ ఛానల్ చూడొచ్చు.

6 నుంచి ఫుడ్ ప్రాసెసింగ్‌పై ఆచరణాత్మక శిక్షణ

దేశీ వంగడాలతో ప్రకృతి సేద్యంలో పండించే ఉత్పత్తులను ఆధునిక పద్ధతుల్లో ప్రాసెస్ చేసి, మంచి ధరకు అమ్ముకునే పద్ధతులు, సోలార్ డ్రయ్యర్లు ఇతర యంత్రపరికరాలను తక్కువ ధరలోనే సమకూర్చుకోవటం తదితర అంశాలపై ఈ నెల 6, 7, 8 తేదీల్లో సుప్రసిద్ధ యువ ప్రకృతి సేద్య నిపుణులు ఆకాష్ చౌరాసియా ఆచరణాత్మకంగా శిక్షణ ఇవ్వనున్నారు. సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరు-దౌలతాబాద్ రోడ్డులోని తుర్కల ఖానాపూర్ (హత్నూర)లోని రత్నపురి సంస్థల ఆవరణలో ఈ శిక్షణ నిర్వహిస్తున్నారు. వసతి, ఆహారం సహా ఫీజు రూ. 2 వేలు.

వివరాలకు: 95050 46750 73869 57633

15-17 తేదీల్లో తరకటూరులో ప్రకృతి వ్యవసాయ శిబిరం

గోపాలనతో పాటు చేసే ప్రకృతి వ్యవసాయ మెళకువలపై కృష్ణా జిల్లా తరకటూరు(మచిలీపట్నం దగ్గర) సౌభాగ్య గోసదనంలో ఏప్రిల్ 15,16,17 తేదీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సేవ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు విజయరామ్ తెలిపారు. సమాజ ఆరోగ్య, ఆర్థిక పరిపుష్టికి ప్రకృతి వ్యవసాయంలో దేశీ విత్తనాల ప్రాముఖ్యత.. మాగాణి భూముల్లో/ నీటి కాలువలకు దగ్గరగా వుండే పొలాల్లో చెరువు అవశ్యకత, పొలం గట్ల మీద పంటల సాగు, చెరువు తవ్విన మట్టిని మెట్ట (దిబ్బ) గా వేసి కూరగాయలు , పండ్ల మొక్కలు పెంచుకోవటం, కలుపు నివారణకు పెంట పోగు (దిబ్బ ఎరువుతో) ఆచ్ఛాదన, ఐదేళ్ల పాటు ఒకే రకమైన దేశవాళీ వరిని సాగు చేసేవారికి విత్తనం పంపిణీ, సేద్యం/ఎద్దు గానుగ కోసం ఉచితంగా గిత్తల పంపిణీ, నైవేద్యం కోసం పంటల సాగు తదితర అంశాలపై విజయరామ్ అవగాహన కల్పిస్తారు. 3 రోజులూ ఒకే కార్యక్రమాలు జరుగుతాయి. ఏదైనా ఒకరోజు పాల్గొంటే చాలు. అల్పాహారం, భోజన సదుపాయం ఉన్నాయి. ప్రవేశ రుసుం: రూ. 300.

సంప్రదించాల్సిన నంబరు 63091 11427 (ఉ.10–6 వరకు)



'బుమ్రా గురించి చర్చ అనవసరం'

బెంగళూరు చేతిలో పరాజయం తర్వాత టాప్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా లేని లోటు గురించి అడిగిన ప్రశ్నపై ముంబై ఇండియన్స్ కెప్టెన్ రోహిత్ శర్మ అసహనం వ్యక్తం చేశాడు. గత ఎనిమిది నెలలుగా నేను బుమ్రా లేకుండానే జట్టును నడిపిస్తున్నాను. కానీ ఎవరో ఒకరు అతని స్థానంలో వచ్చి ఆడాల్సిందే. సుదీర్ఘ కాలం దాని గురించే మాట్లాడితే ఎలా. మన నియంత్రణలో ఉండే విషయాల గురించే చెప్పగలం. గాయాలను ఎవరూ నియంత్రించలేరు. మిగతా ఆటగాళ్లలోనూ మంచి ప్రతిభ ఉంది. వారిని ప్రోత్సహిస్తూ మద్దతు పలకడం అవసరం' అని రోహిత్ అన్నాడు.



మళ్లీ నంబర్‌వన్‌గా జొకోవిచ్

ఏటీపీ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ మళ్లీ తన అగ్ర స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. సోమవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో జొకోవిచ్ నంబర్‌వన్‌గా నిలిచాడు. రెండు వారాల క్రితం అతను తన టాప్ ర్యాంక్‌ను స్పెయిన్‌కు చెందిన అల్‌కరాజ్‌కు కోల్పోయాడు. అయితే మయామీ ఓపెన్‌లో అల్‌కరాజ్ సెమీస్‌లోనే ఓడటంతో రెండో ర్యాంక్‌కు పడిపోయాడు. జొకోవిచ్ కెరీర్ నంబర్‌వన్‌గా ఇది 381వ వారం కావడం విశేషం.

చెన్నై చెలరేగగా...

సూపర్ కింగ్స్ సొంత మైదానంలో సత్తా చాటింది...ముందుగా బ్యాటింగ్‌లో చెలరేగి భారీ స్కోరు నమోదు చేసిన ధోని టీమ్, ఆపై ప్రత్యర్థిని నిలువరించడంలో సఫలమైంది. రుతురాజ్, కాన్వేలు చెన్నైకి భారీ స్కోరును అందిస్తే, బౌలింగ్‌లో మొయిన్ అలీ ఆఫ్ స్పిన్ జట్టును గెలుపు దిశగా నడిపించింది. మరో వైపు తమ తొలి మ్యాచ్‌ను గెలుపు జోరు మీదున్న లక్నో ప్రభావం చూపలేకపోయింది. ఓపెనర్ మేయర్స్ ఆట మినహా మిగతా రంగాల్లో విఫలం కావడంతో రాహుల్ బృందానికి ఓటమి తప్పలేదు.

- ధోని సేనకు తొలి విజయం
- 12 పరుగులతో ఓడిన లక్నో
- గెలిపించిన రుతురాజ్, అలీ


రుతురాజ్

చెన్నై: నాలుగేళ్ల తర్వాత ప్రత్యక్షంగా మ్యాచ్‌ను చూసేందుకు వచ్చిన అభిమానులకు చెన్నై సూపర్ కింగ్స్ అమితానందాన్ని పంచింది. గత ఓటమిని మరిచేలా చేస్తూ లీగ్‌లో తొలి విజయాన్ని నమోదు చేసింది. సోమవారం జరిగిన పోరులో చెన్నై 12 పరుగుల తేడాతో లక్నోను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. రుతురాజ్ గైక్వాడ్ (31 బంతుల్లో 57; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) వరుసగా రెండో మ్యాచ్‌లో అర్ధ సెంచరీ సాధించగా, డెవాన్ కాన్వే (29 బంతుల్లో 47; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. రవి బిష్ణోయ్, మార్క్‌వుడ్ చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం లక్నో సూపర్ జెయింట్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 205 పరుగులు చేసింది. కైల్ మేయర్స్ (22 బంతుల్లో 53; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలవగా, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మొయిన్ అలీ (4/26) ప్రత్యర్థిని దెబ్బతీశాడు.

శతక భాగస్వామ్యం...

కేవలం 56 బంతుల్లో 110 పరుగులు...చెన్నై తొలి వికెట్ భాగస్వామ్యమిది. రుతురాజ్, కాన్వే చెలరేగుతూ లక్నో బౌలర్లపై విరుచుకుపడ్డారు. అవేశ్ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లతో కాన్వే మొదలుపెట్టగా, గౌతమ్ వేసిన ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో రుతురాజ్ మూడు సిక్సర్లతో చెలరేగాడు. వుడ్ ఓవర్లోనూ 2 ఫోర్లు, సిక్స్‌తో 19 పరుగులు రాబట్టిన చెన్నై పవర్‌ప్లే ముగిసే సరికి 79 పరుగులు సాధించింది. ఈ క్రమంలో 25 బంతుల్లోనే రుతురాజ్ అర్ధసెంచరీ పూర్తయింది. కృనాల్ ఓవర్లో రెండు సిక్సర్లు కొట్టి కాన్వే తన జోరును కొనసాగించాడు. ఎట్టకేలకు బిష్ణోయ్ తన తొలి బంతికే వికెట్ తీసి రుతురాజ్‌ను వెనక్కి పంపడంతో భారీ భాగస్వామ్యానికి తెర పడింది. ఆ తర్వాత కొద్ది సేపటికే కాన్వే అవుట్ కాగా...మూడో స్థానంలో వచ్చిన శివమ్ దూబే (16 బంతుల్లో 27; 1 ఫోర్, 3 సిక్స్‌లు) కూడా మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఒక దశలో తాను ఎదుర్కొన్న వరుస నాలుగు బంతుల్లో అతను 6, 4, 6, 6తో చెలరేగిపోయాడు. అతని వికెట్ కూడా బిష్ణోయ్ ఖాతాలోకే చేరగా, అవేశ్ ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు కొట్టిన మొయిన్ అలీ (19)ని కూడా బిష్ణోయ్ అవుట్ చేశాడు. స్టోక్స్ (8), జడేజా (3) విఫలం కాగా...చివర్లో అంబటి రాయుడు (14 బంతుల్లో 27 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), ధోని (12) కలిసి స్కోరును 200 పరుగులు దాటించారు. లక్నో ప్రధాన బౌలర్ మార్క్ వుడ్ తన చివరి రెండు ఓవర్లలో 4 సిక్సర్లతో సహా మొత్తం 30 పరుగులు సమర్పించుకున్నాడు.

మేయర్స్ మినహా...

భారీ ఛేదనలో జట్టుకు అవసరమైన శుభారంభం లక్నోకు లభించింది. 35 బంతుల్లోనే ఓపెనర్లు 79 పరుగులు జోడించారు. ఇందులో మేయర్స్ మెరుపులే ఎక్కువగా ఉండగా, కేఎల్ రాహుల్ (20) ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యాడు. స్టోక్స్ ఓవర్లో వరుసగా 4, 4, 6 కొట్టిన మేయర్స్ చహర్ వరుస రెండు ఓవర్లలో కలిపి మొత్తం 5 ఫోర్లు బాదాడు. తుషార్ ఓవర్లోనూ 4, 6 కొట్టిన అతను 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. అయితే అలీ తన తొలి ఓవర్లోనే మేయర్స్‌ను అవుట్ చేసి లక్నో పతనానికి శ్రీకారం చుట్టాడు. ఆ తర్వాత ఏ దశలోనూ జెయింట్స్ కోలుకోలేకపోయింది. హుడా (2), కృనాల్ (9) విఫలం కాగా, స్టొయినిస్ (21) కూడా చెప్పుకోదగ్గ ప్రదర్శనే చేయలేదు. క్రీజ్‌లో ఉన్నంత సేపు నికోలస్ పూరన్ (18 బంతుల్లో 32; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడే ప్రయత్నం చేసినా జట్టు విజయానికి అది సరిపోలేదు. రాజ్‌వర్ధన్ ఓవర్లోనే వరుసగా 6, 4, 4 కొట్టిన పూరన్ జడేజా ఓవర్లో రెండు సిక్స్‌లు బాదాడు. 16వ ఓవర్ చివరి బంతికి పూరన్ అవుట్ కావడంలో లక్నో విజయావకాశాలు పూర్తిగా కోల్పోయింది.

స్కోరు వివరాలు:

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (సి) వుడ్ (బి) బిష్ణోయ్ 57; కాన్వే (సి) కృనాల్ (బి) వుడ్ 47; దూబే (సి) వుడ్ (బి) బిష్ణోయ్ 27; అలీ (స్టంప్డ్) పూరన్ (బి) బిష్ణోయ్ 19; స్టోక్స్ (సి) యష్ (బి) అవేశ్ 8; రాయుడు (నాటౌట్) 27; జడేజా (సి) బిష్ణోయ్ (బి) వుడ్ 3; ధోని (సి) బిష్ణోయ్ (బి) వుడ్ 12; సాన్‌ట్నర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 16; మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 217.
వికెట్ల పతనం: 1–110, 2–118, 3–150, 4–166, 5–178, 6–203, 7–215. **బౌలింగ్:** మేయర్స్ 2–0–16–0, అవేశ్ 3–0–39–1, కృనాల్ 2–0–21–0, గౌతమ్ 1–0–20–0, వుడ్ 4–0–49–3, యష్ ఠాకూర్ 4–0–36–0, రవి బిష్ణోయ్ 4–0–28–3.


మేయర్స్

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) రుతురాజ్ (బి) అలీ 20; మేయర్స్ (సి) కాన్వే (బి) అలీ 53; హుడా (సి) స్టోక్స్ (బి) సాన్‌ట్నర్ 2; కృనాల్ (సి) జడేజా (బి) అలీ 9; స్టొయినిస్ (బి) అలీ 21; పూరన్ (సి) స్టోక్స్ (బి) తుషార్ 32; బదోని (సి) ధోని (బి) తుషార్ 23; గౌతమ్ (నాటౌట్) 17; వుడ్ (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 205.** **వికెట్ల పతనం:** 1–79, 2–82, 3–82, 4–105, 5–130, 6–156, 7–195. **బౌలింగ్:** దీపక్ చహర్ 4–0–55–0, స్టోక్స్ 1–0–18–0, తుషార్ 4–0–45–2, మొయిన్ అలీ 4–0–26–4, సాన్‌ట్నర్ 4–0–21–1, రాజ్‌వర్ధన్ 2–0–24–0, జడేజా 1–0–14–0.

ఐపీఎల్‌లో నేడు
ఢిల్లీ × గుజరాత్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

ధోని ఫటాఫట్...



మ్యాచ్‌ను తన భుజస్కంధాలపై మోసే భారంనుంచి చాలా కాలంగా దూరమైన ధోని కొద్ది సేపు క్రీజ్‌లో ఉండి అభిమానులను అలరిస్తే చాలు అన్నట్లుగా ఆడుతున్నాడు. అతని ఆట చూసేందుకు చెపాక్ మైదానానికి భారీ సంఖ్యలో తరలివచ్చిన ఫ్యాన్స్‌ను అతను నిరాశపర్చలేదు. 6, 6, అవుట్...ఆడిన మూడు బంతుల్లోనే రెండు సిక్సర్లతో స్టేడియం హోరెత్తగా, సొంత జట్టు సభ్యులు కూడా ఆ సిక్సర్లకు సంబరాలు చేసుకున్నారు. తొలి మ్యాచ్‌లోనూ 7 బంతుల్లో ఫోర్, సిక్స్ బాదిన అతను 14 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ మ్యాచ్‌తో ధోని ఐపీఎల్‌లో 5 వేల పరుగులు కూడా పూర్తి చేసుకున్నాడు. లీగ్‌లో ఈ మైలురాయిని దాటిన ఏడో ఆటగాడిగా (కోహ్లి, ధావన్, వార్నర్, రోహిత్, రైనా, డివిలియర్స్ తర్వాత) నిలిచాడు.

మయామీ ఓపెన్ విజేత మెద్వెదెవ్



మయామీ: రష్యా స్టార్ డానిల్ మెద్వెదెవ్ ఈ ఏడాది తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ నాలుగో ఏటీపీ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ప్రతిష్టాత్మక ఏటీపీ మాస్టర్స్ 1000 టోర్నీలో మెద్వెదెవ్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో అతను 7–5, 6–3 స్కోరుతో జనిక్ సిన్నర్ (ఇటలీ)ని ఓడించాడు. 1 గంటా 34 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో మెద్వెదెవ్ 9 ఏస్‌లు కొట్టగా, సిన్నర్ 6 ఏస్‌లు బాదాడు. రష్యా ఆటగాడు 6 డబుల్ ఫాల్ట్‌లు చేసినా ఆ ప్రభావం ఫలితంపై పడకుండా సత్తా చాటడం విశేషం. 2023లో 24 మ్యాచ్‌లలో గెలిచి ఒకే ఒక మ్యాచ్‌లో ఓడిన మెద్వెదెవ్ ఖాతాలో ఇది నాలుగో టైటిల్ కాగా ఓవరాల్‌గా ఐదో ఏటీపీ మాస్టర్స్ టైటిల్.

'పవర్‌ప్లే'లోనే ఓడాం!


లారా

సాక్షి, హైదరాబాద్: రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో తమ ఓటమికి రెండు 'పవర్ ప్లే'లలో ప్రదర్శనే కారణమని సన్‌రైజర్స్ హైదరాబాద్ కోచ్ బ్రియాన్ లారా అభిప్రాయపడ్డాడు. 'ముందుగా రాజస్తాన్ పవర్‌ప్లేను అద్భుతంగా వాడుకొని 85 పరుగులు చేసింది. అదే మా వంతు వచ్చేసరికి పవర్‌ప్లేలో పరుగులే చేయలేకపోయాం. 200కుపైగా స్కోరు ఛేదిస్తూ తొలి ఓవర్లోనే 2 వికెట్లు కోల్పోతే కోలుకోవడం కష్టమే' అని లారా అన్నాడు.

అటు స్టార్, ఇటు జియో...

న్యూఢిల్లీ: ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రసారానికి సంబంధించి అటు టీవీలో, ఇటు డిజిటల్ వేదికపైనా కొత్త రికార్డులు నమోదయ్యాయి. చెన్నై, గుజరాత్ మధ్య జరిగిన మ్యాచ్‌ను వేర్వేరు దశల్లో కలిపి స్టార్ టీవీలో 140 బిలియన్ల మంది ప్రేక్షకులు కూడా చూశారని డిస్నీ స్టార్ సంస్థ ప్రకటించింది. మొత్తంగా 8.7 బిలియన్ నిమిషాల పాటు అభిమానులు స్టార్ స్పోర్ట్స్‌లో లీగ్ తొలి పోరును ఆస్వాదించారని ఆ సంస్థ పేర్కొంది. గత ఏడాదితో పోలిస్తే ఇది 47 శాతం ఎక్కువ కాగా, మొత్తంగా రేటింగ్స్ కూడా 29 శాతం పెరగడం విశేషం. మరో వైపు 'జియో సినిమా'లో ఫ్యాన్స్ కూడా ఐపీఎల్‌పైనే దృష్టి పెట్టారు. వారాంతంలో అభిమానుల ఆసక్తిని గమనిస్తే ఒక్కో మ్యాచ్‌ను ఒక్కో ప్రేక్షకుడు కనీసం 57 నిమిషాల పాటు డిజిటల్ వేదికపై చూశారని వయాకామ్ 18 స్పోర్ట్స్ ప్రకటించింది. గత ఏడాది ఐపీఎల్ మొత్తం సీజన్‌ను డిజిటల్‌లో చూసినదాంతో పోలిస్తే ఈ ఒక్క వారాంతంలోనే దానికి మించిన గణాంకాలు నమోదయ్యాయని వెల్లడించింది. అభిమానులు జియో సినిమాలో మొత్తం 147 కోట్ల వీడియోలు చూడగా... ఏకంగా 5 కోట్ల మంది యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం విశేషం.

హారిక ఓటమి, హంపి 'డ్రా'

న్యూఢిల్లీ: మహిళల గ్రాండ్ ప్రి చెస్ టోర్నీ తొమ్మిదో రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారికకు ఓటమి ఎదురైంది. రష్యాకు చెందిన అలెగ్జాండ్రా గొర్యాకినా 60 ఎత్తుల్లో హారికపై విజయం సాధించింది. మరో ఏపీ ప్లేయర్ కోనేరు హంపి 9వ రౌండ్ గేమ్‌ను డ్రా చేసుకుంది. భారత్‌కే చెందిన వైశాలితో జరిగిన ఈ గేమ్‌లో 31 ఎత్తుల తర్వాత ఇద్దరూ సమంగా నిలిచారు.

ఐపీఎల్‌నుంచి తప్పుకున్న షకీబ్



ఢాకా: బంగ్లాదేశ్ తరఫున అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాల్సి ఉండటంతో ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ ఈ ఏడాది ఐపీఎల్‌నుంచి పూర్తిగా తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు షకీబ్ ప్రాతినిధ్యం వహించాల్సి ఉంది. ఐర్లాండ్‌తో మార్చి 31న టి20 సిరీస్ ముగిసిన తర్వాత షకీబ్ తమ జట్టుతో కలుస్తాడని కేకేఆర్ యాజమాన్యం కొద్ది రోజుల క్రితం ప్రకటించింది. అయితే నేటినుంచి ఐర్లాండ్‌తో బంగ్లాదేశ్ టెస్టు మ్యాచ్ ఆడనుండగా...మే 9–14 మధ్య కెమ్స్‌ఫోర్డ్‌లో మూడు వన్డేల్లో బంగ్లా, ఐర్లాండ్ తలపడతాయి. ఇదే కారణంతో మరో బంగ్లా ఆటగాడు, కేకేఆర్ సభ్యుడే అయిన లిటన్ దాస్ కూడా ఐపీఎల్ ఆడే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. వేలం సమయంలో తమ ఆటగాళ్లు పూర్తి స్థాయిలో కాకపోయినా, కొన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటారని బంగ్లా బోర్డు ప్రకటించగా, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. షకీబ్ దూరమైతే కోల్‌కతా టీమ్‌లో ఆరుగురు విదేశీ ఆటగాళ్లే ఉంటారు.

సినిమా

ఆ మాట జీవితాంతం వినాలని ఉంది
- నాని




"దసరా' సినిమా విడుదల తర్వాత చాలామంది నాని.. 'దసరా'కి ముందు, 'దసరా' తర్వాత అంటున్నారు. నా గత చిత్రాలు 'భలే భలే మగాడివోయ్, నిన్ను కోరి, జెర్సీ'లకి కూడా ఇదే మాటలు విన్నాను. జీవితాంతం నేను చేసిన ప్రతి సినిమాకి ఈ మాట వినాలని ఉంది (నవ్వుతూ)" అని హీరో నాని అన్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని, కీర్తీ సురేష్ జంటగా నటించిన చిత్రం 'దసరా'. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా మార్చి 30న విడుదలైంది. ఈ సందర్భంగా నాని పంచుకున్న విశేషాలు.

- 'దసరా' కథని శ్రీకాంత్ చెప్పినప్పుడు అద్భుతంగా ఉందనిపించింది. మంచి సాంకేతిక నిపుణులను తనకు ఇచ్చి, ప్రోత్సహించాలని కథ వినగానే నిర్ణయించుకున్నాను. ఈ సినిమా చేస్తున్నప్పుడే శ్రీకాంత్ చాలా పెద్ద డైరెక్టర్ అవుతాడని చెప్పాను. ప్రేమ, స్నేహం, పగ.. యూనివర్సల్‌గా కనెక్ట్ అయ్యే ఎమోషన్స్, మన సంస్కృతిని సెలబ్రేట్ చేసుకునే సినిమా ఏదైనా దొరికితే అది అందరి దగ్గరకి తీసుకెళ్లడం మన బాధ్యత. 'దసరా' అలాంటి సినిమానే. అందుకే మిగతా భాషల్లోనూ రిలీజ్ చేయాలని నిర్ణయించుకున్నాం. ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులే కాదు.. ఉత్తరాదిలోనూ బాగా ఎంజాయ్ చేస్తున్నారు.
- 'దసరా' లొకేషన్‌లో ఎంజాయ్ చేస్తూ చేసిన సన్నివేశం ఏదీ లేదు. దుమ్ము, ధూళి, వేడి మధ్య చాలా కష్టపడి పని చేశాం. అయితే సన్నివేశాలు బాగా వస్తున్నాయనే ఫీలింగ్ షూటింగ్‌లోనే కలిగింది. ఈ సినిమా క్లయిమాక్స్‌ని ప్రేక్షకులతో కలసి థియేటర్‌లో చూడటానికి చాలా ఆత్రుతగా ఎదురు చూశాం.. మేము అనుకున్నట్టే క్లయిమాక్స్‌కి మంచి స్పందన వస్తోంది. 'దసరా' చూసినవారంతా గొప్పగా స్పందిస్తున్నారు. ఫోన్ కాల్స్‌తో పాటు ఎమోషనల్ మెసేజ్‌లు చేస్తుంటే చాలా ఆనందంగా ఉంది.
- రామ్‌చరణ్‌కు 'రంగస్థలం', అల్లు అర్జున్‌కి 'పుష్ప', నాకు 'దసరా' అని సోషల్ మీడియాలో వార్తలు రావడం చూశాను. ఆ మాటలకు నటుడిగా ఆనందపడతాను. కానీ తృప్తిపడను. ఎప్పుడైతే మనం తృప్తి పొందుతామో ఆ తర్వాత ప్రయత్నం చేయడంలో అలసత్వం వచ్చేస్తుంది. ఏ సినిమాకీ నేను తృప్తిపడను. ఆనందం మాత్రం ఉంటుంది.
- రస్టిక్ మూవీ చేయాలా? వేరే జానర్ మూవీ చేయాలా? అని నేను ప్లాన్ చేయను. 'దసరా' మాస్ సినిమా. పెద్ద బ్లాక్ బస్టర్ అయింది. ఈ సినిమా విడుదలకు ముందే నేను దాన్నుంచి బయటికి వచ్చేశాను. ఇప్పుడు ఓ సినిమాలో ఆరేళ్ల పాపకి తండ్రిగా చేస్తున్నాను. నటుడిగా వైవిధ్యం చూపిస్తూ అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించేలా సినిమాలు చేయాలనేది నా ఆలోచన. నా కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్స్‌లో 'దసరా, ఎంసీఏ, నేను లోకల్' ఉన్నాయి. నేను ఏ సినిమానీ జానర్‌వారీగా చూడను.. కథ నచ్చితే సినిమా చేసేస్తాను. అయితే ఏ జానర్‌ని కూడా రిపీట్ చేయకపోవడాన్ని సౌకర్యంగా భావిస్తాను.
- కొత్త దర్శకులని పరిచయం చేయాలని ప్రత్యేకంగా అనుకోను. కథ నచ్చితే చేస్తాను. అయితే నేను పరిచయం చేసిన దర్శకులు మంచి స్థానాల్లో ఉండటం గర్వంగా ఉంది. 'దసరా' తొలి ఆటకి మా అబ్బాయి జున్నుని తీసుకెళ్లాను. నా ఫ్యాన్స్ అరుస్తూ, పేపర్లు విసిరేస్తుంటే.. ఎందుకు అలా చేస్తున్నారో వాడికి అర్థం కాలేదు. పేపర్లు వేస్ట్ అవుతున్నాయంటూ టెన్షన్ పడ్డాడు (నవ్వుతూ).
- ప్రభాస్, మహేశ్‌గార్లతో పాటు ఇండస్ట్రీలోని చాలామంది 'దసరా'ని మెచ్చుకుంటూ మెసేజ్‌లు పెట్టడం చాలా ఆనందంగా ఉంది. 'జెర్సీ, శ్యామ్ సింగరాయ్' సమయంలో కూడా చిరంజీవి, రామ్‌చరణ్, ఎన్టీఆర్, ప్రభాస్, మహేశ్‌బాబుగార్లు మెసేజ్ చేశారు. ఇది ఆనందంతో పాటు బాధ్యతని కూడా పెంచుతుంది. నా చిత్రాలను చాలామంది వేరే చిత్రాల బాక్సాఫీసు లెక్కలతో పోలుస్తారు. ప్రతి సినిమాకి ఒక లక్ష్యం ఉంటుంది.. ప్రేక్షకులు దాన్ని అర్థం చేసుకోవాలి. ప్రతి మూవీని ప్రత్యేకంగా చూడాలి.

వేసవిలో ఉగ్రం

'నాంది' వంటి హిట్ చిత్రం తర్వాత హీరో 'అల్లరి' నరేశ్, డైరెక్టర్ విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో రూపొందిన మరో చిత్రం 'ఉగ్రం'. మీర్నా మీనన్ హీరోయిన్. వేసవిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించిన ఈ సినిమాని మే 5న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'ఉగ్రం'. ఇప్పటికే రిలీజ్ చేసిన ఈ మూవీ టీజర్‌కి, 'దేవేరి..' అనే తొలి పాటకి అద్భుతమైన స్పందన వచ్చింది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సిద్, సంగీతం: శ్రీ చరణ్ పాకాల.


'అల్లరి' నరేశ్


దేవ్ మోహన్, రష్మికలపై క్లాప్ ఇస్తున్న అమల

రొమాంటిక్ రెయిన్‌బో

హీరోయిన్ రష్మికా మందన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న 'రెయిన్‌బో' చిత్రం షురూ అయింది. శాంతరూబన్ దర్శకునిగా పరిచయమవుతున్న ఈ సినిమాలో నటుడు దేవ్ మోహన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్‌పై ఎస్ఆర్. ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్. ప్రభు నిర్మిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత అల్లు అరవింద్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నటి అమల అక్కినేని క్లాప్ కొట్టారు. నిర్మాత సురేష్‌బాబు స్క్రిప్టుని యూనిట్‌కి అందించారు. రష్మికా మందన్నా మాట్లాడుతూ– ''రెయిన్‌బో' చేస్తున్నందుకు చాలా ఎగ్జయిటింగ్‌గా ఉంది'' అన్నారు. ''ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 7న ప్రారంభం అవుతుంది'' అన్నారు ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్. ప్రభు. ''రొమాంటిక్ ఫ్యాంటసీ ఎంటర్‌టైనర్ చిత్రమిది'' అన్నారు శాంతరూబన్. ఈ ప్రారంభోత్సవానికి నిర్మాతలు కేకే రాధామోహన్, దామోదర్ ప్రసాద్, పి. కిరణ్, శరత్ మరార్, సుప్రియ అక్కినేని, దర్శకులు వెంకీ కుడుముల, శశికిరణ్, హీరో సందీప్ కిషన్ తదితరులు హాజరై చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: కేఎం భాస్కరన్, సంగీతం: జస్టిన్ ప్రభాకరన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: తంగ ప్రభాకరన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అరవేంద్ర రాజ్ భాస్కరన్.

దుబాయ్‌లో బేబీ షవర్


రామ్‌చరణ్, ఉపాసన

రామ్‌చరణ్–ఉపాసన ఫుల్ జోష్‌లో ఉన్నారు. తల్లిదండ్రులు కాబోతున్న ఆనందం అది. ఇటీవల లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ఆస్కార్ అవార్డు వేడుకకు హాజరైన ఈ దంపతులు ప్రస్తుతం దుబాయ్‌లో ఉన్నారు. అక్కడి నమ్మోస్ బీచ్ క్లబ్‌లో ఉపాసన బేబీ షవర్ జరిగింది. ఈ వేడుకలో రామ్‌చరణ్, ఉపాసనల స్నేహితులు, కజిన్స్ పాల్గొన్నారని సమాచారం. కొన్ని ఫొటోలను ఉపాసన షేర్ చేశారు. వేడుకలో తెలుపు రంగు గౌనులో ఆమె మెరిసిపోయారు. కొన్నాళ్లు దుబాయ్‌లో వెకేషన్‌ని ఎంజాయ్ చేసి, చరణ్–ఉపాసన ఇండియా చేరుకుంటారట. ఆ తర్వాత శంకర్ దర్శకత్వంలో చేస్తున్న 'గేమ్ చేంజర్' సినిమా షూట్‌లో పాల్గొంటారు చరణ్.

నాలుగు భాషల్లో మిషన్


అమీ జాక్సన్, అరుణ్ విజయ్

అరుణ్ విజయ్ హీరోగా రూపొందుతోన్న చిత్రం 'మిషన్: చాప్టర్ 1'. విజయ్ దర్శకత్వంలో ఎం. రాజశేఖర్, ఎస్. స్వాతి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ''2.0, పొన్నియిన్ సెల్వన్, ఇండియన్ 2' వంటి భారీ చిత్రాలతో ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్న లైకా ప్రొడక్షన్స్ తాజాగా 'మిషన్: చాప్టర్ 1'ని విడుదల చేయాలనుకోవడానికి కారణం ఈ చిత్ర కథాంశమే. అరుణ్ విజయ్‌ను నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్లేలా ఈ చిత్రం ఉంటుంది. చాలా గ్యాప్ తర్వాత అమీ జాక్సన్ ఈ చిత్రంతో మళ్లీ తెరపై కనిపించనున్నారు. ఈ సినిమా కోసం లండన్ జైలును పోలి ఉండేలా చెన్నైలో ఓ భారీ జైలు సెట్ వేశాం. స్టంట్ సిల్వ ఈ చిత్రానికి యాక్షన్ కొరియోగ్రఫీ అందించారు. రిస్కీ యాక్షన్ సీన్స్‌ని అరుణ్ విజయ్ అద్భుతంగా చేశారు. భాషాపరమైన హద్దులు లేకుండా అందర్నీ ఆకట్టుకునేలా ఈ చిత్రం ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది.

ఒకరు ప్రపంచం.. మరొకరు ప్రాణం


నయనతార, విఘ్నేష్ శివన్

హీరోయిన్ నయనతార–దర్శకుడు విఘ్నేష్ శివన్ గత ఏడాది జూన్‌లో పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. అక్టోబర్‌లో కవలలకు తల్లిదండ్రులైనట్లు ఈ దంపతులు ప్రకటించారు. సరోగసీ విధానం ద్వారా ఈ ఇద్దరూ పేరెంట్స్ అయ్యారు. కాగా, తాజాగా జరిగిన ఓ అవార్డు వేడుకలో తమ ఇద్దరు కుమారుల పేర్లను వెల్లడించారు నయనతార. ఒకరి పేరు ఉయిర్ రుద్రోనీల్ ఎన్ శివన్, ఇంకో బాబు పేరు ఉలగ్ దైవిక్ ఎన్ శివన్. ఉలగ్ (ఉలగం అంటారు) అంటే ప్రపంచం అని, ఉయిర్ అంటే ప్రాణం అని అర్థం. కుమారులిద్దరూ తమ ప్రపంచం, ప్రాణంగా భావించి ఈ పేర్లను ఎన్నుకుని ఉంటారు. అలాగే రుద్రోనీల్ అంటే శివుడిని, ఇంకో బాబు పేరులో ఉన్న దైవిక్ అంటే దైవత్వాన్ని సూచిస్తున్నాయి. ఇక ఇద్దరి పేర్లలో ఉన్న 'ఎన్' నయనతార పేరులో ఉన్న అక్షరం. శివన్ అంటే విఘ్నేష్ శివన్ పేరులో సగం. ఇలా ప్రేమ, దైవత్వం, తమ పేర్లు కలిసొచ్చేలా కుమారులకు ఈ దంపతులు పేర్లు పెట్టారు.

అందుకే వెంటనే ఓకే చెప్పాను
- సుశాంత్

''రావణాసుర' వైవిధ్యమైన చిత్రం. ఇలాంటి కాన్సెప్ట్ తెలుగు సినిమాల్లో ఇప్పటివరకూ రాలేదు. అందుకే కథ వినగానే నటించేందుకు ఓకే చెప్పాను'' అని సుశాంత్ అన్నారు. రవితేజ హీరోగా సుధీర్‌వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రావణాసుర'. అభిషేక్ నామా, రవితేజ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర చేసిన సుశాంత్ మాట్లాడుతూ– ''రావణాసుర' టైటిల్ రోల్‌ని రవితేజగారు చేశారు. నేను రామ్ పాత్ర చేశా. మా ఇద్దర్నీ సుధీర్‌గారు సరికొత్తగా చూపించారు. నా పాత్రని ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారనే ఎగ్జయిట్‌మెంట్ ఉంది. 'రావణాసుర' కంప్లీట్ థ్రిల్లర్. వెర్సటైల్ యాక్టర్‌గా అన్ని రకాల పాత్రలు చేయాలనేది నా ఆలోచన. ఈ సినిమాలో ఆ కొత్తదనం కనిపిస్తుంది. 'రావణాసుర'లో నన్ను తీసుకోవాలనే ఆలోచన అభిషేక్‌గారిదే. ఇందుకు ఆయనకు థ్యాంక్స్. 'అల వైకుంఠపురములో' చిత్రం నాకు మంచి పేరు తీసుకొచ్చింది. ఉత్తరాదిలో కూడా ఫేమ్ తీసుకొచ్చింది. అయితే ఆ సినిమా తర్వాత చాలా అవకాశాలు వచ్చినా నన్ను ఎగ్జయిట్ చేసిన 'రావణాసుర, భోళా శంకర్..' లాంటి సినిమాలు మాత్రమే ఒప్పుకున్నాను. అక్కినేని ఫ్యామిలీ నుంచి ఇండస్ట్రీకి రావడం నా లక్. నేను మొదటి నుంచి కూడా నాకు వస్తున్న అవకాశాలతోనే ముందుకువెళ్లాను. కొన్ని సినిమాల షూటింగ్ ఆలస్యం కావడం, అనుకున్న టైమ్‌కి విడుదల కాకపోవడం వల్ల గ్యాప్ వస్తోంది. 'చిలసౌ' తర్వాత ఇక గ్యాప్ తీసుకోకూడదని నిర్ణయించుకున్నాను. అయితే కోవిడ్ వల్ల గ్యాప్ వచ్చింది. కానీ ఆరు నెలలుగా బిజీగా ఉన్నాను. 'భోళా శంకర్'లో కీ రోల్ చేస్తున్నాను. అలాగే సోలో హీరోగా ఒక కథ ఓకే చేశాను'' అన్నారు.



సాక్షి బిజినెస్

మంగళవారం
4-4-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	115	59,106
నిఫ్టీ ▲	38	17,398

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ వారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,102	▽	120
డోజోన్స్	33,518	▲	243
ఎఫ్‌టీఎస్ఈ 100	7,673	▲	41
డాక్స్	15,581	▽	48
షాంఘై	3,296	▲	23
నికాయ్	28,118	▲	147

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	59,715
బంగారం (22 క్యారట్)	59,476
వెండి (కేజీ)	71,700

రిలయన్స్ డిజిటల్ డిస్కౌంట్ డేస్



హైదరాబాద్: రిలయన్స్ డిజిటల్ డిస్కౌంట్ డేస్ పేరుతో భారీ ఆఫర్లు ప్రకటించింది. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కొనుగోళ్లపై అత్యుత్తమ డీల్స్‌తో పాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కార్డులపై 7.5% వరకు తక్షణ డిస్కౌంట్ అందిస్తుంది. అదనంగా రూ.1000 విలువైన డిస్కౌంట్ కూపన్స్ ఇస్తుంది. టీవీలు, స్మార్ట్ ఫోన్స్, ల్యాప్‌టాప్స్, టీవీలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, స్మార్ట్ వాచీలు, కిచెన్ పరికరాలపై ఆకర్షణీయమైన డీల్స్ ఉన్నాయి. ఈ ఏప్రిల్ తొమ్మిదో తేదీ వరకూ డిజిటల్ డిస్కౌంట్ డేస్ కొనసాగుతాయని, రిలయన్స్ డిజిటల్, మై జియో స్టోర్లలో కస్టమర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కంపెనీ కోరింది.

2022-23లో ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.16.61 లక్షల కోట్లు

18 శాతం అప్



న్యూఢిల్లీ: భారత్ నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు మార్చితో ముగిసిన 2022-23 ఆర్థిక సంవత్సరంలో 2021-22 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 18 శాతం పెరిగి, రూ.16.61 లక్షల కోట్లకు ఎగశాయి. ఆర్థిక శాఖ తాజా గణాంకాలను విడుదల చేసింది. 2021-22లో నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.14.12 లక్షల కోట్లు. రిఫండ్స్‌ను సర్దుబాటు చేయకుండా స్థూలంగా చూస్తే, పన్ను వసూళ్లు రూ.19.68 లక్షల కోట్లని ఆర్థికశాఖ వివరించింది. వీటిలో నుంచి మార్చి 31 వరకూ రూ.3.07 లక్షల కోట్ల రిఫండ్స్ జరిగాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-4-2023	
విశాఖ	430-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	417-00
విజయవాడ	417-00
రిటైల్ ధర (డజను)	66.00
3-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	405-00
వరంగల్	407-00
రిటైల్ ధర	4.65

ఆర్‌బీఐ తొలి ద్వైమాసిక పాలసీ సమీక్ష ప్రారంభం

6న కీలక నిర్ణయాలు



ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) తొలి ద్వైమాసిక మూడు రోజుల సమావేశాలు ప్రారంభమయ్యాయి. గవర్నర్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కమిటీ కీలక నిర్ణయాలు 6వ తేదీన వెలువడనున్నాయి. 3, 5, 6 తేదీల్లో సమావేశాలు జరుగుతాయి. 4వ తేదీ మహావీర్ జయంతి సందర్భంగా సెలవు. ఈ సమావేశాల్లో రెపో రేటును మరో పావుశాతం పెంపునకు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్న విశ్లేషణలు ఉన్నాయి. ఇదే జరిగితే బ్యాంకులకు ఆర్‌బీఐ తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు 6.75 శాతానికి పెరగనుంది. ఉక్రెయిన్‌పై రష్యా దాడి, అంతర్జాతీయంగా క్రూడ్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం తీవ్రత నేపథ్యంలో దీర్ఘకాలంగా 4 శాతంగా ఉన్న రెపో రేటు, మే 4వ తేదీన మొదటిసారి 0.40 శాతం పెరిగింది. జూన్ 8, ఆగస్టు 5, సెప్టెంబర్ 30 తేదీల్లో అరశాతం చొప్పున పెరుగుతూ, 5.9 శాతానికి చేరింది. డిసెంబర్ 7న ఈ రేటు పెంపు 0.35 శాతం ఎగసి 6.25 శాతాన్ని తాకింది. ఫిబ్రవరి మొదట్లో జరిగిన ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధానంలో వరుసగా ఆరవసారి (పావు శాతం) రేటు పెంపుతో మే నుంచి 2.5 శాతం రెపో రేటు పెరిగింది. ఈ రేటు 6.5 శాతానికి ఎగసింది.

సైయంట్ సీఈవోగా కార్తీక్ నటరాజన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సైయంట్ కొత్త సీఈవోగా కార్తీక్ నటరాజన్ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా, ఈడీగా ఉన్నారు. ఇప్పటివరకూ సీఈవోగా ఉన్న కృష్ణ బోదనపు ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, ఎండీగా పదోన్నతి పొందారు. ఏరోస్పేస్ తదితర విభాగాల గ్లోబల్ హెడ్ ప్రభాకర్ అట్ల.. సీఎఫ్‌వోగా నియమితులయ్యారు. సంస్థను 2 విభాగాలుగా విడదీసే పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళికను కూడా సైయంట్ డైరెక్టర్ల బోర్డు ఆమోదించింది. సైయంట్ డీఎల్ఎం(డిజైన్ లెడ్ మాన్యుఫాక్చరింగ్) వ్యాపార విభాగం పబ్లిక్ ఇష్యూకి వచ్చే దిశగా సెబీకి ప్రాస్పెక్టస్‌ను సమర్పించింది. సైయంట్ డీఎల్ఎంకి ఆంటోనీ మాంటల్‌బానో సీఈవోగా వ్యవహరిస్తారు.

మార్చిలో తయారీ రంగం పరుగు

56.4కు ఎస్అండ్‌పీ సూచీ అప్



న్యూఢిల్లీ: భారత్ తయారీ రంగం మార్చిలో మంచి పురోగతి కనబరచింది. ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా మాన్యుఫాక్చరింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) మూడు నెలల గరిష్ట స్థాయిలో 56.4కు వద్దకు చేరింది. డిమాండ్ ఊపందుకోవడంతో కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి పెరిగినట్లు నెలవారీ సర్వే పేర్కొంది. ద్రవ్యోల్బణం ఒత్తిడులు తగ్గినట్లూ వివరించింది. ఫిబ్రవరిలో పీఎంఐ 55.3గా నమోదయ్యింది. అయితే సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగానే భావించడం జరుగుతుంది. ఆ లోపునకు పడిపోతేనే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన సూచీ వృద్ధి బాటన కొనసాగడం వరుసగా 21వ నెల. ఉద్యోగ కల్పన విషయానికి వస్తే, మార్చిలో పేరోల్ సంఖ్యలో దాదాపు మార్పులేదు. ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో సంస్థలు ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ ఎకనమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పోలీయానా డీ లిమా పేర్కొన్నారు.

లాభాలతో కొత్త ఏడాదిలోకి!

- ఒడిదుడుకులున్నా.., మూడోరోజూ ముందుకే
- ఆటో, బ్యాంకింగ్ షేర్లకు డిమాండ్
- 59 వేలపైకి సెన్సెక్స్
- నిఫ్టీ లాభం 38 పాయింట్లు
- మహావీర్ జయంతి సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు



ముంబై: కొత్త ఆర్థిక సంవత్సరం తొలి ట్రేడింగ్ రోజైన సోమవారం స్టాక్ మార్కెట్ లాభాలతో ముగిసింది. ఆటో, బ్యాంకింగ్, వినిమయ షేర్లు రాణించడంతో మార్కెట్ మూడోరోజూ ముందడుగేసింది. భారత తయారీ రంగ కార్యకలాపాలు మార్చిలో పుంజుకొని మూడు నెలల గరిష్టానికి చేరుకోవడం కలిసొచ్చింది. ఉదయం సానుకూలంగా ట్రేడింగ్ ప్రారంభించిన సూచీలు కొద్దిసేపటికే నష్టాల్లోకి మళ్లాయి. రోజంతా పరిమిత శ్రేణిలో తీవ్ర ఊగిసలాటకు లోనయ్యాయి. అయితే చివరి గంటలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఉదయం సెన్సెక్స్ 139 పాయింట్ల లాభంతో 59,131 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 412 పాయింట్ల పరిధిలో 58,793 వద్ద కనిష్టాన్ని, 59,205 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 115 పాయింట్ల లాభంతో 59,106 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 68 పాయింట్లు బలపడి 17,428 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 17,313-17,428 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 38 పాయింట్లు పెరిగి 17,398 వద్ద ముగిసింది. ఎఫ్ఎంసీజీ, ఐటీ, ఇంధన షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఎఫ్‌పీఐలు రూ.322 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.328 కోట్ల షేర్లను అమ్మేశారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 9 పైసలు క్షీణించి 82.30 స్థాయి వద్ద స్థిరపడింది. మహవీర్ జయంతి సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు కావడంతో ఎక్స్ఛేంజీలు తిరిగి బుధవారం ప్రారంభమవుతాయి. ముడిచమురు ధరలు పెరుగుదలతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి. ''ఈ వారంలో ట్రేడింగ్ మూడురోజులకే పరిమితం కావడంతో పాటు ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ కీలక నిర్ణయాలను వెల్లడించనున్న నేపథ్యంలో ట్రేడర్లు పొజిషన్లను తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. మార్చిలో ఆటో అమ్మకాలు గణనీయంగా పెరగడంతో పాటు భారత తయారీ రంగ కార్యకలాపాలు పుంజుకొని మూడు నెలల గరిష్టానికి చేరుకోవడం మార్కెట్లో ఒత్తిళ్లను తగ్గించాయి'' అని జియోజిత్ ఫైనాన్షియల్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- హీరో మోటోకార్ప్స్ షేరు నాలుగుశాతం లాభపడి రూ.2,434 వద్ద ముగిసింది. వార్షిక ప్రాతిపదికన మార్చి విక్రయాలు 15% వృద్ధిని సాధించడంతో ఈ కంపెనీ షేరుకు డిమాండ్ నెలకొంది.
- అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ జేపీ మోర్గాన్ రేటింగ్ తగ్గించడంతో కేపీఐటీ టెక్నాలజీ షేరు 12 శాతం క్షీణించి రూ.810 వద్ద నిలిచింది.
- పలు ఆర్డర్లను దక్కించుకోవడంతో రైల్ వికాస్ నిగమ్ షేరు 10% ఎగసి రూ.75 వద్ద నిలిచింది.

ఎస్‌బీఐ ఆన్‌లైన్ సేవలకు అంతరాయం



ముంబై: సాంకేతిక సమస్యలు తలెత్తడంతో సోమవారం ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఆన్‌లైన్ బ్యాంకింగ్ సర్వీసులకు కొన్ని గంటల పాటు అంతరాయం కలిగింది. దీంతో పెద్ద సంఖ్యలో కస్టమర్లు ఇబ్బంది పడ్డారు. సర్వీస్ అంతరాయంపై చాలా మంది కస్టమర్లు సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో ఆందోళన వ్యక్తం చేశారు. యోనో బ్యాంకింగ్ యాప్ పని చేయడం లేదని, ఆన్‌లైన్‌లో లావాదేవీలు సాధ్యపడటం లేదని ఫిర్యాదులు చేశారు. ఆ తర్వాత సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేసిన ఎస్‌బీఐ.. సాంకేతిక సమస్య పరిష్కారమైనట్లు వెల్లడించింది. 'ఏప్రిల్ 3న కొద్ది గంటల పాటు సాంకేతిక సమస్య వల్ల మా డిజిటల్ సర్వీసుల్లో కొన్నింటిపై ప్రతికూల ప్రభావం పడిందని తెలియజేయడానికి చింతిస్తున్నాము. ప్రస్తుతం సమస్య పరిష్కారమైంది. డిజిటల్ సర్వీసులను పునరుద్ధరించాం' అని పేర్కొంది. అయితే కచ్చితంగా సమస్య ఏమిటి, ఏయే సర్వీసులపై.. ఎంత సేపు ప్రభావం పడింది తదితర వివరాలు మాత్రం వెల్లడించలేదు. ఇలాగే పలుమార్లు సాంకేతిక లోపాలు తలెత్తడంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు రిజర్వ్ బ్యాంక్ గతంలో జరిమానా విధించింది.

స్పైస్‌జెట్ కార్గో, లాజిస్టిక్స్ విభాగం విడదీత



ముంబై: విమానయాన సంస్థ స్పైస్‌జెట్ తమ కార్గో, లాజిస్టిక్స్ వ్యాపార విభాగం స్పైస్ఎక్స్‌ప్రెస్‌ను ప్రత్యేక విభాగంగా విడదీసింది. ఏప్రిల్ 1 నుంచి దీన్ని స్పైస్ఎక్స్‌ప్రెస్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా వ్యవహరిస్తున్నట్లు సంస్థ తెలిపింది. లాజిస్టిక్స్ వ్యాపార విభాగం స్వతంత్రంగా నిధులను సమీకరించుకునేందుకు ఇది ఉపయోగపడగలదని సంస్థ చైర్మన్ అజయ్ సింగ్ తెలిపారు. 2022-23 ఏప్రిల్-డిసెంబర్ మధ్య వ్యవధిలో స్పైస్ఎక్స్‌ప్రెస్ రూ. 51 కోట్ల నికర లాభం నమోదు చేసింది. డీల్ ప్రకారం స్పైస్‌జెట్‌కు స్పైస్ఎక్స్‌ప్రెస్ రూ. 2,556 కోట్ల విలువ చేసే ఈక్విటీ షేర్లు, డిబెంచర్లు జారీ చేయనుంది. కార్లైల్ ఏవియేషన్ పార్ట్‌నర్ చెల్లించాల్సిన 100 మిలియన్ డాలర్ల రుణాన్ని గత నెల పునర్‌వ్యవస్థీకరించుకున్నామని అజయ్ సింగ్ పేర్కొన్నారు. తాజాగా లాజిస్టిక్స్ విభాగం విడదీతతో స్పైస్‌జెట్ బ్యాలెన్స్ షీటు మరింత పటిష్టంగా మారగలదని, కంపెనీ నెగటివ్ నికర విలువ భారం గణనీయంగా తగ్గగలదని ఆయన వివరించారు.

విద్య, ఉద్యోగ సమాచారం

పీజీసీఐఎల్‌లో 138 ఇంజనీర్ ట్రైనీ పోస్టులు

పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్).. ఇంజనీర్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 138
» **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ -టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్-ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్/టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ ఇంజనీరింగ్/ఐటీ తదితరాలు.
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్(ఎలక్ట్రికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణులవ్వాలి. గేట్ 2023 అర్హత సాధించాలి.
» **ఎంపిక విధానం:** గ్రూప్ డిస్కషన్/ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.04.2023.
» **వెబ్‌సైట్:** www.powergrid.in

కర్నూలు వైద్య కళాశాలలో డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్టులు

కర్నూలులోని కర్నూలు మెడికల్ కాలేజీ, మైక్రోబయాలజీ విభాగం.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
» **పోస్టుల వివరాలు:** ల్యాబ్ టెక్నీషియన్-01, డేటాఎంట్రీ ఆపరేటర్-01.
» **అర్హత:** డిగ్రీ, డిప్లొమా, ఎంఎల్‌టీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు ఎల్‌టీ పోస్టులకు రూ.30,000, డీఈవోకు రూ.20,000.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తును స్పీడ్/రిజిస్టర్ పోస్టు లేదా వ్యక్తిగతంగా ప్రిన్సిపాల్, కర్నూలు మెడికల్ కళాశాల, కర్నూలు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 04.04.2023.
» **రాతపరీక్ష, ఇంటర్వ్యూ తేది:** 21.04.2023.
» **ఎంపిక జాబితా వెల్లడితేది:** 28.04.2023.
» **వెబ్‌సైట్:** www.kurnool.ap.gov.in

తెలంగాణ ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలు

తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని 23 ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశాలకు 7, 8, 9 తరగతుల్లో మిగిలిపోయిన బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి సంబంధించి ప్రవేశ ప్రకటన వెలువడింది.

» **పరీక్ష పేరు:** ఈఎంఆర్ఎస్ సెలక్షన్ టెస్ట్(ఈఎంఆర్ఎస్ఎస్‌టీ), ఈఎంఆర్ఎస్ లేటర్ ఎంట్రీ టెస్ట్(ఈఎంఆర్ఎస్ఎల్‌టీ).
» **మొత్తం సీట్ల సంఖ్య:** 233.
» **సీట్ల వివరాలు:** ప్రతి ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయంలో ఆరో తరగతిలో 60 సీట్ల చొప్పున మొత్తం 23 విద్యాలయాల్లో 1380(690 బాలురు, 690 బాలికలు) సీట్లు ఉన్నాయి. ఏడో తరగతిలో 26(18 బాలికలు, బాలురు 8), ఎనిమిదో తరగతిలో 103(55 బాలికలు, బాలురు 48), తొమ్మిదో తరగతిలో 104(59 బాలికలు, బాలురు 45).
» **అర్హత:** ఆరో తరగతిలో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు తప్పనిసరిగా 2022-23 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివి ఉండాలి. 7, 8, 9 తరగతుల్లో ప్రవేశానికి వరుసగా 6, 7, 8 తరగతుల్లో ఉత్తీర్ణులై ఉండాలి. విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్ష(పట్టణ ప్రాంతం), రూ.లక్షన్నర(గ్రామీణ ప్రాంతం) మించకూడదు.
» **వయసు:** 31.03.2023 నాటికి ఆరో తరగతికి 10-13ఏళ్లు,ఏడో తరగతికి 12-15ఏళ్లు, ఎనిమిదో తరగతికి 13-16 ఏళ్లు, తొమ్మిదో తరగతికి 14-17 ఏళ్ల మధ్య ఉండాలి. దివ్యాంగులకు రెండేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా విద్యార్థులను ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** ఆరో తరగతికి 100 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ, అర్థమేటిక్, లాంగ్వేజ్ అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు. 7, 8, 9 తరగతులకు 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇంగ్లిష్, రీజనల్ లాంగ్వేజ్, మ్యాథ్స్, సైన్స్, సోషల్ సైన్స్ అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో పరీక్షనిర్వహిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.04.2023.
» **ప్రవేశ పరీక్ష తేది:** 07.05.2023.
» **పరీక్ష ఫలితాల ప్రకటన తేది:** 30.05.2023.
» **మొదటి దశ ప్రవేశాలు:** 01.06.2023 నుంచి 10.06.2023.
» **వెబ్‌సైట్:** https://fastses.telangana.gov.in

వినూత్న బోధనకు కేరాఫ్.. కేవీలు!

» కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశ ప్రక్రియ ప్రారంభం
» ప్రాథమిక స్థాయి నుంచే వినూత్న విధానంలో బోధన
» యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు ప్రాధాన్యం

స్కూల్ విద్య..విద్యార్థి జీవితంలో ఎంతో ప్రధానమైన దశ! భవిష్యత్‌కు పునాది పాఠశాల చదువు!! కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని కేంద్రీయ విద్యాలయాలు(కేవీ).. యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు ప్రాధాన్యమిస్తూ.. పిల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీసి, నైపుణ్యాలకు పదును పెడుతున్నాయి. వీటిల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటి నుంచి 11వ తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. కేంద్రీయ విద్యాలయాల ప్రత్యేకత, విద్యాబోధన, ప్రవేశ విధానం తదితర వివరాలు..



కేంద్రీయ విద్యాలయాలు వినూత్న బోధనకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో దశాబ్దాల క్రితమే కేవీలు ఏర్పాటయ్యాయి. ప్రారంభంలో వీటిని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, త్రివిధ దళాల ఉద్యోగుల పిల్లలకు మాత్రమే ఉద్దేశించినప్పటికీ.. తర్వాత కాలంలో సామాన్య పౌరుల పిల్లలకు కూడా ప్రవేశాలు కల్పిస్తున్నారు. మారుతున్న విద్యా వ్యవస్థకు అనుగుణంగా బోధనలో మార్పులుచేస్తూ.. నాణ్యమైన విద్యకు నిలయంగా నిలుస్తున్నాయి కేంద్రీయ విద్యాలయాలు.

ఎన్ఈపీ మేరకు వయో పరిమితి

కేవీల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు ఇటీవల నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో నూతన విద్యా విధానానికి అనుగుణంగానే వయో పరిమితి నిబంధనలు పేర్కొన్నారు. అన్ని తరగతులకు సంబంధించి వయో పరిమితికి మార్చి 31వ తేదీని గడువు తేదీగా పరిగణిస్తారు. ఉదాహరణకు..ఒకటో తరగతిలో చేరాలనుకుంటే.. మార్చి 31 నాటికి విద్యార్థి వయసు ఆరు నుంచి ఎనిమిదేళ్ల మధ్యలో ఉండాలి. అదేవిధంగా రెండు, మూడో తరగతుల్లో ప్రవేశానికి 7-9ఏళ్లు, ఐదో తరగతి 9-11ఏళ్లు, ఆరో తరగతికి 10-12 ఏళ్లు, ఏడో తరగతికి 11-13ఏళ్లు, ఎనిమిదో తరగతికి 12-14ఏళ్లు, తొమ్మిదో తరగతికి 13-15ఏళ్లు, పదో తరగతికి 14-16ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

విభిన్న కేటగిరీలకు ప్రాధాన్యతలు

- కేవీల్లో ప్రవేశాల ఖరారుకు విభిన్న కేటగిరీల ఉద్యోగులను పరిగణనలోకి తీసుకుంటూ.. నిర్దిష్ట ప్రాధాన్యత క్రమాన్ని అనుసరిస్తున్నారు.
- **కేటగిరీ-1:** బదిలీయైన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, సాధారణ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు.
- **కేటగిరీ-2:** కేంద్ర ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి సంస్థలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ ఆఫ్ ది ఇండియన్ గవర్నమెంట్‌కు సంబంధించి బదిలీయైన, సాధారణ ఉద్యోగుల పిల్లలు.
- **కేటగిరీ-3:** బదిలీయైన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, సాధారణ ఉద్యోగుల పిల్లలు.
- **కేటగిరీ-4:** రాష్ట్ర ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి సంస్థలు, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్, రాష్ట్ర ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ సంబంధించి బదిలీయైన, సాధారణ ఉద్యోగుల పిల్లలు.
- **కేటగిరీ-5:** పై కేటగిరీలకు చెందని ఇతర వర్గాలకు చెందిన పిల్లలు.

ఆర్‌టీఈ ప్రకారం-25 సీట్లు

విద్యార్థులకు సీట్లు కేటాయించే క్రమంలో విద్యా హక్కు చట్టం నిబంధనలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఒక పాఠశాలలోని మొత్తం సీట్లలో 25 శాతం సీట్లను ఆర్‌టీఈ విధానంలో కేటాయిస్తారు. అదే విధంగా 15 శాతం సీట్లను ఎస్సీ కేటగిరీ విద్యార్థులకు, 7.5 శాతం సీట్లను ఎస్టీ కేటగిరీ విద్యార్థులకు, 27 శాతం సీట్లను ఓబీసీ-నాన్ క్రీమీ లేయర్ కేటగిరీ విద్యార్థులకు కేటాయిస్తారు. అన్ని రిజర్వేషన్ కేటగిరీ వర్గాలకు అందుబాటులో ఉన్న సీట్లలో 3 శాతం సీట్లను ఆ వర్గాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు కేటాయిస్తారు.

లాటరీ విధానంలో ఎంపిక

- ఎంపిక ప్రక్రియలో ఆయా కేటగిరీలు,రిజర్వేషన్లను అనుసరించి లాటరీ విధానంలో నిర్దిష్ట క్రమంలో సీట్ల కేటాయింపు చేస్తారు. మొదట ఆర్‌టీఈ విధానంలో, తర్వాత అన్ని వర్గాల దివ్యాంగ విద్యార్థులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారు.
- ఈ రెండు దశలు పూర్తయిన తర్వాత కేటగిరీ-1, కేటగిరీ-2, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, కేటగిరీ-3, కేటగిరీ-4 కేటగిరీ-5, కేటగిరీ-6, సింగిల్ గర్ల్ చైల్డ్ విద్యార్థులను వరుస క్రమంలో ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు

దరఖాస్తు ప్రక్రియను ఆన్‌లైన్‌లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా గరిష్టంగా మూడు కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా పూర్తిగా లాటరీ విధానంలో సంబంధిత కేంద్రీయ విద్యాలయ అధికారులు విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఈ లాటరీ విధానంలో సైతం ప్రాధాన్యతలను అనుసరిస్తారు. ఇది కూడా ఆన్‌లైన్ విధానంలోనే ఉంటుంది.

పదకొండో తరగతి

కేంద్రీయ విద్యాలయాల్లో పదకొండో తరగతిలో వయో పరిమితి నిబంధనలు లేకుండానే ప్రవేశాలు కల్పించే విధానం అమలవుతోంది. అయితే విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణులైన సంవత్సరంలోనే దరఖాస్తు చేసుకోవాలి. ఇంటర్ ప్రథమ సంవత్సరం తర్వాత బ్రేక్ లేని వారికే ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు.

ప్రవేశ పరీక్ష ఆధారంగా తొమ్మిదో తరగతి

- కేంద్రీయ విద్యాలయాల్లో ఎనిమిదో తరగతి వరకు ఎలాంటి ప్రవేశ పరీక్షలు ఉండవు. మెరిట్, అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నారు. తొమ్మిదో తరగతిలో అడ్మిషన్‌కు మాత్రం పరీక్ష నిర్వహిస్తున్నారు.
- హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, సోషల్‌సైన్స్, సైన్స్ సబ్జెక్ట్‌లలో వంద మార్కులకు మూడు గంటల వ్యవధిలో ఈ పరీక్ష ఉంటుంది. ఒక్కో సబ్జెక్ట్ నుంచి 20 ప్రశ్నలు ఉంటాయి.
- ఈ పరీక్షలో 33 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఆ తర్వాత సంబంధిత కేంద్రీయ విద్యాలయ అధికారులు మెరిట్ జాబితా రూపొందించి.. పైన పేర్కొన్న కేటగిరీల వారీగా ప్రాధాన్యత క్రమంలో ప్రవేశాలు కల్పిస్తారు.

పదకొండో తరగతి.. మూడు గ్రూప్స్

కేంద్రీయ విద్యాలయాల్లో పదకొండో తరగతిలో మూడు స్ట్రీమ్స్(సైన్స్, కామర్స్, హ్యుమానిటీస్) అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు పదో తరగతిలో సాధించిన మార్కులు, వారు దరఖాస్తు చేసుకున్న స్ట్రీమ్‌లో అందుబాటులో ఉన్న సీట్లను పరిగణనలోకి తీసుకొని ప్రవేశం కల్పిస్తారు. పదకొండో తరగతిలో ప్రవేశం పొందిన అన్ని స్ట్రీమ్‌ల విద్యార్థులు ఇన్ఫర్మాటిక్ ప్రాక్టీసెస్‌ను ఎలక్టివ్ సబ్జెక్ట్‌గా ఎంచుకోవాల్సి ఉంటుంది. సంబంధిత కేంద్రీయ విద్యాలయంలో అందుబాటులో ఉన్న ఎలక్టివ్స్ ఆధారంగా.. కంప్యూటర్ సైన్స్/బయో టెక్నాలజీలను సైన్స్ స్ట్రీమ్ అభ్యర్థులు ఎలక్టివ్‌గా ఎంచుకోవచ్చు. వీటితోపాటు మల్టీమీడియా, వెబ్ డిజైనింగ్ టెక్నాలజీ, సబ్జెక్ట్‌లను కూడా ఎలక్టివ్‌గా అన్ని స్ట్రీమ్‌ల విద్యార్థులు ఎంచుకోవచ్చు.

బోధన.. ఆహ్లాదకరం

పిల్లలు ఉత్సాహంగా స్కూల్‌కు వెళ్లే విధంగా కేంద్రీయ విద్యాలయాల్లో విద్యా విధానం అమలవుతోంది. ముఖ్యంగా కొత్తగా చేరే పిల్లలు ఇంటి నుంచి స్కూల్ వాతావరణానికి అలవాటుపడేలా చేసేందుకు ఆరు వారాల వ్యవధితో 'స్కూల్ రెడీనెస్ ప్రోగ్రామ్'ను రూపొందించాయి. ఈ ప్రోగ్రామ్ అనంతరం పరిసరాలను అర్థం చేసుకోవడం, ఆత్మవిశ్వాసం, పరిశీలన, పరస్పర సంబంధాలు, వర్గీకరణ , అనుకరణ, భావ వ్యక్తీకరణ, అవగాహన, క్రియేటివ్ స్కిల్స్‌ను పరిశీలిస్తారు.

ఫీజులు నామ మాత్రంగా

- కేంద్రీయ విద్యాలయాల్లో ఫీజులు నామమాత్రంగా ఉంటాయి. అడ్మిషన్ ఫీజు రూ.25. విద్యాలయ వికాస నిధి(రూ.500), ట్యూషన్ ఫీజు, కంప్యూటర్ ఎడ్యుకేషన్ తదితర ఫీజులు ఉంటాయి. ఒకటి నుంచి అయిదో తరగతి విద్యార్థులకు అన్నిరకాల ఫీజులు కలిపి నెలకు రూ.500-600, ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.1000లోపు అవుతుంది. బాలికలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేంద్రీయ విద్యాలయ ఉద్యోగుల పిల్లలకు ట్యూషన్ ఫీజు నుంచి మినహాయింపు లభిస్తుంది.
- పదకొండో తరగతిలో కంప్యూటర్ సైన్స్ ఎలక్టివ్‌గా తీసుకున్న విద్యార్థులు రూ.150, పదకొండు, పన్నెండు తరగతులకు కామర్స్, హ్యుమానిటీస్ స్ట్రీమ్ విద్యార్థులు రూ.300; సైన్స్ స్ట్రీమ్ విద్యార్థులు రూ.400 చెల్లించాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- ఒకటో తరగతికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ: ఏప్రిల్ 17, 2023
- 2వ తరగతి, ఆపై తరగతులకు(ఇంటర్ ఫస్ట్ యర్ మినహా) దరఖాస్తు తేదీలు: ఏప్రిల్ 3 - ఏప్రిల్ 12, 2023
- పదకొండో తరగతి రిజిస్ట్రేషన్: పదో తరగతి ఫలితాలు వెల్లడైన పది రోజుల నుంచి దరఖాస్తు చేసుకోవాలి.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://kvsonlineadmission.kvs.gov.in/index.html
- ఒకటో తరగతి ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్: https://kvsonlineadmission.kvs.gov.in/index.html

క్లుప్తంగా...

ప్రతిపక్షం లేకుండా చేయాలనే రాహుల్‌పై వేటు

ఏపీ మహిళా కాంగ్రెస్ నేతలు

సాక్షి, న్యూఢిల్లీ : పార్లమెంటు ఉభయసభల్లోనూ ప్రతిపక్షం లేకుండా చేయాలన్న ఉద్దేశంతోనే కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేశారని ఏపీ మహిళా కాంగ్రెస్‌నేతలు ఆరోపించారు. సోమవారం రాహుల్ గాంధీకి మద్దతుగా అఖిల భారత మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ధర్నాకు ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ నేతలు ఆకుల భాగ్య సూర్యలక్ష్మి, అరిగెల అరుణకుమారి, షేక్ కుర్షిదా, శుభాషిణి, దేవి తదితరులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం గద్దె దిగే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సి ఉందని చెప్పారు.

మురళీధరన్‌తో పవన్‌కళ్యాణ్ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ : ఏపీ బీజేపీ బాధ్యుడు, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి మురళీధరన్‌తో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ భేటీ అయ్యారు. సోమవారం సాయంత్రం పార్టీ నేత నాదెండ్ల మనోహర్‌తో కలిసి మురళీధరన్‌తో ఏపీలో పార్టీ పరిస్థితులపై చర్చించినట్లు తెలిసింది. రాష్ట్రంలో పొత్తులు, ఎన్నికల్లో సీట్ల గురించి వారి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. సమావేశం అనంతరం.. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతోనూ సమావేశం కానున్నానని ఆ తర్వాతే మీడియాతో మాట్లాడతానని పవన్‌కళ్యాణ్ తెలిపారు. అయితే, ఉదయమే ఢిల్లీకి చేరుకున్న పవన్ అమిత్‌షా, నడ్డాల అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించినా దొరకలేదని సమాచారం.

ఇసుక తవ్వకాల్లో నిబంధనల ఉల్లంఘన

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఆరోపణ

అమరావతి: ఇసుక రీచ్‌లలో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుపుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఆరోపించారు. వీటిని అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పల్నాడు జిల్లా బీజేపీ బూత్ కన్వీనర్ల సమావేశం కోసం సోమవారం అమరావతి వచ్చిన సోము వీర్రాజు.. తొలుత వైకుంఠపురం ఇసుక రీచ్‌కు వెళ్లటానికి ప్రయత్నించారు. అనుమతి తీసుకోకపోవడంతో వీరిని వైకుంఠపురం బొడ్డురాయి సెంటర్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో సోము వీర్రాజు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం అమరేశ్వర ఘాట్‌కు చేరుకుని ఇసుక రీచ్‌ను పరిశీలించారు. సోము వీర్రాజు మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణాపై బీజేపీ పోరాడుతోందన్నారు. బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడిపై దాడి చేసిన వారి మీద కేసు నమోదు చేసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం నిర్వహించిన జిల్లా స్థాయి బూత్ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆలోకం సుధాకర బాబు, మేకల వెంకటేశ్వర్లు, కోలా వెంకటేశ్వర రావు, ధాత్రి నారాయణ పాల్గొన్నారు.

ఇక అధ్యయనంతో పని లేదు

పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంపై తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ అధికారులకు తేల్చిచెప్పిన సీడబ్ల్యూసీ

- గరిష్టంగా 50 లక్షల క్యూసెక్కుల వరద వస్తుందనే అంచనాతో అధ్యయనం చేశామని వెల్లడి
- బ్యాక్ వాటర్ ప్రభావం ఏమాత్రం ఉండదని వెల్లడైనట్టు స్పష్టీకరణ
- భద్రాచలం, మణుగూరు భారజల కార్మాగారానికి ముంపు ఉందన్న తెలంగాణ.. కొట్టిపారేసిన ఏపీ
- ఎఫ్‌ఆర్‌ఎల్ గుర్తిస్తూ వేసిన రాళ్లు చూపించేందుకు సిద్ధమన్న ఏపీ అధికారులు
- ఈ నెల 10న ఏపీ, తెలంగాణ అధికారులతో సమావేశం కావాలని పీపీఏకు సీడబ్ల్యూసీ ఆదేశం



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావంపై మళ్లీ అధ్యయనం చేసే ప్రసక్తే లేదని తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అధికారులకు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) తేల్చి చెప్పింది. గోదావరి నదికి గరిష్టంగా 36 లక్షల క్యూసెక్కుల వరద వస్తే.. 50 లక్షల క్యూసెక్కులు నీరు వస్తుందని అధ్యయనం ద్వారా అంచనా వేసినట్టు గుర్తుచేసింది. పోలవరం ప్రాజెక్టు నిర్మించక ముందు వరద నీటిమట్టం ఏ స్థాయిలో ఉంటుందో.. ప్రాజెక్టు నిర్మించాక కూడా అంతే ఉంటుందని ఆ అధ్యయనంలో వెల్లడైందని పేర్కొంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పోలవరం ప్రాజెక్టు ముంపుతోపాటు ఇతర సాంకేతిక అంశాలపై సందేహాలను నివృత్తి చేయడానికి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఏపీ సర్కార్‌లతో ఇప్పటికే రెండుసార్లు కేంద్ర జల్‌శక్తి శాఖ, సీడబ్ల్యూసీ సమావేశాలు నిర్వహించాయి. ఈ క్రమంలో సోమవారం సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా అధ్యక్షతన ఢిల్లీలో నాలుగు రాష్ట్రాల అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఒడిశా వాదనతో ఏకీభవించని సీడబ్ల్యూసీ

గోదావరికి గరిష్టంగా 58 లక్షల క్యూసెక్కుల వరద వస్తుందని.. దాన్ని పరిగణలోకి తీసుకుని పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంపై అధ్యయనం చేయాలని ఒడిశా ఈఎన్‌సీ అశుతోష్ దాస్ చేసిన ప్రతిపాదనను సీడబ్ల్యూసీ చైర్మన్ వోరా తోసిపుచ్చారు. గరిష్టంగా 58 లక్షల క్యూసెక్కుల వరద వస్తుందనడానికి ప్రాతిపదిక ఏమిటో చెప్పాలని నిలదీశారు. ఊహాజనితంగా 58 లక్షల క్యూసెక్కుల వరద వస్తుందని చెప్పడం సమంజసం కాదని హితవు పలికారు.

ఎఫ్‌ఆర్‌ఎల్ చూపడానికి రెడీ

గత ఏడాది గోదావరికి జూలైలో వచ్చిన వరదలకు కిన్నెరసాని, ముర్రేడువాగు తదితర 30 వాగుల్లోకి పోలవరం బ్యాక్ వాటర్ ఎగదన్నడం వల్ల భద్రాచలం, మణుగూరు భారజల కర్మాగారం, 809 ఎకరాల భూమి ముంపునకు గురైందని తెలంగాణ ఈఎన్‌సీ నాగేంద్రరావు చెప్పడాన్ని ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి ఖండించారు. ప్రాజెక్టే ఇంకా పూర్తి కాలేదని.. నీటిని నిల్వ చేయకుండానే బ్యాక్ వాటర్ ప్రభావం వల్ల ముంపునకు గురైందని ఊహాజనితంగా చెప్పడం సరైంది కాదన్నారు. ఏపీ ఈఎన్‌సీ వాదనతో ఏకీభవించిన సీడబ్ల్యూసీ చైర్మన్ వోరా గోదావరి ట్రిబ్యునల్ ఆమోదించిన మేరకే పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తున్నారని స్పష్టం చేశారు. గతేడాది జూలైలో వచ్చిన వరదలకు భద్రాచలం ముంపునకు గురైందని.. రక్షణ గోడలు నిర్మించాలని తెలంగాణ ఈఎన్‌సీ కోరడంపై ఏపీ ఈఎన్‌సీ అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టులో గరిష్ట నీటి మట్టం (ఎఫ్‌ఆర్‌ఎల్) 45.72 స్థాయిలో నీటిని నిల్వ చేస్తే.. ముంపునకు గురయ్యే ప్రాంతాన్ని గుర్తిస్తూ సర్వే రాళ్లు వేశామని.. వాటి పరిధిలోకి భద్రాచలం, మణుగూరు రావని స్పష్టం చేశారు. కావాలంటే క్షేత్ర స్థాయిలో ఎఫ్‌ఆర్‌ఎల్ సర్వే రాళ్ల చూపించడానికి సంయుక్త సర్వేకు తాము సిద్ధమని తేల్చి చెప్పారు. కిన్నెరసాని, ముర్రేడువాగుతోపాటు మరో నాలుగు వాగులపై బ్యాక్ వాటర్ ప్రభావంపై అధ్యయనం చేయాలని తెలంగాణ ఈఎన్‌సీ చేసిన ప్రతిపాదనను ఏపీ ఈఎన్‌సీ తోసిపుచ్చారు.

పీపీఏ నేతృత్వంలో భేటీ

పోలవరం ప్రాజెక్టు ఎఫ్‌ఆర్‌ఎల్ ముంపుపై ఏపీ, తెలంగాణ అధికారులతో ఈ నెల 10న సమావేశమై తెలంగాణ సందేహాలను నివృత్తి చేయాలని పీపీఏ చైర్మన్ శివనంద్‌కుమార్‌ను సీడబ్ల్యూసీ చైర్మన్ వోరా ఆదేశించారు. రెండు రాష్ట్రాల అధికారులు ఎఫ్‌ఆర్‌ఎల్, ముంపుపై నివేదికలు సిద్ధం చేసి పరస్పరం మార్పిడి చేసుకుని చర్చించాలని సూచించారు. ఈ సమావేశంలో తెలంగాణ అధికారుల సందేహాలు నివృత్తి కాకుంటే ఎఫ్‌ఆర్‌ఎల్ రాళ్ల గుర్తించడానికి సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించాలని ఆదేశించారు.

ఊయలలో బొమ్మ ఉంచి..

- చిన్నారి అపహరణ
- నెల్లూరులో ఘటన



అపహరణకు గురయిన చిన్నారి లక్ష్మీ నిహారిక (ఫైల్)

నెల్లూరు సిటీ: ఊయలలో నిద్రిస్తున్న ఓ చిన్నారిని అపహరించి.. ఆ స్థానంలో ఓ బొమ్మను ఉంచి తల్లిని ఏమార్చి అనుమానం రాకుండా కిడ్నాప్ చేసిన ఘటన సోమవారం తెల్లవారుజామున నెల్లూరు నగరంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని గుర్రాలమడుగు సంఘంలో కనుకూటి మణికంఠ, అనూష నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలున్నారు. మణికంఠ రాపూరులో హోటల్ నిర్వహిస్తున్నారు. అప్పుడప్పుడు నెల్లూరుకు వచ్చి వెళుతుంటారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి అనూష తన పెద్దకుమార్తెను పక్కన పడుకోబెట్టుకుని, ఒకటిన్నర సంవత్సరం వయస్సు కలిగిన చిన్నారి లక్ష్మీ నిహారికను ఊయలలో పడుకోబెట్టింది. సోమవారం ఉదయం ఏడు గంటలకు చిన్నారి నుంచి కదలికలు లేకపోవడంతో ఊయల దగ్గరికి వెళ్లి చూడగా చిన్నారి కనిపించలేదు. ఊయలలో ఓ బొమ్మ ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు చిన్నారిని అపహరించి బొమ్మను పెట్టి ఉంటారని గుర్తించిన అనూష కుటుంబ సభ్యులతో కలిసి బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ సుమన్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆ ప్రాంతంలో సీసీ టీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు.

పేదలకిచ్చే స్థలాలపై అమరావతి రైతుల పిటిషన్లు

నేడు విచారణ జరపనున్న ద్విసభ్య ధర్మాసనం

సాక్షి, అమరావతి: సీఆర్‌డీఏ చట్ట నిబంధనల ప్రకారం రాజధాని ప్రాంతంలో పేదలకు నివాసాలు కల్పించేందుకు 1,134 ఎకరాల భూమిని ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లకు బదిలీ చేసేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత నెల 31న జారీ చేసిన జీవో 45ను సవాల్ చేస్తూ అమరావతి రైతులు హైకోర్టును ఆశ్రయించారు. లంచ్‌మోషన్ రూపంలో అత్యవసరంగా దాఖలైన ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్ విచారణ జరిపారు. విచారణ సందర్భంగా ఇదే అంశానికి సంబంధించిన వ్యాజ్యాలను ఇప్పటికే ప్రధాన న్యాయమూర్తి (సీజే) నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ జరుపుతోందని, మంగళవారం విచారణకు అదనపు ఏజీ అందుబాటులో ఉంటారని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. అదనపు ఏజీ కార్యాలయం సైతం త్రిసభ్య ధర్మాసనం ముందు ఇదే అంశానికి సంబంధించిన వ్యాజ్యాలు పెండింగ్‌లో ఉన్నందున, తాజా వ్యాజ్యాలను కూడా త్రిసభ్య ధర్మాసనమే విచారించడం సబబుగా ఉంటుందంటూ అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కార్యాలయం రాతపూర్వకంగా కోర్టు ముందు మెమో దాఖలు చేసింది. తాజా వ్యాజ్యాలను ఇప్పటికే త్రిసభ్య ధర్మాసనం ముందున్న వ్యాజ్యాలతో జత చేయాలని అదనపు ఏజీ ఆ మెమోలో కోర్టును కోరారు.

ద్విసభ్య ధర్మాసనం విచారణకు ఆదేశాలిచ్చిన సీజే

అటు ఏజీ వాదనలను, ఇటు ఏఏజీ మెమోను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ రాయ్ సైతం ఈ వ్యాజ్యాలను త్రిసభ్య ధర్మాసనమే విచారించడం మేలని అభిప్రాయపడ్డారు. అయితే, తమ వ్యాజ్యాలపై అత్యవసరంగా విచారణ జరపాల్సిన అవసరం ఉందని అమరావతి రైతుల తరఫు న్యాయవాదులు కోరడంతో.. ఈ వ్యాజ్యాలు మంగళవారం విచారణకు వచ్చే విషయంలో తగిన నిర్ణయం తీసుకునేందుకు కేసు ఫైళ్లను (సీజే) ప్రధాన న్యాయమూర్తి ముందుంచాలని న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ రిజిస్ట్రీని ఆదేశించారు. దీంతో రిజిస్ట్రీ ఈ వ్యాజ్యాలను సీజే జస్టిస్ ప్రశాంత్ కుమార్‌మిశ్రా ముందుంచింది. వీటిని పరిశీలించిన సీజే మంగళవారం ద్విసభ్య ధర్మాసనం విచారణకు వేయాలని ఉత్తర్వులిచ్చారు. దీంతో ఈ వ్యాజ్యాలపై మంగళవారం సీజే జస్టిస్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ మంతోజు గంగారావులతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరపనుంది.

బీసీ బిల్లు కోసం జూలైలో పార్లమెంట్ ముట్టడి

- నాలుగు లక్షలమంది బీసీలతో కార్యక్రమం
- జంతర్‌మంతర్ వద్ద మహాధర్నాలో ఎంపీ ఆర్.కృష్ణయ్య



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రాందాస్ అథవాలే చిత్రంలో ఎంపీ ఆర్ కృష్ణయ్య తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: బీసీ బిల్లు ప్రవేశపెట్టాలంటూ జూలైలో పార్లమెంట్‌ను ముట్టడించనున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీ బిల్లు సాధనకు నాలుగు లక్షల మంది బీసీలతో ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. బీసీల డిమాండ్ నెరవేర్చాలంటూ సంఘం కన్వీనర్ జబ్బాల శ్రీనివాస్ నేతృత్వంలో సోమవారం ఇక్కడి జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన మహాధర్నాను ఉద్దేశించి కృష్ణయ్య మాట్లాడారు. పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో 50 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య దేశంలో సామాజిక కులాలన్నింటికీ జనాభా ప్రకారం వాటాలు ఇవ్వడమే సామాజిక న్యాయమని అన్నారు. బీసీల స్థితిగతులపై మరోసారి అధ్యయనం జరిపించి రాజ్యాంగబద్ధమైన హక్కులు, వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీల జనగణన చేస్తున్నప్పుడు బీసీల విషయంలో అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. ధర్నాల్లో సంఘం సభ్యులు గుజ్జ కృష్ణ, కర్రి వేణుమాధవ్, నీరడి భూపేష్ సాగర్, కె.రాము పాల్గొన్నారు.

కురుబలను ఎస్టీల్లో చేర్చడానికి కృషి చేస్తా..

ఏపీలో కురుబలను ఎస్టీల్లో చేర్చడానికి కృషి చేస్తానని కేంద్ర సామాజిక న్యాయ సాధికారత శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలే తెలిపారు. సోమవారం రాత్రి కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జె.శ్రీనివాసులు నేతృత్వంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి రాందాస్ అథవాలే, వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య హాజరయ్యారు. అథవాలే మాట్లాడుతూ.. కురుబలకు గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కురుబలను ఎస్టీ జాబితాలో చేర్చడం వల పేద కులం అభివృద్ధి చెందడానికి మద్దతు ఇచ్చినట్లు అవుతుందన్నారు.

స్మార్ట్‌గా మారిపోతున్నారు



అధునాతన టెక్నాలజీతో మారుతున్న జీవనశైలి

- పాత వాటి స్థానంలో కొత్త ఉపకరణాలు
- కొనుగోలుదారుల్లో 32 శాతం స్మార్ట్ పరికరాలవైపే..
- ఈ ఏడాది స్మార్ట్ పరికరాల కొనుగోళ్లు మరింత పెరుగుతాయి
- టెచార్క్ ఇండియా నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: రోజురోజుకూ మారిపోతున్న టెక్నాలజీతో స్మార్ట్ వస్తువుల వినియోగం పెరుగుతోంది. స్మార్ట్ ఫోన్లు, వాచీలే కాదు గృహోపకరణాలు కూడా స్మార్ట్‌గా మారిపోతున్నాయి. ఈ డివైస్‌లు ప్రజల జీవన విధానాన్ని మార్చేస్తున్నాయి. మార్కెట్‌లో స్మార్ట్ పరికరాల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. అధునాతన సౌకర్యాన్ని అందించే ఉత్పత్తులకు భారీగా డిమాండ్ పెరుగుతోంది. పాత టీవీలు, వాషింగ్ మెషీన్లు, ఫ్యాన్లు స్థానంలో కొత్త టెక్నాలజీతో రూపొందించిన ఉత్పత్తులు వచ్చి చేరుతున్నాయి. 5జీ సాంకేతికత అందుబాటులోకి వచ్చాక దాని ఆధారిత స్మార్ట్ పరికరాలకు వినియోగదారులు ప్రాధాన్యమిస్తున్నారు. సౌకర్యంతో పాటు సులభంగా, తక్కువ సమయంలో పనులను ముగించడం, మరింత ఆనందంగా జీవించడానికి వీలుగా స్మార్ట్ పరికరాలు తోడ్పడుతున్నాయని ప్రజలు భావిస్తున్నారు. స్మార్ట్ పరికరాల వినియోగంపై టెచార్క్ సంస్థ ఇటీవల విడుదల చేసిన 'ఇండియా కనెక్టెడ్ కన్స్యూమర్ రిపోర్ట్' పలు అంశాలను వెల్లడించింది. 2023లో స్మార్ట్ పరికరాల కొనుగోలు మరింత పెరుగుతుందని పేర్కొంది. అయితే 5జీ టెక్నాలజీ ఆధారిత స్మార్ట్ పరికరాల్లో వినియోగదారులు ఆశిస్తున్న సామర్థ్యం ఉండటం లేదని, ఈ పరికరాల్లో సామర్థ్యం మరింత ఉండాలని ఎక్కువ మంది ప్రజలు కోరుకుంటున్నట్లు తమ సర్వేలో తేలిందని టెచార్క్ వివరించింది. దాంతో పాటు స్మార్ట్ ఫోన్లు, ట్యాబులు, ఇతర పరికరాల వల్ల తమ వ్యక్తిగత సమాచారానికి భంగం వాటిల్లుతుందేమోనన్న ఆందోళన కూడా వినియోగదారుల్లో వ్యక్తమవుతున్నట్లు తెలిపింది. సామాన్యుల్లో కూడా ఈ స్మార్ట్ పరికరాల కోసం రూ. 20 వేల నుంచి రూ. 50 వేల వరకు ఖర్చు పెడుతున్నారు. కొనుగోలుదారుల్లో 32 శాతానికి పైగా స్మార్ట్ పరికరాలవైపు వెళ్తున్నారు. అయితే ఈ స్మార్ట్ పరికరాల వినియోగంపై, బ్రాండ్లపై నమ్మకం వంటి అంశాల్లో ఇంకా చాలా మందిలో అవగాహన ఉండటం లేదని సర్వే పేర్కొంది.

జీవన ప్రమాణాలను మారుస్తున్న వాటిలో స్మార్ట్ పరికరాల పాత్ర ఇలా...


- కంఫర్ట్ కన్వీనియన్స్ పరికరాలు: 69%
- సోషల్ రికగ్నిషన్- ప్రెస్టేజ్, స్టయిల్: 53%
- కనెక్టివిటీ ఆటోమేషన్: 53%
- టైమ్ సేవింగ్ ప్రొడక్ట్స్: 46%
- ఎనర్జీ మేనేజ్‌మెంటు: 19%
- సేఫ్టీ, సెక్యూరిటీ: 17%

స్మార్ట్‌గా మారుతున్న వాటిల్లో ముఖ్యమైనవి..



గృహోపకరణాలు: ఒవెన్, వాషింగ్ మెషీన్, వాక్యూమ్ క్లీనర్, హెయిర్ డ్రైయర్

భద్రత పరికరాలు: వీడియో ఎనేబుల్డ్ డోర్‌బెల్, డోర్‌లాక్, సీసీ కెమెరా





సౌకర్యం, సౌలభ్యం: లైట్, ఏసీ, హీటర్, స్విచ్, ఎయిర్ ప్యూరిఫయర్, క్లాక్, వాటర్ ఫిల్టర్

వ్యక్తిగతం: క్రోమ్‌బుక్, టాబ్లెట్, ట్రూ వైర్‌లెస్ స్టీరియో (టీడబ్ల్యూఎస్), వాచ్, ఫిట్‌నెస్ బ్యాండ్



ఏ స్మార్ట్ వస్తువు ఎంత శాతం మంది వాడుతున్నారంటే..

వస్తువు	శాతం
వాచ్, ఫిట్‌నెస్ బ్యాండ్	72
టీవీ	28
లైట్లు	82
ఏసీలు	14
కెమెరాలు	48
వాషింగ్ మెషీన్	12

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అరుదైన కాలమ్నార్ బసాల్ట్ శిలలు

అగ్నిపర్వతాల నుంచి వెలువడిన లావా స్తంభాల్లా ఏర్పడిన తీరు

ఆరున్నర కోట్ల ఏళ్ల కింద రూపొందినట్టు నిపుణుల అంచనా

గుర్తించిన ఔత్సాహిక యువత.. ఇప్పటివరకు నమోదు చేయని జీఎస్‌ఐ

పట్టించుకోకుంటే ధ్వంసమైపోయే అవకాశం

మహారాష్ట్ర, కర్ణాటకలలో ఇలాంటి శిలలున్న ప్రాంతాలకు రక్షణ

లావా చెక్కిన శిలలు!



బోరెల్‌గూడ వద్ద పాదవుగా కాలమ్నార్ బసాల్ట్ స్తంభాలు

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాంతం.. దట్టమైన అడవుల్లో.. గుట్టల దిగువన పొడవాటి శిలలు.. ఏదో పని కోసం మనుషులు చెక్కి అలా వదిలేసినట్టు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి.. కానీ అవి ప్రకృతి చెక్కిన రాళ్లు.. అందులోనూ మామూలు రాళ్లు కాదు.. భూమి అడుగునుంచి పొంగుకొచ్చిన లావా గట్టిపడి నిలువునా పోతపోసినట్టు ఏర్పడిన బసాల్ట్ శిలలు అవి. ఎంతో చరిత్ర దాగి ఉన్న ఆ నిలువు రాళ్లను ఔత్సాహిక యువత గుర్తించినా.. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్‌ఐ) ఇప్పటివరకు నమోదు చేయలేదు. పరిరక్షణకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీనితో ఆ అరుదైన బసాల్ట్ శిలలు ధ్వంసమైపోయే అవకాశం ఉందన్న విమర్శలు వస్తున్నాయి.

ఏమిటీ శిలలు..

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని బజార్ హత్నూర్, బోరెల్‌గూడ, ఆసిఫాబాద్ సమీపంలోని వర్తమనూర్‌తో పాటు పలుచోట్ల అరుదైన బసాల్ట్ శిలలు ఉన్నాయి. వీటిని కాలమ్నార్ బసాల్ట్ (లావా శిలలు)గా పిలుస్తారు. సుమారు ఆరు కోట్ల ఏళ్ల కింద ఇవి ఏర్పడినట్టు అంచనా. సాధారణంగా భూగర్భం నుంచి ఉబికి వచ్చిన లావా ప్రవహిస్తూ నీటి ప్రవాహాల వద్ద వేగంగా ఘనీభవించినపుడు.. నీళ్ల ఇంకినప్పుడు నేల నెర్రలువాసినట్టుగా లావాలో అష్టభుజి, షట్భుజి, చతురస్రం.. ఇలా రకరకాల ఆకృతుల్లో లోతుగా పగుళ్లు ఏర్పడతాయి. కొన్నేళ్ల పరిణామక్రమంలో అవి విడివడి స్తంభాలుగా రూపొందుతాయి. చాలా ప్రాంతాల్లో లావా ప్రవహించినా ఈ కాలమ్నార్ బసాల్ట్‌లు మాత్రం కొన్ని చోట్లనే ఏర్పడడం విశేషం. ఇలాంటివి చాలా అరుదు కూడా.

5 లక్షల కిలోమీటర్ల పరిధిలో..

- భూగర్భం నుంచి ఉబికి వచ్చిన లావా ప్రవహించిన ప్రాంతం మన దేశంలో ఐదు లక్షల చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉంది. దీన్ని డెక్కన్ వల్కానిక్ ప్రావిన్స్ (డీవీపీ)గా పేర్కొంటారు. ఇందులో మహారాష్ట్ర పూర్తి ప్రాంతం ఉండగా తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, గుజరాత్‌లలో కొంత భాగం ఉంది. డీవీపీ తూర్పు చివరిభాగం తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, మహబూబ్‌నగర్‌లలలో విస్త రించి ఉంది. ఈ డీవీపీలోనే పలు ప్రాంతా ల్లో కాలమ్నార్ బసాల్ట్ శిలలు ఏర్పడ్డాయి.

ఇతర రాష్ట్రాల్లో రక్షిస్తున్నా..

మహారాష్ట్ర, కర్ణాటకలలో ఇలాంటి లావా శిలలున్న ప్రాంతాలను జీఎస్‌ఐ అధికారికంగా గుర్తించింది. ఇప్పుడు అవి రక్షిత ప్రాంతాలుగా ఉన్నాయి. కర్ణాటకలోని ఉడిపి జిల్లా పరిధిలోకి వచ్చే సెయింట్ మేరీస్ దీవిలో పొడవాటి లావా శిలలతో ఏర్పడిన గుట్ట ఉంది. ఆ శిలలను జీఎస్‌ఐ గుర్తించి ప్రాచుర్యంలోకి తేవటంతో అది పర్యాటక ప్రాంతంగా మారింది. విదేశాల్లోనూ ఇలాంటి శిలలున్న ప్రాంతాలను జియో పార్కులుగా అభివృద్ధి చేస్తున్నారు. అయితే మన రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఐదారు ప్రాంతాల్లో ఈ లావా శిలలను గుర్తించినా పట్టించుకునేవారే లేకుండా పోయారు. వ్యవసాయం, ఆవాసాల విస్తరణ, రోడ్ల నిర్మాణంతో అవి చెదిరిపోయే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాజమండ్రి సమీపంలో ఓ చిన్న భాగం..

తెలంగాణ సహా ఇతర రాష్ట్రాల్లోని డీవీపీతో లింకు లేకుండా.. రాజమండ్రి సమీపంలో 25 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో లావా ఘనీభవించిన ప్రాంతముంది. కోస్తా ప్రాంతంలో ఈ చిన్న ముక్క తప్ప మరెక్కడా ఇలాంటిది లేదని నిపుణులు చెప్తున్నారు.

అంగారకుడిపైనా కాలమ్నార్ శిలలు

- కొన్నేళ్ల కింద నాసా ఉపగ్రహాలతో అంగారకుడిని చిత్రించినప్పుడు కనిపించిన దృశ్యాలు శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరిచాయి. అంగారక గ్రహం మీద గుట్టల్లాగా ఉన్న ప్రాంతాల్లో నిలువు చారలను విశ్లేషించగా.. కాలమ్నార్ బసాల్ట్ (లావా శిలలు)గా తేల్చా రు. అంగారక గ్రహం మీద అగ్నిపర్వతాలు ఉండేవన్న దానికి ఇవి ఆధారంగా నిలిచాయి. భవిష్యత్తులో మానవులు అంగారకుడిపైకి వెళ్లేందుకు ఎంత అనువుగా ఉంటుందన్న దిశలో సాగుతున్న పరిశోధనల్లో ఇదీ ఓ కీలక అంశంగా మారింది.

బొమ్మలు గీసినట్టే



ఇది ఆసిఫాబాద్ ప్రాంతంలోని వర్తమనూర్ వద్ద అడవిలో కనిపించిన అందమైన రాతి అమరిక. ఎవరో చెక్కినట్టుగా, రాళ్లపై ఆదిమానవులు రూపొందించిన పెట్రోగ్లిఫ్స్‌ను తలపిస్తున్న ఈ అమరిక లావా ప్రభావంతో ఏర్పడినదే. ప్రపంచవ్యాప్తంగా కొన్నిచోట్ల మాత్రమే ఇలాంటి శిలలు ఉన్నాయి. అలాంటి వీటిని పట్టించుకునే వారే లేరన్న విమర్శలున్నాయి.

రక్షిత ప్రాంతాలుగా గుర్తించాలి..

ప్రపంచంలో అరుదుగానే ఈ కాలమ్నార్ బసాల్ట్ శిలలు ఉన్నాయి. పలు దేశాల్లో వీటిపై అధ్యయనాలు జరుగుతున్నాయి కూడా. తెలంగాణలో ఈ శిలలు కనిపించిన ప్రాంతాలను రక్షిత ప్రాంతాలుగా గుర్తించి భవిష్యత్తు ప్రయోగాలకు రక్షించుకోవాలి.

– చకిలం వేణుగోపాల్, జీఎస్‌ఐ విశ్రాంత అధికారి

ఔత్సాహికులే గుర్తించారు..

ఆదిలాబాద్ ప్రాంతంలో ఇప్పటివరకు వెలుగు చూసిన లావా శిలలను మన్నె ఆలియా, కటకం మురళి, వేణుగోపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితర ఔత్సాహికులు గుర్తించారు. కొత్త తెలంగాణ చరిత్ర బృంద సభ్యు ల వల్లనే ఆ శిలలు బయటి ప్రపంచానికి తెలిసి వాటిపై స్థానికంగా కొంత అవగాహనకు వీలు కలిగింది. వాటి పుట్టుపూర్వోత్తరాలపై అధ్యయనం జరగాల్సిన అవసరం ఉంది.

– శ్రీరామోజు హరగోపాల్, చరిత్ర పరిశోధకులు

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943